# RURAL DEVELOPMENT (DAEC033-IV)

## (BA ECONOMICS)

# ACHARYA NAGARJUNA UNIVERSITY

## CENTRE FOR DISTANCE EDUCATION

## NAGARJUNA NAGAR,

## GUNTUR

## ANDHRA PRADESH

పాఠం - 1

# గ్రామీణాభివృద్ధి - పరిధి - ఆవశ్యకత

## 1.1 లక్ష్యం :-

ఈ పాఠం చదివిన తరువాత విద్యార్థులు ఈ క్రింది విషయాలు తెలుసుకోగలరు.

* గ్రామీణాభివృద్ధి అనగా నేమి?
* జాతిపిత మహాత్మాగాంధి ఊహ ప్రకారము భారతదేశంలోని గ్రామాలు ఏ విధంగా ఉండాలి?
* మన దేశంలోని ప్రాచీన గ్రామాలకు, ఈ నాటి గ్రామాలకు తేడా ఏమిటి?
* గ్రామీణాభివృద్ధి యొక్క స్వభావమేమి?
* గ్రామీణాభివృద్ధి పరిధిలోనికి తీసుకొనబడు అంశములేమి? గ్రామీణాభివృద్ధి యొక్క అవసరమేమి?
* గ్రామీణాభివృద్ధికి, ఆర్థికాభివృద్ధికి గల సంబంధము.

## విషయసూచిక :-


**1.2 విషయ పరిచయము**

**1.3 గ్రామీణాభివృద్ధి అర్థము**

**1.4 భారతదేశంలోని ప్రాచీన గ్రామాలు**

**1.5 భారతదేశంలోని ఈనాటి గ్రామాలు**

**1.6 మహాత్మా గాంధీ - ఆదర్శ గ్రామము**

**1.7 గ్రామీణాభివృద్ధి - స్వభావము - పరిధి**

**1.8 గ్రామీణాభివృద్ధి - ఆవశ్యకత**

**1.9 గ్రామీణాభివృద్ధి - ఆర్థికాభివృద్ధి**

**1.10 సారాంశము**

**1.11 నమూనా ప్రశ్నలు**

**1.12 చదువదగిన గ్రంథాలు**


## 1.2 విషయ పరిచయము :-

భారతదేశపు ఉనికిని తెలియ చెప్పేవి గ్రామాలు. మన దేశంలోని ప్రాచీన గ్రామాలు పరిపాలనలోను, వృత్తులలోను వికేంద్రీకరణను కలిగి ఉండి సౌభాగ్యంలో ప్రజాస్వామ్య వికేంద్రీకృత పరిపాలనకు పట్టుకొమ్మలుగా ఉండగా ఈ నాటి గ్రామాలు నిర్మానుష్యమై, నిర్జీవమై పాలక కర్తల నిర్లక్ష్యానికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయో అట్టి గ్రామాలు దేశ ప్రగతికి అవరోధాలు. దేశంలోని అధిక జనాభా నివసిస్తున్న ఈ గ్రామాల అభివృద్ధికి అర్థము, పరిధి తెలుసుకొనవలసిన అవసరం ఉన్నది. గ్రామీణాభివృద్ధి ప్రాధాన్యత ఎంత ఉన్నదో అవగాహన చేసుకుంటే గ్రామాల అభివృద్ధి ఆర్థికాభివృద్ధికి ఎంత దోహదపడుతుందో తెలియగలదు.

## 1.3 గ్రామీణాభివృద్ధి అర్థము :-

మహాత్మాగాంధీ ప్రకారం భారతదేశపు ఉనికిని చాటి చెప్పేవి గ్రామాలు. గ్రామాల అభివృద్దే దేశాభివృద్ధి. గ్రామాలు నశించినచో దేశము వెనకబడుతుంది. ప్రపంచ దేశాలలో భారతీయతకున్న ప్రాధాన్యతను మనం పోగొట్టుకుంటున్నాము.

" I would say that if the village perishes, India will perish too. India will no more be India. Her own mission in the world will get lost." - Mahatma Gandhi

అభివృద్ధి అను భావనను ప్రత్యేకంగా గ్రామీణ (భారతీయతకు) భారతదేశానికి అనువర్తింపజేస్తే గ్రామీణాభివృద్ధికి కొత్త అర్థం స్ఫురిస్తుంది. గ్రామీణాభివృద్ధి అంటే కేవలం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి మాత్రమే కాదు. ప్రధానంగా ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజల అభివృద్ధి గ్రామీణాభివృద్ధిని తీసుకువస్తుంది. ప్రజల అభివృద్ధి అంటే ఏమిటి? కేవలం తలసరి ఆదాయము పెరగటమా? లేక జీవన ప్రమాణ స్థాయి పెరగటమా? ఈ రెండూ ఆర్థికవృద్ధికి సంకేతాలు. గ్రామీణాభివృద్ధి అంటే ఈ రెంటితోపాటు గ్రామీణ ప్రజల మానసిక వికాసము. ఆదాయ సంపదల కంటే గ్రామీణుల మానసిక సంతృప్తి, వికాసము అభివృద్ధికి కొలమానము. గ్రామీణాభివృద్ధి అంతిమ లక్ష్యము గ్రామీణుల మానసిక వికాసము, శ్రేయస్సు, వారి సంతృప్తి. గ్రామీణుల సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక జీవన విధానంలో పురోగతిని తీసుకుని వచ్చు ఒక పథకమే గ్రామీణాభివృద్ధి అని చెప్పవచ్చు. పెక్కు దిశలుగా, పెక్కు ప్రమాణాలలో తీసుకురాబడిన ఈ పురోగతి గ్రామీణుల వ్యక్తిత్వ వికాసానికి, మానసిక సంతృప్తికి దోహదం చేస్తుంది. అదే గ్రామీణాభివృద్ధి.

## 1.4 మహాత్మాగాంధీ - ఆదర్శ గ్రామము :-

గ్రామీణాభివృద్ధి పథకం క్రింద మహాత్మాగాంధీ అభివర్ణించిన ఆదర్శవంతమైన గ్రామం ఈ క్రింది విధముగా ఉండవలెను.

1. ఆదర్శ గ్రామ నిర్మాణములో పారిశుద్ధతకు ఎక్కువ ప్రాధాన్యమివ్వవలెను.
2. గృహములు తగిన ఎత్తులో ధారాళమైన గాలి, వెలుతురు కలిగి ఉండవలెను.
3. ప్రతి ఇంటికి విశాలమైన పెరడు, అందులో పోషక విలువలనివ్వగలిగిన కూరగాయల చెట్లు పెంచబడాలి.
4. గ్రామాలలోని రహదారులు పరిశుభ్రముగా ఉండాలి.
5. గ్రామ ప్రజలందరికీ ఉపయోగపడేటట్లుగా గ్రామంలో పలుచోట్లు త్రాగునీటి సౌకర్యార్థం బావులు త్రవ్వబడాలి.
6. వివిధ మతాల వారికి ప్రత్యేకంగా ప్రార్థనా స్థలాలు ఉండాలి. అవి సౌభ్రాతృత్వ భావనను, పరస్పర అవగాహనను పెంచేటట్లుగా కూడలి సఫలాలుగా కూడా ఉండాలి.
7. ప్రతి గ్రామంలోనూ తప్పనిసరిగా ఒక సహకార పాల కేంద్రం, ప్రాథమిక, మాధ్యమిక పాఠశాల ఉండాలి.
8. పరిపాలనా వికేంద్రీకరణను సూచిస్తూ స్వయం పరిపాలనా సంస్థలైన గ్రామ పంచాయితీ ఉండాలి.
9. ఈ పంచాయితీ సంస్థలు, పరిపాలనతో తోడు గ్రామ కలహాలను తీర్చాలి, అస్పృశ్యతను నివారించాలి. పేదరిక నిర్మూలనకు బాధ్యత వహించాలి.
10. ఖాదీ పరిశ్రమ ద్వారా ప్రజలు తమకు కావలసిన వస్త్రములు తయారు చేసుకోగలగాలి.
11. వ్యవసాయాభివృద్ధి ద్వారా ఆహార ధాన్యాలను అవసరం మేరకు పండించుకోగలగాలి.
12. గృహ నిర్మాణానికి స్థానిక వనరులను ఉపయోగపరుచుకోవాలి.

## 1.5 భారతదేశములోని ప్రాచీన గ్రామాలు :-

సర్ చార్లెస్ మెటీకాల్ఫ్ వంటి సామాజిక శాస్త్రవేత్తలు భారతదేశంలోని ప్రాచీన గ్రామాలను (Little Republics) చిన్న చిన్న గణతంత్ర రాజ్యాలుగా అభివర్ణించారు. అనగా అవి తమకు కావలసిన ప్రాథమిక అవసరాలనన్నింటిని తామే ఉత్పత్తి చేసుకుంటూ స్వయం సమృద్ధంగా ఉండాలి. మనకు లభ్యమగుచున్న అనేక పౌరాణిక, ఇతిహాస, చారిత్రాత్మక గ్రంథాలు, ప్రాచీన గ్రామాలలోని సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వివరాలను వర్ణిస్తూ ఆనాటి గ్రామాలు స్వయం సమృద్ధంగాను, సౌభాగ్యం గాను ఉన్నాయని తెలుపుతున్నవి. గ్రామాలు చైతన్యవంతంగా ఉండేవి. గ్రామాలలో వ్యవసాయదారులు మాత్రమేకాక, కుమ్మరి, కమ్మరి, జౌళి, చర్మకారులు, కంసాలి, వడ్రంగి ఆదిగా అన్ని వృత్తుల వారు పరస్పర సహకార భావములతో ఉండి గ్రామాలను స్వయం సమృద్ధం చేసారు. వృత్తి వైవిధ్యత, వికేంద్రీకరణ వలన భూమి, శ్రామికుల మధ్య నిష్పత్తి (Land Labour Ratio) అభిలషణీయంగా ఉండేవి. ప్రార్థనా స్థలాలలో గ్రామీణులు తమ అభిప్రాయాలను పరస్పరం చర్చించుకుంటూ సౌభ్రాతృత్వ, సహకార భావంతో ఉండేవారు. గ్రామాలలో వివిధ కులాల మతాలకు సంబంధించిన పండుగలు, సభాసమావేశాలలో అందరూ పాల్గొనేవారు. సంతలలో వస్తు మార్పిడి పద్ధతి కూడా అమలులో ఉండేది. గ్రామాలు పరిశ్రుభంగాను, గ్రామీణులు ఆరోగ్యంగాను ఉండేవారు. అతిథి మర్యాద గ్రామాలలో ప్రత్యేకంగా చెప్పుకొనవలసిన సామాజిక లక్షణం. గ్రామీణులలో ఉన్న విద్య లేకపోయినా మానవత్వం, మంచితనం కనిపించేవి.

## 1.6 భారతదేశంలోని ఈనాటి గ్రామాలు :-

పారిశ్రామికరణ, పాశ్చాత్య ప్రభావాల వలన వ్యవసాయం తప్ప ప్రత్యామ్నాయ ఉద్యోగ అవకాశాలు లేకపోవడం చేత ఈ నాటి గ్రామాలు నిర్జీవంగాను, నిర్మానుష్యంగాను ఉంటున్నవి.

ఒక సగటు భారతీయ గ్రామం కొన్ని వందల ఎకరాల నివాస స్థలాన్ని కలిగి ఉంటుంది. ప్రతి గ్రామంలోను దాదాపుగా 50 నుంచి 200 వరకూ కుటుంబాలు ఉండవచ్చు. ఒక సాధారణ గ్రామాన్ని పరిశీలిస్తే ఇందులోని గృహాలు ఎక్కువగా రెల్లుతోనూ, తాటాకులతోనూ, మట్టితోనూ నిర్మింపబడి ఉంటాయి. సన్నగా వంకరగా ఉండే రహదారులు ప్రణాళికా బద్ధంకాని గ్రామీణ వ్యవస్థను తెలుపుతాయి. భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో ముఖ్యంగా కేరళ రాష్ట్రంలో ఒక గ్రామం ఎక్కడ అంతమౌతున్నది? వేరొక గ్రామం ఎక్కడ మొదలవుతున్నదనేది తెలుసుకోలేము. గ్రామీణులు తీసుకునే అసంతులిత ఆహారం, ఆరోగ్య సదుపాయాల లేమి, అపరిశుభ్రత పరిమితంగా ఉన్న ప్రాథమిక సదుపాయాలు గ్రామాలలోని తక్కువ జీవన ప్రమాణ స్థాయిని సూచించును. గ్రామీణులు మార్కెట్‌ను, ఆరోగ్య కేంద్రాన్ని, బస్‌స్టాండ్‌ను, రైల్వే స్టేషన్‌ను చేరుకోవాలంటే కొన్ని కిలోమీటర్ల దూరం నడవవలసి ఉంటుంది. చాలా గ్రామాలలో రక్షిత మంచి నీటి సదుపాయం 1.6 కి॥మీ॥ నడిస్తే కాని దొరకదు. గ్రామాలలో నీరు లభిస్తున్నప్పటికి ఆ నీటిలో ఎక్కువగా ఫ్లోరైడ్‌లు, క్లోరిన్, ఇనుము, ఉప్పతనము పరిమితిని మించి ఉండుట వలన అనేక అనారోగ్యాలు సంక్రమించుచున్నవి. అపరిశుభ్ర నీటి సరఫరా గ్రామాలలో కలరా, కామెర్లు మొ॥గు అంటు వ్యాధులను కలగ చేయుచున్నవి. ఈనాటికి అనేక గ్రామాలలో ప్రజలు మట్టి పాత్రలను మాత్రమే ఉపయోగించగలుగుతున్నారు. కాలుష్యాన్ని కలిగించే ఇంధనములను (పిడకలు, కట్టెలు) వంటకు ఉపయోగించుట చేత గృహంలో ఉండే స్త్రీలు, శిశువులు, వృద్ధులు అనేక అనారోగ్యాల బారిన పడుతున్నారు. విద్యుచ్ఛక్తి కొరత వలన ప్రజలు ఇక్కట్ల పాలవుతున్నారు. వ్యవసాయము, లఘు కుటీర పరిశ్రమలు వెనకబడుతున్నవి. చాలా కొద్ది మంది గ్రామీణులు మాత్రమే పశు సందను కలిగి ఉంటారు. పైన పేర్కొన్న గ్రామీణుల జీవన సరళి, వారి అమాయకత్వం, అవిద్య, అపరిశుభ్రత భారతదేశంలోని అనేక గ్రామాలు ఈనాటికి అన్ని విధాలుగాను వెనుకబడి ఉన్నవని, మహాత్మాగాంధీ కలలకు విరుద్ధంగా ఉన్నాయని తెలుస్తున్నది.

## 1.7 గ్రామీణాభివృద్ధి - పరిధి :-

భారతదేశంలో గ్రామాలు ఎక్కువ. కాబట్టి మన దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి, గ్రామాల అభివృద్ధి పై ఆధారపడి ఉన్నది. 1901

సం॥లో గ్రామీణ జనభా 212.6 మిలియన్ల కాగా 2001 నాటికి ఈ జనాభా 721.1 మిలియన్లకు పెరిగింది. దాదాపు వెయ్యి మిలియన్ల జనాభాలో అధిక భాగం గ్రామాలలో నివసిస్తున్నపుడు అట్టి గ్రామీణా జనాభా అభివృద్ధి ఆవశ్యకత ఎంతైనా వున్నది. గ్రామీణాభివృద్ధి ఆవశ్యకతను తెలుసుకోవటానికి ముందుగా పరిధిని గురించి చదువుకుందాము.

ప్రత్యేక సమూహాములుగా ఉన్న పేద గ్రామీణుల ఆర్థిక, సాంఘిక, సామాజిక జీవన విధానాన్ని వృద్ధి చేయటానికి ఉద్దేశించబడిన ప్రణాళికాభివృద్ధి ఫలాలను గ్రామీణులకు అందించుటే గ్రామీణాభివృద్ధి. అభివృద్ధి పథకాలలో గ్రామీణుల భాగస్వామ్యము ఏ విధంగా ఉండాలి? అనే విషయాన్ని చర్చించుట గ్రామీణాభివృద్ధిగా చెప్పవచ్చు. గ్రామీణాభివృద్ధి పరిధిలో ఉన్న ఇతర అంశాలు -

1. శాస్త్ర సాంకేతిక పురోగతిని ప్రాచీన, సంప్రదాయబద్ధమైన గ్రామీణ కార్యకలాపాలకు అనువిర్తంపజేయుట ద్వారా వాటి ఆధునీకరణ చేయుట.
2. గ్రామీణుల జీవన శైలిలో నాణ్యతను తీసుకుని వచ్చు ప్రయత్నాలు.
3. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధిత రంగాలలో అభివృద్ధి తీసుకుని వచ్చుట.
4. గ్రామీణ లఘు కుటీర పరిశ్రమల వృద్ధి.
5. గ్రామాలలో భౌతిక, సామాజిక అవస్థాపనా సదుపాయాల పెంపు.
6. గ్రామీణ ప్రాంతాలలో మానవ వనరుల నైపుణ్యాల వృద్ధి.
7. గ్రామాలలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు (వ్యవసాయదారులు, వ్యవసాయ కార్మికులు, చేతి పని వారు) లాభాలను సమకూర్చు కార్యక్రమాలు.
8. పూల తోటలు, పండ్ల తోటల పెంపకము, పాడి, కోళ్ళ పరిశ్రమ, సామాజిక అడవుల పెంపకము, వ్యవసాయ ఆధార పరిశ్రమల అభివృద్ధి.
9. గ్రామాలలో పలు ప్రాంతాలలో ఉన్న స్థానిక వనరులు వాటి మధ్య అనుసంధానతకు పూరతకను సమకూర్చుట ద్వారా గ్రామీణాభివృద్ధి.
10. గ్రామీణ ప్రజల దృక్పథాలలో మార్పును తెచ్చి, గ్రామీన సామాజిక వ్యవస్థ స్వరూపమును మార్చుట.
11. స్థానిక స్వయం పాలనా సంస్థలను ప్రజాస్వామ్య పద్ధతులలో అభివృద్ధి పరచుట, తగిన స్థానిక నాయకత్వాన్ని ప్రోత్సహించుట.
12. ప్రాథమిక అవసరములగు ఆరోగ్యము, పారిశుధ్యము, రవాణా, రక్షిత మంచినీరు, ఉద్యోగిత, గృహ సదుపాయము మొ॥వి సమకూర్చు పథకాలు.

గ్రామీణాభివృద్ధి పరిధిలో గల పైన పేర్కొన్న అనేక అంశములను గమనించినట్లయితే గ్రామీణాభివృద్ధి అను భావన ఒక్క దిశలో చూడవలసినది కాదు అని అవగతమగును. అనేక భౌతిక, సాంఘిక, సామాజిక, వ్యవస్థా పూర్వక సాంకేతిక, సాంస్కృతిక, సంస్థాగతమైన అంశాల మధ్య పూరకత, అనుసంధానతే గ్రామీణాభివృద్ధి.

## 1.8 గ్రామీణాభివృద్ధి - ఆవశ్యకత :-

భారతదేశంలో 76% ప్రజలు గ్రామాలలో నివసిస్తున్నారు. భారతదేశంలోని గ్రామాలు పేదరికంతో ఉండుట వలననే భారతదేశంలో 1999 - 2000 నాటికి 26.1* శాతం. ప్రజలు పేదరికపు రేఖ దిగువన ఉన్నారు. గ్రామాలు సౌభాగ్యంతో ఉంటే దేశం అభివృద్ధి చెందుతుంది. కాబట్టి గ్రామాలలోని పేదరిక నిర్మూలననే మనకున్న ప్రధాన సమస్య. కాబట్టి దేశాభివృద్ధికి గ్రామీణాభివృద్ధి యొక్క ఆవశ్యకత ఎంతైనా ఉంది.

1. పాల్‌స్ట్రీటెన్ వంటి ప్రముఖ ఆర్థికవేత్తల అభిప్రాయం ప్రకారం పేదరికం ఎక్కడ ఉన్నా అది అభివృద్ధికి అవరోధము. అందువలన దేశ సంపదల గురించి తెలుసుకోవటం కన్నా గ్రామాలలో ఉండే పేదరికం గురించి తెలుసుకొనుట ముఖ్యం. అందువలన గ్రామీణాభివృద్ధి అను భావనకు ప్రాధాన్యత పెరిగింది.

2. స్వాతంత్ర్యానంతరం ఏర్పరచబడిన భారత రాజ్యాంగం సామ్యవాద సమాజ స్థాపనను ముఖ్య ధ్యేయంగా ఎంచుకున్నది. సామ్యవాద సమాజ స్థాపన అంటే కేవలం జాతీయాదాయంలో పెరుగుదల మాత్రమే కాదు. పెరిగిన జాతీయాదాయం ప్రణాళికాయుతంగా దేశంలోని అన్ని వర్గాల ప్రజల మధ్య అంతర్గతంగా సక్రమంగా సమానంగా పంపిణీ చేయబడాలి. దీనికి విరుద్ధంగా మన దేశంలో గ్రామీణ ప్రాంతాలలో పేదరికము, నిరుద్యోగిత ప్రబలుతున్నది. ఈ సమస్యల పరిష్కారానికి గ్రామీణాభివృద్ధి ఆవశ్యకత ఉన్నది.

3. వ్యవసాయోత్పత్తులు ఎక్కువగా వర్షాధారం కావటం చేత శీతోష్ణస్థితిలోని మార్పులు, వ్యవసాయ ఉత్పత్తులలో భారీగా హెచ్చుతగ్గులను తెస్తాయి. ఈ హెచ్చు తగ్గులు వ్యవసాయ వస్తువుల ధరలలోనూ, రైతుల ఆదాయాలలోను విపరీతంగా మార్పులు తెస్తాయి. వ్యవసాయ వస్తువులు అతి తక్కువ ధర డిమాండు వ్యాకోచత్వాన్ని కలిగి ఉంటాయి. పైగా ఎక్కువ మంది మన దేశంలో సన్నకారు, ఉపాంత రైతులు కావటంతో వీరు వ్యవసాయ వస్తువుల ధరలోని ఈ విపరీతమైన మార్పులకు తట్టుకోలేకపోతున్నారు. కాబట్టి పేద రైతుల అభివృద్ధికి వ్యవసాయోత్పత్తుల ధరలను స్థిరీకరించటానికి ప్రభుత్వం పటిష్టమైన వ్యవసాయ ధరల విధానం ( Agricultural Pricing Policy) అవలంభించాలి. Procurement మరియు సపోర్ట్ ధరల విధానం ద్వారా రైతులకు సహాయపడాలి. ఇవి అన్నీ గ్రామీణాభివృద్ధి పథకాల ద్వారా అమలుపరచబడాలి.

* Source : Ministry of Finance Government of India, Economic Survey (2000 - 01) P.13.

4. మనదేశంలోని గ్రామీణుల తలసరి ఆదాయం తక్కువగా ఉండటం మాత్రమే కాక గ్రామీణ ఆదాయాలలో వ్యత్యాసం కూడా ఎక్కువ. గ్రామాలలో ముఖ్యమైన ఉత్పాదక వనరు అయిన భూమి అతి తక్కువ మంది భూస్వాముల చేతులలో కేంద్రీకృతం అయి ఉన్నది. భూకమతాల పంపిణీలోని అసమానతలే కాక అనేక గ్రామీణ ఉత్పాదక వనరులు పేదవారికి అందుబాటులో లేవు. ఇట్టి వ్యవస్థా పూర్వక లోపాలను తొలగించటానికి గ్రామీణాభివృద్ధి పథకాల అమలుకు ప్రభుత్వ జోక్యము అవసరము.

5. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అసంఘటితమై ఉన్నది. గ్రామీణ పరిశ్రమలు సంఘటితంగా లేక చెల్లాచెదరుగా (Scattered) ఉండుట చేత గ్రామీణులు కొనుగోలు, అమ్మకాలు రెండు వైపుల నుంచీ బేరమాడు శక్తిని పోగొట్టుకుంటున్నారు. ముడి పదార్థాల కొనుగోలులో భారీ పరిశ్రమల పోటీకి తట్టుకోలేక నాణ్యత తక్కువగా ఉన్న ముడి పదార్థంతో వస్తువులు ఉత్పత్తి చేయుట వలన సరసమైన ధరలను పొందలేకపోతున్నారు. విక్రయం విషయంలో కూడా వీరి వస్తువులకు తగిన మార్కెట్ సదుపాయం లేదు. ఈ సమస్యలను పరిష్కరించటానికి, లఘు కుటీర పరిశ్రమలకు బలోపేతం చేయటానికి ప్రభుత్వం K.V.I.C మొ॥గు సంస్థల ద్వారా గ్రామీణులకు సహకారం అందించాలి.

6. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న మరో ముఖ్య లోపం తగిన ప్రాథమిక అవస్థాపనా సదుపాయాలు లేకపోవుట. రవాణా సమాచార సదుపాయాలు, మంచి నీరు, విద్యుచ్ఛక్తి, విద్య, వైద్యము, పారిశుధ్యము రక్షణ వ్యవస్థ మొ॥ ప్రభుత్వ సేవలు సక్రమముగా అందకపోవడం లేదా సక్రమంగా నిర్వహింపబడకపోవటం గ్రామీణ వ్యవస్థ వెనకబడటానికి కారణాలు. కాబట్టి ఈ లోపాల సవరణకు గ్రామీణాభివృద్ధి ఆవశ్యకత ఎంతైనా ఉంది.

7. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా వ్యవసాయ రంగం పై ఆధారపడి ఉన్నది. కాబట్టి వ్యవసాయ రంగంలో ఉన్న వ్యవస్థాపూర్వక, సంస్థాగతమైన లోపాలను గ్రామీణాభివృద్ధి పథకాల ద్వారా సవరించాలి. భూ సంస్కరణలు భూకమతాల

పంపిణీలోని అసమానతలను తొలగించగలవు. సాంకేతిక పరిజ్ఞానాన్ని శాస్త్రీయంగా వ్యవసాయ రంగాలని అనువర్తింప చేయటం ద్వారా ఫలసాయం పెంపు చేయవచ్చు. ఉదాహరణకు ఇజ్రాయిల్ దేశంలో శాస్త్రీయ పద్ధతుల ద్వారా బీడు భూములను పచ్చిక బయళ్ళుగాను సాగు భూమిగాను మార్చటం జరిగింది.

8. అటవీ సంపద పరిరక్షణకై గ్రామీణాభివృద్ధి పథకాల అవసరం ఉన్నది. సరియైన సామాజిక అటవీ విధానం ద్వారా గ్రామీణుల ఆదాయాలను పెంచవచ్చు.

9. గ్రామాలలో పూల, పండ్ల తోటల పెంపకం ప్రభుత్వం సరియైన అభివృద్ధి పథకాలను అమలుపరిస్తే గ్రామాలలో స్వయం ఉపాధి ద్వారా నిరుద్యోగితను, భూమి పై ఒత్తిడిని తొలగించి గ్రామీణాభివృద్ధిని పొందవచ్చు.

10. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలైన పాడి పరిశ్రమ, కోళ్ళ పెంపకం, చేపల పరిశ్రమ మొదలగు వాటిని గ్రామాలలో ప్రోత్సహించటం ద్వారా గ్రామీణుల జీవన ప్రమాణ స్థాయిని పెంచవచ్చును.

11. వ్యవసాయ వస్తువులను ముడి పదార్థాలుగా వాడు పరిశ్రమలు గ్రామాలలో స్థాపించబడాలి. వీటికి కావలసిన శిక్షణను, కొద్దిపాటి మూలధనాన్ని ప్రభుత్వం స్వయం సహాయ సంఘాలను ప్రోత్సహించటం ద్వారా ఏర్పాటు చేయాలి. మైక్రో క్రెడిట్ పద్ధతి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడటానికి సహాయపడగలదు. పైన పేర్కొన్న అంశాలన్నీ గ్రామీణాభివృద్ధి ఆవశ్యకతను విశదపరుచుచున్నవి.

## 1.9 ఆర్థికాభివృద్ధి - గ్రామీణాభివృద్ధి :-

"భారతదేశంలో అధిక జనాభా గ్రామాలలో నివసిస్తున్నారు. కాబట్టి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందనేది గ్రహించవలసిన విషయం. నిజమైన భారతదేశం గ్రామాలలో ఉన్నది. వెనుకబడిన వారిని, గిరిజనులను పైకి తీసుకురాలేకపోతే భారతదేశ భవిష్యత్తు అంధకారమే" అని స్వామి వివేకానంద తెలియచెప్పారు.

"The real India lives in villages. Unless we are able to uplift the tribals and backward classes, India faces a dark future." - Swami Vivekananda

ఇదే అభిప్రాయాన్ని జాతిపిత మహాత్మాగాంధీ మరియు పండిత జవహర్‌లాల్ నెహ్రూ వ్యక్త పరిచారు.

ప్రముఖ అర్థశాస్త్రవేత్తలైన హలిస్ టెనరీ, మాంటేన్ అహ్లూవాలియా ప్రకారం గ్రామీణాభివృద్ధి జరిగితేనే, ఆర్థికాభివృద్ధి ఒక దేశంలో సాధ్యపడుతుంది. వారిచే తయారు చేయబడిన ఇంటర్నేషనల్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ గ్రామీణాభివృద్ధి నమూనా (International Government Organisation Model of Rural Development) ఈ విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రభుత్వ వనరుల కేటాయింపు ధోరణి మారాలని, కొన్ని నిధులకైనా ప్రత్యక్షంగా గ్రామీణాభివృద్ధికై ( Trickle up benefit theory ) తరలించబడాలని ఈ శాస్త్రవేత్తలు తమ అభివృద్ధి నమూనాలో సూచించారు.

ప్రభుత్వ పెట్టుబడులు గ్రామీణాభివృద్ధికై తరలించినపుడు, గ్రామాలలో ఉండే సన్నకారు. ఉపాంత రైతులు, వ్యవసాయ కూలీలు, ఇతర చేతివృత్తుల వారి ఆదాయ స్థాయి పెరుగుతుంది. అపుడు పారిశ్రామికరణ ద్వారా పట్టణాలలో ఉత్పత్తి చేయబడే వస్తువులకు సార్థక డిమాండ్ పెరిగి మార్కెట్లు విస్తృతమౌతాయి. అధిక జనాభా గ్రామాలలో ఉన్నారు. కాబట్టి వారి కొనుగోలు శక్తి పెరగనిదే స్వదేశీ మార్కెట్లకు వ్యాకోచత్వం ఉండదు. అంటే సేవల రంగం, పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందాలంటే ఆయా రంగాలు అందిస్తున్న సేవలు, ఉత్పత్తి చేయబడుతున్న వస్తువులకు డిమాండు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నుంచి రావాలి. అంటే గ్రామీణాభివృద్ధి జరిగితేనే దేశంలోని ఆర్థిక రంగాలు వృద్ధి చెంది దేశం ఆర్థికంగా ముందుకు నడుస్తుంది.

## 1.10 సారాంశము :-

పై అంశాలను పరిశీలిస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పెరుగుపడాలి అంటే మొదటగా గ్రామీణాభివృద్ధి అంటే ఏమిటో తెలుసుకోవాలి. గ్రామీణాభివృద్ధి పరిధిలో చేరగల అంశాలు తెలిస్తే, గ్రామీణ వ్యవస్థలో ఉన్న లోటు పాట్లను తెలుసుకుని వాటిని సవరించటానికి గ్రామీణాభివృద్ధి పథకాలను ఏ విధంగా అమలు పరచాలో తెలుసుకోవచ్చు. చివరగా ఈ పాఠంలో గ్రామీణాభివృద్ధిని, ఆర్థికాభివృద్ధికి ఉన్న సంబంధాన్ని సూచించటం జరిగింది.

## 1.11 నమూనా ప్రశ్నలు :-

1. గ్రామీణాభివృద్ధి అనగానేమి? మహాత్మాగాంధీ ఆదర్శ గ్రామాన్ని వర్ణించండి.
2. భారతదేశంలో ప్రాచీన గ్రామాలకు, నేటి గ్రామాలకు మధ్య ఉన్న తేడాలను వివరించండి.
3. గ్రామీణాభివృద్ధి పరిధిని, ఆవశ్యకతను విశ్లేషించండి.

## 1.12 చదువదగిన గ్రంథాలు :-


1. Vasant Desai - Issues and Problems & Rural Development, Vol I, Himalaya Publishing Home
2. Katarsingh - Rural Development, Principles, Policies & Management, Suge Publications
3. Vasant Desai - Rural Developement In India, Past, Present & Future. A Challange in the Crisis
4. Vasant Desai - A Study of Rural Economics
5. I. Satyasundaram - Rural Developement, Himalaya Publishing House
6. J.K. Mehta - Gandhian Thought, An Analytical Study as High Publishing House- 1995


శ్రీమతి. యస్. సుబ్బలక్ష్మి

**పాఠం - 2**

# గ్రామీణాభివృద్ధి సంస్థలు

## 2.0 లక్ష్యం :-

ఈ పాఠం చదువుట వలన గ్రామీణాభివృద్ధి కి తోడ్పడే సంస్థలు ముఖ్యంగా (D.R.D.A.'s) సహకార సంస్థలు, పంచాయితీలు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలు, జిల్లా పారిశ్రామిక కేంద్రాలు (D.I.C.'s), సమగ్ర గిరిజనాభివృద్ధి ఏజన్సీలు (D.T.D.A.), జిల్లా ప్రణాళికా బోర్డులు (D.P.B.'s), S.C మరియు B.C. కార్పోరేషన్‌లను గురించి వివరించడం జరిగినది. ఈ పాఠ్యమును చదివిన తరువాత విద్యార్థులకు గ్రామీణాభివృద్ధికి వివిధ గ్రామీణాభివృద్ధి సంస్థలు పనిచేసే తీరు, గ్రామీణాభివృద్ధి కోసం వివిధ సంస్థలు నిర్వహించే విధులకు ఏర్పడే అవరోధాలు, ఆయా అవరోధాలను రూపుమాపుటకు ప్రణాళికలలో ప్రభుత్వాలు తీసుకునే చర్యలు, ప్రజల సహకారం ఏ విధంగా వున్నదీ, గ్రామీణాభివృద్ధి ఎంత వరకు సాధించినదీ మొదలగు విషయాలను గురించి విద్యార్థికి పూర్తి అవగాహన ఏర్పడుతుంది.

## విషయసూచిక :-


**2.1 ఉపోద్ఘాతము**

**2.2 గ్రామీణాభివృద్ధి సంస్థలు**

**2.3 భారతదేశములో గ్రామీణాభివృద్ధికి సహకార సంఘాల పాత్ర**

**2.4 సహకార సంఘాల పనితీరులో ఎదురయ్యే సమస్యలు**

**2.5 పంచాయితీరాజ్ సంస్థల నిర్వహణ - పరిపాలనా వికేంద్రీకరణ - గ్రామీణాభివృద్ధి**

**2.6 గ్రామీణాభివృద్ధిలో పంచాయితీ రాజ్ సంస్థల పాత్ర**

**2.7 జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ** (D.R.D.A.)

**2.8 సమగ్ర గిరిజనాభివృద్ధి ఏజన్సీ** (I.T.D.A.)

**2.9 జిల్లా ప్రణాళికా బోర్డు** (D.P.B.)

**2.10 జిల్లా పారిశ్రామిక కేంద్రాలు** (D.I.C.)

**2.11** S.C. **మరియు** B.C. **కార్పోరేషన్లు**

**2.12 సారాంశము**

**2.13 గుర్తుంచుకోవలసిన విషయాలు**

**2.14 కఠిన పదాలు**

**2.15 నమూనా ప్రశ్నలు**

**2.16 చదువదగిన గ్రంథాలు**

## 2.1 ఉపోద్ఘాతము :-

మానవ మరియు సహజ వనరులతో గ్రామీణ ప్రాంతాలను మెరుగుపరచడమే గ్రామీణాభివృద్ధి అనవచ్చు. గ్రామాల సంపూర్ణ అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలను రూపొందించడం జరిగినది. ఆ పథకాల అమలుకు పటిష్టమైన సంస్థలు అవసరం. అవే గ్రామీణాభివృద్ధి సంస్థలు. సామూహిక జీవనం ప్రారంభమయిన నాటి నుండి ఏదో ఒక రూపంలో సహకారము అనే భావన ఉన్నది. అట్టి సహకారాన్ని గూర్చి సహకార సంఘాలను గూర్చి ఈ భాగంలో వివరించడమైనది. అదే విధంగా గ్రామీణాభివృద్ధి పంచాయితీలు పట్టుకొమ్మలు లాంటివి. పంచాయితీల నిర్వహణ తీరు ప్రతి అర్థం గ్రామాలభివృద్ధి. సంఘటితమైన పంచాయితీరాజ్ వ్యవస్థ అవసరాన్ని గుర్తించి మన దేశంలో పంచాయితీరాజ్ వ్యవస్థను వివిధ దశలలో మార్పులను చేసుకుంటూ, పంచాయితీల నిర్వహణకు తగిన వనరులను కల్పిస్తూ 73వ రాజ్యాంగ సవరణ ద్వారా అశోక్‌మెహతా కమిటీ సూచనల మేరకు పరిపాలనా వికేంద్రకరణను చేపట్టడం జరిగినది. తద్వారా బహు ముఖంగా గ్రామీణాభివృద్ధి చర్యలు చేపట్టడం కోసం అవిరళ కృషిని ప్రభుత్వాలు సాగిస్తున్నాయి.

అదే విధంగా సమగ్ర అభివృద్ధిని సాధించుటకు సమగ్ర గ్రామీణాభివృద్ధి కార్యక్రమమును అమలుపరుచుటకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేయడమైనది. గిరిజనుల అభివృద్ధి ప్రత్యేకించి సమగ్ర గిరిజనాభివృద్ధి ఏజన్సీ (ITDA) ఏర్పాటయినది. అదే విధంగా జిల్లా పారిశ్రామిక కేంద్రాలు (D.I.C.), జిల్లా ప్రణాళికా బోర్డులు (D.P.B.'s), గ్రామీణాభివృద్ధికి తీసుకున్న చర్యలు అనేకం. వీటితోపాటు గ్రామాలలో వెనుకబడిపోయి, దారిద్ర్య రేఖకు దిగువున వున్న షెడ్యూల్డు కులాలు మరియు వెనుకబడిన తరగతుల వారి అభివృద్ధికి S.C. మరియు B.C. కార్పోరేషన్‌లు ప్రభుత్వం ఏర్పాటు చేయడమైనది. గ్రామీణాభివృద్ధికి బహుముఖ సాధనకు పైన పేర్కొనిన సంస్థలు ప్రభుత్వాలు నిర్దేశించిన మార్గాలను గురించి తగిన కృషి చేస్తున్నాయి.

## 2.2 గ్రామీణాభివృద్ధి సంస్థలు - పరిధి :-

మన దేశంలో వ్యవసాయ ప్రాధాన్యత కల్గి అల్పాభివృద్ధి చోటు చేసుకున్నది ప్రధానంగా గ్రామ ప్రాంతాలలో చూస్తున్నాము. మన దేశ జనాభాలో 70 శాతం మంది గ్రామ ప్రాంతాలలో నివసిస్తున్నారు. అటువంటి గ్రామ ప్రాంతాలలో లభించే మానవ మరియు సహజ వనరుల సక్రమ వినియోగంతో గ్రామీణాభివృద్ధికి పాటుపడడం తక్షణ కర్తవ్యం. గ్రామీణ ప్రాంతాలలో కనిపించి అల్పాభివృద్ధి అనేక సమస్యలకు దారి తీస్తుంది. నిరుద్యోగం, పేదరికం, ఆర్థిక అసమానతలు, నిరక్షరాస్యత మొదలగు వలసలు జరుగుతున్నాయి. సాంఘిక న్యాయంతో కూడిన ఆర్థికాభివృద్ధిని సాధించవలెనంటే గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక కృషి అవసరం. గ్రామీణాభివృద్ధి పథకాలను, కార్యక్రమాలను అమలు పరచుటకు పటిష్టమైన సంస్థాపరమైన ఏర్పాటు ఉండాలి. ఇందుకోసం ఏర్పాటయినవి గ్రామీణాభివృద్ధి సంస్థలు. ముఖ్యంగా గ్రామ పంచాయితీలు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలు, సహకార సంస్థలు, గిరిజనాభివృద్ధి సంస్థలు, జిల్లా ప్రణాళికా బోర్డులు, జిల్లా పారిశ్రామిక కేంద్రాలు, S.C. మరియు B.C. కార్పోరేషన్‌లు మొదలగునవి.

గ్రామీణాభివృద్ధి వివిధ లక్ష్యాల సాధనకు ఈ సంస్థలు దోహదపడతాయి. ఈ సంస్థలన్నీ అంకిత భావంతో పని చేస్తేనే గ్రామీణాభివృద్ధి సాధ్యము. గ్రామీణాభివృద్ధి అనేది ఈ సంస్థల భుజస్కంధాల పైనే వున్నదని చెప్పవచ్చు. గాంధీజీ ఆశించిన రామరాజ్యం ముఖ్యంగా పంచాయితీరాజ్ వ్యవస్థ ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది.

## 2.3 భారతదేశ గ్రామీణాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర :-

కొన్ని తృతీయ ప్రపంచ దేశాలు సమజాభివృద్ధి పరిధిలోనే సహకార సంఘాలను ఏర్పరచుకున్నాయి. సహకార సంఘాల ద్వారా వ్యక్తులు తమ పరిస్థితులను మెరుగుపరుచుకొనుటకు కొంతమంది కలసి పనిచేయుటనే సహకార సంఘం అని అర్థము. అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రకారం సామాజిక ఆర్థిక ప్రయోజనాన్ని ఆశించి ప్రజాస్వామిక పద్ధతుల ద్వారా కార్యకలాపాలు నిర్వహించుకొనుటకు స్వచ్ఛందంగా ఒక సంస్థగా ఏర్పడిన వ్యక్తుల సముదాయము సహకార సంఘము. కొందరు వ్యక్తులు కలసి

సమిష్టిగా పనిచేసి ఉత్తమ ఫలితాలను సాధించడాన్నే సహకార సంఘము అంటాము. సహకార సంఘాలు సమాజాభివృద్ధిలో ఒక భాగం. భారతదేశానికి సంబంధించి అతి ప్రాచీన గ్రంథాలలో కూడా ప్రజలు సహకార సంఘాలను ఏర్పరచుకుని సుఖ జీవనాన్ని గడిపారనే సమాచారం ఉన్నది. రెండవ ప్రపంచ యుద్ధానంతరము మన దేశంలో సహకార ఉద్యమంలో ఎంతో మార్పు సంభవించినది. కేవలం పరపతిని అందించే సంస్థలుగానే ఉన్న అప్పటి సహకార సంఘాలు తర్వాత ఉత్పత్తి పంపిణీ వంటి కార్యకలాపాలలో పాల్గొనడం జరిగినది. 1944లో వ్యవసాయ విత్త ఉప సంఘాన్ని ఒక దానిని నియమించినది.

స్వాతంత్ర్యానంతరం దేశంలో గ్రామీణాభివృద్ధికి సహకార ఉద్యమం ఒక సమర్థవంతమైన సాధనంగా పరిగణించబడినది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి, సాంఘిక ఆర్థిక చైతన్యానికి, సమాజాభివృద్ధిలో ఒక భాగంగా వ్యాపార సంస్థలుగా, ఆర్థిక విధాన సాధనాలుగా సహకార సంఘాలు మన దేశంలో ఎన్నో పాత్రలు పోషించినాయి. మార్కెటింగు, పరపతి, సరఫరా, సమగ్ర అభివృద్ధి పథకాలు, వ్యవసాయ సంస్కరణలు మొదలగు రంగాలలో సహకార సంఘాలు ఆర్థిక విధాన సాధనములుగా ఉపయోగపడినాయి. 95 శాతం గ్రామాలకు సహకార సంస్థలు విస్తరించినాయి. ఎరువులు, కర్మాగారాలు, పంచదార మిల్లులు, నూనె మిల్లులు, సహకార రంగంలోనే నెలకొల్పబడినాయి. కనీసం 50 శాతం గ్రామీణ జనాభా సహకార సంఘాల ద్వారా లాభాన్ని పొందుతున్నారు.

**(ఏ) సహకార పరపతి సంఘాలు :-** అనాది నుండి మన దేశంలో గ్రామీణాభివృద్ధి వ్యవసాయాభివృద్ధితో ముడిపడి ఉన్నది. వ్యవసాయాభివృద్ధికి నీటి పారుదల సౌకర్యాలను సమకూర్చుటకు, అధిక దిగుబడినిచ్చే వంగడాలభివృద్ధి, రసాయన ఎరువుల సప్లయి, క్రిమి సంహారక మందులు సప్లయి చేయడం మొదలగు వాటిని సమకూర్చుకొనుటకు వ్యవసాయ పరపతి చాలా అవసరము. వ్యవసాయ పరపతి మూలాధారాలలో ముఖ్యమయినది వ్యవసాయ పరపతి. స్వల్పకాలిక, దీర్ఘకాలిక పరపతిని సహకార ప్రాతిపదిక మీద సమకూరుస్తూ వ్యవసాయాభివృద్ధికి దోహదపడుతుంది. విక్రయం, ప్రాసెసింగు, గిడ్డంగి సదుపాయాలను కూడా సహకార పరపతిని విస్తృతపరిస్తే వ్యవసాయము లాభసాటి కార్యక్రమంగా రూపొందించబడుతుంది.

**(బి) ప్రాథమిక సహకార సంఘాలు :-** గ్రామ స్థాయిలో రైతులకు అప్పులనివ్వడమే ఈ ప్రాథమిక సహకార సంఘాల లక్ష్యం. సహకార పరపతి మూడంచెల విధానంలో ప్రాథమిక సహకార సంఘాలు ఒకటి. సాధారణముగా గ్రామానికి చెందిన 10 లేక అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులతో దీనిని ప్రారంభిస్తారు. వ్యవసాయ కార్యకలాపాలు 10 - 15 నెలల వరకు అల్పకాలిక ఋణాలు ఇస్తాయి. వ్యక్తుల హోదాతో సంబంధం లేకుండా గ్రామీణ వాసులందరికీ సభ్యత్వం ఉంటుంది. ప్రతి సభ్యుడు సంఘం వాటా మూలధనానికి కొంత చెల్లిస్తాడు. ప్రతి సభ్యుని బాధ్యత అపరిమితం. అనగా సంఘం విఫలమయిన మొత్తం సంఘానికి ప్రతి సభ్యుడు బాధ్యత వహించాలి. వ్యవసాయ కార్యకలాపాలకు ఇచ్చిన స్వల్పకాలిక ఋణాల ద్వారా వచ్చిన రాబడిని గ్రామీణాభివృద్ధికి ఉపయోగిస్తారు. ఈ ప్రాథమిక సహకార సంఘాలు సహకార బ్యాంకింగులో బలహీనమైన పాత్రని పోషించినాయి. దానికి కారణాలు -

1. ఈ సంఘాలు రైతులకు కావలసినంత ఆర్థిక సహాయాన్ని అందివ్వడం లేదు.
2. చిన్న రైతులకు ఋణాలు అందడం లేదు.
3. ఈ సంఘాల వనరులు స్వల్పము. అందుచే ఇవ్వగలిగే ఋణాలు తక్కువ.
4. ప్రజలలో ఈ సంఘాల పటిష్టత మీద నమ్మకం లేదు.

అయినప్పటికీ ప్రాథమిక పరపతి సంఘాల సంఖ్య గణనీయంగా పెరిగినది. ప్రస్తుత అంచనాలనుబట్టి మన దేశంలో పదివేల ప్రాథమిక సహకార పరపతి సంఘాలున్నాయి. 86 శాతం గ్రామాలు, 62 శాతం గ్రామీణ ప్రజలు వీటి పరిధిలోకి వచ్చారు. ఈ సంఘాల ద్వారా లభించే పరపతి మొత్తం పరపతిలో 40 శాతం పైగా వున్నది. బలహీన వర్గాలకు ఇది అందించే పరపతి పరిమాణం పెరిగినది.

**(సి) సేవా సహకార సంఘాలు :-** దేశ సామాజిక మరియు ఆర్థిక అభివృద్ధి ప్రక్రియలో గ్రామీణ ప్రజల పాత్రను పెంపొందించుటకు వీలు కల్పించే సంస్థలే సహకార సంస్థలు. మన దేశంలో సామ్యవాద రీతి సమాజ స్థాపనను స్థాపించే లక్ష్యంతో జాతీయాభివృద్ధి మండలి 1958లో దేశ వ్యాప్తంగా సేవా సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని తీర్మానించింది. భారత ప్రతినిధి వర్గం 1959లో సమర్పించిన నివేదికలో సేవా సహకార సంఘాలు అనే పదాన్ని సమర్థించినారు. సేవా సంఘాలు సహకార సూత్రాల ప్రాతిపదికగా ఏర్పాటయి, దానిలోని సభ్యులకు కావలసిన అన్ని సేవలను అందించే స్వచ్ఛంధ సంస్థలు. మరో విధంగా చెప్పవలెనంటే సేవా సహకార సంఘాలు దానిలోని సభ్యుల సాధారణ ఆర్థిక అవసరాలను అందచేయడానికి వ్యవసాయోత్పత్తిని పెంచడానికి, పరస్పర సహాయ సహకారాల పై గ్రామీణులు నడిపే వ్యవస్థలు.

**సేవా సహకార సంఘాల విధులు :-**

1. సభ్యులలో స్వయం సహాయ లక్ష్యాన్ని పరస్పర సహకారాన్ని ప్రోత్సహిస్తాయి.
2. సభ్యులకు కావలసిన స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ఋణాలు ఇచ్చి వ్యవసాయదారుల భూములను అభివృద్ధిపరుస్తాయి.
3. రైతులకు కావలసిన వ్యవసాయ వస్తువులను సేకరించి పంపిణీ చేస్తాయి.

   ఉదా॥ విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు మొదలైనవి.
4. వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ, ప్రాసెస్ చేయడానికి తగిన ఏర్పాట్లు సరసమయిన ధరకు అమ్మిపెట్టే ఏర్పాటు చేయడం.
5. వ్యవసాయ పథకాలు తయారు చేయడం, అమలు పరచడంలో సభ్యులకు సహాయం చేస్తూ అవసరమయిన సాంకేతిక సలహాలను ఇస్తుంది. ఇవేకాక జాతీయ అభివృద్ధి మండలి, సహకార ఋణాల సంఘం, భారతదేశంలో సహకార సంఘాల సభ్యులకు మరికొన్ని సేవలు కూడా సమకూర్చాలని విక్రయపరంగా మార్కెటింగు సంస్థగా పంపిణీ సంస్థగా, వీటన్నింటి కంటే ముఖ్యంగా వ్యవసాయాభివృద్ధి ఏజన్సీగా పని చేస్తాయి. అనగా సేవా సహకార సంఘాలు గ్రామీణ సమాజ పరిపూర్ణ ఆర్థిక సాంఘికాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని అనేక కార్యకలాపాలను నిర్వహిస్తాయి. ఇవి గ్రామాలలో ఒక కేంద్ర వ్యవస్థగా వుంటూ గ్రామీణాభివృద్ధికి తోడ్పడుతుంది.

## 2.4 సహకార సంఘాల పనితీరులో ఎదురయ్యే సమస్యలు :-

దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధి ప్రక్రియలో గ్రామీణ ప్రజల పాత్రను పెంపొందించేందుకు వీలు కల్పించే సంస్థలే సహకార సంస్థలు. అయితే కొన్ని సమస్యలు గలవు అవి - (1) పాలనాపరమైన సమస్యలు, (2) ఆర్థిక సమస్యలు, (3) వసూలు కాని ఋణాల సమస్య, (4) ఋణాల దుర్వినియోగం, (5) ఉద్యోగ సమూహానికి సంబంధించిన సమస్యలు, (6) ఇతర సమస్యలు.

**1. పాలనాపరమైన సమస్యలు :-**

(ఎ) కేంద్రీకృత ప్రణాళికా వ్యవస్థలో సహకార సంస్థలు స్వతంత్రంగా వ్యవహరించలేవు. సహకార సంస్థలోని వివిధ భాగాల మధ్య సమన్వయ లోపం అధికం.

(బి) సహకార సంస్థల పాలన ఎన్నో నియమ నిబంధనలకు లోబడి వుంటుంది. క్లిష్టమయిన ఈ పద్ధతి సమర్థవంతయిన పాలనా పద్ధతులకు అడ్డు తగులుతుంది.

(సి) మార్కెటింగు సౌకర్యాలు, గిడ్డంగుల మొదలగు సౌకర్యాలను సహకార సంస్థ కలుగ చేయడం లేదు.

(డి) ఋణాల మంజూరు జాప్యం వలన సహకార సంస్థలు విమర్శలకు గురైనవి.

(ఇ) శిక్షణ పొందిన, నిజాయితీ గల, సమర్థులయిన సిబ్బంది లభ్యం కానందున ఈ సంస్థల పనితీరు సమర్థవంతంగా లేదనే విమర్శ వున్నది.

(ఎఫ్) ఆచరణలో సహకార సంస్థల పై ప్రభుత్వం నిర్వహించే పర్యవేక్షణ, తనిఖీలు, ఆడిటింగ్ సక్రమంగా జరపడం లేదు.

2. **ఆర్థిక సమస్యలు :-** సహకార సంస్థలకు ఆర్థిక వనరుల కొరత ఉన్నది. పరిమిత వనరులలో అవి ఎక్కువ మందికి ఋణ సౌకర్యాలను కల్పించలేకున్నాయి. ఇవి వసూలు చేసే వడ్డీ రేటు తక్కువగా వున్నప్పటికీ పరపతి పొందుటకు కొంత ధనం ఖర్చు పెట్టవలసి వుంది.

3. **వసూలు కాని ఋణ సమస్య :-** సహకార సంస్థల సామర్థ్యం అవి మంజూరు చేసిన ఋణాలు, వసూలు చేసిన ఋణాల పై కూడా ఆధారపడి వుండును. ప్రకృతి వైపరీత్యాలు, మార్కెటింగు మాంద్యం, ఋణగ్రహీతలలో నిజాయితీ కొరవడడం మొ॥ కారణాల వలన వసూలు కాని ఋణాల సమస్యలు ఏర్పడుతున్నాయి. బకాయిలు ఎక్కువగా వున్న సంస్థలు కొన్ని తమ విధులను కూడా నిర్వహించలేని స్థితిలో వున్నాయి.

4. **ఋణాల దుర్వినియోగం :-** సహకార సంస్థల ద్వారా లభించిన ఋణాలను రైతులు అనుత్పాదక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. అందువలన వారికి ఋణాలు తీర్చగలిగే శక్తి తగ్గి ఋణ బకాయిలు పెరుగుతున్నవి.

5. **ఉద్యోగ సమూహం - సమస్యలు :-** సహకార సంస్థల ఉద్యోగుల నియామకాలలో లోపాలున్నాయని లంచగొండితనం వుందనే విమర్శ వున్నది.

6. **ఇతర సమస్యలు :-** సహకార సంస్థలు కొన్ని విచ్ఛిన్నకర శక్తుల చేతుల్లో కీలుబొమ్మలనే విమర్శ కూడా వున్నది.

## 2.5 పంచాయితీరాజ్ సంస్థల నిర్వహణ - పరిపాలనా వికేంద్రీకరణ - గ్రామీణాభివృద్ధి :-

ప్రజాస్వామ్య పటిష్టతకు వికేంద్రీకృత పరిపాలన యొక్క ఆవశ్యకత ఉన్నది. ప్రజాస్వామ్యం అంటే పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం. విధులను ప్రజలకు కేటాయించడమే పరిపాలనా వికేంద్రీకరణ. స్థానిక సంస్థలు నిర్దేశించిన విధులను నిర్వహిస్తూ ప్రజాస్వామ్య పరిపాలనలో భాగస్వాములుగా వున్నాయి. మన దేశంలోని స్థానిక సంస్థలు స్వపరిపాలన దిశలో పయనిస్తూ విధులను నిర్వహిస్తున్నాయి. పంచాయితీరాజ్ వ్యవస్థగా రూపొందడం జరిగినది. మొదటిసారిగా 1952, అక్టోబర్ 2న 55 ప్రాజెక్టు ప్రాంతాలలో గ్రామీణ పునర్నిర్మాణానికి సమాజాభివృద్ధి పథకం (Community Development Programme) ప్రారంభించబడినది. బల్వంతరాయ్ మెహతా కమిటీ ఆధ్వర్యంలో 1957లో సమాజాభివృద్ధి పథకం మరియు జాతీయ విస్తరణా కార్యక్రమాల పరిశీలన జరిగిన దరిమిలా ఇచ్చిన సూచనలలో స్థానికులకు పరిపాలనలో బాధ్యత మరియు అధికారము ఇచ్చినచో సత్ఫలితాలుంటాయని పేర్కొనడం జరిగినది. తత్ఫలితంగా భారతదేశ రాజకీయ చరిత్రలో స్వయం పాలనా సంస్థగా పంచాయితీరాజ్ సంస్థ ఆవిర్భావానికి కారణమైనది. బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ ప్రకారం పంచాయితీరాజ్ సంస్థలు ఈ క్రింది లక్షణాలను కల్గి ఉండాలి.

1. గ్రామ స్థాయిలో గ్రామ పంచాయితీ, బ్లాక్ స్థాయిలో పంచాయితీ సమితి, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ ఏర్పరచబడినది. ఈ మూడింటి మధ్య అనుసంధానం ఉండాలి.

2. స్థానిక సంస్థలకు అధికారాలు, బాధ్యతలు వాస్తవముగా బదిలీ చేయబడాలి.

3. వాటి విధులను అవి సక్రమంగా నిర్వర్తించుటకు అవసరమైన వనరులు కల్పించాలి.

4. ప్రజాస్వామ్య పాలనలో అట్టడగు స్థాయిలో అభివృద్ధి పథకాలను పంచాయితీరాజ్ సంస్థలు అమలుపరుచు అధికారాన్ని కల్గి వుండాలి.

5. స్థానిక సంస్థలు ప్రజాసామ్య వికేంద్రీకరణకు ప్రతీకలుగా వుండాలి.

పై సూచనల ప్రకారంగానే రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో పంచాయితీరాజ్ సంస్థలు అమలులోనికి వచ్చినవి. అప్పటికే మహాత్మాగాంధి స్వపరిపాలనా సంస్థల ప్రాధాన్యతను గురించి మరియు మన దేశంలో ప్రాచీన కాలంలో గ్రామ పంచాయితీల పనితీరును, గ్రామీణాభివృద్ధికి పంచాయితీలు ఏ విధంగా తోడ్పడినాయి వివరించినారు.

మహాత్మాగాంధి భారతదేశంలో ఆదర్శ గ్రామ నిర్మాణం ద్వారా గ్రామీణ పునర్నిర్మాణం జరగాలని కలలుకన్నారు. ఆదర్శ గ్రామం అనేది రాజ్యంలో ప్రధానమైన మొదటి భాగం. ఈ భాగం స్వపరిపాలనా విధానాన్ని కలిగి పరిపాలనా వికేంద్రీకరణను సూచించినది. మన దేశంలో గ్రామ పంచాయితీలు ఆర్య నాగరికతలోనే చోటు చేసుకున్నాయి. ఆర్య నాగరికతలో గ్రామ పంచాయితీలకు పరిపాలన, శాసన, పౌర సంబంధ విషయాలలో విస్తృత అధికారాలుండేవి. ఈ అంశాలన్నింటిలో స్వతంత్ర ప్రతిపత్తిని కల్గి వుండెడివని మన స్మృతి, మహాభారతంలోని శాంతిపర్వం, కౌటిల్యుని అర్థశాస్త్రంలోను పేర్కొనబడినది. వాల్మీకి రామాయణ గ్రంథంలో "గణపథ్" ద్వారా గ్రామ స్వరాజ్యాన్ని అభివర్ణించినారు. శాతవాహనులు, చోళులు, కాకతీయులు కూడా స్థానిక సంస్థలకు ప్రాధాన్యతనిచ్చినారు. అనగా 230 B.C. నుండి 1326 A.D. వరకు భారతదేశంలో ఆంధ్రరాష్ట్రంలో స్థానిక సంస్థలు వృద్ధి చెందినాయి. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తన "Discovery of India" అను గ్రంథంలో స్థానిక సంస్థలను గురించి పేర్కొన్నారు. అప్పటి గ్రామ పంచాయితీలు తమ రాజ్యాంగాన్ని తామే తయారు చేసుకొనేవారు. ఈనాటి 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా గ్రామ పంచాయితీలకు సంక్రమించిన అధికారాలు అన్ని ఆనాటి స్వపరిపాలనా సంస్థలకుండేవని విమర్శకులు వ్యాఖ్య కూడా ఉన్నది.

**పంచాయితీరాజ్ సంస్థల విధులు :-** మూడంచెల పద్ధతిలో వున్న పంచాయితీరాజ్ నిర్వహణ ఈ క్రింది విధంగా వున్నది.

1. గ్రామీణ స్థాయి - గ్రామ పంచాయితీలు
2. బ్లాక్ స్థాయి - పంచాయితీ సమితి
3. జిల్లా స్థాయి - జిల్లా పరిషత్తులు

1. **గ్రామీణ స్థాయి :-** గ్రామీణ స్థాయిలో గ్రామ పంచాయితీ విధులను నిర్వహిస్తూ గ్రామీణాభివృద్ధికి తోడ్పడతాయి. గ్రామ పంచాయితీ విధులను తప్పనిసరి విధులు, ఆర్థిక వనరులను బట్టి నిర్వహించవలసిన విధులు అని రెండు విధాలుగా వర్గీకరించవచ్చు.

**తప్పనిసరి విధులు :-**

1. వీధి దీపాలు ఏర్పరచడం, రహదారులను వేయించుట, బాగు చేయించుట.
2. ఆరోగ్య సదుపాయములు కలుగచేయడం.
3. అంటువ్యాధుల నివారణ చర్యలు, పారిశుధ్యము.
4. గ్రామ ఆస్తుల పర్యవేక్షణ, పరిరక్షణ.
5. జీవన, మరణములను, వివాహములను నమోదు చేయుట.
6. గ్రామ సభ ఆస్తుల ఆక్రమణను నివారించుట.
7. తమ పరిధిలో వున్న మార్కెట్ల నిర్వహణ.

8. పశుగ్రాసాన్ని ఇచ్చి పచ్చిక బయళ్ళను పెంచుట, నిర్వహించుట.
9. మంచినీటి సౌకర్యార్థము బావులూ, చెరువులను త్రవ్వించుట, మరియు నిర్వహించుట.
10. వ్యవసాయ వాణిజ్య పరిశ్రమల వృద్ధి.
11. స్త్రీ, శిశు సంక్షేమము.
12. ఎరువుల నిల్వకు స్థలములను కేటాయించుట.

**ఆర్థిక వనరులను బట్టి నిర్వహించవలసిన విధులు :-**

1. రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటించుట.
2. పశుసంరక్షణకు శాస్త్రీయ పద్ధతులు అవలంభించుట.
3. సహకార భావనను పెంపొందించుట.
4. క్షామము మొదలగు ప్రకృతి వైపరీత్యముల నుండి ప్రజలకు ఉపశమనము కలిగించుట.
5. గ్రంథాలయములను నిర్వహించుట.
6. గ్రామమును, గ్రామ ఆస్తులను పర్యవేక్షించుటకు స్వచ్ఛంద సహాయక బృందమును నిర్వహించుట.
7. వివిధ జాతి, మత కులములకు చెందిన ప్రజల మధ్య సత్సంబంధములను ప్రోత్సహించుట.
8. వినోదముకై తగిన ఏర్పాట్లు చేయుట.

ఆచరణలో విధుల నిర్వహణలో గ్రామ పంచాయితీలకు అనేక సమస్యలు ఏర్పడినాయి. రాజ్యాంగములో పంచాయితీరాజ్ సంస్థలు నిర్దేశిత సూత్రాలలో మాత్రమే గుర్తించబడడం, వాటి స్వయం పాలనాధికారంలో సమస్యలురావడానికి కారణమని చెప్పవచ్చు. గ్రామ పంచాయితీల పాలనలో స్థానికంగా ఉన్న అనేక అంశాల విషయంలో స్వయం నిర్ణయాధికారానికి, పంచాయితీరాజ్ సంస్థలకు సక్రమమైన పాలనా యంత్రాంగము, తగినన్ని ఆర్థిక వనరులు, బలమైన స్థానిక నాయకత్వము వుండాలి. స్థానిక సంస్థలు రాష్ట్ర ప్రభుత్వాల అధికారానికి లోబడి వున్నాయి. స్థానిక పంచాయితీల విధులతో పోలిస్తే వనరులు చాలా తక్కువ. ఈ స్థానిక సంస్థలు బలోపేతానికి తగిన చర్యల ఫలితమే మరియు అశోక్‌మెహతా కమిటీ సూచనలకనుగుణంగా 1973 ఏప్రియల్‌లో రూపొందించిన 73వ రాజ్యాంగ సవరణ చట్టం.

**గ్రామ పంచాయితీలను బలోపేతం చేయుటకు 73వ రాజ్యాంగ సవరణ చట్టం ముఖ్యాంశాలు :-**

1. గ్రామీణ, బ్లాకు మరియు జిల్లా స్థాయిలో మూడంచెలుగా పంచాయితీరాజ్ వ్యవస్థ ఏర్పరచబడాలి.
2. గ్రామ పంచాయితీ సర్పంచ్ సభ్యులు ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకోబడతారు.
3. పంచాయితీ ఎన్నికలలో సభ్యులుగా పోటీ చేయుటకు S.C. మరియు S.T. స్త్రీలకు రిజర్వేషను ఈయబడినది.
4. గ్రామ పంచాయితీలన్నింటికి 5 సంవత్సరములకొకసారి ప్రత్యక్ష ఎన్నికలు జరపబడాలి. రాష్ట్ర శాసనంలో పేర్కొన్న పరిమితులకు లోబడి రాష్ట్ర ప్రభుత్వం 5 సంవత్సరములకు ముందే గ్రామ పంచాయితీలను రద్దు చేయు అధికారమును కల్గిఉన్నది. కాని సవరణ చట్టం ప్రకారం గ్రామ పంచాయితీలు రద్దు చేసిన 6 నెలలలో మళ్ళీ ఎన్నికలు జరపబడతాయి.
5. 21 సంవత్సరములు మించిన పౌరులు ఎన్నికలలో పోటీ చేయుటకు అర్హులు.
6. గ్రామ పంచాయితీలు, స్వయం పాలనా సంస్థలుగా వుండుటకు ఎన్ని అధికారాలు కావాలో వాటన్నింటిని గ్రామ పంచాయితీలు ఇచ్చుటకు అన్ని అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాలు కల్గి ఉన్నాయి.

7. 73వ రాజ్యాంగ సవరణ చట్టం 11వ అధికరణంలోని 29 అంశాలకు సంబంధించిన బాధ్యతలను పంచాయితీలకు అప్పగించవచ్చు.

8. రాష్ట్ర ప్రభుత్వము చట్ట ప్రకారము కొన్ని పరిమితులకు లోబడి పన్నులను విధించి వసూలు చేయు అధికారమును పంచాయితీలకు ఇవ్వవచ్చు.

9. పంచాయితీరాజ్ సంస్థల ఆర్థిక వనరుల పరిస్థితిని పరిశీలన చేసి పన్నుల ద్వారా వచ్చు ఆదాయమును రాష్ట్రము మరియు పంచాయితీరాజ్ సంస్థల మధ్య ఏ నిష్పత్తిలో పంపిణీ చేయాలో తెలియచేయు ఒక ఫైనాన్స్ కమీషన్‌ను ఏర్పాటు చేయు రాజ్యాంగ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వము కల్గి ఉన్నది.

10. పంచాయితీరాజ్ సంస్థలకు శాంతియుతంగా వ్యవస్థాపూర్వక ఎన్నికలు నిర్వహించుటకు ఒక ఎన్నికల కమీషన్ ఏర్పాటు చేయడమైనది.

పైన పేర్కొన్న అంశాల ఆధారంగా అన్ని రాష్ట్రాలు పంచాయితీ రాజ్ వ్యవస్థను తయారు చేసుకొన్నాయి. మన రాష్ట్రంలో 21943 గ్రామా పంచాయితీలకు 25159 ప్రతినిధులు వున్నారు. అదే విధంగా 1097 మండల పరిషత్తులకు 14580 ప్రతినిధులు వున్నారు. 22 జిల్లా పరిషత్తులకు 1094 ప్రతినిధులున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు మంచితనం, నైతిక బాధ్యత మరియు రాజకీయ ఒత్తిడులకు లోబడి స్థానిక స్వపరిపాలన వుంటుంది. అయినప్పటికి స్థానిక సంస్థలు అధిక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

## 2.6 గ్రామీణాభివృద్ధిలో పంచాయితీరాజ్ సంస్థల పాత్ర :-

1. స్థానిక సంస్థలు మాత్రమే స్థానిక ప్రజల అభిరుచిని తెలుసుకొని అభివృద్ధి పథకాల అమలులో వారి భాగస్వామ్యమును పెంపొందించగలవు.

2. ప్రజలలో సహకార భావన, స్వయం సహాయకత, క్రమబద్ధత, వివేకము పెంపొందించగల తెలివైన స్థానిక నాయకత్వమును గుర్తించి ప్రోత్సహించు అవకాశము స్థానిక సంస్థలకు మాత్రమే వుండును.

3. స్థానిక సంస్థలే ప్రజాస్వామ్యపాలనకు ప్రాథమిక విద్యాలయాలని బ్రైనీ మహాశయుడు చెప్పారు.

4. ఆర్థిక వనరుల సక్రమ వినియోగ బాధ్యతను స్థానిక సంస్థలు నేర్పగలవు.

5. అభివృద్ధి చెందుతున్న భారతదేశము వంటి దేశాలలో ఆర్థికాభివృద్ధికి అవసరమైన సామాజిక, ఆర్థిక అవస్థాపనా సదుపాయాలను దీర్ఘకాలం పాటు ఉపయోగంలో ఉండే సామాజిక వనరులను స్థానిక సంస్థలు మాత్రమే సమకూర్చగలవు.

6. సూక్ష్మ స్థాయి ప్రణాళిక యొక్క అమలు స్థానిక సంస్థలు మాత్రమే చేయగలవు. జాతీయ స్థాయి ప్రణాళికలు, స్థానిక ప్రజల అవసరాలకు అనువర్తింపజేయు నేర్పరితనము స్థానిక సంస్థలకు మాత్రమే వుంటుంది.

7. విస్తరణ సేవల విషయములో స్థానిక సంస్థలు ప్రముఖ పాత్ర వహించగలవు.

8. స్థానిక పన్నులు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆర్థిక వనరుల పరిమితిని విస్తృతపరచగలవు.

9. భౌతిక మానవ వనరులకు గమనశీలతను తెచ్చి మూలధన సమీకరణకు స్థానిక సంస్థలు సహాయపడతాయి.

ప్రజాస్వామ్య ప్రణాళికకు పెద్దపీటవేయు భారత ప్రణాళికలకు ప్రజల భాగస్వామ్యం అవసరం. అది స్థానిక స్వపరిపాలనా సంస్థల స్వతంత్ర పరిపాలనా ప్రతిపత్తి పై మాత్రమే ఆధారపడి వుంటుంది. ఈ స్థానిక సంస్థల స్వపరిపాలనా ప్రతిపత్తి గ్రామీణాభివృద్ధికి బహుముఖంగా తోడ్పడుతుంది.

## 2.7 జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (D.R.D.A.) :-

భారతదేశము గ్రామాలకు నిలయం. గ్రామాల, గ్రామీణుల అభ్యున్నతి దేశ అభివృద్ధికి గీటురాయి. అందువలన ఆర్థిక వ్యవస్థలో సమగ్ర వృద్ధిని సాధించుటకు సాంఘిక న్యాయాన్ని కలుగ చేయుటకు గ్రామీణ ప్రాంతాల ఆర్థిక మరియు సాంఘిక అభివృద్ధి ఎంతో అవసరము. భారతదేశపు ఆర్థిక ప్రణాళికలలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం జరిగినది. 6వ పంచవర్ష ప్రణాళికలో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ జిల్లా స్థాయి గ్రామీణాభివృద్ధి ఏజన్సీల ఏర్పాటుకు సిఫారసు చేసినవి. దీని బాధ్యతలు / విధులు ప్రధానంగా రెండు. అవి -

1. గ్రామీణాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన
2. గ్రామీణాభివృద్ధి ప్రణాళికల అమలు

1. **జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్మాణము :-** 73వ రాజ్యాంగ సవరణననుసరించి DRDA లు జిల్లా పరిషత్ ఆధీనంలో పని చేస్తాయి. జిల్లా పరిషత్ ఛైర్మన్‌ను DRDA ఛైర్మన్ గాను, జిల్లా కలెక్టరు ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గాను ఉంటారు. జిల్లా లోని M.L.A. లు, M.P. లు ఇందులో సభ్యులు.

   1. కేంద్ర సహకార బాంకు ఛైర్మన్
   2. ప్రాంతీయ గ్రామీణ బాంకు ఛైర్మన్
   3. లీడ్ బాంకు ఆఫీసరు
   4. జిల్లా ఉపాధికల్పనా అధికారి
   5. గ్రామీణ స్త్రీ లబ్దిదారులలతో ఒక ప్రతినిధి ఉంటారు.

D.R.D.A. ప్రెసిడెంటు కార్యనిర్వాహక సంఘం ఒక దానిని ఏర్పాటుచేసే అధికారం కల్గి వుంటాడు. ఈ అధికారులు కూడా ఇందులో సభ్యులు. D.R.D.A. పాలక వర్గం మూడు నెలలకు ఒకసారి, కార్యనిర్వాహక వర్గం నెలకొకసారి సమావేశం కావాలి.

D.R.D.A. Project Officer కు సహాయపడేందుకు ఇద్దరు లేక ముగ్గురు అసిస్టెంటు ప్రాజెక్టు ఆఫీసర్లు ఉంటారు. వారు గ్రామీణాభివృద్ధిలో నిపుణులయి వుంటారి. ఒక అసిస్టెంటు ప్రాజెక్టు ఆఫీసరు సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకంలోని స్త్రీలకు సంబంధించిన కార్యక్రమాలను పర్యవేక్షణ చేస్తుంది. డ్వాక్రా పథకంలోని స్త్రీలు, పిల్లల కార్యక్రమాలకు ఒక A.P.O. ఉంటాడు.

D.R.D.A. **విధులు :-**

1. IRDP పథకాలను అమలు చేస్తుంది.
2. జిల్లాకు సంబంధించిన గ్రామీణ కార్యక్రమాలను రూపొందించి అమలుపరచడం మరియు సమీక్షించడం.
3. సంబంధిత అధికారులు కార్యక్రమాల రూపకల్పనలో అనుసరించవలసిన ప్రమాణాలను నిర్దేశిస్తుంది.
4. బ్లాక్ స్థాయిలో తయారయిన దీర్ఘదర్శి విస్తృత ప్రణాళికను సంవిధానపరచి చివరకు ఒక ప్రణాళికను తయారు చేస్తుంది.
5. తన ఆధ్వర్యంలో ఉన్న వివిధ రంగాలు, శాఖల మధ్య సహకారాన్ని, సమన్వయాన్ని సాధించే ప్రయత్నం చేస్తుంది.

6. D.R.D.A. కార్యకలాపాలను గూర్చి వివరించి వారికి సామాజిక స్పృహను కల్పించి ప్రజలను చైతన్యవంతులను చేస్తుంది. కొన్ని కుటుంబాలను పేదరికపు గీత నుండి తప్పించుటకై D.R.D.A. ద్వారా మూడు పథకాలను అమలుచేస్తారు. అవి 1. IRDP, 2. SFPP, 3. TRYSEM.

(1) IRDP **సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం :-** ఎన్నుకొనబడిన కుటుంబమునకు ఉత్పత్తి పనిముట్లు, ఉత్పత్తి కార్యక్రమాలకు సబ్సిడీ పై ఇచ్చి వారి ఆదాయమును పెంచుటకు తోడ్పడుతుంది. వారికి ఋణ సౌకర్యములను కలుగ చేస్తుంది.

(2) SFPP - Special Food Grain Production Programme :- చిన్న రైతులకు, ఉపాంత రైతులకు సబ్సిడీలు, స్వల్పకాలిక ఋణములు ఈ పథకము ద్వారా సరఫరా చేయబడతాయి.

(3) TRYSEM - **గ్రామీణ యువకుల స్వయం ఉపాధి శిక్షణా పథకము** (Training Rural Youth For Self Employment) :- స్వయం ఉపాధి కల్పనకై గ్రామీణ యువతకు శిక్షణ ఇచ్చుటకు నూతన వ్యాపార రహస్యములు వివరించుటకు ఇది ఉపయోగపడుతుంది.

పై మూడింటిలోను సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం ముఖ్యమయినది. బలహీన వర్గాలకు చెందిన చిన్న, ఉపాంత రైతులు, కౌలుదారులు, భూమిలేని నిరుపేదలు, కళాకారులు, S.C., S.T.లకు ఈ పథకం మూడు విధాలుగా ఉపయోగపడుతుంది.

(ఎ) వ్యవసాయం, పశుపోషణ, చేపల పెంపకం, అడవులు మొదలగు ప్రాథమిక రంగానికి సంబంధించినది.

(బి) గౌణ రంగానికి సంబంధించిన కుటీర పరిశ్రమలు.

(సి) సేవా రంగానికి సంబంధించిన వివిధ కార్యక్రమాలు.

ఈ పథకం వల్ల స్థానిక వనరులు, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగంలోనికి వచ్చి అదనపు ఆదాయం సమకూర్చుకొనుటకు దోహదపడుతుంది. ఈ విధంగా వివిధ గ్రామీణాభివృద్ధి పథకాలను అమలు చేసి గ్రామీణ పేదరికము, నిరుద్యోగులను నిర్మూలించి గ్రామీణాభివృద్ధిని సాధించుటలో D.R.D.A. ఎంతగానో కృషి చేయుచున్నది.

## 2.8 సమగ్ర గిరిజనాభివృద్ధి ఏజన్సీ (ITDA) :-

భారతదేశంలో సాంఘీకంగాను, ఆర్థికంగాను వెనుకబడిన వర్గాలలో గిరిజనులు అధికంగా ఉన్నారు. వీరి అభివృద్ధికి ప్రభుత్వం నాల్గవ ప్రణాళికలో గిరిజనాభివృద్ధి ఏజన్సీలను ఏర్పాటు చేసినది. గిరిజనులభివృద్ధికై అంతకు పూర్వం వున్న గిరిజన అభివృద్ధి బోర్డుల (TDB) ను I.T.D.A. లో విలీనం చేయబడినాయి. ఈ TDA లు ఎక్కువగా గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం సూచనలు చేయుటకై ప్రణాళికా సంఘం ప్రత్యేక కమిటీని వేసి నివేదికను సేకరించినది.

5వ ప్రణాళికలో ITDA క్రింద గిరిజన సబ్‌ప్లాన్‌ను తయారు చేసి అమలు చేశారు. జనాభాలో 50 శాతం కన్నా ఎక్కువగా గిరిజనులున్న ప్రాంతాలను ఉప ప్రణాళికా ప్రాంతాలుగా పరిగణించినారు. పారిశ్రామిక మరియు పట్టణ ప్రాంతాలను వీటి నుండి మినహాయించినారు. అభివృద్ధి బ్లాక్‌ను ఈ వ్యూహం క్రింద అతి చిన్న యూనిట్‌గా గుర్తించినారు. ఇటువంటి కొన్ని బ్లాకులున్న తాలూకాను ప్రాతిపదికగా తీసుకుని దాని అభివృద్ధికి ఉపప్రణాళికలను తయారు చేసి అమలు చేశారు. ఇటువంటి యూనిట్‌ను ITDA అంటారు. 7వ ప్రణాళికా కాలంలో 5 వేల జనాభాలో 50 శాతం కన్నా ఎక్కువగా గిరిజనులు ఉన్న ప్రాంతాలను ఈ స్కీము క్రింద అభివృద్ధి చేశారు. గిరిజనుల పేదరిక నిర్మూలనకు సమగ్ర అభివృద్ధికి ITDA ప్రధాన సాధనంగా ఉపయోగిస్తున్నారు. దీని

లక్ష్యం గిరిజన కుటుంబాలలో కనీసం 50 శాతం కుటుంబాలు దారిద్ర్యరేఖ పైకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్ణయించినారు. దీని కోసం తగిన అవస్థాపనా సౌకర్యాలను ఏర్పరచి గిరిజనులను పట్టణవాసులు దోచుకోకుండా కాపాడి వారిని అక్షరాస్యులుగా చేసి వారి సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలని నిర్ణయించినారు.

I.T.D.A. **ప్రధాన ధ్యేయాలు :-**

1. కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని వ్యవసాయం, పశుపోషణ, చిన్న పరిశ్రమలు, మొక్కల పెంపకం మొదలగు కార్యక్రమాల ద్వారా గిరిజనుల ఉత్పాదకతను పెంచడం.

2. గిరిజనుల భూములను ఇతరులు ఆక్రమించకుండా కాపాడటం, ఋణాలతో వారిని వెట్టి చాకిరీకి గురిచేసే పద్ధతికి స్వస్థి చెప్పడం గిరిజన ప్రాంతాల్లో తగినన్ని అవస్థాపనా సౌకర్యాలు కల్పించడం. విద్య, శిక్షణా సౌకర్యాలను పెంచి వారి మనో వికాసాన్ని అభివృద్ధి చేయడం. ఈ లక్ష్యాల సాధనకు రాష్ట్ర ప్రణాళికా నిధుల నుండి కేంద్ర సంక్షేమ మంత్రిత్వ శాఖ ఇచ్చే ప్రత్యేక గ్రాంటు నుండి కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులు మరియు కేంద్రం స్పాన్సర్ చేసే పథకాల నిధుల నుండి విత్త సహాయ సంస్థల నుండి, సంస్థాగత విత్తం నుండి విత్త వనరులు సమకూర్చబడతాయి.

ఈ పథకం 19 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 75 శాతం కంటే ఎక్కువ మంది గిరిజన జనాభాలకు వర్తింప చేయబడినది. గిరిజనులభివృద్ధి బహుముఖంగా కాని ఎన్నో ఆటంకాలను అధిగమించేవిగా ఉండాలి.

## 2.9 జిల్లా ప్రణాళికా బోర్డు (D.P.B.) :-

మన పరిపాలనా యంత్రాంగాలలో జిల్లా ముఖ్యమయిన యూనిట్‌గా తీసుకోబడినది. సమాజ వికాసాభివృద్ధి కార్యక్రమాలన్నింటికి కలెక్టర్ ఉన్నతాధికారి. జిల్లా ప్రణాళికా బోర్డును జిల్లా కలెక్టరు ఏర్పాటు చేయును. ఈ బోర్డుకు అతడే చైర్మన్‌గా వ్యవహరించును. ఈ బోర్డు నందు అధికారులే కాక, అనధికారులు కూడా వుంటారు. వారికి ఒక జిల్లా స్థాయి ప్లానింగు ఆఫీసరు సహాయంగా ఉంటాడు. జిల్లా స్థాయి అభివృద్ధి కమిటీల సమావేశాలకు అన్ని అభివృద్ధి శాఖల అధికారులు బ్లాక్ డెవలప్‌మెంటు అధికారులు, బ్యాంకు అధికారులు, అధికార సంస్థల ప్రతినిధులు హాజరవుతారు. ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల బోర్డు, జిల్లా పరిశ్రమల కేంద్రం, బ్యాంకుల ప్రతినిధులే కాక అన్నీ అధికార శాఖల అధిపతుల మధ్య సంవిధానం సాధించే నిమిత్తం ఈ కమిటీ సమావేశాలు ప్రయత్నిస్తాయి. జిల్లా ఋణ ప్రణాళికను కూడా రూపొందిస్తాయి. జిల్లా ప్రణాళికా బోర్డు నిర్ణయాలు చేయడానికి ఒక సాంఘిక సాధనంగా పని చేస్తుంది. ఇందు స్థానిక స్వయం ప్రతిపత్తి పరిపాలనా సామర్థ్యం, ప్రణాళికా రచనానుభవం కలసి వుంటాయి. ఈ విధంగా జిల్లా ప్రణాళికా రచన మరియు అమలులో ప్రజలు పూర్తి భాగస్వాములై బోర్డులు ప్రజలను శక్తివంతం చేసి ఒక నిశ్శబ్ద విప్లవాన్ని వారిలో తీసుకురాగలుగుతారు.

## 2.10 జిల్లా పారిశ్రామిక కేంద్రాలు (D.I.C.) :-

1977లో జనతా ప్రభుత్వం నూతన పారిశ్రామిక మరియు ఆర్థిక విధానాన్ని ప్రకటించినది. ఈ తీర్మానం పరిధిలో జిల్లా పరిశ్రమల కేంద్రాల స్థాపన ఒక ముఖ్య అంశం. పరిశ్రమలభివృద్ధికి అవసరమైన సలహాలు, సంప్రదింపుల కొరకు ప్రతి జిల్లాలో ఒక పారిశ్రామిక కేంద్రాన్ని (D.I.C.) ప్రారంభించాలని నిర్ణయించినారు. దీనిని అనుసరించి చిన్న గ్రామాలు మరియు పట్టణాలను అమలులో వున్న కుటీర మరియు చిన్న తరహా పరిశ్రమలకు ప్రభుత్వం ఇతోధికంగా సహాయం చేస్తుంది.

D.I.C. లు పరిశ్రమలకు సహాయాన్ని ఈ క్రింది రూపాలలో అందిస్తాయి.

1. జిల్లాలో లభ్యమయ్యే ముడి పదార్థాల గూర్చి పరిశీలన జరుపుట.

2. ఋణ సదుపాయం కల్పించుటకు కృషి చేస్తారు.

3. తయారయిన వస్తువులకు తగిన మార్కెటింగు సౌకర్యం కల్పించే ప్రయత్నం చేస్తారు.

4. ఉత్పత్తుల నాణ్యతను పరీక్షించు ఏర్పాట్లు, ఇందు నిమిత్తం ఒక ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పారు.

5. పరిశోధనా మరియు విస్తరణా కార్యక్రమాలు చేపడతారు.

6. గృహ, కుటీర పరిశ్రమలు, అతి చిన్న పరిశ్రమలు, చేతి వృత్తులభివృద్ధికి సలహాలనిచ్చే ఒక ప్రత్యేక విభాగం D.I.C. లలో ఏర్పాటు చేయబడినది. ఈ D.I.C. లు ఒకవైపు డెవలప్‌మెంట్ బ్లాక్స్‌తోను, మరో వైపు సేవా పరిశ్రమల వంటి చిన్న పరిశ్రమలతోను సంబంధం కల్గి ఉంటాయి.

## 2.11 S.C. మరియు B.C. కార్పోరేషన్లు :-

మన దేశ జనాభాలో 26.1 శాతం అనగా 260.3 మిలియన్లు పేదరికపు గీతకు దిగువ వున్నవారే. ఈ పేదలలో S.C. మరియు B.C. తరగతులకు చెందినవారు అధికం. స్వాతంత్ర్యానంతరం ఈ వెనుకబడిన తరగతుల వారి అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేసినది. అందులో ఒకటి S.C. మరియు B.C. కార్పోరేషన్లు. ఈ కార్పోరేషన్లు ఈ క్రింది విధులను నిర్వహిస్తున్నాయి.

1. S.C. మరియు B.C. వర్గాల ప్రజలలో నిరుద్యోగితను తొలగించుట.

2. స్వయం ఉపాధి పథకాలను చేపట్టి ఈ వర్గాలను తమ సొంత కాళ్ళ పై నిలబడేటట్లు చేయడం.

3. అందుకు కావలసిన ఆర్థిక సహాయాన్ని ఋణ రూపంలో అందించుట, ఋణాలు ఇవ్వడానికి కావలసిన నిధులను ఈ కార్పోరేషన్‌కు ప్రభుత్వం సమకూరుస్తుంది.

4. S.C. మరియు B.C. తరగతులకు చెందిన చేతి వృత్తులు, కుల వృత్తులు చేసుకునే వారికి తక్కువ వడ్డీ రేటుకి ఆర్థిక సహాయం ఇవ్వడం.

5. శిక్షణా వసతులు కలుగచేయుట.

ఈ కార్పోరేషన్ల పని తీరు పైనే కాక పని చేయు పరిస్థితుల పై విమర్శలున్నాయి. ప్రభుత్వం ఈ కార్పోరేషన్లకు సమకూర్చే నిధులు చాలినంతగా లేవు. ఈ వర్గాలకు చెందిన ప్రజలు నిరక్షరాస్యులైనందు వలన కార్పోరేషన్లు అందించే ఆర్థిక సహాయాన్ని ఇతర సౌకర్యాలను పూర్తిగా ఉపయోగించుకుని ప్రయోజనం పొందలేకున్నారు.

## 2.12 సారాంశము :-

గ్రామాల సంపూర్ణ అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలను రూపొందించినది. వాటిని అమలు చేసేందుకు నెలకొల్పబడినవే గ్రామీణాభివృద్ధి సంస్థలు. అనాదిగా సామూహిక జీవనం సుఖంగా సాగడానికి సహకారం తోడ్పడినది. అదే విధంగా గ్రామ పంచాయితీలకు భారతదేశంలో ప్రాచీన కాలం నుండి ప్రాధాన్యత ఉన్నప్పటికీ, స్వాతంత్ర్యానంతరం స్థానిక సంస్థలు కేవలం నిర్దేశిత సూత్రాలలోనే చోటు చేసుకోగలుగుతున్నాయి. గాంధీజీ పేర్కొన్న గ్రామ స్వరాజ్ స్థాపనకు 73వ రాజ్యాంగ సవరణ చట్టం చేసినప్పటికీ పరిపాలనా వికేంద్రీకరణ వున్నప్పటికీ పంచాయితీల ద్వారా గ్రామీణాభివృద్ధి ఆశించినమేర వుండటం లేదు. సాంఘిక న్యాయంతో కూడిన సమగ్ర అభివృద్ధిని సాధించుటకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలు, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ, జిల్లా పారిశ్రామిక కేంద్రాలు, జిల్లా ప్రణాళికా బోర్డులు, S.C. మరియు B.C. కార్పోరేషన్లు మొదలగున్నవి గ్రామీణాభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములుగా వుంటున్నాయి.

## 2.13 గుర్తుంచుకోవలసిన విషయాలు :-

సమగ్ర గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయుటకు ఏర్పాటయినవే గ్రామీణాభివృద్ధి సంస్థలు.

1. స్వాతంత్రమునకు ముందు నుండే అమలులో సహకార సంస్థలు గ్రామ పంచాయితీ గ్రామీణాభివృద్ధికి ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి.
2. గ్రామీణ ప్రాంతాలభివృద్ధికి ఏర్పాటయిన సంస్థ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (D.R.D.A.)
3. వెనుకబడిన వర్గాలైన S.C. మరియు B.C. ల అభివృద్ధికి రూపొందించబడిన S.C. మరియు B.C. కార్పోరేషన్లు.
4. గిరిజనులభివృద్ధికి ఏర్పాటయిన సమగ్ర గిరిజనాభివృద్ధి ఏజన్సీ (ITDA).
5. జిల్లా ప్రణాళికా బోర్డు.
6. జిల్లా పారిశ్రామిక కేంద్రాలు.

## 2.14 కఠినపదాలు :-

| | | | |
|---|---|---|---|
| 1. | D.R.D.A. : District Rural Development Agency | - | గ్రామీణ ప్రాంతాలభివృద్ధికి ఏర్పాటయిన సంస్థ. |
| 2. | I.T.D.A. - Integrated Tribal Development Agency | - | గిరిజనులభివద్ధికి ఏర్పాటయిన సంస్థ. |
| 3. | D.P.B. - District Planning Board | - | జిల్లాను ముఖ్యమయిన యూనిట్‌గా తీసుకొని జిల్లా ప్రణాళికల రూపకల్పనకు తోడ్పడేది. |
| 4. | D.I.C. - District Industrial Centre | - | జిల్లాలోని పరిశ్రమలకు సహాయం చేయుటకు జనతా ప్రభుత్వం రూపొందింపబడినది. |
| 5. | **గ్రామీణాభివృద్ధి సంస్థలు** | - | గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయుటకు ఏర్పాటయిన సంస్థలు. |
| 6. | **సహకార సంఘాలు** | - | వ్యక్తులు తమ సామూహిక ప్రయోజనాలను మెరుగుపరచుకొనుటకు ఏర్పాటయిన సంఘము. |
| 7. | **సేవా సహకార సంఘాలు** | - | సహకార సూత్రాల ప్రాతిపదికగా ఏర్పాటయి, దానిలోని సభ్యులకు కావలసిన అన్ని సేవలను అందించే స్వచ్ఛంధ సంస్థలు. |
| 8. | S.C. **మరియు** B.C. **కార్పోరేషన్లు** | - | ఆర్థికంగా, సాంఘికంగా వెనుకబడిన వర్గాలభ్యున్నతికి ఏర్పడినది. |

## 2.15 నమూనా ప్రశ్నలు :-

(i) **వ్యాసరూప ప్రశ్నలు :-**

1. భారతదేశంలో గ్రామీణాభివృద్ధికి తోడ్పడుచున్న గ్రామీణాభివృద్ధి సంస్థలను గురించి వివరించండి.

జ. గ్రామీణాభివృద్ధి సంస్థలు అర్థము వ్రాసి, సహకార సంఘాలు, గ్రామ పంచాయితీలు, D.R.D.A., I.T.D.A., D.I.C., D.P.B., S.C మరియు B.C. కార్పోరేషన్లను గురించి వ్రాయాలి.

2. సహకారము అనగానేమి? భారతదేశంలో సహకారం ప్రాధాన్యతను తెలుపుము?

జ. సహకార సంఘాలు గురించి వ్రాసి, భారతదేశంలో సహకారం ప్రాధాన్యతను వ్రాయాలి.

3. గ్రామీణాభివృద్ధికి స్థానిక సంస్థలు ఎట్లా తోడ్పడుతున్నాయి?

జ. పంచాయితీరాజ్ వ్యవస్థ - పరిపాలనా వికేంద్రీకరణ - 73వ రాజ్యాంగ సవరణ చట్టం.

(ii) **సంక్షిప్త వ్యాసరూప ప్రశ్నలు :-**

1. గ్రామీణాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర
2. గ్రామీణాభివృద్ధిలో స్థానిక సంస్థల పాత్ర
3. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాముఖ్యత
4. సమగ్ర గిరిజనాభివృద్ధి ఏజన్సీల ప్రాముఖ్యత

(iii) **సంక్షిప్త ప్రశ్నలు :-**

1. గ్రామీణాభివృద్ధి సంస్థలు
2. సహకార సంఘాలు
3. స్థానిక సంస్థలు - గ్రామీణాభివృద్ధి
4. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ
5. జిల్లా ప్రణాళికా బోర్డు
6. జిల్లా పారిశ్రామిక కేంద్రాలు
7. S.C. మరియు B.C. కార్పోరేషన్లు
8. సేవా సహకార సంఘాలు

## 2.16 చదువదగిన గ్రంథాలు :-

1. Devi Das, M. Mulley - Rural Development - Administration
2. Hicks U.K. - Development From Below
3. Report of the High Power Committee on Panchayat Raj 1972, P - 64
4. Dr. B.P. Tyaqi - Agricultural Economics and Rural Development
5. Kurushetra . June 2001 - Panchayat Raj in A.P.
6. Kurushetra . Jan 1994 - Problems of Panchayat Raj Institutions
7. Vasanta Desai - Rural Development

**డా॥ వై. ఇందిరా కుమారి,**

**శ్రీమతి. యస్. సుబ్బలక్ష్మి.**

పాఠం - 3

# గ్రామీణాభివృద్ధి పథకాలు

## 3.0 లక్ష్యం :-

ఈ పాఠం చదివిన తరువాత విద్యార్థులు ఈ క్రింది విషయాలు తెలుసుకోగలరు.

* ప్రభుత్వము గ్రామీణాభివృద్ధికి పథకాలను అమలు పెట్టడం ఎప్పటి నుండి మొదలైనది, అభివృద్ధి పథకాల అవసరం.
* గ్రామీణాభివృద్ధి పథకాల లక్ష్యాలు ఏఏ అంశాలను దృష్టిలో పెట్టుకొని నిర్దేశించడమైనది.
* గ్రామీణాభివృద్ధి పథకాలు ఉపాధికల్పనకు ఎట్లా తోడ్పడ్డాయి.
* 1950 నుండి 1960 వరకు అమలుపరచిన గ్రామీణాభివృద్ధి పథకాలు.
* 1960 నుండి 1970 వరకు అమలు పెట్టిన గ్రామీణాభివృద్ధి పథకాలు.
* 1970 నుండి 1977 వరకు అమలులో వున్న గ్రామీణాభివృద్ధి పథకాలు.
* 1978 నుండి 1980 వరకు గ్రామీణాభివృద్ధి పథకాలు.
* 1980 నుండి 1990 వరకు గ్రామీణాభివృద్ధి పథకాలు.
* 1990 నుండి ఇప్పటివరకు అమలులో ఉన్న పథకాలు.

## విషయసూచిక :-


**3.1 ఉపోద్ఘాతము**

**3.2 గ్రామీణాభివృద్ధి పథకాలు - ఆవశ్యకత**

**3.3 వివిధ గ్రామీణాభివృద్ధి పథకాలు - లక్ష్యాలు**

**3.4 వివిధ గ్రామీణాభివృద్ధి పథకాలు సాధించిన ఫలితాలు**

**3.5 1950 నుండి 1960 వరకు అమలుపరచిన గ్రామీణాభివృద్ధి పథకాలు**

**3.6 1960 నుండి 1970 వరకు అమలుపరచిన గ్రామీణాభివృద్ధి పథకాలు**

**3.7 1970 నుండి 1977 వరకు అమలులో ఉన్న గ్రామీణాభివృద్ధి పథకాలు**

**3.8 1978 నుండి 1980 వరకు అమలు చేయబడిన గ్రామీణాభివృద్ధి పథకాలు**

**3.9 1980 నుండి 1990 వరకు గ్రామీణాభివృద్ధి పథకాలు**

**3.10 1990 నుండి అమలుపరచిన గ్రామీణాభివృద్ధి పథకాలు**

**3.11 సారాంశము**

**3.12 గుర్తుంచుకోవలసిన విషయాలు**

**3.13 కఠినపదాలు**

**3.14 నమూనా ప్రశ్నలు**

**3.15 చదువదగిన గ్రంథాలు**

## 3.1 ఉపోద్ఘాతము :-

ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ప్రజల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కొరకు వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచుటకు పేదరిక నిర్మూలన కొరకు అనేక కార్యక్రమాలను రూపొందించడం జరుగుచున్నది. పూర్తి స్థాయి ఆర్థికాభివృద్ధికి ఏ దేశంలోనైనా గ్రామీణాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఉంటుంది. ముఖ్యంగా భారతదేశంలో డెబ్బయి శాతం పైగా జనాభా గ్రామాలలో నివసిస్తూ వ్యవసాయ రంగం ప్రధాన రంగంగా వుండి అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. సంవత్సరములో కొద్ది కాలం మాత్రమే ఉద్యోగావకాశాలు పొందుతూ ఎక్కువ మంది ప్రచ్ఛన్న నిరుద్యోగిత బారినపడి అల్పాదాయాలు, అల్ప ఉత్పాదకత, నిరుద్యోగంతో సతమతమవుతూ వుండటం సర్వ సాధారణమైన విషయంగా మారినది. ఇటువంటి గ్రామీణ పరిస్థితులలో మార్పు తీసుకురావడానికి ప్రభుత్వం అనేక పథకాలను చేపడ్తుంది.

## 3.2 గ్రామీణాభివృద్ధి పథకాలు - ఆవశ్యకత :-

ప్రభుత్వ పథకాలన్నీ వ్యవసాయదారులు, వ్యవసాయ శ్రామికులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ చేతివృత్తుల మీద ఆధారపడే వారికి అందుబాటులోకి తేవడం చాలా అవసరం. 1950లో స్థాపించిన సమాజాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా అందుబాటులో ఉన్న గ్రామీణ వనరులను సక్రమంగా వినియోగించుటకు, సాంకేతిక విజ్ఞానాన్ని గ్రామీణ ప్రాంతాలభివృద్ధికి వుపయోగించి తద్వార సత్వర గ్రామీణాభివృద్ధికి పునాది వేయడం అవసరం. 1953లో జాతీయ విస్తరణ సర్వీసులను ప్రారంభించడం జరిగినది. ప్రభుత్వం శ్రేయరాజ్యంను అవలంభించే మార్గంలో స్త్రీ, శిశు సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రారంభించినది. మానవ వనరులభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక గ్రామీణాభివృద్ధి పథకాలు అమలు చేయడం అవసరం.

## 3.3 గ్రామీణాభివృద్ధి పథకాలు - లక్ష్యాలు :-

గ్రామీణాభివృద్ధి పథకాలు ప్రత్యేకంగా వ్యవసాయ రంగం అభివృద్ధికి, ఉద్యోగితా కల్పనకు, ప్రత్యేక ప్రాంతాలభివృద్ధికి మరియు నిర్దేశించిన లక్ష్యాలను సాధించుటకు, వివిధ ఏజన్సీలను ద్వారా అమలులో పెట్టుటకు కృషి జరుగుతున్నది.

(ఎ) **వ్యవసాయ రంగం అభివృద్ధికి సంబంధించిన పథకాలు :-** గ్రామీణాభివృద్ధిలో భాగంగా సమగ్రమైన వ్యవసాయాభివృద్ధి కొరకు సాంద్ర వ్యవసాయోభివృద్ధి కార్యక్రమము (Intensive Agricultural District Programme, IADP), సాంద్ర వ్యవసాయ క్షేత్ర వృద్ధి కార్యక్రమము (Intensive Agricultural Area Development Programme, IAAP), అధిక దిగుబడినిచ్చే వంగడాల అభివృద్ధి కార్యక్రమము (High Yielding Varities of Paddy, HYVP), బహుళ పంటల కార్యక్రమము (Multiple Cropping System), పొగాకు, పంచదార, ప్రత్తి, జనపనార, నూనె గింజలు, పండ్ల తోటల పెంపకము మొదలగు వాణిజ్య పంటలను పండించుటకు తగిన ప్రోత్సాహకాలనందించడం మొదలయినవి వ్యవసాయ రంగము అభివృద్ధికి సంబంధించిన ప్రత్యేక పథకాలు అమలులో పెట్టడం జరిగినది.

(బి) **ఉద్యోగితా సాంద్రిత పథకాలు :-** గ్రామీణ ప్రాంతాలలో ఉపాధికల్పనకు ప్రత్యేకంగా నిర్దేశించిన వాటిలో ముఖ్యమైనవి గ్రామీణ ఉద్యోగితా పథకం, ఉద్యోగితా హామీ పథకం, పనికి ఆహార పథకం మొదలగునవి ఉపాధికల్పన అవకాశాలను పెంచుటకు ఏర్పాటు చేయబడిన పథకాలు.

(సి) **ప్రాంతీయాభివృద్ధి పథకాలు :-** గ్రామీణ ప్రాంతాలలో వెనుకబడిన ప్రాంతాలభివృద్ధి కార్యక్రమములో భాగంగా క్షామ పీడిత ప్రాంతాలభివృద్ధి పథకం (Drought Prone Area Programme, DPAP), ఆధీన ప్రాంతాలభివృద్ధి పథకం (Command Area Development Programme), మెట్ట ప్రాంతాలభివృద్ధి కార్యక్రమము, ఎడారులుగా మారుతున్న ప్రాంతాల పరిరక్షణకు ఎడారి అభివృద్ధి పథకం (Desert Development Programme), సంపూర్ణ గ్రామీణాభివృద్ధి పథకం, గిరిజన

ప్రాంతాలభివృద్ధి పథకం (Tribal Area Development Programme, TADP), కొండ ప్రాంతాలభివృద్ధి కార్యక్రమము (Hill Area Development Programme, HADP) మొదలగు కార్యక్రమాలను వివిధ ప్రణాళికలలో ప్రవేశ పెట్టడం జరిగినది.

(డి) **నిర్దేశితా లక్ష్యాల సాధనా కార్యక్రమము** (Target Group Oriented Programmes) :- గ్రామీణ ప్రాంతాలలో ఏమీ భూమి లేని వ్యవసాయ శ్రామికులకు, వ్యవసాయ రంగంలో పని లేని సమయాలలో పనిని కల్పించడానికి చిన్నకారు రైతుల అభివృద్ధి పథకం (Small Farmer Development Agency - SFDA), ఉపాంత వ్యవసాయదారులు మరియు వ్యవసాయ శ్రామికులభివృద్ధి పథకం (MFALDA), షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన కనీసావసరాల పథకం (Minimum Needs Programme - MNP), అంత్యోదయ పథకం మొదలగునవి ప్రత్యేకమైన వర్గాలభివృద్ధికి సంబంధించిన పథకాలను ప్రవేశ పెట్టడం జరిగినది.

## 3.4 వివిధ గ్రామీణాభివృద్ధి పథకాలు :-

గ్రామీణాభివృద్ధికి సంబంధించిన పథకాలు 5 రకాలు.

### (ఎ) వ్యవసాయ రంగం అభివృద్ధికి సంబంధించినవి.

1. సమాజాభివృద్ధి కార్యక్రమాలు (Community Development Programme - C.D.P.)
2. చిన్నకారు రైతులభివృద్ధి ఏజన్సీ (Small Farmers Development Agency - S.F.D.A.)
3. అధిక దిగుబడి వంగడాలభివృద్ధి కార్యక్రమం (High Yielding Varieties Programme - H.Y.V.P.)
4. ఆధీన ప్రాంతాలభివృద్ధి పథకం (Command Area Development Programme)
5. సాంద్ర వ్యవసాయ జిల్లాల కార్యక్రమం (Intensive Agricultural District Programme)
6. సంపూర్ణ గ్రామీణాభివృద్ధి పథకం (Whole Village Development Programme - W.V.D.P.)
7. వ్యవసాయ సేవా సంస్థలు (Farmers Service Societies - F.S.S.)
8. ఉపాంత వ్యవసాయదారులు మరియు వ్యవసాయ శ్రామికులభివృద్ధి ఏజన్సీ (Marginal Formers and Agricultural Laboures Development Agency)

### (బి) వృత్తి పని వారల ప్రోత్సాహక చర్యలు

జిల్లా పరిశ్రమల కేంద్రాలు (District Industrial Centre)

### (సి) ఉపాధి కల్పన ప్రోత్సాహకాలు

1. పనికి ఆహార పథకం (Food for Work Programme)
2. జాతీయ గ్రామీణ ఉద్యోగితా పథకం (N.R.E.P. National Rural Employment Programme)
3. గ్రామీణ భూమిలేని వారికి ఉద్యోగితా హామీ పథకం (Rural Landless Employment Guarantee Programme) - R.L.E.G.P.)
4. జవహర్ రోజ్‌ఘార్ యోజన (Jawahar Rojgar Yojana)

**(డి) ప్రాంతాలభివృద్ధి పథకాలు**

1. క్షామ పీడిత ప్రాంతాలభివృద్ధి పథకము (Draught Prone Area Programme D.P.A.P.)
2. వెనుకబడిన ప్రాంతాలభివృద్ధి పథకం (Backward Area Development Programme - B.A.D.P.)
3. ఎడారి ప్రాంతాలభివృద్ధి పథకం (Desert Development Programme - D.D.P.)

**(ఇ) ప్రత్యేక చర్యలు**

1. అంత్యోదయ పథకము
2. కనీసావసరాల కార్యక్రమము
3. స్త్రీలు మరియు శిశు సంక్షేమానికి ప్రత్యేక పథకం (Special Programme for Women and Children SPWE)
4. పౌష్టికాహార పథకం (Applied Nutrition Programme - A.N.P.)
5. అణచివేతకు గురయిన ప్రాంతాలభివృద్ధి పథకం

   (Programme for Depressed Areas Development - PDAD)
6. కొండ ప్రాంతాలభివృద్ధి పథకం (Hill Area Development Programme - HADP)
7. సహకారపరపతి (Co - Operative Credit)
8. జాతీయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (National Bank For Agriculture and Land Development NABARD)
9. ప్రత్యేక పాడిపశువుల పెంపకం పథకం (Special Livestock Production Programme SLPP)
10. గ్రామీణ రోడ్ల అభివృద్ధి పథకం (Rural Roads Programme RRP)
11. సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం (Integrated Rural Development Programme - IRDP)
12. గ్రామీణ యువతకు స్వయం ఉపాధి శిక్షణ (Training for Youth for Self Employment - TRYSEM)
13. గ్రామీణ ప్రాంతాలలో మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి పథకం (DWCRA - Development of Women and Children in Rural Areas)
14. ఇందిరా ఆవాస్ యోజనా పథకం (Indira Aawas Yojana Scheme - IAYS)
15. గ్రామీణ పేద ప్రజల ఉద్యోగ హామీ పథకం (Employment Guarantee Programme For the Poor)
16. తెలుగు గ్రామీణ క్రాంతి పథకం (Telugu Grameena Kranthi Programme)
17. మహిళా సమృద్ధి యోజనా
18. ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజనా (Prime Minister Rojgar Yojana - PMRY)
19. స్వర్ణ జయంతి స్వరాజ్‌గార్ యోజనా (Swarna Jayanthi Swarajghar Yojana - SJSY)

గ్రామీణాభివృద్ధిలో భాగంగా గ్రామీణ ప్రాంతాలలో అమలుపరచిన ఉపాధికల్పన మరియు పేదరిక నిర్మూలనా పథకాలు (లక్షలలో) సాధించిన ఫలితాలు

| పథకాలు | 1997 - 98 | | 1998 - 99 | | 1999 - 2000 | |
|---|---|---|---|---|---|---|
| పథకం పేరు | సాధించాలనుకున్నది | సాధించినది | సాధించాలనుకున్నది | సాధించినది | సాధించాలనుకున్నది | సాధించినది |
| జవహర్ రోజ్‌గార్ యోజన ద్వారా ఉపాధి కల్పన (J.R.Y.) | 3867.00 | 33958.00 | 3966.4 | 3725.1 | 3966.6 | 587.0 |
| ఉద్యోగ హామీ పథకం ద్వారా ఉపాధి కల్పన (E.G.P.) | --- | 4717.7 | --- | 4165.7 | --- | 724.9 |
| సమగ్ర గ్రామీణాభివృద్ధిలో సహాయం పొందిన కుటుంబాలు (I.R.D.P.) | --- | 17.1 | --- | 16.6 | --- | --- |
| గ్రామీణ యువతకు స్వయం ఉపాధి శిక్షణ (T.R.Y.S.E.M.) | 3.0 | 2.5 | 2.9 | 1.7 | --- | --- |
| గ్రామీణ పేద మహిళాలభివృద్ధి మరియు శిశు సంక్షేమము (DWCRA) | | | | | | |
| గ్రూపుల సంఖ్య | 0.3 | 0.3 | 0.6 | 0.5 | --- | --- |
| మెంబర్ల సంఖ్య | --- | 4.6 | --- | 5.0 | --- | --- |
| ఇందిరా ఆవాస్ యోజన | 7.2 | 7.7 | 9.9 | 8.3 | --- | --- |
| త్రవ్విన బావులు (Mullte Wells Scheme) | --- | 0.9 | --- | 0.9 | 8.5 | --- |
| తెలుగు గ్రామీణ క్రాంతి పథకం అభివృద్ధి చెందిన గ్రామాలు | 1.0 | 1.2 | 1.1 | 0.5 | --- | --- |
| Central Rural Sanitation Programe | 18.8 | 11.6 | 16.0 | 5.6 | 0.9 | 0.29 |
| జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం | | | | | | |
| (ఎ) వృద్ధాప్య పింఛను పథకం | 17.9 | 50.9 | 48.8 | 64.2 | 55.7 | 29.3 |
| (బి) కుటుంబ ప్రయోజన పథకం | 3.4 | 1.8 | 2.1 | 2.6 | 1.9 | 0.6 |
| (సి) ప్రసూతి ప్రయోజన పథకం | 33.9 | 15.6 | 17.8 | 15.1 | 17.8 | 4.2 |

## 3.5 1950 నుండి 1960 వరకు అమలుపరచిన గ్రామీణాభివృద్ధి పథకాలు :-

1952లో సమాజాభివృద్ధి కార్యక్రమాన్ని అమలుచేయడమైనది. ఈ పథకం ద్వారా ప్రజలలో చైతన్యం కలిగించి అభివృద్ధి మార్గాలను అమలుపరిచేటట్లు చేయడం ప్రధాన లక్ష్యం. అభివృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానాన్ని త్వరితగతిన ఉపయోగించుకుని పురోగతిని సాధించాలని ప్రయత్నించినారు. దీనికి తోడు 1953లో జాతీయ విస్తరణ సర్వీసులను ప్రారంభించినారు. మహిళా శిశు సంక్షేమం కోసం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా ప్రారంభించినారు. వీరి కోసం అక్షరాస్యత, వైద్య, ఆహార విషయాలు ప్రాముఖ్యతను తెలియచేసే కార్యక్రమాన్ని చేపట్టినారు.

## 3.6 1960 నుండి 1970 వరకు అమలుపరచిన గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు :-

1. 1960వ సంవత్సరంలో వ్యవసాయ రంగం అభివృద్ధికై అవస్థాపనా సౌకర్యాలలో సమగ్ర పద్ధతిలో 15 జిల్లాలలో వ్యవసాయాభివృద్ధి పథకమును ప్రారంభించినారు.
2. 1965 సంవత్సరములో వ్యవసాయ పనిముట్లు, మంచి విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందుల ఉపయోగాన్ని ఎక్కువ చేసి వ్యవసాయ ఉత్పత్తులను అధికం చేసే ప్రయత్నాలు జరిగినాయి.
3. 1969 నుండి స్త్రీ శిశు సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా గ్రామీణ మహిళల స్థితిగతులను మెరుగుపరుచుటకు మహిళా మండలులు ఏర్పాటు చేయడం జరిగినది.

## 3.7 1970 నుండి 1977 వరకు అమలు జరిపిన గ్రామీణాభివృద్ధి పథకాలు :-

1. 1971లో ప్రారంభించిన చిన్న సన్నకారు రైతులభివృద్ధి సంస్థలు (SFDA) సహకార సంఘాల సహాయంతో వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పద్ధతులను అనుసరించడానికి తగిన ప్రోత్సాహకాలను కల్పించడమైనది. గ్రామీణ చేతివృత్తుల ప్రోత్సాహకాలు మరియు గ్రామీణ పనుల పథకాల వలన 168.75 లక్షల మంది లబ్దిదారులుగా రూపొందినారు. ఈ పథకాల లక్ష్యాలను సహకార సంఘాలతో సమన్వయంతో మొత్తం మీద 83.83 లక్షల సన్న చిన్నకారు రైతులు లబ్ది పొందినారు.
2. **క్షామ పీడిత ప్రాంతాలభివృద్ధి పథకం (1973) :-** 1970 - 71లో ప్రారంభించిన గ్రామీణ పనుల పథకంను 1973లో మొదలు పెట్టిన క్షామపీడిత ప్రాంతాలభివృద్ధి పథకంతో సమన్వయం చేసి 74 జిల్లాలలో 10.76 లక్షల హెక్టారు భూములు భూ సంరక్షణను పొందినాయి. 2.30 లక్షల హెక్టార్లు భూమికి నీటి పారుదల సౌకర్యాలను అందచేయడం జరిగినది. దీనితోపాటు పాడి పరిశ్రమాభివృద్ధి కార్యక్రమాలను మెట్ట భూముల వ్యవసాయాభివృద్ధికి తగిన కృషి జరిగినది.
3. **ఎడారి అభివృద్ధి కార్యక్రమము (1977) :-** వర్షపాతం లేక ఎడారులుగా మారుతున్న ప్రాంతాలభివృద్ధిలో భాగంగా ఈ ప్రాంతాలలో వ్యవసాయ ఉత్పాదకతను పెంచుటకు ఉపాధి సౌకర్యాలను కల్పించుటకు కృషి జరిగినది. కొన్ని ప్రాంతాలను ఏజన్సీల ద్వారా అభివృద్ధిపరచుటకు 1977లోనే ఆధీన ప్రాంతాలభివృద్ధి కూడా జరిగినది.
4. **కనీసవసరాల కార్యక్రమము (1977 - 78) :-** గ్రామీణ పేదలకు ఉపాధిని కల్పించుటకు మరియు పౌష్టికాహార సదుపాయాలను కల్పించుటకు మరియు గ్రామీణ ప్రాంతాలలో ఆర్థిక అవస్థాపనా కార్యక్రమాలను అభివృద్ధి చేయుటకు, సామాజిక ఆస్తులను పెంచుటకు, గ్రామీణుల తలసరి వినియోగస్థాయిని పెంచుటకు ఈ పథకాన్ని 1977 - 78లో ప్రారంభించినారు. ఈ పథకం ద్వారా గ్రామ ప్రాంతాలలో వ్యవసాయ శ్రామికులు, వ్యవసాయదారులు ఉపాధి అవకాశాలను పొందినారు.

5. **పనికి ఆహార పథకం 1977 మరియు అంత్యోదయ పథకం :-** గ్రామీణ పేదలకు వ్యవసాయ పనులు సమయాలలో అదనపు ఉపాధిని కల్పించడానికి, బడుగు వర్గాల బాగోగుల కోసం రోజువారి వేతన కార్మికుల కోసం చేపట్టిన అంత్యోదయ మరియు పనికి ఆహార పథకాల రెండింటిని సమన్వయపరచి జాతీయ గ్రామీణాభివృద్ధి పథకంతో కలిపి ఆశయ సాధనకు కృషి చేయడం జరిగినది.

## 3.8 1978 - 80 వరకు గ్రామీణాభివృద్ధి పథకాలు :-

1. **సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం (1978 - 79) :-** గ్రామీణ పేదరికం నిర్మూలనకు రూపొందించిన వివిధ పథకాల లక్ష్యాలన్నింటిని ఏకం చేసి ఆయా పథకాల లక్ష్య సాధనలో వున్న లోటుపాట్లన్నింటినీ సరిదిద్దుతూ వనరులను సక్రమంగా వినియోగించుటకు 1978 - 79లో సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం ప్రారంభించబడినది.

**ఈ పథకం ముఖ్య లక్ష్యాలు :-**

1. వృద్ధి మరియు ఉత్పత్తి సాధించుట
2. గ్రామీణ ప్రాంతాలలో పథకాల వలన లాభం పొందలేని నిర్దేశించిన గ్రూపులకు లాభం చేకూర్చుట
3. నిర్దేశించిన గడువులో సంపూర్ణోద్యోగితను సాధించుట

గ్రామీణ ప్రాంతాలలో నివసించే సన్న, చిన్నకారు రైతులు, కౌలుదారులు, భూమి లేని శ్రామికులు, గ్రామీణ చేతి వృత్తులవారు, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల వారు మొదలగు వారు ఈ పథకం ద్వారా లబ్ది పొందుటకు అర్హులుగా చేసి దేశం మొత్తం మీద 2300 బ్లాకులలో నిర్దేశించిన పై లక్ష్యాలను సాధించుటకు ఈ పథకాన్ని 1978లో ప్రవేశ పెట్టినారు. 1981 - 82 నాటికి 5011 బ్లాకులకు ఈ పథకాన్ని విస్తరించడమైది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా సన్న, చిన్నకారు రైతుల అభివృద్ధి ఏజన్సీలను, క్షామ పీడిత ప్రాంతాలభివృద్ధి ఏజన్సీలను, ఆధీన ప్రాంతాలభివృద్ధి ఏజన్సీల కార్యక్రమాలను సమన్వయపరచి నిర్దేశించిన బ్లాకులలో లక్ష్యసాధనకు కృషి చేయడమైనది. 6వ ప్రణాళిక కాలం నాటికి 150 లక్షల కుటుంబాలు లబ్దిదారులుగా వుండవలసి వుంటే 165.6 లక్షల కుటుంబాలు ఈ పథకం ద్వారా లాభాన్ని పొందినాయి. అదే విధంగా షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల నుండి 50 లక్షల మంది లబ్దిదారులున్నారు. 6వ ప్రణాళికా కాలం నాటికి ఈ సంఖ్య 64.6 లక్షలకు పెరిగినది. అదే సమయంలో రూ॥ 1500 కోట్లు ఖర్చు పెట్టవలసి వుండగా రూ॥ 1661.17 కోట్లు ఈ పథకం క్రింద ఖర్చు పెట్టడమయినది. 15 మిలియన్లు లాభం పొందాలని లక్ష్యం కాగా, 16.56 మిలియన్లు మంది లబ్ది పొందినారు. 1986 - 87 నుండి 1987 - 88 వరకు రూ॥ 28.83 కోట్లు పరపతి ఇవ్వగా 11 మిలియన్ల కుటుంబాలు లబ్ది పొందినాయి. అందులో 4 మిలియన్లు షెడ్యూల్డు కులాలకు చెందినవారే. 1992 - 93లో సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం ద్వారా 18 మిలియన్లు కుటుంబాలు లబ్ది పొందినారు. ఈ పథకం ద్వారా 49 శాతం మంది పేదరికపు గీతకు దిగువన వున్న వారు లబ్దిపొంది వార్షికాదాయంను రూ॥ 35,000 మించి పొందగలిగినారు. లబ్దిదారుల కుటుంబాలు ఆస్తులు పెరిగినాయి. తలసరి వినియోగ స్థాయి పెరిగినది. 75 శాతం మంది పాడి పరిశ్రమ అభివృద్ధి ద్వారా లాభాన్ని పొందినారు.

అయితే గ్రామీణాభివృద్ధి శాఖ మార్గదర్శక సూత్రాలు పాటించుటకు వివిధ ఏజన్సీలలో సమన్వయ లోపం వలన వీలు కాలేదని నిర్దేశించిన వనరులు నిజమైన అర్హులకు చేరలేదని దళారీలు ప్రాబల్యంతో ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులు అక్రమార్జనకు పూనుకొన్నట్లుగా పేర్కొనడం జరిగినది.

2. **గ్రామీణ యువతకు స్వయం ఉపాధి శిక్షణ** (TRYSEM) **1979 :-** ఈ పథకం సమగ్ర గ్రామీణాభివృద్ధిలో ఒక భాగం. ఈ పథకం అమలుకు ప్రతి బ్లాకుకు 40 మంది పేద మరియు నిరుద్యోగ యువకులను గుర్తించి కేంద్ర,

రాష్ట్ర ప్రభుత్వాలు 50 : 50 నిష్పత్తిలో నరులను కల్పించి, వేర్వేరు చిన్న ఉత్పత్తి సంస్థల ఏర్పాటుకు తగిన శిక్షణ ఇవ్వడమైనది. 1988 - 89 నాటికి ఈ పథకం ద్వారా 35,800 మంది యువకులకు గ్రామీణ సాంకేతిక శిక్షణ సంస్థల ద్వారా శిక్షణ ఇవ్వడం జరిగినది. ఈ పథకంలో చిరిన వారికి శిక్షణ కాలం 6 నెలల నుండి ఒక సంవత్సరం వరకు ఉండవచ్చు. ఈ పథకంలో ముఖ్యంగా టైలరింగు, బైండింగు, బుట్ట అల్లకం, రేడియో, టి.వి. రిపేరు, ఎలక్ట్రికల్ వర్క్స్, పంపు సెట్లు రిపేరు, తేనె పరిశ్రమ, కోళ్ల పెంపకం, పండ్ల మొక్కల పెంపకం, పట్టు పరిశ్రమ, బయోగ్యాస్ ప్లాంటు నిర్మాణం మొదలైన వాటిలో శిక్షణ ఇవ్వడమైనది. ఆరవ ప్రణాళికా కాలంలో రూ॥ 55 కోట్లు ఖర్చు చేసి 10.15 లక్షల మందికి శిక్షణ సౌకర్యాలు కల్పించడమైనది. 1992 నాటికి 3 లక్షల మంది యువకులకు శిక్షణ ఇచ్చినారు.

## 3.9 1980 నుండి 1990 వరకు గ్రామీణాభివృద్ధి పథకాలు :-

1. **జాతీయ గ్రామీణ ఉద్యోగితా పథకం** (National Rural Employment Programme) 1980 :- పనికి ఆహార పథకాన్ని పేరు మార్చి 1980లో జాతీయ గ్రామీణ ఉద్యోగితా పథకాన్ని ప్రవేశ పెట్టటం జరిగినది. 50 శాతం కేంద్రం సాయంతో ఈ పథకం అమలు చేశారు. ఈ పథకం వలన ప్రతి సంవత్సరం 310 నుండి 400 మిలియన్ల పనిదినాలు అదనపు ఉద్యోగితను సృష్టించడమైనది. శాశ్వత సమాజ ఆస్తులు ఈ పథకం ద్వారా సృష్టిస్తారు. పని చేసేవారికి ఆహార ధాన్యాలు ఇస్తారు. ఈ పథకంలో 1775 మిలియన్ల పని దినాలు కల్పించడమైనది. 1985 నాటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకానికి రూ॥ 2487 కోట్లు కేటాయించినారు. ఈ పథకం క్రింద సృష్టించే ఉద్యోగిత స్వల్పకాలానికి చెందినది. చెల్లించే వేతనాలు మార్కెట్టు వేతనాల కన్నా తక్కువగా వున్నాయి. ఈ పథకం క్రింద పూర్తిగా రోడ్లు మరమ్మత్తులు చేయడం జరిగింది.

2. **గ్రామీణ ప్రాంతాలలో భూములు లేని వారి శ్రామికులను ఉద్యోగితా హామీ పథకం** (RLEGP) 1983 :- ఈ పథకం ద్వారా సంవత్సరములో 100 రోజులు పని కల్పించి గ్రామీణ ప్రాంతాలలో సామాజిక ఆస్తులను ఏర్పరచుటకు ప్రణాళిక తయారు చేసినారు. ఈ పథకం క్రింద కనీస వేతనాల చట్టం ప్రకారం వేతనాలనివ్వడమైనది. 1985 నుండి రూ॥ 1743 కోట్లు ఖర్చు చేసి 858 మిలియన్ పని దినాలు ఉద్యోగితను కల్పించడమైనది. ఈ పథకం వలన 5.2 లక్షల హెక్టారులలో సామాజిక అడవుల పెంపకం జరిగినది. 4.27 లక్షల గృహాల నిర్మాణం జరిగినది. ఈ పథకం అమలులో అవినీతి చోటు చేసుకోవడం వలన నిజమైన వారు సహాయం పొందడం జరగలేదు.

3. **గ్రామీణ ప్రాంతాల పేద మహిళలభివృద్ధి మరియు శిశు సంక్షేమ పథకం** (DWCRA) **1982 :-** సమాజంలో సగ భాగమున్న మహిళలను కేవలం ఇంటికే పరిమితం చేయకుండా సమాజ సేవారంగంలో భాగస్వామిగా వుంటూ గ్రామీణ మహిళలభివృద్ధికి కేటాయించిన సంక్షేమ పథకాలను గురించి చైతన్యపరచి వారి అభివృద్ధి కోసం సహాయపడుటకు డ్వాక్రా పథకం 1982లో సమగ్ర గ్రామీణాభివృద్ధి అనుబంధ కార్యక్రమంగా ప్రారంభించడం జరిగినది. గ్రామీణ నిరుపేదల మహిళలను పొదుపు ప్రాతిపదికపైన గట్టి సంఘటిత శక్తిగా తయారు చేసి సాంఘిక, దురాచారాలు, సంఘ విద్రోహ శక్తులు పై పోరాడేలా చేయడానికి వాళ్ళ శక్తియుక్తుల్ని ఒక ఆదర్శమైన ఆర్థిక సాంఘిక మార్పు కోసం వినియోగింప చేయడానికి డ్వాక్రా పథకం తొలిమెట్టు.

1982లో 50 జిల్లాలలో ప్రారంభమయిన ఈ పథకం 2002 నాటికి 2420 జిల్లాలకు విస్తరించినది. 2003 - 2004 నాటికి దేశం మొత్తం మీద 4,75,646 మహిళా స్వయం సహాయక సంఘాలు రూ॥ 1624.95 కోట్లు కార్పస్ ఫండ్‌తో మహిళలభివృద్ధికి తోడ్పడుచున్నారు.

ఒకే వృత్తి చేయుచున్న 10 నుండి 15 మహిళలతో కూడిన బృందాలను ఎంపిక చేసి ఆదాయం ఏర్పాటుకోసం పొదుపు గురించి ప్రచారం చేయడం, పొదుపు పథకాలు మొదలు పెట్టడం, కుటుంబ సంక్షేమం, కుటుంబ నియంత్రణ, ఆరోగ్య పరిరక్షణ, పౌష్టికాహారం, టీకాలు, అక్షరాస్యత, పరిశుభ్రత, వ్యవసాయం, పశుపోషణ వంటి కార్యక్రమాలను అమలుపరుస్తూ ప్రతి నెలా రూ॥ 30 పొదుపు చేస్తే ఆ మొత్తాలను గలిగిన పొదుపు సంఘాలను ఆరు నెలల పాటు పరిశీలనలో వుంచి అటు తర్వాత ఆ సంఘ సభ్యుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడే చేతివృత్తులను చేపట్టడానికి వీలుగా గ్రూపులకు ఋణ సదుపాయాన్ని అందించి, చక్ర నిధిని మంజూరు చేయడం జరిగినది. మహిళలకు శిక్షణ ఉత్పత్తి వంటి విషయాలను గురించి ప్రత్యేక సమావేశాలు పెట్టి తెలియచేయడం జరుగుతుంది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా డ్వాక్రా సంఘాలకు కావలసిన నిధులను సమకూరుస్తుంది.

దేశ వ్యాప్తంగా అందరి దృష్టి ఆకర్షించిన ఈ పథకం గ్రామీణ ప్రాంతాలలోని నిరుపేద మహిళల జీవితాలలో వెలుగు నింపిన కార్యక్రమం గ్రామీణ మహిళలకు వర ప్రసాదంగా మారినది.

**2003 నాటికి స్వయం సహాయ బృందాల సామాజిక నేపథ్యం :-** దేశం మొత్తం మీద 7,17,360 గ్రూపులు, బ్యాంకుల ద్వారా రూ॥ 2438 కోట్లు రివాల్వింగు ఫండు పొంది వారి తలసరి ఆదాయాలను పెంచుకుంటూ వివిధ ఉత్పత్తి కార్యకలాపాలను నిర్వహిస్తూ ఆర్థికంగా బలోపేతం పొంది అవి ప్రభుత్వ శాఖలలోను, రాజకీయ వ్యవస్థలలోను పంచాయితీరాజ్ పట్టణ స్థానిక సంస్థలలోనూ విద్య, ఉపాదుల్లోనూ మూడవ వంతు రిజర్వేషన్లను అమలుపరుస్తున్నారు. బాలికల సంరక్షణా పథకం ద్వారా బాలికల పేరున రూ॥ 5000 బ్యాంకు అకౌంట్లలో జమ చేయడం జరిగినది. ఈ విధంగా రాజకీయం గానూ, సామాజికంగానూ, ఆర్థికంగాను మహిళా సాధికారతకు ఈ పథకం తోడ్పడుతుంది.

4. **జవహర్ రోజ్‌గార్ యోజనా పథకం** (JRY) **1989 - 90 :-** గ్రామీణ ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలు అనగా గ్రామ స్థాయిలో దీర్ఘకాలిక వనరుల ఏర్పాటు, శాశ్వత పద్ధతిలో ఉపాధి అవకాశాలు కల్పించే వనరుల ఏర్పాటు చేయడం ఈ పథకం ప్రాథమిక ఉద్దేశ్యం. కేటాయించిన నిధులలో వ్యక్తిగత లబ్దిని చేకూర్చే పథకాలలో 22.5 శాతం నిధులు షెడ్యూల్డు కులాలు, తెగలకు కేటాయించాలి. 3 శాతం నిధులను వికలాంగులకుపకరించే పనులకు కేటాయించాలి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు మాత్రమే ఈ పథకం క్రింద ఉపాధి లభిస్తుంది. ఈ పథకం గ్రామ పంచాయితీల ద్వారా అమలు చేయబడుతుంది. గ్రామ పంచాయితీలకు రూ॥ 2100 కోట్లు ద్రవ్య వనరులను కల్పిస్తూ ఉపాధికల్పనకు ఈ పథకం ప్రారంభించబడినది. గ్రామీణ ప్రాంతాలలో పేదరికపు గీతకు దిగువన వున్న కుటుంబాలను గుర్తించి ప్రతి కుటుంబంలో కనీసం ఒకరికి ఉపాధి కల్పించాలనే సంకల్పముతో మొదలు పెట్టినారు. 3000 నుండి 4000 జనాభా గల ప్రతి గ్రామ పంచాయితీకి రూ॥ 80,000 నుండి రూ॥ 1,00,000 వరకు ద్రవ్య సహాయం చేస్తూ కుటుంబంలో ఒకరికి సంవత్సరములో 50 నుండి 100 రోజులకు ఉపాధిని కల్పించడమైనది. దీనిలో 30 శాతం గ్రామీణ పేద మహిళలకు కేటాయించబడినది. ఈ గ్రామీణ ప్రాంతాలలో పేదరికపు గీతకు దిగువన వున్న 4 కోట్ల 40 లక్షల కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకం అమలులో మధ్యవర్తులు, కాంట్రాక్టర్ల ప్రమేయం వుండదు. పేదలకు ప్రత్యక్షంగా సహాయపడే సామాజిక ఆస్తుల నిర్మాణానికి దారిద్ర్య నిర్మూలన కార్యక్రమాల నిర్వహణకు జవహర్ రోజ్‌గార్ యోజనా నిధులను వినియోగిస్తారు. ఈ పథకం కార్యక్రమాలను జిల్లా పరిషత్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలు కలసి ప్రణాళికను రూపొందించి పంచాయితీలకు కేటాయిస్తారు.

ఈ పథకం ద్వారా 1991 - 92 సంవత్సరములో రూ॥ 12,641.91 కోట్లు ఖర్చు చేసి 8,081 లక్షల పని దినాలు కల్పించినారు. వీటిలో 4530 లక్షల పని దినాలు షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందినవారికి కేటాయించినారు

మరియు 1,951 లక్షల పనిదినాలు మహిళల కోసం కేటాయించడం జరిగినది. 1993 - 94 ఆర్థిక సంవత్సరములో జవహర్ రోజ్‌గార్ యోజన క్రింద రూ॥ 1775.24 కోట్లు ఖర్చు చేసి 12.65 కోట్లు పని దినాలను కల్పించినారు. ఈ పథకం అమలుకు స్వచ్ఛంధ సంస్థలు ఉపాధి అవకాశాలను కల్పించుటకు ప్రత్యేక ఉప పథకాలను చేపట్టినారు.

## 3.10 1990 నుండి అమలుపరచిన గ్రామీణాభివృద్ధి పథకాలు :-

**(ఎ) ఇందిరా ఆవాస్ యోజనా గృహ నిర్మాణ పథకం (1996) :-** ప్రమాదవశాత్తు ఇండ్లు కాలిపోయిన వారికి, తుఫాను బాధితులకు, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు సంబంధించిన వెట్టి చాకిరీ కార్మికులకు, వికలాంగులకు ఈ పథకం క్రింద ఇళ్ళు నిర్మించబడతాయి. పేదరికపు గీతకు దిగువన వుండి కుటుంబ పోషక బాధ్యత వహించుచున్న వితంతువులకు, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, వెనుకబడిన తరగతుల వారు అర్హులు. జవహర్ రోజ్‌గార్ యోజనాలోని ఉప పథకమే ఇందిరా ఆవాసే యోజనా పథకం.

**(బి) స్వర్ణ జయంతి స్వరాజ్‌గార్ యోజనా (1-4-1999) :-** 1998 - 99 వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల క్రింద అమలులో ఉన్న సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం గంగా కళ్యాణి యోజన, మిలియన్ బావుల పథకం, డ్వాక్రా పథకం, ముఖ్యమంత్రి ఉద్యోగ హామీ పథకం, ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజనా పథకం, యువశక్తి పథకం, గ్రామీణ యువకులకు స్వయం ఉపాధి శిక్షణా పథకము, జవహర్ రోజ్‌గార్ యోజనా మొదలైన వాటినన్నింటిని కలిపి 1 - 4 - 1999 నుండి స్వర్ణ జయంతి స్వరాజ్‌గార్ యోజనగా మార్చడం జరిగింది.

గ్రామీణ ప్రాంతాలలోని దారిద్ర్య రేఖకు దిగువన వున్న కుటుంబాలకు ఈ స్వర్ణ జయంతి గ్రామ స్వరాజ్‌గార్ యోజన పథకం వర్తిస్తుంది. గ్రామీణ పేదరికాన్ని నిర్మూలించుటకు గ్రామీణ నిరుపేదలకు ఆర్థిక సహాయం ద్వారా స్వయం ఉపాధి కల్పించడమే ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యము. ఈ పథకం ద్వారా గ్రూపులలోని దారిద్ర్య రేఖకు దిగువన వున్న కుటుంబాలను గుర్తించి వారికి వ్యక్తిగతంగా మరియు గ్రూపుపరంగా ఆర్థిక సహాయాన్ని అందిస్తారు. దారిద్ర్యరేఖకు దిగువన వున్న కుటుంబాలకు కనీసం రూ॥ 2000 ఆదాయము వచ్చే పథకాలను వ్యక్తిగతముగా గాని, గ్రూపుగా గాని, స్వశక్తి సంఘములలో వున్న వారికి స్వర్ణ జయంతి స్వరాజ్‌గార్ యోజన పథకము క్రింద ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ పథకం ద్వారా సహాయం పొందుటకు అర్హత గల వారిని స్వరాజ్‌గార్‌గా పిలవబడతారు. ఈ పథకము క్రింద వ్యక్తిగతంగా వెనుకబడిన తరగతి వారికి ఇతర వర్గాల వారికి యూనిట్ విలువలో 30 శాతం సబ్సిడీ రూ॥ 7500లకు మించకుండా ఇవ్వబడుతుంది. 10 నుండి 20 సభ్యులు గల గ్రూపునకు రూ॥ 1.25 లక్షలకు మించకుండా యూనిట్ విలువలో 50 శాతం సబ్సిడీ వుంటుంది. మిగిలిన డబ్బు బ్యాంకు నుండి ఋణంగా ఇవ్వబడుతుంది. స్వరోజ్‌గార్ ఉత్పత్తి చేసే వస్తువుల మార్కెట్టు డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుంటారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఋణాల మంజూరులో ప్రధాన పాత్ర వహిస్తుంది.

1. **జాతీయ సామాజిక సహాయ కార్యక్రమము** (NSAP) (1995) :- ప్రభుత్వము వారు 1995 నుండి పేద కుటుంబాల మనుగడకు వివిధ సామాజిక సహాయక కార్యక్రమాలను ప్రవేశ పెట్టినది. ఈ కార్యక్రమము ద్వారా 3 పథకాలు అమలుపరచబడుతున్నవి.

**(ఎ) జాతీయ వృద్ధాప్య పింఛను పథకము** (NOAPS) :- 65 సంవత్సరాలకు పైబడి వుండి నిరాధారులై ఆర్థికంగా దిక్కులేని వృద్ధులకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకం క్రింద నెలకు రూ॥ 300 పింఛను లబ్ధిదారులకు వస్తుంది. దరఖాస్తుదారులు ఎటువంటి ఆదాయము లేనివారై వుండాలి. కుటుంబ సభ్యుల నుండి గాని, ఇతరుల నుండి ఆర్థిక సహాయము అందనివారై వుండాలి. సంబంధిత మండల అభివృద్ధి

అధికారి లేదా మున్సిపల్ కమీషనర్ లేదా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వారి నుండి నిధులు అందిన వెంటనే నగదు రూపంలో గ్రామ పరిపాలనాధికారి ద్వారా పంచాయితీ ప్రెసిడెంటు సమక్షంలో లబ్దిదారునికి డబ్బులు పంపిణీ చేస్తారు.

**(బి) కుటుంబ ప్రయోజన పథకం** (NFBS) :- కుటుంబ ఆదాయం సంవత్సరానికి రూ॥ 13,600 కంటే తక్కువ వుండి కుటుంబంలో ప్రధానంగా సంపాదించే వ్యక్తి 18 నుండి 64 సంవత్సరాలలోపు వారయి ప్రమాదవశాత్తు గాని, సహజముగా గాని మరణించినట్లయితే వారి కుంటుంబ సభ్యులు అనాథలు కాకూడదన్న ఉద్దేశ్యముతో రూ॥ 10,000 కలిగి ఆ కుటుంబములో మిగిలిన సభ్యులలో ఎవరు పెద్ద అయితే వారికి ఈ సహాయాన్ని ఇస్తారు.

**(సి) జాతీయ ప్రసూతి సహాయ పథకము** (NMBS) :- ఇది 19 సంవత్సరముల వయసు పైబడిన గర్భవతులకు అందచేసే పథకం. అటువంటి వారి కుటుంబ ఆదాయం సంవత్సరానికి రూ॥ 13,600ల కంటే తక్కువ వుండాలి. ఈ పథకం మొదటి రెండు కాన్పులకు మాత్రమే వర్తిస్తుంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన గర్భిణీ స్త్రీలకు బలవర్ధకమైన ఆహారము తీసుకొనుటకు రూ॥ 500 ప్రసూతి సహాయంగా చెల్లిస్తారు. గ్రామ పంచాయితీ లేదా మున్సిపాలిటీ ఒక టీము ద్వారా మెడికల్ ఆఫీసుకు పరిశీలనలో సబ్ కలెక్టరు లేదా R.D.O. కు గాని ఆర్జీ పెట్టుకుంటే జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థల నిధుల నుండి మంజూరు చేస్తారు.

## 3.11 సారాంశము :-

పైన పేర్కొన్న పథకాలన్ని సంబంధిత వర్గాల ప్రజలు అందుకునే విధానం వుండాలంటే ఆ పథకానికి సంబంధించిన సంపూర్ణమైన సమాచారం వారికి అందుబాటులో వుండాలి. ఈ పాఠ్యాంశము ఆ సమాచారాన్ని చాలా వరకు పొందుపరచినది. అదే విధంగా ఏ ప్రభుత్వ పథకానికైనా కార్యక్రమము అమలులో పారదర్శకత వుండాలి. పారదర్శకత అంటే సమాచారం పొందే హక్కు ద్వారా సాధ్యపడుతుంది. ఇటువంటి హక్కుని ప్రజలకు కల్పించడానికి మొదటిమెట్టు. ఆ కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని అందుబాటులో తేవడం. ఈ పాఠంలో పేద బడుగు వర్గాల జీవితాలను ప్రత్యక్షంగా ప్రభావితం చేసే వివిధ ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను పొందుపరచడమైనది. ఆయా కార్యక్రమాలను అమలుపరచే శాఖలలో వివిధ సంస్థలు అందించే సేవల వివరాలను సంక్షిప్తంగా చెప్పడం జరిగినది. పేద బడుగు వర్గాల కుటుంబాలు, సన్న, చిన్నకారు రైతులు, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు వారికి స్వచ్ఛంధ సంస్థల ద్వారా గాని గ్రామ స్థాయిలో ఇతర వర్గాలు వారు కాని తగిన సూచన వచ్చి ఈ పథకాల అమలు ద్వారా గ్రామీణాభివృద్ధి సాధ్యమయ్యేటట్లు చూడగలరని ఆశిద్దాము. అందరం కలసి కృషి చేద్దాము.

## 3.12 గుర్తుంచుకోవలసిన విషయాలు :-

గ్రామీణాభివృద్ధికి వ్యవసాయ రంగం అభివృద్ధితో పాటుగా వ్యవసాయేతర రంగాలభివృద్ధి వెనుకబడిన ప్రాంతాలభివృద్ధి, చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, వ్యవసాయ శ్రామికులు, చేతి వృత్తుల వారు సంక్షేమము కొరకు ప్రత్యేక ఏజన్సీల ద్వారా, స్వచ్ఛంధ సేవా సంస్థల ద్వారాను, వివిధ ప్రాజెక్టుల ద్వారాను ప్రభుత్వము అభివృద్ధి పథకాలను ప్రవేశ పెట్టి ప్రజల సహకారంతో గ్రామీణాభివృద్ధి సంస్థలు పటిష్ఠమైన కృషి చేయటం అవసరం.

గ్రామీణాభివృద్ధి పథకాలు 4 దశలలో అమలులో పెట్టడం జరిగినది.

1. వ్యవసాయ రంగము అభివృద్ధికి సంబంధించిన అంశాలు
2. ఉద్యోగితా సాంద్రత పథకాలు

3. ప్రాంతీయాభివృద్ధి పథకాలు

4. నిర్దేశితా లక్ష్యాల సాధనా కార్యక్రమాలు

1. 1950 నుండి 1960 వరకు గ్రామీణాభివృద్ధి కొరకు అమలుపరచిన పథకాలు
   - (ఎ) 1952 నుండి సమాజాభివృద్ధి కార్యక్రమము (C.D.P.)
   - (బి) 1953లో అమలుపరచిన జాతీయ విస్తరణ సర్వీసు (N.E.S.)

2. 1960 నుండి 1970 వరకు గ్రామీణాభివృద్ధి కొరకు తీసుకున్న చర్యలు
   - (ఎ) 1960 నుండి వ్యవసాయ రంగము అభివృద్ధికై సమగ్ర పద్ధతిలో అవస్థాపనా సౌకర్యాలను కల్పించుట (I.I.S.)
   - (బి) 1965లో వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు అందచేయడం
   - (సి) 1969 నుండి స్త్రీ శిశు సంక్షేమ కార్యక్రమాలను అమలుపరచి గ్రామీణ మహిళలు మరియు శిశువుల సంక్షేమం కొరకువివిధ మండలాలలో కృషి చేయడం

3. 1970 నుండి 1977 వరకు అమలుపరచిన పథకాలు
   - (ఎ) 1971లో చిన్న మరియు సన్నకారురైతుల అభివృద్ధి సంస్థలు స్థాపించుట (MFALDA) (SFDA)
   - (బి) 1973లో క్షామ పీడిత ప్రాంతాలభివృద్ధి పథకం (DPAP)
   - (సి) 1977లో ప్రారంభించిన ఎడారి ప్రాంతాలభివృద్ధి పథకం (DADP)
   - (డి) 1977 - 78 నుండి కనీసావసరాల కార్యక్రమము (M.N.P.)
   - (ఇ) 1977 లో పనికి ఆహార పథకం మరియు అంత్యోదయ పథకం (F.W.P.)

4. 1978 నుండి 1980 వరకు గ్రామీణాభివృద్ధి పథకాలు
   - (ఎ) 1978 - 79 సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం (IRDP)
   - (బి) 1979లో ప్రారంభించిన గ్రామీణ యువజన స్వయం ఉపాధి శిక్షణ (TRYSEM)

5. 1980 నుండి 1990 వరకు గ్రామీణాభివృద్ధి పథకాలు
   - (ఎ) 1980లో ప్రారంభించిన గ్రామీణ ఉద్యోగితా పథకం (EGP)
   - (బి) 1983లో ప్రారంభించిన గ్రామీణ భూములు లేనివారి ఉద్యోగితా హామీ పథకం (RLEGP)
   - (సి) 1982 - 83లో ప్రారంభించిన గ్రామీణ పేద మహిళలు మరియు శిశువుల సంక్షేమ పథకం (DWCRA)
   - (డి) 1989లో ప్రారంభించిన జవహర్ రోజ్‌ఘార్ యోజనా (JRY)

6. 1990 నుండి అమలులో పెట్టిన గ్రామీణాభివృద్ధి పథకాలు
   - (ఎ) 1995లో మొదలు పెట్టిన జాతీయ సామాజిక సహాయ కార్యక్రమము. ఇవి మూడు రకాలు (NSSP)

     1. NOAPS, 2. NFBS, 3. NMBS
   - (బి) 1996లో ప్రారంభించిన ఇందిరా ఆవాస్ యోజనా (IAY)
   - (సి) 1999లో ప్రారంభించిన స్వర్ణ జయంతి స్వరాజ్ గార్ యోజనా (SJJY)

## 3.13 కఠినపదాలు :-

| | | |
|---|---|---|
| C.D.P. (Community Development Programme) | : | సమాజాభివృద్ధి కార్యక్రమము |
| N.E.S. (NaAtional Extension Service) | : | జాతీయ విస్తరణ సర్వీసు |
| I.I.S. (Intensive Infrastructural Service Programme) | : | సమగ్ర అవస్థాపనా సేవలభివృద్ధి పథకం |
| S.F.D.A. (Small Farmers Development Agency) | : | చిన్నకారు రైతులభివృద్ధి ఏజన్సీ |
| M.F.A.L.D.A. (Marginal Farmers and Agricultural Development Agency) | : | ఉపాంత రైతులభివృద్ధి ఏజన్సీ |
| D.P.A.P. (Dranght Prone Area Programme) | : | క్షామ పీడిత ప్రాంతాల అభివృద్ధి పథకం |
| D.A.D.P. (Desert Area Development Programme) | : | ఎడారి ప్రాంతాలభివృద్ధి కార్యక్రమము |
| M.N.P. (Minimum Needs Programme) | : | కనీసావసరాల కార్యక్రమము |
| F.W.P. (Food for Work Programme) | : | పనికి ఆహార పథకం |
| I.R.D.P. (Integrated Rural Development Programme) | : | సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం |
| T.R.Y.S.E.M. (Training for Rural Youth and Self Employment Programme) | : | గ్రామీణ యువజన స్వయం ఉపాధి శిక్షణా పథకం |
| E.G.P. (Employment Guarantee Programme) | : | ఉద్యోగిత హామీ పథకం |
| R.L.E.G.P. (Rural Landless Employment Guarantee Programme) | : | గ్రామీణ ప్రాంతాలలో భూమిలేని శ్రామికుల ఉపాధి హామీ పథకం |
| D.W.C.R.A. (Development of Women and Children in Rural Areas) | : | గ్రామీణ పేద మహిళల అభివృద్ధి మరియు సంక్షేమ పథకము |
| J.R.Y. (Jawahar Rojgar Yojana) | : | జవహర్ రోజ్‌ఘార్ యోజన పథకము |
| N.S.A.P. (National Social Service Programme) | : | జాతీయ సామాజిక సహాయక కార్యక్రమము |
| N.O.A.P.S. (National Old Age Pension Scheme) | : | జాతీయ వయోవృద్ధుల పింఛను పథకము |
| N.F.R.S. (National Family Benefit Scheme) | : | జాతీయ కుటుంబ సంక్షేమ పథకము |
| N.M.B.S. (National Maternity Benefit Scheme) | : | జాతీయ ప్రసూతి ప్రయోజన పథకము |
| I.A.Y. (Indira Awas Yojana) | : | ఇందిరా ఆవాస్ యోజనా పథకము |
| S.J.S.Y. (Swarna Jayanti Swarojgar Yojana) | : | స్వర్ణ జయంతి స్వరోజ్‌గార్ యోజనా పథకము |

## 3.14 నమూనా ప్రశ్నలు :-

**1. వ్యాసరూప ప్రశ్నలు**

1. భారతదేశంలో గ్రామీణాభివృద్ధి పథకాలను గురించి క్లుప్తముగా వ్రాయుము.

**జ.** మన దేశంలో గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు 1950 నుండి అమలుపరచిన తీరును గురించి క్లుప్తముగా వ్రాయాలి.

**2. సంక్షిప్త వ్యాసరూప ప్రశ్నలు**

1. గ్రామీణాభివృద్ధిలో వ్యవసాయ రంగము అభివృద్ధికి తీసుకున్న చర్యలు

జ. గ్రామీణాభివృద్ధిలో వ్యవసాయాభివృద్ధి అవసరం గురించి వ్రాసి, 1956 నుండి గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ రంగముకు కేటాయించిన పథకాలను పేర్కొనాలి.

2. గ్రామీణాభివృద్ధిలో గ్రామీణ ప్రజల సంక్షేమ కార్యక్రమాలు

జ. గ్రామీణాభివృద్ధిలో ఉపాధి కల్పించే వ్యవసాయేతర రంగాలభివృద్ధికి తీసుకున్న చర్యలు మరియు సంక్షేమ కార్యక్రమాల గురించి వ్రాయాలి.

**3. సంక్షిప్త ప్రశ్నలు**

1. సన్న చిన్నకారు రైతులభివృద్ధి ఏజన్సీ

జ. చిన్నకారు రైతులు మరియు సన్నకారు రైతులభివృద్ధికి తీసుకున్న చర్యలు

2. కనీసావసరాల కార్యక్రమం
3. పనికి ఆహార కార్యక్రమం
4. సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం
5. గ్రామీణ యువజన ఉపాధి శిక్షణా పథకం
6. గ్రామీణ పేద మహిళల అభివృద్ధి మరియు శిశు సంక్షేమ పథకం
7. జవహర్ రోజ్‌ఘార్ యోజన
8. స్వర్ణ జయంతి స్వరాజ్ ఘార్ యోజనా

## 3.15 చదువదగిన గ్రంథాలు :-


1. Rural Development in India : Vinod Kumar Lavanya
2. Statistical Data on Indian Economy : Dr. Gopalji, Dr. Suman Bhakar
3. Indian Economy (ITs Growing Dimensions) : P.K. Dhar
4. Indian Economy : Ruddar Dutt and Sundaram 49th Edition 2004
5. Rural Development in india Past, Present and Future A Challange in the crisis : Vasant Desai
6. Rural Development, Principles, Policies and Management, Sage Publications : Katar Singh
7. Rural Development : I. Satya Sundaram


డా॥ వై. ఇందిరా కుమారి

పాఠం - 4

# గ్రామీణ జనాభా

## 4.0 లక్ష్యం :-

ఈ భాగంలో గ్రామీణ జనాభా లక్షణాలు, జనాభా పరిణామ సిద్ధాంతం, దానిలోని దశలు గ్రామాలలో జనాభా పెరుగుదలకు గల కారణాలు, జనాభా పెరుగుదల ధోరణులు, గ్రామీణ జనాభా యొక్క వయస్సు వారి స్త్రీ, పురుష జనాభా విభజన, జనాభా పరిమాణంను గూర్చి వివరించడమైనది. ఈ భాగం పూర్తయ్యేసరికి మీరు క్రింది పాఠ్యాంశాలను అవగాహన చేసుకుంటారు.

* గ్రామీణ జనాభా - Profile
* జనాభా పరిణామ సిద్ధాంతం - దశలు
* గ్రామాలలో జనాభా పెరుగుదలకు కారణాలు
* గ్రామీణ జనాభా పరిమాణం - పెరుగుదల ధోరణులు
* రాష్ట్రాల వారీగా గ్రామీణ జనాభా వివరాలు
* వయస్సు వారీ విభజన
* స్త్రీ - పురుష జనాభా విభజన

## విషయసూచిక :-


**4.1 విషయ పరిచయము**

**4.2 గ్రామీణ జనాభా - Profile**

**4.3 జనాభా పరిణామ సిద్ధాంతము**

**4.4 గ్రామీణ ప్రాంతాలలో జనాభా పెరుగుదలకు కారణాలు**

**4.5 గ్రామీణ జనాభా**

**4.5.1 గ్రామీణ జనాభా పరిమాణం మరియు పెరుగుదల ధోరణులు**

**4.5.2 రాష్ట్రాల వారీగా గ్రామీణ జనాభా వివరాలు**

**4.6 గ్రామీణ జనాభా యొక్క వయస్సు వారి విభజన**

**4.7 గ్రామీణ జనాభా యొక్క స్త్రీ - పురుష జనాభా విభజన**

**4.8 సారాంశము**

**4.9 గుర్తుంచుకోవలసిన విషయాలు**

**4.10 కఠినపదాలు**

**4.11 నమూనా ప్రశ్నలు**

**4.12 చదువదగిన గ్రంథాలు**

## 4.1 విషయ పరిచయము :-

గ్రామీణ జనాభా అధ్యయనాలు గ్రామీణ జనాభా లక్షణములను, సమస్యలను, పెరుగుదల ధోరణులను గూర్చి తెలియచేస్తుంది. భారతదేశంలో 2001 జనాభా లెక్కింపు ప్రకారం 72.2 శాతం ప్రజలు గ్రామీణ ప్రాంతాలలో నివశించుటచే గ్రామీణ జనాభా సమస్య అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. గ్రామీణులు సాంప్రదాయబద్దులు, నిరక్షరాస్యులు. గ్రామీణుల సంఖ్య పెరుగుతున్నదే కానీ సామర్థ్యం దృష్ట్యా వీరు వెనుకబడుచున్నారు. ఏ అభివృద్ధి ప్రణాళిక అయినా ప్రజల కోసమే కనుక అభివృద్ధి కోసం ప్రణాళికలను తయారు చేసేటపుడు ప్రజలకు సంబంధించిన సమాచారాన్ని సంపూర్ణంగా సేకరించాలి. జనాభా పరిమాణం, దాని నిర్మాణం, పెరుగుదల ధోరణుల గూర్చి పెరుగుదలకు గల కారణాలను గూర్చి అధ్యయనం చేయాలి.

## 4.2 గ్రామీణ జనాభా - Profile :-

1. **అధిక జనాభా :-** భారతదేశం గ్రామాలకు నిలయం. మన గ్రామాలలో దాదాపు జనాభాలో 72.2 శాతం జీవిస్తున్నారు. గ్రామీణ జనాభా ఎక్కువగా ఉండటమే కాక, సాలుసరి పెరుగుదల రేటు శాతం కూడా హెచ్చుగా ఉన్నది. పెరిగే జనాభా మూడు రకాల ఒత్తిడులను సృష్టిస్తున్నది.

   (ఎ) జననాల రేటు హెచ్చుగా ఉండి, పెద్దల పై ఆధారపడే పిల్లల శాతం పెరుగుచున్నది.

   (బి) మరణాల రేటు తగ్గుతూ జననాల రేటు పెరగటం వల్ల జనాభా వేగంగా పెరుగుతున్నది.

   (సి) పెరుగుతున్న జనాభా భూమి పై ఒత్తిడిని, అల్ప ఉద్యోగితను సృష్టిస్తున్నది.

2. **ఆర్థిక వ్యవస్థలో గ్రామీణ వ్యవస్థ ప్రాముఖ్యత :-** భారతదేశపు ఆర్థిక వ్యవస్థలో గ్రామీణ వ్యవస్థ ప్రధానమైనది. 80 శాతం ప్రజలు గ్రామాలలో నివశిస్తున్నారు. అన్ని రంగాలలోనూ ఉత్పత్తి ఉత్పాదకతలు తక్కువ. గ్రామీణాభివృద్ధి కొరవడటానికి కారణం ఇన్ని సంవత్సరాలుగా గ్రామీణ రంగపు ఉత్పాదకత పెరగకపోవడం.

3. **నిరక్షరాస్యత :-** గ్రామీణ జనాభాలో మూడు వంతులు నిరక్షరాస్యులు కనుక, గ్రామీణ ప్రాంతాల మానవ వనరులు నాణ్యత లేని పని స్పష్టమవుతుంది. మానవ మూలధనం మెరుగుపరచకుండా గ్రామీణ అభివృద్ధిని సాధించడం అసాధ్యం.

4. **ఆధారిత జనాభా నిష్పత్తి ఎక్కువ :-** చాలా కాలంగా జననాల రేటు హెచ్చుగా ఉండి మరణాల రేటు తగ్గటంతో పెద్దల పై ఆధారపడే పిల్లల శాతం పెరుగుచున్నది. అనగా గ్రామీణ ఆర్థికవ్యవస్థలో ఉత్పాదక శ్రామికుల శాతం తగ్గుతూ అనుత్పాదక శ్రామికుల సంఖ్య పెరుగుచున్నది. ఆధారిత జనాభా నిష్పత్తి తగ్గితే తప్ప ఆర్థిక అభివృద్ధి ఫలితాలు కనిపించవు.

5. **గ్రామీణులలో అధిక శాతం పేదలు :-** 1999 - 2000 నాటికి 193 మిలియన్ల గ్రామీణులు పేదలు. వీరు అవలంభించే ఉత్పత్తి పద్ధతులు సంప్రదాయమైనది. కనుక వీరి ఉత్పాదకత తక్కువ. గ్రామీణుల జీవన ప్రమాణ స్థాయి అల్పంగా ఉంటుంది. కనుక వీరు పేదరికపు విష వలయంలో చిక్కుకొని ఉంటారు.

6. గ్రామీణ ప్రజలు మూఢనమ్మకాలను కలిగి ఉంటారు. వీరిపై కుల, మత ప్రభావాలు ఎక్కువ. సాంఘీక ఆచారాలకు, కట్టుబాట్లకు సాంప్రదాయ విలువలకు కట్టుబడి ఉంటారు. గ్రామీణ సమాజంలో వ్యక్తులు చేపట్టే వృత్తి వారి

సామర్థ్యాన్ని బట్టి కాక, కులాన్ని బట్టి ఉండును. గ్రామీణ సమాజంలో వృత్తిపరమైన గమనశీలతకు అవకాశం చాలా తక్కువగా ఉంటుంది.

7. గ్రామీణ ప్రజల జీవన విధానంలో వైవిధ్యం కంటే సారూప్యత అధికంగా ఉంటుంది.

8. గ్రామీణ ప్రాంతాలలోని నివసించే ప్రజలలో ఎక్కువ భాగం సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబడినారు. వీరు సాధారణంగా అసంఘటిత రంగానికి చెంది ఉంటారు.

**టేబుల్ 1**

| దశ | సంవత్సరం | పెరుగుదల (కోట్లలో) | స్థితి |
|---|---|---|---|
| మొదటి దశ | 1891 - 1921 | 0.19 | నిశ్చల జనాభా |
| రెండవ దశ | 1921 - 1951 | 1.22 | క్రమంగా వృద్ధి |
| మూడవ దశ | 1951 - 1981 | 2.15 | ఎక్కువ రేటుతో త్వరితంగా వృద్ధి |
| నాల్గవ దశ | 1981 - 2001 | 2.11 | అధిక వృద్ధితో పాటు, జనాభా తప్పనిసరిగా తగ్గుతుందనే లక్షణాలు |

## 4.3 జనాభా పరిణామ సిద్ధాంతము :-

మానవ వనరులలో జనాభా ముఖ్యమైనది. ఒక దేశంలోని జనాభా నాణ్యతను బట్టి ఆ దేశ ఆర్థికాభివృద్ధి కొనసాగుతుంది. అంటే జనాభా పరిమాణం, పెరుగుదల తీరు, పెరుగుదల రేటులను అభివృద్ధిని నిర్ణయించే అంశాలుగా భావించవచ్చు. అభివృద్ధి చెందుతున్న భారతదేశం లాంటి వ్యవస్థల అభివృద్ధిని గురించి తెలుసుకోవడానికి ఆ దేశ జనాభా పరిమాణాన్ని, పెరుగుదల పోకడలను, వాటి ప్రభావాలను గురించి తెలుసుకోవలసి ఉంటుంది. అందుకే జనాభా పరిణామ సిద్ధాంతాన్ని గూర్చి తెలుసుకోవాలి. కాలక్రమంలో జనాభా మార్పు చెందే ధోరణిని ఈ సిద్ధాంతం వివరిస్తుంది. జనాభా పరిణామము మూడు దశలలో జరుగుతుందని ఈ సిద్ధాంతం తెలియచేస్తుంది.

1. **మొదటి దశ (1891 - 1921) :-** దీనికి సంబంధించిన సమాచారం టేబుల్ - 1లో ఉంది). ఈ దశలో జనన - మరణాల రేట్లు రెండూ ఎక్కువగానూ, ఆర్థికాభివృద్ధి స్థాయి తక్కువగానూ ఉంటుంది. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఉండి 90% ప్రజలు దీనిపైనే ఆధారపడి జీవిస్తుంటారు. వ్యవసాయ రంగంలో పురాతన పద్ధతులను అవలంభిస్తుంటారు. బాల్య వివాహాలు, సాంఘీక కట్టుబాట్లు, నిరక్షరాస్యత, సంతానం పై ఆసక్తి మొదలైన కారణాల వలన జననాల రేటు ఎక్కువగా ఉంటుంది. ఆర్థిక వ్యవస్థలో వైద్య సదుపాయాల కొరత, పౌష్టికాహార లోపం, అపరిశుద్ధ వాతావరణం వలన మరణాల రేటు కూడా ఎక్కువగా ఉంటుంది. ఈ దశలో జనన - మరణాల రేట్లు రెండూ ఎక్కువగా ఉండుట వలన మొత్తం జనాభాలో పెరుగుదల స్పష్టంగా కనిపించకుండా దాదాపు స్థిరంగా ఉంటుంది. ఇది ఆర్థికాభివృద్ధిలోని ప్రాథమిక దశ.

2. **రెండవ దశ (1921 - 1951) :-** ఈ దశలో మరణాల రేటు కన్నా జననాల రేటు ఎక్కువగా ఉండి, ఆర్థికవ్యవస్థ అభివృద్ధి దిశగా సాగుతుంది. అభివృద్ధి జరిగి ఈ దశలో ప్రజల ఆదాయం పెరిగినందున పౌష్టికాహారం తీసుకుంటారు.

ప్రభుత్వం కూడా వైద్య సదుపాయాలను పెంచడం, అంటువ్యాధుల నిర్మూలన వంటి చర్యలు చేపట్టడం వలన మరణాల రేటు తగ్గుతుంది. సాంఘీక పరిస్థితులు, ఆచార అలవాట్లు, మూఢ నమ్మకాల వల్ల జననాల రేటు ఎక్కువగానే ఉంటుంది. మరణాల రేటు తగ్గుతూ జననాల రేటు పెరుగుతున్నందున మొత్తం జనాభాలో పెరుగుదల త్వరితంగానూ, స్పష్టంగానూ కనిపిస్తుంది. ఈ పరిస్థితిని 'జనాభా విస్ఫోటనం' అంటారు.

3. **మూడవ దశ (1951 - 1981) :-** ఈ దశలో తగ్గిన మరణాల రేటుకు అనుకూలంగా జననాల రేటు కూడా తగ్గుతుంది. అభివృద్ధి చెందుతున్న వ్యవస్థలలో వ్యవసాయ రంగ ప్రాధాన్యత తగ్గి పాక్షికంగా పారిశ్రామికీకరణ జరుగుతుంది. ప్రజలు సుఖ జీవనం కోసం పల్లెల నుండి పట్టణాలకు వలసపోతారు. అలాగే వ్యవసాయ రంగం నుండి పారిశ్రామిక రంగానికి మళ్ళుతారు. స్త్రీలు కూడా ఆర్థిక స్వాతంత్ర్యం విలువ గుర్తించి, చురుకుగా ఉత్పత్తి కార్యక్రమాలలో పాల్గొంటారు. ప్రజలలో అక్షరాస్యత, విద్య వ్యాప్తి చెందుతుంది. నగరీకరణ విస్తరిస్తుంది. ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. చిన్న కుటుంబము యొక్క ప్రాధాన్యతను గుర్తిస్తాయి. ఈ వివిధ కారణాల వలన జనన - మరణాల రేట్లు రెండూ తగ్గడం వలన జనాభా వృద్ధిరేటు తగ్గుతుంది. ఆర్థిక వ్యవస్థ ఈ దశకు చేరితే జనాభా సమస్య పరిష్కారం అయినట్లే.

## 4.4 గ్రామీణ ప్రాంతాలలో జనాభా పెరుగుదలకు కారణాలు :-

గ్రామాలలో జనాభా అధికంగా ఉండటం ఆ దేశపు ఆర్థిక వెనుకబాటుతనానికి సూచికగా చెప్పవచ్చు. 1981 జనాభా లెక్కల ప్రకారం భారతదేశపు మొత్తం జనాభాలో గ్రామీణ జనాభా 76.3 శాతం కాగా 1991లో 74.3 శాతం కాగా 2001లో 72.2 శాతం ఉన్నారు. గ్రామీణ జనాభా అధికంగా ఉండుటకు అనేక ఆర్థిక, సాంఘీక, ఇతర కారణాలు ఉన్నాయి.

1. **జననాల రేటు హెచ్చు - మరణాల రేటు తక్కువ :-** ప్రస్తుత భారతదేశంలో జననాల రేటు హెచ్చుగా ఉండి, మరణాల రేటు క్షీణిస్తుంది. ఈ కారణంగా జనాభా నికర పెరుగుదల రేటు హెచ్చుగా ఉన్నది. మన దేశంలో ప్రస్తుతం జనాభా పెరుగుదల రేటు సాలుసరి 2.35%. ఏ ప్రమాణాల దృష్ట్యా చూసినా ఈ పెరుగుదల రేటు భరించలేనిది.

2. **వివాహము విశ్వవ్యాప్తము :-** మన దేశంలో ఇంచుమించుగా అందరూ విధిగా వివాహం చేసుకొని వివాహ వ్యవస్థలో ఉందురు. వివాహము మాతృత్వము కలసి ఉంటాయి. సంతానం పట్ల మక్కువ గ్రామీణ ప్రాంతాలలో మరింత హెచ్చు.

3. **పుత్రుడిపై మోజు :-** వంశవృద్ధి కోసం, వృద్ధాప్యంలో రక్షణ కోసం, భారతీయులలో మగ పిల్లల పట్ల అభిలాష ఎక్కువ. ఆడ పిల్లలు కలుగుతున్నప్పటికి పుత్రుడి కోసం వేచి ఉండటంచే జనాభా మరింత పెరుగుతుంది. గ్రామీణ ప్రాంతాలలో ఈ దృక్పథం ఎక్కువ.

4. **బాల్య వివాహాలు :-** భారతదేశంలో 50 శాతం బాలికలు 15 సం॥ లోపుగానే వివాహితులవుతారు. ఇది గర్భధారణ కాలాన్ని పెంచి మరింత జనాభా పెరుగుదలకు దారి తీస్తుంది. చిన్న వయస్సులోనే వివాహమైతే దాదాపు 30 సం॥ల పాటు సంతానాన్ని కనే అవకాశం ఉంటుంది.

5. **హెచ్చు శిశు మరణాల రేటు :-** ప్రతీ 1000 మంది శిశువులలో చనిపోయే వారి సంఖ్యను శిశు మరణాల రేటు అంటారు. మన గ్రామాలలో జననాల రేటు 140, శిశు మరణాల రేటు 124గా ఉంది. పుట్టిన పిల్లల్లో కొందరైనా బ్రతుకుతారనే గ్రామీణులు ఎక్కువ సంతానాన్ని కోరతారు.

6. **పేదరికం :-** మన దేశంలో ముఖ్యంగా గ్రామాలలో పిల్లలను ఆస్థిగా భావిస్తారు. పిల్లలను అదనపు ఆర్జనకు మార్గంగా భావిస్తారు. దీనికి కారణం గ్రామీణుల పేదరికం.

7. **నిరక్షరాస్యత :-** దేశంలో నూటికి 65 శాతం నిరక్షరాస్యులు. పెరిగే జనాభా కుటుంబాలకు, దేశానికి భారమని వీరు గుర్తించలేరు. గ్రామీణులకు జనాభా నియంత్రణ పద్ధతులు గానీ, దాని ఆవశ్యకత గూర్చి గానీ తెలియదు. స్త్రీల అక్షరాస్యత తక్కువగా ఉండి గ్రామాలలో జనాభా పెరుగుదల రేటు అధికంగా ఉంది.

8. **మత ప్రలోభాలు :-** భారతీయులు ముఖ్యంగా గ్రామీణులు మత ప్రలోభంలో పడి పిల్లలను దేవుడిచ్చిన వరంగా భావిస్తారు. కుటుంబ నియంత్రణ పాటించడం మహా పాపంగా తలుస్తారు. సాంప్రదాయ హిందువులు, కేథలిక్స్, ముస్లింలు కుటుంబ నియంత్రణకు వ్యతిరేకులు. ఈ కారణంగా జనాభా పెరుగుతున్నది.

9. **బాధ్యతా రాహిత్యం :-** హిందూ కుటుంబాలలోని సమిష్టి కుటుంబ విధానం ప్రజలలో బాధ్యతా రాహిత్యాన్ని పెంచుతుంది. ఉమ్మడి ఆస్థిలో హెచ్చు వాటా పొందుటకు ఎక్కువ మంది పిల్లలను కంటుంటారు.

10. **సౌకర్యాల లేమి :-** గ్రామీణ భారతదేశంలో కుటుంబ నియంత్రణ పద్ధతులు ప్రజలకు తెలియకపోవడం, గ్రామీణ ప్రాంతాలలో కుటుంబ నియంత్రణ సౌకర్యాలు లేకపోవడం మరో కారణం.

11. **సాంఘీక లోపాలు :-** పరిమిత కుటుంబాల భావనకు సంఘంలో మద్దతు లోపించింది. దైవభీతి, పాపభీతి, గర్భస్రావాలకు అడ్డువస్తాయి. తమకు ఇష్టం లేకున్నా గ్రామీణ స్త్రీలు ఎక్కువ మంది పిల్లలకు జన్మనిస్తారు.

## 4.5 గ్రామీణ జనాభా :-

**4.5.1 గ్రామీణ జనాభా పరిమాణం మరియు పెరుగుదల ధోరణులు :-** జనాభా పెరుగుదల ధోరణులను తెలుసుకోవడంలోని ముఖ్య ఉద్దేశం, గతాన్ని బట్టి భవిష్యత్ ధోరణులను అంచనా వేయవచ్చు. ఏ అభివృద్ధి ప్రణాళిక అయినా ప్రజల కోసమే, ప్రజల సంక్షేమాన్ని సాధించని అభివృద్ధి నిష్ప్రయోజనం. కనుక గ్రామీణ అభివృద్ధి కోసం పథకాలు రూపొందించేటపుడు ప్రజలకు సంబంధించిన సమాచారాన్ని సంపూర్ణంగా సేకరించాలి. అంటే జనాభా పరిమాణం, పెరుగుదల, ధోరణులు, నిర్మాణపు ధోరణులు మొదలైనవి అధ్యయనం చేయాలి.

భారతదేశంలో గ్రామీణ ప్రాంతాలలో జనాభా పెరుగుదల ఎక్కువ. పెరిగే జనాభాలో సింహ భాగం గ్రామీణ ప్రాంతాలదే కావడంచే భారతదేశం గ్రామాలలో నివసిస్తున్నది అనే నానుడి బయలుదేరింది. ఈ నానుడి వాస్తవమని ఈ క్రింది పట్టిక సహాయముతో ఋజువు చేయవచ్చు.

**భారతదేశంలో గ్రామీణ జనాభా పరిమాణం, గ్రామీణ జనాభా వృద్ధి రేటు**

| గణన సంవత్సరం | జనాభా (మిలియన్లలో) | | మొత్తం జనాభాలో శాతం | |
|---|---|---|---|---|
| | మొత్తం జనాభా | గ్రామీణ జనాభా పరిమాణం | గ్రామీణ జనాభా శాతం | పట్టణ, గ్రామీణ జనాభా నిష్పత్తి |
| 1901 | 232.9 | 207.3 | 89% | 1 : 8.1 |
| 1911 | 246.0 | 220.4 | 89.6% | 1 : 8.6 |
| 1921 | 244.3 | 216.6 | 88.7% | 1 : 7.8 |
| 1931 | 270.8 | 233.8 | 87.8% | 1 : 7.2 |
| 1941 | 309.0 | 265.5 | 85.9% | 1 : 6.1 |
| 1951 | 361.1 | 298.7 | 82.7% | 1 : 4.7 |
| 1961 | 439.2 | 360.3 | 82.0% | 1 : 4.5 |
| 1971 | 548.2 | 439.1 | 80.1% | 1 : 3.7 |
| 1981 | 685.2 | 525.7 | 76.7% | 1 : 3.3 |
| 1991 | 844.3 | 627.1 | 74.3% | 1 : 2.9 |
| 2001 | 1027.0 | 742.0 | 72.2% | 1 : 2.6 |

**మూలం -** రిజిస్ట్రార్ జనరల్ ఇండియా

పై పట్టికను పరిశీలించిన

1. ఉజ్జాయింపుగా నాల్గింట మూడు వంతుల జనాభా అనగా 75% మేరకు జనాభా గ్రామీణ ప్రాంతాలలో నివశిస్తున్నట్లు తెలుస్తున్నది.
2. 1901 నుండి 2001 వరకు గ్రామీణ జనాభా పరిమాణం 207 మిలియన్‌ల నుండి 742 మిలియన్‌లకు పెరిగింది.
3. గ్రామీణ జనాభా శాతం తగ్గుతున్నప్పటికి అది చెప్పుకోదగినంతగా లేదు.
4. పట్టణ గ్రామీణ జనాభా నిష్పత్తి మాత్రం తగ్గింది.

**4.5.2 రాష్ట్రాల వారీగా గ్రామీణ జనాభా వివరాలు :-**

**1981 - 2001 సెన్సెస్ ప్రకారం**

| రాష్ట్రం | మొత్తం జనాభా | గ్రామీణ జనాభా | రాష్ట్ర జనాభాలో దాని గ్రామీణ శాతం | మొత్తం గ్రామీణ జనాభాలో రాష్ట్ర గ్రామీణ జనాభా శాతం |
|---|---|---|---|---|
| ఉత్తరప్రదేశ్ | 11.1 | 9.1 | 82.0 | 17.3 |
| బీహార్ | 7.0 | 6.1 | 87.1 | 11.6 |
| మధ్యప్రదేశ్ | 5.2 | 4.2 | 80.8 | 8.0 |
| ఆంధ్రప్రదేశ్ | 5.4 | 4.1 | 75.9 | 7.8 |
| మహారాష్ట్ర | 6.3 | 4.1 | 65.1 | 7.8 |
| పశ్చిమ బెంగాల్ | 5.5 | 4.0 | 72.7 | 7.6 |
| తమిళనాడు | 4.8 | 3.2 | 66.7 | 6.6 |
| రాజస్థాన్ | 3.4 | 2.7 | 79.4 | 5.1 |
| కర్ణాటక | 3.7 | 2.6 | 70.3 | 5.0 |
| గుజరాత్ | 3.4 | 2.3 | 67.6 | 4.4 |
| ఒరిస్సా | 2.6 | 2.3 | 8.8.5 | 4.4 |
| కేరళ | 2.5 | 2.1 | 84.0 | 4.0 |
| పంజాబ్ | 1.7 | 1.2 | 70.6 | 2.3 |
| హర్యానా | 1.3 | 1.0 | 76.9 | 1.9 |

దేశం మొత్తం మీద గ్రామీణ జనాభాలో అత్యధికులు ఉత్తరప్రదేశ్‌లో నివశిస్తున్నారు. హిందీ మాట్లాడే ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో మొత్తం గ్రామీణ జనాభా లో 48% ఉన్నారు. కనుక గ్రామీణాభివృద్ధి ప్రణాళికలలో ఈ నాలుగు రాష్ట్రాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వవలసి ఉన్నది.

## 4.6 గ్రామీణ జనాభా యొక్క వయస్సు వారీ విభజన :-

వయస్సుల వారీ జనాభా విభజన వలన శ్రమశక్తిని అంచనా వేయవచ్చును. మొత్తం జనాభాలో పని చేయగల వయస్సు గ్రూపులో ఎంతమంది ఉన్నారో, వారిలో ఎంతమంది ఏ వృత్తిలో ఉన్నారో, ఎంతమంది నిరుద్యోగులుగా ఉన్నారో గ్రహించవచ్చు. 15 - 60 సం॥ మధ్య ఉన్న వారిని పనిచేసే వయస్సు గ్రూపుగా పరిగణిస్తారు.

ఈ విభజన వలన మార్కెట్ ప్రయోజనం కూడా ఉంది. పిల్లల సంఖ్యను బట్టి వారు వాడే వస్తువుల ఉత్పత్తి పరిమాణాలను, అదే విధంగా వృద్ధుల సంఖ్యను బట్టి వారు వాడే వస్తువుల ఉత్పత్తి పరిమాణాలను నిర్ణయించవచ్చు. వివిధ ప్రాంతాలలో వారి విభజన ప్రకారం ఎంతెంత సప్లయి చేయవచ్చునో గ్రహించవచ్చు. మన దేశంలో 1991లో 0 - 14 గ్రూపు వారి శాతం 35.8 ఉండగా, 15 - 64 సం॥ వయస్సు గ్రూపు వారి శాతం 60.2గా ఉంది. ఈ క్రింది పట్టీ ద్వారా గ్రామీణ జనాభా యొక్క వయస్సుల వారి పంపిణీని అర్థం చేసుకొనవచ్చు.

**పట్టిక - 2**

| సంవత్సరము | వయస్సు గ్రూపు | | |
|---|---|---|---|
| | 0 - 14 | 15 - 60 | 60 ఆ పైన |
| 1961 | 41.5 | 52.7 | 5.8 |
| 1971 | 42.8 | 51.0 | 6.2 |
| 1981 | 40.6 | 52.9 | 6.5 |
| 1991 | 36.6 | 56.4 | 7.0 |
| 2001 | 32.3 | 59.4 | 8.3 |

పై పట్టిక ఆధారంగా గ్రామాలలో పిల్లల సంఖ్య తగ్గింది. పనిచేసే వయస్సు వారి సంఖ్య వృద్ధుల సంఖ్య పెరుగుతున్నాయి. 1981లో వృద్ధుల శాతాన్ని మినహాయిస్తే జనాభాలో సగం మంది పని చేస్తూ మిగతా సగం మందిని పోషిస్తున్నారన్నమాట.

పిల్లల శాతం ఎక్కువగా ఉండుటకు కారణం హెచ్చు జననాల రేటు. 1981 తరువాత పిల్లల శాతం క్రమంగా తగ్గి, పెద్దల శాతం క్రమంగా పెరగడం మరణాల రేటు తగ్గడం, వలన పనిచేసే వారి శాతం, వృద్ధుల శాతం పెరిగినది. పనిచేసే వయస్సు గ్రూపు వారి సంఖ్య పెరుగుతున్నందున వారికి ఉద్యోగితను కల్పించే అంశానికి ప్రాధాన్యత పెరుగుతుంది. వృద్ధుల సంఖ్య పెరుగుతున్నందున సాంఘిక సంక్షేమ పథకాలకు, ఆరోగ్య సేవల ఏర్పాటుకు ఎక్కువ ఖర్చు పెట్టాల్సి ఉంటుంది.

## 4.7 గ్రామీణ జనాభా యొక్క స్త్రీ - పురుష జనాభా విభజన :-

జనాభాకు సంబంధించిన మరో ముఖ్య అంశం, స్త్రీ - పురుష జనాభా నిష్పత్తి. ఈ క్రింది పట్టిక భారతదేశపు గ్రామాలలో స్త్రీ పురుష జనాభా పంపిణీ వివరిస్తున్నది. ప్రతి 1000 మంది పురుషులకు ఉన్న స్త్రీ జనాభాను 'స్త్రీ - పురుష జనాభా నిష్పత్తి' అంటారు. జనాభా ఈ విధంగా విభజించటం అనేక అంశాలైన వివాహం, జనాభా పెరుగుదల రేటు మొదలైన వాటి దృష్ట్యా ముఖ్యం. పురుషుల కంటే స్త్రీలలో మరణాల రేటు తక్కువ. స్త్రీ, పురుష జనాభా వివాహపు రేటును, పిల్లల సంఖ్యను నిర్ణయిస్తుంది. ప్రతికూల స్త్రీ - పురుష నిష్పత్తి అనేక సాంఘీక విలువల వినాశానికి, నైతిక విలువల పతనానికి దారి తీస్తుంది. ఈ క్రింది పట్టిక గ్రామీణ జనాభాలో స్త్రీ - పురుష నిష్పత్తిని గూర్చి వివరిస్తుంది.

గ్రామీణ జనాభాలో స్త్రీ - పురుషుల నిష్పత్తి

| సంవత్సరం | గ్రామీణ | పట్టణ | మొత్తం |
|---|---|---|---|
| 1951 | 965 | 860 | 946 |
| 1961 | 963 | 845 | 941 |
| 1971 | 949 | 858 | 930 |
| 1981 | 951 | 878 | 933 |
| 1991 | 959 | 897 | 929 |
| 2001 | 964 | 913 | 933 |

1901లో ఈ నిష్పత్తి 1000 : 972 ఉన్నది. 1951లో 1000 : 946కు తగ్గినది. 1991 నాటికి 929కి తగ్గింది. 2001 నాటికి ఈ నిష్పత్తి పెరిగింది. అంటే స్త్రీ మరణాల సంఖ్యను తగ్గించే కృషికి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇవ్వడమే కారణం. ఒక్క కేరళ రాష్ట్రంలోనే ఈ నిష్పత్తి స్త్రీల వైపు మొగ్గుచూపి 1000 మంది పురుషులకు 1040 స్త్రీలున్నారు. కానీ రాజస్థాన్, బీహార్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా రాష్ట్రాలలో స్త్రీ పురుషుల నిష్పత్తి జాతీయ స్థాయి సగటుకన్నా కూడా తక్కువగా ఉంది. మన దేశంలో ఈ నిష్పత్తి తగ్గుటకు గల కారణాలలో ప్రధానమైనవి -

1. సంతానోత్పత్తి చేసే వయస్సులో ఉన్న స్త్రీల మరణాల రేటు పెరుగుదల
2. స్త్రీ శిశువులలో మరణాల రేటు పెరుగుట
3. మగ పిల్లల సంఖ్య విషయంలో శ్రద్ధ వహించినట్లుగా ఆడపిల్లల ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించకపోవుట. అభివృద్ధి చెందిన దేశాలలో 1000 మంది పురుషులకు సుమారు 1040 మంది స్త్రీలున్నారు.

## 4.8 సారాంశము :-

భారతదేశం గ్రామాలకు నిలయం. మన గ్రామాలలో దాదాపు దేశ జనాభాలో 80 శాతం జీవిస్తున్నారు. ఏ అభివృద్ధి ప్రణాళిక అయినా కూడా ప్రజల కోసమే. అభివృద్ధి కోసం ప్రణాళికలను రూపొందించేటపుడు ప్రజలకు సంబంధించిన సమాచారాన్ని సంపూర్ణంగా సేకరించాలి. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాన్ని రూపొందించేటపుడు గ్రామీణ ప్రాంతపు జనాభా పరిమాణం వివిధ ప్రాంతాలలో దాని పంపిణీ లక్షణాలు, పెరుగుదల ధోరణులు, నిర్మాణపు ధోరణులు మొదలైనవి అధ్యయనం చేయాలి. భారతదేశపు గ్రామాలలో అనేక కారణాల వల్ల జనాభా పెరుగుచున్నది. స్త్రీ - పురుష జనాభా నిష్పత్తి ఈ దేశంలో ప్రతికూలంగా ఉన్నది. వయస్సు వారీ విభజన కూడా అభివృద్ధి చెందిన వారితో పోలిస్తే ప్రతికూలంగా ఉంది. ఈ ధోరణులు 2001 నాటి నుండి కొద్దిగా మారుతున్నాయి,

## 4.9 గుర్తుంచుకోవలసిన విషయాలు :-

1. గ్రామీణ అభివృద్ధికి ప్రణాళికను రూపొందించేటపుడు గ్రామీణ జనాభా తీరును అవగాహన చేసుకోవాలి.
2. కాలక్రమంలో జనాభా మార్పు చెందే ధోరణిని జనాభా పరిణామ సిద్ధాంతం వివరిస్తుంది.
3. జనాభా పరిణామ సిద్ధాంతంలో 3 దశలుంటాయి.
4. గ్రామీణ ప్రాంతాలలో అనేక కారణాల వల్ల జనాభా పరిమాణం పెరుగుతూ ఉన్నది.

5. భారతదేశంలో కొన్ని రాష్ట్రాలలో గ్రామీణ జనాభా, అత్యధికంగా ఉన్నది.
6. జనాభా యొక్క వయస్సుల వారీ విభజన వలన శ్రమ శక్తిని అంచనా వేయవచ్చు.
7. మన దేశంలో ప్రతికూల స్త్రీ - పురుష జనాభా నిష్పత్తి ఉన్నది.

## 4.10 కఠిన పదాలు :-

**జనభా పరిణామ సిద్ధాంతము** - జనాభా కాలక్రమంలో మార్పు చెందే ధోరణిని ఇది వివరిస్తుంది

**వయస్సు వారీ విభజన** - జనాభా యొక్క శ్రమశక్తిని దీని ద్వారా అంచనా వేయవచ్చు.

## 4.11 నమూనా ప్రశ్నలు :-

**(ఎ) వ్యాసరూప ప్రశ్నలు**

1. మన గ్రామాలలో హెచ్చు జననాలకు గల కారణాలు వ్రాయండి.

జ. గ్రామీణ ప్రాంతాలలో జనాభా పెరుగుదలకు కారణాలు వ్రాయవలెను.

2. గ్రామీణ జనాభా పెరుగుదల ధోరణులు వివరించండి?

జ. గ్రామీణ జనాభా పరిమాణం మరియు పెరుగుదల ధోరణుల రాష్ట్రాల వారీగా గ్రామీణ జనాభా వివరాలు వ్రాయండి.

**(బి) సంక్షిప్త వ్యాసరూప ప్రశ్నలు**

1. జనాభా పరిణామ సిద్ధాంతాన్ని వివరించుము?

జ. జనాభా పరిణామ సిద్ధాంతము

2. గ్రామీణ జనాభా లక్షణాలను వివరించుము?

జ. గ్రామీణ జనాభా Profile ను గూర్చి వ్రాయుము

**(సి) సంక్షిప్త ప్రశ్నలు**

1. గ్రామీణ జనాభా యొక్క వయస్సు వారి విభజన?

జ. గ్రామీణ జనాభా యొక్క వయస్సు వారి విభజన

2. గ్రామీణ జనాభా స్త్రీ - పురుష నిష్పత్తి?

జ. గ్రామీణ జనాభా యొక్క స్త్రీ - పురుష జనాభా విభజన

## 4.12 చదువదగిన గ్రంథాలు :-


1. Indian Economy - Datt & Sundaram
2. Rural Development - Vasanth Desai
3. అభివృద్ధి అర్థశాస్త్రం , భారతదేశ ఆర్థికవ్యవస్థ - సమస్యలు - తెలుగు అకాడమీ


**శ్రీమతి యన్. ధనేశ్వరి**

పాఠం - 5

# గ్రామీణ జనాభా పెరుగుదల సమస్యలు - పరిష్కార మార్గాలు - కుటుంబ సంక్షేమ పథకాలు - గ్రామాలలో ఆరోగ్య పరిరక్షణ - పౌష్టికాహారం

## 5.0 లక్ష్యం :-

భారతదేశము ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు కారణం అధిక జనాభా మరియు దాని పెరుగుదల రేటు. అతి శీఘ్రంగా పెరిగే జనాభా ఆర్థికాభివృద్ధికి ఆటంకం. ఇది అనేక సమస్యలను సృష్టించును. ఈ జనాభా పెరుగుదల సమస్యను పరిష్కరించుటకు భారతదేశంలో వివిధ కుటుంబ నియంత్రణ - సంక్షేమ పథకాలు అమలుపరచబడినవి. ఈ భాగం పూర్తయ్యేసరికి మీరు ఈ క్రింది పాఠ్యాంశాలను అవగాహన చేసుకొందురు.

* గ్రామీణ జనాభా పెరుగుదల వల్ల ఏర్పడే సమస్యలు
* కుటుంబ నియంత్రణ - సంక్షేమ పథకాలు
* గ్రామాలలో ఆరోగ్య పరిరక్షణ
* గ్రామీణ ప్రజల కోసం ఏర్పాటు చేయబడ్డ ఆరోగ్య, వైద్య సౌకర్యాల వ్యవస్థ
* పౌష్టికాహారం

**విషయసూచిక :-**


**5.1 విషయ పరిచయము**

**5.2 గ్రామీణ జనాభా పెరుగుదల వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలు**

**5.3 జనాభా నియంత్రణ - చర్యలు**

**5.4 కుటుంబ నియంత్రణ - కుటుంబ సంక్షేమ పథకాలు - కార్యక్రమాలు**

**5.5 నూతన జాతీయ జనాభా విధానము - 2000**

**5.6 గ్రామాలలో ఆరోగ్య పరిరక్షణ - అర్థం**

**5.7 గ్రామాలలో ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్య, వైద్య సౌకర్యాలు**

**5.8 పౌష్టికాహారం - అర్థం**

**5.9 పౌష్టికాహారం వివరములు - మన దేశంలో పోషకాహార పరిస్థితి**

**5.10 గ్రామాలలో పిల్లల ఆరోగ్యము - పోషకాహార సమస్యలు / ప్రభుత్వం చేపట్టిన చర్యలు**

**5.11 గ్రామీణ స్త్రీ జనాభా విషయంలో ఆరోగ్య సమస్యలు - పోషకాహార లోపం సమస్యలు / నివారణకై ప్రభుత్వం తీసుకున్న చర్యలు**

**5.12 సారాంశము**

**5.13 గుర్తుంచుకోవలసిన విషయాలు**

**5.14 కఠిన పదాలు**

5.15 నమూనా ప్రశ్నలు

5.16 చదువదగిన గ్రంథాలు

## 5.1 విషయ పరిచయము :-

ఒక దేశంలోని భౌతిక వనరులను, శ్రమశక్తి ద్వారా ఉపయోగించుట వలన అభివృద్ధి ప్రక్రియ కొనసాగుతుంది. ఏ దేశంలో జనాభా మితిమీరి పెరుగుతుందో అక్కడ అనేక ఆర్థిక, సాంఘీక, నైతిక సమస్యలు ఏర్పడతాయి. భారత ప్రభుత్వం అధిక జనాభా వల్ల ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుటకు, జనాభా నియంత్రణకు కుటుంబ నియంత్రణ పథకాలను అమలు చేసింది. అందుకోసం గ్రామస్థాయిలో కుటుంబ నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేసింది. భారతీయ గ్రామాలలో ప్రజలు అనేక రుగ్మతలతో బాధపడుతుంటారు. పేదరికమే దీనికి కారణం. నిరక్షరాస్యత వలన అజ్ఞానం పారిశుద్ధ్యం గురించి తెలియకపోవుట వలన అనేక రోగాలు కలుగుతుంటాయి. గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి వైద్య, ఆరోగ్య సౌకర్యాల వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసి అనేక కార్యక్రమాలు చేపట్టింది. పౌష్టికాహారం లోపమే అనారోగ్యానికి కారణం. పౌష్టికాహారం దాని వివరాలు గూర్చి వివరించడమైనది.

## 5.2 గ్రామీణ జనాభా పెరుగుదల వల్ల ఏర్పడే సమస్యలు :-

పేద దేశాల ఆర్థికాభివృద్ధి పై జనాభా పెరుగుదల పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి. భారతదేశ గ్రామాలలో శీఘ్రంగా పెరుగుతున్న జనాభా వల్ల అనేకమైన (ఎ) ఆర్థిక, (బి) సాంఘిక, (సి) నైతిక సమస్యలు ఏర్పడుతుంటాయి.

1. **అల్ప తలసరి ఆదాయం :-** జాతీయాదాయంలో పెరుగుదల కన్నా జనాభాలో పెరుగుదల హెచ్చుగా ఉన్న తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలు పడిపోతాయి. మన దేశంలో 1980 - 81 మరియు 2000 - 01 సంవత్సరాలలో సగటు నికర జాతీయ ఉత్పత్తి పెరుగుదల శాతం 5.4 అయితే తలసరి ఆదాయంలో పెరుగుదల 3.4 శాతం మాత్రమే. అంటే తలసరి ఆదాయం పెరుగుదలకు వేగంగా పెరిగే జనాభా అవరోధం.

2. **ఆహార సమస్య :-** పెరుగుతున్న జనాభా తలసరి సేద్యపు భూమిని తగ్గిస్తుంది. ఫలితంగా కమతాల పరిమాణం తగ్గి ఉత్పాదకత, ఉత్పత్తి తగ్గుతాయి. అందువల్ల అహార సమస్య ఏర్పడుతుంది.

3. **నిరుద్యోగిత :-** విపరీతంగా పెరిగే జనాభా నిరుద్యోగితను అల్ప ఉద్యోగితను సృష్టిస్తుంది. వ్యవసాయ రంగం పై జనాభా ఒత్తిడులు పెరుగుతాయి.

4. **అనుత్పాదక వినియోగదారుల పెరుగుదల :-** ఉత్పత్తి కార్యకలాపాలలో పాల్గొనని వారిని అనుత్పాదక వినియోగదారులు అంటారు. ఉదా॥ పిల్లలు, వృద్ధులు,ఇతరత్రా పని చేయనివారు. జనాభా పెరగడం వల్ల మన దేశంలో అనుత్పాదక వినియోగదారులు 68.8%నికి పెరిగారు (2001 నాటికి).

5. **విద్య - వైద్యం, గృహ వ్యయాల పెరుగుదల :-** జనాభా పెరుగుదల వల్ల కుటుంబంలోనూ, దేశంలోనూ పిల్లల సంఖ్య పెరుగుతుంది. విద్య, ప్రజారోగ్యం పై ప్రభుత్వపు వ్యయం పెరుగుతుంది. అదనపు జనాభాకు అదనంగా గృహ సౌకర్యాలు అవసరం కనుక గృహ వ్యయం పెరుగుతుంది.

6. **మూలధన కల్పన :-** జనాభా పెరుగుతూ ఉంటే మూలధన కల్పన, పొదుపు జరగదు. జనాభా పెరుగుదల వలన తలసరి ఆదాయం, పొదుపు పెట్టుబడి మూలధన కల్పన అన్నీ తగ్గుతుంటాయి.

7. **అశాంతి, ఆందోళన :-** జనాభా పెరుగుదలతో ప్రతి విషయం సమస్యగా తయారై ప్రజలలోనూ, సంఘాలలోనూ అశాంతి, ఆందోళన పెరుగుతుంటాయి. అల్ప మానవ - భూమి నిష్పత్తి, వాతావరణ కాలుష్యం, పర్యావరణ క్షీణత మొదలైనవన్నీ జనాభా పెరుగుదల వలన ఏర్పడే దుష్ఫలితాలు.

8. సాంప్రదాయాలకు, కళలకు పుట్టినిల్లైన గ్రామాలలో జనాభా వలస పోవటంతోఅవి అంతరించిపోతాయి.

## 5.3 జనాభా నియంత్రణ చర్యలు :-

జనాభా పెరుగుదల మన దేశంలో అధికంగా ఉంది. ఈ అధిక జనాభా పెరుగుదల ఆర్థికాభివృద్ధికి ఆటంకంగా ఉంది. దీనిని అరికట్టవలసిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించి జనాభా ప్రణాళికను ఆర్థిక ప్రణాళికలో ఒక అంతర్భాగంగా చేసింది. జనాభా నియంత్రణకు దిగువ చర్యలు అవసరం.

(ఎ) ఆర్థికపరమైన చర్యలు

(బి) సాంఘీక చర్యలు

(సి) జనాభా శక్తి సామర్థ్యాలు, ఉత్పత్తి మరియు జీవన ప్రమాణములను పెంచు చర్యలు

### (ఎ) ఆర్థికపరమైన చర్యలు :-

1. **పారిశ్రామిక రంగమును విస్తరించుట :-** సాధారణంగా పరిశ్రమలలో పని చేసే శ్రామికులు తమ కుటుంబాలను పరిమితం చేసుకుంటారు. అందువల్ల పారిశ్రామిక రంగమును విస్తరించి గ్రామీణ పరిశ్రమలను అభివృద్ధిపరచి ప్రజల వృత్తి స్వరూపంలో మార్పు తెచ్చినచో జననాల రేటు తగ్గిపోవును.

2. **సాంఘిక చర్యలు :-** ప్రభుత్వం పట్టణీకరణను ప్రోత్సహించి పట్టణాలలో ఉద్యోగ అవకాశాలను పెంచితే శ్రామికులు గ్రామాల నుండి పట్టణాలకు తరలిపోతారు. పట్టణ జనాభా పరిమిత కుటుంబాన్ని కోరుకుంటారు. కనుక జననాల రేటు తగ్గును.

3. **ఆదాయ పంపిణీలో అసమానతలు తగ్గించుట - పేదరిక నిర్మూలన :-** పేదవారికి కుటుంబ నియంత్రణ లాభసాటిగా ఉండదు. పేదవారి ఆదాయములను పెంచి సముచిత జీవన ప్రమాణమును కల్పించినచో పరిమిత కుటుంబ అవసరాన్ని గుర్తిస్తారు.

### (బి) సాంఘీకపరమైన చర్యలు :-

1. **విద్యా సదుపాయాల కల్పన :-** విద్య మానవుని దృక్పథంలో మౌళిక మార్పులను తెచ్చును. ప్రజలలో అక్షరాస్యుల శాతం పెరుగుతున్న కొలది కుటుంబ నియంత్రణను పాటించుటకు సంసిద్ధులగుదురు.

2. **స్త్రీల స్థితిగతులలో మార్పు తెచ్చుట :-** స్త్రీలలో అక్షరాస్యత పెంచవలెను. అభ్యుదయ భావాలు కలిగిన స్త్రీలు కుటుంబ నియంత్రణకు సుముఖంగా ఉంటారు.

3. **వివాహ వయోపరిమితిని పెంచవలెను :-** శ్రీలంక, మలేషియాలలో వివాహ వయస్సును పెంచటం వల్ల జననాల రేటు గణనీయంగా తగ్గినది. మన దేశంలో కూడా అమలులో ఉన్న ఈ కనీస వివాహ వయస్సు చట్టాన్ని పటిష్టంగా అమలుపరచవలెను. 7.9.2004 నుండి వివాహ వయస్సును 21 సం॥లుగా నిర్ణయిస్తూ లోక్‌సభ ఒక స్పెషల్ మ్యారేజ్ బిల్లుకు ఒక సవరణను ప్రవేశ పెట్టింది.

4. **కుటుంబ నియంత్రణ పథకము :-** జననాల రేటు తగ్గించుటకై ప్రభుత్వం కుటుంబ నియంత్రణ పథకమును ప్రధాన కార్యక్రమంగా చేపట్టి ప్రచారం చేస్తున్నది. వేసక్టమీ, ట్యూబెక్టమీ ఆపరేషన్లకు లూపు, కాపర్ - టి మొ॥ అంశాలకు కుటుంబ నియంత్రణ కార్యక్రమాలలో ప్రముఖ స్థానం ఇవ్వబడినది. 1975 నుండి 'లూప్'లను సరఫరా చేసే కార్యక్రమం ప్రారంభమయింది. 1978లో గర్భస్రావమును చట్టబద్ధము చేసినది. ప్రజలు ఇప్పుడు ఈ కార్యక్రమము పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

(సి) **జనాభా శక్తి సామర్థ్యాలు, ఉత్పత్తి, జీవన ప్రమాణమును పెంచు చర్యలు :-** జనాభా శక్తి, సామర్థ్యాలను పెంచి శ్రామిక ఉత్పాదకతను పెంచుటకు చర్యలు తీసుకున్నచో ప్రజల ఆదాయము, వారి జీవన ప్రమాణము పెరుగును. భారత ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించి వ్యవసాయ రంగంలో హరిత విప్లవాన్ని ప్రవేశ పెట్టుట వల్ల ఉత్పత్తులు గణనీయంగా పెరిగినాయి. అదే విధంగా దేశ పారిశ్రామికీకరణకు ప్రభుత్వం విశేషంగా కృషి చేయుచున్నది.

## 5.4 కుటుంబ నియంత్రణ / కుటుంబ సంక్షేమ పథకాలు :-

భారతదేశం వంటి పలు దేశాలు ఎదుర్కొంటున్న అనేక ముఖ్య సమస్యలకు కారణం విపరీతమయిన జనాభా పెరుగుదల. జనాభా పెరుగుదలను అదుపు చేయనిచో నిరుద్యోగం, పేదరిక నిర్మూలన, కలలుగానే మిగులుతాయి. ఆధునిక కాలంలో జనాభా పెరుగుదలను అదుపు చేయుటకు కుటుంబ నియంత్రణ ఉత్తమ సాధనం. జాతీయ స్థాయిలో కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను అమలుచేసిన మొదటి దేశం భారతదేశమే. భారత ప్రణాళికా సంఘం కుటుంబ నియంత్రణను జాతీయ స్థాయిలో ఒక ఉద్యమంగా అమలు చేయాలని ప్రభుత్వానికి సూచించింది. ప్రణాళికలు ప్రారంభమయిన మొదటి పది సంవత్సరాలలో కేవలం "క్లినికల్" ప్రాతిపదికగానే కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు రూపొందించబడ్డాయి.

మూడవ పంచవర్ష ప్రణాళికలో క్లినికల్ అప్రోచ్‌కు బదులు "ఎక్స్‌టెన్షన్ అప్రోచ్" ప్రాతిపదిక పై కార్యక్రమాలు రూపొందించబడ్డాయి. 1976లో కాంప్ అప్రోచ్ అనంతరం cafetaria అప్రోచ్‌ని అవలంభించారు. కార్యకర్తల ద్వారా గర్భ నిరోధక సాధనములు సంతాన ఉత్పత్తికి అవకాశం ఉన్న దంపతులకు విస్తారంగా సరఫరా చేయబడినవి. ఈ పథకాలను గూర్చి ప్రచారం ఉధృతం చేయబడినది. 4వ ప్రణాళికలో జననాల రేటును 1000కి 39 నుండి 25కు తగ్గించవలెననే లక్ష్యంతో కుటుంబ నియంత్రణకు ఎంతో ప్రాధాన్యతనిచ్చారు. 6వ ప్రణాళికా కాలంలో కుటుంబ నియంత్రణ ప్రజల పథకం అనే భావనను ప్రజలలో కల్పించుటకు అనేక ప్రయత్నాలు జరిగినవి. 7వ ప్రణాళికలో కూడా జనాభాను గురించి సాహసోపేతమయిన లక్ష్యములు నిర్ణయించబడినవి. 1996 నాటికి జననాల రేటు 1000కి 21కి తగ్గించాలని లక్ష్యంగా నిర్ణయించారు.

**వివిధ ప్రణాళికా కాలంలో కుటుంబ నియంత్రణకు కేటాయింపులు**

| ప్రణాళిక | కుటుంబ నియంత్రణకు కేటాయింపులు (కోట్లలో) రూ॥ |
|---|---|
| మొదటి ప్రణాళిక | 0.65 |
| రెండవ ప్రణాళిక | 5.00 |
| మూడవ ప్రణాళిక | 25.00 |
| నాల్గవ ప్రణాళిక | 217.00 |
| ఐదవ ప్రణాళిక | 409.00 |
| ఆరవ ప్రణాళిక | 1,078.00 |
| ఏడవ ప్రణాళిక | 3,256.00 |
| ఎనిమిదవ ప్రణాళిక | 6,500.00 |

**భారతదేశంలో కుటుంబ నియంత్రణా పథకాల లక్షణాలు :-**

1. కుటుంబ నియంత్రణ గూర్చి ప్రచారం
2. గ్రామీణ మరియు పట్టణ జనాభాకు గర్భనిరోధక సాధనములను సరఫరా చేయుట
3. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్న వారికి నగదు రూపేణా బహుమతి ప్రధానము
4. కుటుంబ నియంత్రణ కేంద్రములు నెలకొల్పుట

**భారతదేశంలో కుటుంబ నియంత్రణా పథకాల లక్ష్యాలు :-**

1. ఇద్దరు పిల్లలు మాత్రమే అనే పరిమిత కుటుంబాల భావనను ప్రచారం చేయటం, అందరు దంపతులు అనుసరించేటట్లు చేయడం.
2. గర్భ నిరోధక సాధనాలకు డిమాండును పెంచి దంపతుల రక్షణ రేటును 42%నికి పెంచాలి.
3. జనాభా నియంత్రణకు సంబంధించిన అవస్థాపనను, సేవలను మెరుగుపరుచుట.
4. అన్ని పథకాలను అన్ని స్థాయిలలో సక్రమంగా నిర్వహించాలి.
5. కుటుంబ నియంత్రణకు స్త్రీలు తమంతట తామే ముందుకు వచ్చేంతగా ప్రచార సాధనాల ద్వారా వారికి మనో వికాసాన్ని కలిగించాలి.

**కుటుంబ సంక్షేమ శాఖ అందించే సేవలు :-**

1. గర్భనిరోధక సాధనాల పంపిణీ
2. మాతా - శిశు ఆరోగ్య సేవలను అందించటం
3. కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు విజయవంతం అగుటకు తగిన ప్రేరణ కల్పించటం
4. కుటుంబ నియంత్రణ పద్ధతులను గురించి పరిశోధన జరిపి మెరుగైన వానిని కనుగొనాలి. వానిని గురించి డాక్టర్లకు ఇతర సిబ్బందికి ట్రైనింగ్ ఇవ్వాలి. ఇందుకొరకు తగిన సంస్థలను నెలకొల్పాలి.

**విమర్శలు :-**

కుటుంబ సంక్షేమ కార్యక్రమాల పై అనేక విమర్శలు వచ్చాయి. అవి -

1. దంపతుల ఎంపికలో లోపాలు
2. ప్రేరణ లోపం
3. లోపభూయిష్టంగా సంఖ్యాగత లక్ష్యాల నిర్ణయం
4. అధికారుల నిర్లక్ష్యం
5. గర్భనిరోధక సాధనాల గూర్చి స్త్రీలలో ఉండే భయాలు
6. దూరాభారం

ఈ లోపాలను సవరించే అనేక చర్యలను గైకొంది ప్రభుత్వం. వీటిని సమగ్ర గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలతో పాటుగా కుటుంబ సంక్షేమ పథకాలను అమలు చేయడం మంచి విధానం.

## 5.5 నూతన జాతీయ జనాభా విధానము - 2000 :-

భారతదేశంలో ఇద్దరు పిల్లల విధానాన్ని మరింత మెరుగుగా అవలంభించేందుకు, 2046 నాటికి జనాభాను స్థిరీకరించే ఉద్దేశ్యంతో N.D.A. ప్రభుత్వం జాతీయ జనాభా విధానాన్ని 2000లో ప్రకటించినది. దీనిలోని ముఖ్యాంశాలు -

2046 నాటికి స్థిర జనాభాను సాధించేందుకు క్రింద పేర్కొన్న చర్యలు తీసుకోవాలని, ఈ జనాభా విధానం పేర్కొన్నది.

1. బాల్య మరణాల రేటును 1000 కి 30 కంటే తగ్గించుట
2. ప్రసూతి మరణాల రేటును 1 లక్ష మందికి 100 కంటే తగ్గించుట
3. అందరికి వ్యాధి నిరోధక టీకాలు వేయటం
4. మొత్తం ప్రసవాలలో 80% ఆసుపత్రులలో జరిగేటట్లు చూడటం
5. అందరికి ఎయిడ్స్ వ్యాధికి సంబంధించిన సమాచారం అందటం, అంటువ్యాధులను నిరోధిస్తూ నియంత్రించటం.
6. ఇద్దరు పిల్లల నియమాన్ని పాటించే వారికి ప్రోత్సాహకాలు ఇవ్వటం
7. గర్భస్రావాలు క్షేమంగా జరిగేటట్లు చూడటం
8. బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని, గర్భస్థ శిశు లింగ నిర్ధారణకు సంబంధించిన చట్టాన్ని ఖచ్చితంగా అమలు జరిగేటట్లు చూడటం
9. స్త్రీ, పురుషులకు వివాహ వయస్సును పెంచటం
10. దారిద్ర్య రేఖ దిగువన ఉండి, ఇద్దరు పిల్లల తరువాత కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి ఆరోగ్య భీమాను కల్పించటం. ఈ లక్ష్యాల ప్రాతిపదికగా రాబోయే 10 సం॥కు ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించటం జరిగినది. ఈ కార్యాచరణ ప్రణాళిక క్రింద అంశాలను కలిగి ఉంటుంది. అవి -
    (ఎ) ప్రాథమిక విద్యను ఉచితంగా, నిర్భందంగా అందించటం
    (బి) జనన మరణాల నమోదు వలె వివాహాలను, గర్భాలను విధిగా నమోదు చేసేలా చూడటం
    (సి) భారత ప్రభుత్వం 2046 నాటికి జనాభా స్థిరత్వాన్ని సాధిస్తుందని ఆశించటం జరిగింది. అందుకోసం అందరికి సరిపడ గర్భనిరోధక సాధనాలను అందించేందుకు అవస్థాపనా సదుపాయాలు కల్పించేందుకు అదనంగా 3 కోట్లు అవసరం.

## 5.6 గ్రామాలలో ఆరోగ్య పరిరక్షణ - అర్థము :-

ప్రపంచ ఆరోగ్య సంస్థ "ఆరోగ్యం అంటే కేవలం మానవుని రోగరహిత స్థితియే కాక, పూర్తి శారీరక, మానసిక, సాంఘిక పుష్టి అని నిర్వచించినది." వైద్యం, ఆరోగ్య సౌకర్యాలు, పోషకాహారం, విద్య, గృహవసతి, పర్యావరణం, సాంఘిక, సామాజిక సేవల పై ప్రభుత్వ వ్యయం ఆరోగ్యాన్ని నిర్ణయించే అంశాలుగా చెప్పవచ్చు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడి అక్షరాల నిజం. దేశ వ్యాప్తంగా ప్రజలు ఆరోగ్యంగా ఉంటే ఆర్థికాభివృద్ధి త్వరితగతిన జరుగుతుంది. గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిస్థితులను మెరుగుపరుచుటకై ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరోగ్యసదుపాయాలు, వైద్య సంస్థల ధ్యేయం ఆరోగ్య పరిరక్షణ. విద్యా మరియు

వైద్యం మానవ మూలధనంలో అంతర్భాగము. మన దేశ జనాభాలో హెచ్చు శాతం గ్రామీణులు కనుక గ్రామీణ ఆరోగ్యం ప్రాముఖ్యతను సంతరించుకున్నది. గ్రామాలో వైద్య సేవలను అందించుటకు ఏర్పాటు చేసిన వివిధ వైద్య సౌకర్యాల కల్పననే గ్రామీణ ఆరోగ్య పరిరక్షణా చర్యలుగా చెప్పవచ్చు.

## 5.7 గ్రామాలలో ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్య - వైద్య సదుపాయాలు :-

ఎక్కడైనా ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే శక్తి సామర్థ్యాలతో పని చేయగలరు. ఎక్కువ ఉత్పత్తిని చేయగలరు. తీగ చక్కగా పూలు పూస్తున్నదంటే అది ఆరోగ్యంగా ఉన్నదని అర్థం. అదే విధంగా మానవ శరీరం ఆరోగ్యంగా ఉంటేనే సక్రమంగా తన విధులను నిర్వర్తిస్తూ అభివృద్ధికి తోడ్పడగలదు. మన దేశంలో అధిక సంఖ్యాకులు గ్రామాలలో జీవిస్తుండటం వలన గ్రామీణ ప్రజల ఆరోగ్యాభివృద్ధిని సాధించాలి. ఆర్థికాభివృద్ధి, ఆరోగ్యాభివృద్ధి పరస్పర పూరకాలు అని గుర్తించాలి. పంచవర్ష ప్రణాళికలను ప్రారంభించినాక గ్రామీణ ప్రజల ఆరోగ్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకమయిన కృషి ప్రారంభించింది. అందులో భాగమే గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వైద్య, ఆరోగ్యాల వ్యవస్థ.

**1. భారత గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ :-** ఇది ఇంచుమించుగా అన్ని రాష్ట్రాలలో ఒకేలా ఉంది.

1. CHV **లేదా** HG (Community Health Volenteer or Health Guide) :- 1000 మంది జనాభా కలిగిన ప్రతి గ్రామానికి ఒక సమాజ ఆరోగ్య స్వచ్ఛంద సేవకుడు (CHV) లేదా ఒక ఆరోగ్య మార్గదర్శి (HV) ఉంటారు. వీరు వైద్య సంస్థలకు, ప్రజలకు మధ్య లింకుగా ఉంటారు. రోగ నిరోధక మరియు రోగ నివారణా చర్యలలో వైద్య అధికారులకు సహాయం చేస్తుంటాడు.

**2.** MPW Sub - Center (Multi Purpose Worker) :- 3000 - 5000 వరకు జనాభా గల గ్రామాలలో ప్రదేశాన్ని, వెనుకబడినతనాన్ని బట్టి ఒక sub - center ను వైద్యం కోసం ఏర్పాటు చేశారు. అక్కడ ఒక పురుష MPW, ఒక స్త్రీ MPW నియమింపబడ్డారు. వారు జబ్బులను నయం చేయటమే కాక ముందు జాగ్రత్త చర్యలు కూడా తీసుకుంటారు. అంటురోగాలను వ్యాప్తి చెందకుండా కంట్రోల్ చేస్తారు. మాతా శిశు ఆరోగ్యాలను, కుటుంబ సంక్షేమాన్ని కాపాడుతుంటారు.

**3.** HA (Health Assistant) :- నాలుగు sub - centers కు కలిపి పర్యవేక్షణ చేస్తూ మద్దతునిచ్చే ఒక మగ HA ను, ఒక ఆడ HA ను నియమించారు. 5వ ప్రణాళిక నుండి 4 sub - center లలో ఒక దానికి S.H.C. అని పేరు పెట్టి (Subsidiary Health Center) అక్కడ ఎక్కువ సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

**4.** PHC (Primary Health Center) :- గ్రామ సీమలలో ఆరోగ్య పరిరక్షణా బాధ్యతలను చేపట్టే అన్ని సంస్థలలో P.H.C. ప్రధానమయినది. ఒక్కొక్క P.H.C. 20,000 - 30,000 జనాభాకు ఆరోగ్య వైద్య సేవలను అందిస్తుంది. ఒక్కొక్క P.H.C. లో ఇద్దరు లేక ముగ్గురు Medical Officers ఉంటారు. వారిలో ఒకరు లేడీ డాక్టర్ అయి ఉండాలి. దేశీయ వైద్య విధానంలో నిపుణుడైన మరొక మెడికల్ ఆఫీసరు కూడా ఉంటారు. వీరు కాక ఒక మగ H.A., ఒక ఆడ H.A., ఒక B.E.E. (Block Extension Educator), ఒక Clinical Laboratory మరియు ఒక గణాంకాల అసిస్టెంట్ కూడా ఉంటారు. ప్రతి P.H.C. కు కేటాయించిన M.P.W. లు, ఇతర సిబ్బంది కూడా ఉంటారు.

**5.** C.H.C. (Community Health Center) :- ప్రతి లక్ష మంది జనాభాకు 30 పడకలు, X - Ray unit, క్లినికల్ లాబ్‌లతో C.H.C. ఏర్పాటు చేశారు. C.H.C. ప్రత్యేకమయిన వైద్య సేవలను అందిస్తుంది. గైనకాలజి నిపుణులు, సర్జన్లు వారికి తోడ్పడే సిబ్బంది కూడా ఉంటారు.

**6.** S.D.H.C. (Sub Divisional Health Center) **:-** ప్రతి 5 లక్షల జనాభాకు ఒక SDHC ఉంటుంది. ఇందులో అంటురోగాల వ్యాప్తిని అరికట్టే విభాగం ఉంటుంది.

**7. ఇతరములు :-** ప్రతి జిల్లాలో అన్ని ఇతర ఆరోగ్య వైద్య సంస్థలు, ఏజన్సీల మీద అజమాయిషీ చేసేందుకు సుమారు 10 నుండి 30 లక్షల మంది కోసం Apex సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

2. **భారత ఆరోగ్య కార్యక్రమాలు :-** ఆరోగ్య శాఖ చేపట్టిన కార్యక్రమాలు 3 విధాలుగా ఉంటాయి. అవి -

1. సాధారణ సేవలు, 2. మాతా - శిశు ఆరోగ్య సేవలు, 3. జాతీయ ఆరోగ్య పథకాలు.

**1. సాధారణ సేవలు :-** గ్రామాలలో ఉచితంగా ప్రాథమిక ఆరోగ్య సదుపాయాలను కల్పించేందుకు సుమారు 20,000 P.H.C. లు, 12,500 Sub Centers, 1700ల C.H.C. లు నెలకొల్పబడ్డాయి.

**2. మాతా - శిశు ఆరోగ్య సేవలు :-** ప్రస్తుతం ఉన్న ఆరోగ్య అవస్థాపనా సౌకర్యాలతోనే మాతా - శిశు ఆరోగ్య సేవలను కూడా అందిస్తున్నారు. రక్తహీనత, అంధత్వం, అతిసార వ్యాధి మొ॥ వానిని నయం చేస్తున్నారు. పౌష్టికాహారం గూర్చి సలహాలను ఇస్తున్నారు. పిల్లలలో వ్యాధి నిరోధక శక్తిని పెంచేందుకు E.P.I. (Expanded Programme of Immunisation) పథకాన్ని 1975లో ఆరంభించారు. దీనిని మరింతగా విస్తరింపజేయాలని, 1985 - 86లో U.I.P. (Universal Immunaisation Programme) ను ప్రభుత్వం ఆరంభించింది. దీని క్రింద గర్భిణీ స్త్రీలను 100%, 85% పిల్లలను కవర్ చేయాలనుకున్నారు. ఈ పథకం క్రింద కోరింత దగ్గుకు టీకాలు, టెటనస్, క్షయ, స్ఫోటకమునకు ఇంజక్షన్లు మందులు ప్రత్యేకంగా ఇస్తారు.

**3. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు :-** మన దేశంలో ప్రజలను పీడిస్తున్న వ్యాధులలో 2/3 వంతులు అంటువ్యాధులే. ప్రధానమయిన వ్యాధులను నివారించి మరణాల రేటును తగ్గించుట, అవయవాలు చచ్చుబడుటను తగ్గించుట ప్రధాన ధ్యేయాలుగా జాతీయ స్థాయిలో ఆరోగ్య కార్యక్రమాలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలలో ప్రధానమయినవి -

(ఎ) మలేరియా నిర్మూలన కార్యక్రమము

(బి) కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమము

(సి) క్షయ వ్యాధి నివారణ కార్యక్రమము

(డి) అంధత్వ నివారణ కార్యక్రమము మొ॥ వానిని చేపట్టింది.

P.H.C. ల ద్వారా క్షయ రోగ పీడితులను గుర్తించి, ప్రభుత్వ ఆసుపత్రులలో వారికి ఉచిత వైద్య సదుపాయాలు అందిస్తున్నారు. శుక్లాల ఆపరేషన్ కార్యక్రమాన్ని, పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నది.

**లోపాలు :-**

1. చాలా కేంద్రాలలో P.H.C. లలో సిబ్బంది, మందుల కొరత ఒక ప్రధానమయిన సమస్య.

2. ప్రసూతి మరియు ఆపరేషన్ వసతులు లోపించుట.

3. మాతా - శిశు సంక్షేమం, కుటుంబ సంక్షేమం సేవలు అసంతృప్తిగా ఉండుట.

4. P.H.C. Doctors ప్రైవేటు ప్రాక్టీసుకు ప్రాధాన్యతను ఇచ్చుట.

5. వెనుకబడిన ప్రాంతాలలో ప్రజలకు డాక్టర్లు అందుబాటులో లేకుండుట, డాక్టర్లు ఆయా ప్రాంతాలకు వచ్చుటకు ఇష్టపడకుండుట.

## 5.8 పౌష్టికాహారం - అర్థం :-

"తీగ చక్కగా పూలు పూస్తున్నదంటే ఆరోగ్యంగా ఎదుగుతున్నదని" అర్థం మానవ శరీరం కూడా అలాంటిదే. శరీరం ఖలు ధర్మసాధనం. సరీరం తన విధులన్నింటిని సక్రమంగా నిర్వర్తించుటకు దోహదపడేదే పోషకాహారం. మానవుని శరీర పెరుగుదలకు, అభివృద్ధికి, మంచి ఆరోగ్యానికి దోహదపడేదే పౌష్టికాహారం. మానవ ఆరోగ్యానికి అవసరం అయిన పరిమాణంలో కావలసిన ధాన్యాలు, ఆహారేతర పదార్థాలను కలిపి, పౌష్టికాహారంగా చెప్పవచ్చు. ఒక దేశ ప్రజల యొక్క ఆరోగ్య స్థాయి వారు తీసుకునే ఆహారం యొక్క కాలరీల శక్తి పై ఆధారపడి ఉంటుంది. పౌష్టికాహారం తీసుకునే ప్రజల ఆరోగ్యస్థితి బాగుంటుంది. అధిక ఉత్పాదక శక్తి అధిక ఆదాయానికి దారి తీసి దేశ పురోగతికి తోడ్పడుతుంది.

## 5.9 పోషకాహార వివరములు / మన దేశంలో పోషకాహార పరిస్థితి :-

మానవుని శారీరక పెరుగుదలకు అభివృద్ధికి, మంచి ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతో అవసరం. పౌష్టికాహారం తీసుకునే ప్రజల ఆరోగ్య స్థితి మెరుగ్గా ఉంటుంది. ప్రజల ఉత్పాదకత శక్తి పౌష్టికాహారం వల్ల పెరిగి దేశ పురోగతికి సహాయ పడుతుంది. మానవుల ఆహారపు అలవాట్లు వారు నివశించే ప్రాంతాన్ని బట్టి ఉంటాయి. ముఖ్యంగా మానవులను శాఖాహారులని, మాంసాహారులని రెండుగా విభజిస్తారు. మానవులు తీసుకునే ఆహారంలో అనేక పదార్థాలు ఉంటాయి. ఈ వైవిధ్యానికి ముఖ్య కారణం మన శరీరానికి కావలసిన పోషక పదార్థాలన్ని ఏ ఒక్కదాని నుండి లభించదు. మానవులు ప్రతి ఒక్క దాని నుండి వైవిధ్యం కోరుకుంటారు. అందుకే కూరలు, పండ్లు, గింజలు, ఆకులు మొ॥ ఆహారంలో భాగంగా ఉంటాయి.

మనం తీసుకునే ఆహారంలో ఉండవలసిన వానిని 6 రకాలుగా విభజించారు.

| | | | |
|---|---|---|---|
| 1. | కార్బోహైడ్రేడ్స్ | - | (పిండి పదార్థం) |
| 2. | క్రొవ్వు పదార్థాలు | - | నెయ్యి, నూనెలు |
| 3. | ప్రొటీన్లు | - | మాంసం, పప్పు దినుసులు |
| 4. | ఖనిజాలు | - | ఆకుకూరలు (ముఖ్యంగా గోంగూరలో ఈ విటమిన్లు (A, B, C, D, E, K) వివిధ రకాల కూరగాయలు, పండ్లు, దంపుడు బియ్యం మొ॥) |
| 5. | నీరు | - | దేహదారుడ్యానికి ప్రొటీనులు ఎక్కువగా ఉండే ఆహారం ఎక్కువగా తీసుకోవాలి. |

ఈ విషయంలో భారతదేశం వెనుకబడి ఉంది. అభివృద్ధి చెందిన దేశాలలో ప్రొటీనుల వినియోగం America లో 99 గ్రా॥లు, ఆస్ట్రేలియాలో 106 గ్రా॥ కాగా మన దేశంలో 49 గ్రాములే. సంపూర్ణ ఆహారమైన పాల విషయానికి వస్తే అమెరికాలో తలసరి పాల వినియోగం 609 గ్రా॥ కాగా మన దేశంలో 116 గ్రా॥లు. మాంసం లభ్యత అమెరికాలో 310 గ్రాములు కాగా, మన దేశంలో 04 గ్రాములు. మొత్తం మీద భారతీయులకు ఆహారం ద్వారా లభ్యం కావలసిన కాలరీలు 2200 - 2300 కాగా సగటున లభ్యత 1990 కేలరీలు మాత్రమే. సుమారుగా సంతులిత ఆహారం అంటే 2550 కేలరీలుగా చెప్పవచ్చు. భారతీయులు దుంపలు, క్రొవ్వు పదార్థాలు ఎక్కువగా తింటారు. ప్రొటీన్లు ఉన్న ఆహారం తీసుకోరు. భారతీయ సగటు మానవుడు తన దైనందిన ఆహారంలో సర్వదా కేలరీలు ప్రొటీనులు, విటమిన్లు, ముఖ్యంగా కాల్షియం సర్వదా లోపభూయిష్టంగా తీసుకుంటాడు.

పాఠశాల విద్యార్థులలో 42% తక్కువ కాలరీలు గల ఆహారంతో బ్రతుకుతున్నారు. పోషకాహార సమస్యే కాక, సంపూర్ణ ఆహార సమస్య కూడా. కరువు కంటే పౌష్టికాహారం కాని ఆహారం చేస్తున్న చెరుపు దృష్ట్యా దానిని కనిపించని శత్రువుగా గ్రహించవచ్చు. ఆధునిక యువ సమాజం ఎత్తు పెరగటంలో, బరువు, రొమ్ము చుట్టు కొలతలు దిగజారిపోతున్నట్లు తెలుస్తున్నది. దీనికి కారణం పౌష్టికాహార లోపమే. రక్షిత మంచినీటి సరఫరా 75% పరిశుభ్రత 55%, పెంచగలిగినట్లయితే గ్రామాలలో విష జ్వర రోగుల సంఖ్యను సగానికి తగ్గించవచ్చు.

**సంతులిత ఆహారంలోని ముఖ్యాంశాలు :-**

1. నీరు - నీరు ప్రాణాధారము. నీరే అన్ని రకాల పోషక పదార్థాలను శరీర అవయవాలకు చేరవేస్తుంది. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధం చేస్తుంది. వ్యర్థ పదార్థాలను బయటకు నెట్టి వేస్తుంది.
2. ధాన్యములు - బియ్యం, గోధుమలు, రాగులు, మొ॥ ఈ కోవకు చెందుతాయి. వీటిలో పిండి పదార్థాలు ఎక్కువ. 6% నుండి 12% ప్రొటీనులు కూడా ఉంటాయి.
3. పప్పు దినుసులు - మాంసకృత్తులు ఎక్కువ మరియు 'బి' విటమిను లభ్యత ఎక్కువ.
4. ఆకుకూరలు - కాల్షియం, 'సి' విటమిను మరియు ఫోలిక్ ఆమ్లము లభిస్తాయి.
5. దుంపలు - పిండి పదార్థం ఎక్కువ. క్యారెట్‌లో 'విటమిన్ - ఎ', బంగాళా దుంపలో 'సి' విటమిన్ లభిస్తుంది.
6. కూరగాయలు - వీనిలో విటమిన్లు, ఖనిజాలుంటాయి.
7. పండ్లు - సిట్రస్ ఫ్రూట్స్ నుండి విటమిన్ 'సి', డ్రై ఫ్రూట్స్ నుండి 'ఇనుము' లభిస్తుంది.
8. చేపలు - ప్రోటీన్లు, బి - విటమిన్, ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి.
9. గ్రుడ్లు - 'సి' విటమిన్ తప్ప మిగిలినవన్ని లభిస్తాయి.
10. మాంసం - ప్రొటీన్లు, బి12, హెచ్చు లివరులో విటమిన్ ఎ ఉంటుంది.
11. పాలు - విటమిన్ 'సి', ఐరన్ తప్ప మిగిలిన పోషక పదార్థాలు అన్నీ ఉన్నాయి. సంతులిత ఆహారాన్ని గ్రామీణ ప్రజలకు లభింపజేసిన వారి సామర్థ్యం పెరిగి గ్రామీణాభివృద్ధి సాధ్యపడుతుంది.

## 5.10 గ్రామాలలో పిల్లల ఆరోగ్యము - పోషక ఆహార సమస్యలు :-

గ్రామీణ పిల్లల అనారోగ్యానికి కారణం తల్లి మరియు పిల్లలకు పోషకాహార లోపం. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు సంతులిత ఆహారం లభించని యెడల పిల్లలకు పుట్టుకతోనే అనేక రోగాలు కలిగే అవకాశం ఉంది. దీనికి తోడు గ్రామీణ పేదరికము, అపరిశుభ్ర పరిసరాలు, పెంపక లోపాలు మరిన్ని సమస్యలను సృష్టిస్తాయి. ఈ సమస్యకు ముఖ్య పరిష్కారం తల్లి పాలు. తల్లి పాల ప్రాముఖ్యతను తెలిపేటందుకు UNESCO ప్రతి ఏటా ఆగష్టు మొదటి వారాన్ని తల్లి పాల వారోత్సవంగా ప్రకటించింది. 6 నెలల వరకు అమ్మపాలు చాలు అని చెప్తూ తల్లి పాల ప్రాముఖ్యతను గురించి వివరిస్తున్నది. గ్రామీణ స్త్రీలకు సంతులిత ఆహారాన్ని సమకూర్చగలిగితే శిశు మరణాల రేటును తగ్గించవచ్చు. పోషకాహార లోపం వల్ల శరీరం రోగ నిరోధక శక్తిని కోల్పోతుంది. విటమిన్ల లోపం అంగ వైకల్యానికి దారి తీస్తుంది.

1. **శిశువుల ఆరోగ్య సమస్యలు :-** శిశు మరణాలకు కారణాలు రెండు -

1. పోషకాహార లోపం, 2. దాని ఫలితంగా వచ్చే జబ్బులు మరియు రోగాలు.

**1. పోషకాహార లోపం :-** మన దేశంలో 90 శాతం పిల్లలు ప్రోటీన్ల కొరతతో బాధపడుతున్నారు. బడి పిల్లలలో ఉండవలసిన బరువులో 60 శాతం మాత్రమే ఉన్న పిల్లలను తీవ్ర పోషకాహార లోపం ఉన్న పిల్లలుగా పరిగణిస్తున్నారు. 1981 లెక్కల ప్రకారం ఇటువంటి వారు 80 శాతం ఉన్నారు. పోషకాహారం లోపించిన పిల్లలు, శారీరంగా, మానసికంగా పెరగరు. తరచుగా రోగాలకు గురి అవుతారు.

**(ఎ) విటమిన్ 'ఎ' లోపం :-** దీని వల్ల మన దేశంలో ఏటా 60 వేల మంది పిల్లలు అంధులగుచున్నారు. 2 - 15 శాతము మంది పిల్లలు రేచీకటి మొదలగు రోగాలకు గురి అగుచున్నారు. విటమిన్ 'ఎ' ఎక్కువగా ఉన్న పచ్చని పళ్ళు, ఆకుకూరలు, కేరట్, బొప్పాయి ఆహారంలో ఇచ్చి పిల్లలకు అంధత్వం రాకుండా కాపాడవచ్చు.

**(బి) రక్తహీనత (ఐరన్ లోపం) :-** ఇది పిల్లలను కనే వయస్సులో ఉన్న తల్లులకు, వారి నుండి పిల్లలకు సంక్రమిస్తుంది. హిమోగ్లోబిన్ శాతము 10 కన్నా తక్కువ ఉన్నవారు 1 - 3 సంవత్సరాలు గ్రూపు పిల్లలలో 63% కి, 1 - 5 ఏళ్ళ గ్రూపు పిల్లలలో 44%కి రక్తహీనత ఉన్నది. న్యూట్రిషన్ లోపం వల్లనే 1 - 6 ఏళ్ళ గ్రూపు పిల్లలలో 63 నుండి 71 శాతం పిల్లలకు ఎనీమియా వస్తుంది.

**(సి) అయోడిన్ లోపం :-** 22 లక్షల మంది పిల్లలు అయోడిన్ లోపం మూలంగా బుద్ధిమాంద్యంతో బాధ పడుతున్నారు. మరో 66 లక్షల మంది అవయవాల కదలిక సమస్యలతో బాధపడుతున్నారు. ఈ కారణంగా రోజుకు 9,000 శిశువులు మరణిస్తున్నారని అంచనా. ఈ లోపాన్ని నివారించడానికి ప్రభుత్వం అయోడైజ్డ్ ఉప్పు వాడమని సలహా ఇస్తుంది.

**(డి) ఆడపిల్లల పట్ల అయిష్టత :-** తల్లిదండ్రులు ఆడ పిల్లలను భారంగా భావిస్తారు. మగ పిల్లల వలె వీరికి పోషక ఆహారం ఇవ్వరు. పేద కుటుంబాలలో ఈ పక్షపాత వైఖరి స్పష్టంగా కనిపిస్తుంది. స్త్రీలు, శిశువులుగా ఉన్నప్పుడు, పిల్లలుగా ఉన్నప్పుడు, వివాహానంతరం, జీవితాంతం అనాదరణకు గురి అగుచున్నారు. గర్భిణీ స్త్రీ ఆరోగ్యంగా ఉంటేనే గర్భస్థ శిశువు ఆరోగ్యంగా ఉంటుందని గ్రామీణులు గ్రహించరు.

**2. పోషకాహార లోపం ఫలితంగా వచ్చే జబ్బులు మరియు రోగాలు :-** పిల్లలకు కోరింత దగ్గు, దనుర్వాతం, పోలియో మొదలగునవి వచ్చును. వీటికి నివారణగా ట్రిపుల్ ఆంటిజెన్ ఉన్నది. క్రమం తప్పకుండా తగు మోతాదులో ఈ మందులు ఇచ్చి శిశు మరణాలు అరికట్టవచ్చు. రక్షిత మంచినీటి లోపం, అపరిశుభ్రమైన ఇళ్ళు వల్ల అతిసార వ్యాధి వస్తుంది. దీనికి చిట్కా రీ హైడ్రేషన్ థెరపీ. 5 ఏళ్ళలోపు పిల్లలో 20 శాతం మరణాలకు కారణం ఊపిరితిత్తుల వ్యాధులు, ప్రభుత్వం నెలకొల్పిన వైద్య సదుపాయాలను ఉపయోగించడం వలన వీటిని నివారించవచ్చు.

## 5.11 గ్రామీణ స్త్రీ జనాభా విషయంలో ఆరోగ్య సమస్యలు - పోషకాహార లోపం సమస్యలు :-

గ్రామీణ స్త్రీల విషయంలో అనారోగ్యం, పోషకాహార లోపం తీవ్రంగా ఉన్నాయి. గ్రామీణ స్త్రీల ఆరోగ్యం శరీర పోషణ విషయాల్లో అల్పత్వాన్ని గుర్తించే సూచికలు - (ఎ) రక్తహీనత, (బి) తక్కువ బరువు, ఎత్తు, (సి) గర్భస్రావాలు, (డి) కాన్పు సమయాలలో మరణాలు, (ఇ) అంగ వైకల్యం గల శిశు జననాలు మొదలైనవి.

బాల్య వివాహాలు, నిరక్షరాస్యత, త్వరత్వరగా వచ్చే కాన్పులు మొదలైన కారణాల వల్ల గ్రామీణ స్త్రీలు అనారోగ్యానికి గురి అవుతున్నారు. గ్రామీణ స్త్రీ జనాభా ఎదుర్కొంటున్న ఈ సమస్యల పరిష్కారానికై ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నది.

**గ్రామీణ స్త్రీల అనారోగ్యానికి గల కారణాలు :-**

1. **బాల్య వివాహాలు - వెంట వెంటనే గర్భధారణలు :-** మన గ్రామాల్లో 10, 14 సంవత్సరాల గ్రూపు బాలికల్లో 8%, 15 - 19 సంవత్సరాల గ్రూపులో 50% వివాహితులే. శరీరం బాగా ఎదిగే వయసులోనే వివాహం జరిగి తల్లులు కావడం వల్ల ఎదుగుదల ఆగిపోతుంది. శారీరకంగా పూర్తిగా సిద్ధం కాని సమయంలో గర్భధారణ అమెకే గాక పుట్టబోయే బిడ్డకు కూడా హానికరం. ఒక జాతీయ స్థాయి అంచనాను బట్టి సగటున ప్రతి స్త్రీ 8 నుండి 9 సార్లు గర్భం ధరిస్తుంది. వీటిల్లో 6 ప్రాణమున్న శిశువు జననానికి దారి తీస్తే చివరకు 4 లేక 5 గురే బ్రతుకుతారు.

2. **గర్భిణీ స్త్రీల సమస్యలు :-** గర్భం ధరించిన మొదటి మూడు నెలల్లో వైద్య సౌకర్యాలు దాదాపు ఉండవు. రక్తహీనత, తక్కువ బరువు అనేవి వీరి ప్రధాన సమస్యలు. అజ్ఞానము, రవాణా సౌకర్యాల లేమి కారణంగా వీరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రారు. ప్రైవేటు ఆసుపత్రుల ఖర్చులను వీరు భరించలేరు.

3. **పక్షపాత వైఖరి :-** స్త్రీ గర్భస్థ శిశువుగా ఉన్నప్పటి నుండి అనాదరణకు గురౌవుతుంది. లింగ పరీక్షలు జరిపించుకొని, ఆడ శిశువులైతే గర్భ స్రావాలు చేయించుకుంటున్నారు. మగ పిల్లల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ఆడ పిల్లల పెంపకాన్ని అలక్ష్యం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న సంఘ పరిస్థితుల్లో స్త్రీలు తమ ఆరోగ్యం గురించి పట్టించుకోరు.

4. **అల్ప అక్షరాస్యతా స్థాయి :-** అల్ప అక్షరాస్యత వల్ల ఆరోగ్యం, శరీర పోషణల గురించి సరైన అవగాహన ఉండదు. గ్రామాల్లో స్త్రీల అక్షరాస్యత రేటు 18% మాత్రమే. అల్ప అక్షరాస్యత వల్ల స్త్రీల మానసిక వికాసం కూడా తక్కువే. ఇదే వారి వెనుకబడినతనానికి కారణం.

5. **వైద్య సౌకర్యాల కొరత :-** చాలా ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలు కొరతగా ఉండగా మరికొన్ని చోట్ల అసలు లేవు. లేడీ డాక్టర్ల కొరత కూడా గ్రామాల్లో తీవ్రంగా ఉంది. డాక్టర్లు పల్లెల్లోని ఆరోగ్య కేంద్రాల్లో సాధారణంగా చేరరు.

6. **ప్రభుత్వ చర్యలు :-** ఈ సమస్యను భారత ప్రభుత్వం మొదటి ప్రణాళికలోనే గుర్తించింది. ఈ కాలంలోనే మాతా శిశు ఆరోగ్య కేంద్రాలు, కుటుంబ నియంత్రణ ఆసుపత్రులు నెలకొల్పబడ్డాయి. కుటుంబ పరిమాణ నియంత్రణతో పాటు, కాన్పుల మధ్య సముచితమైన అంతరాలు ప్రోత్సహించడం మొదలైనది. నాల్గవ ప్రణాళికా కాలంలో మాతా శిశు ఆరోగ్య కేంద్రాల సేవలను, కుటుంబ నియంత్రణ సేవలతో సంవిధానం చేశారు. ఐదవ ప్రణాళికలో పిల్లలు, గర్భిణీ స్త్రీలు, పసి పిల్లల తల్లుల కోసం ప్రత్యేకమైన న్యూట్రిషన్ పథకాలను ప్రవేశ పెట్టింది ప్రభుత్వం. మాతా శిశువుల పోషణకు గాను 100 రోజుల పాటు ఐరన్, ఫోలిక్ యాసిడ్‌లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ కేంద్రాల ద్వారా అందజేస్తున్నారు. గర్భిణీ స్త్రీలకు రోగ నిరోధక, నివారణ, టీకాలు ఇంజక్షన్‌ల వాడకం పెరిగింది. ఈ విధంగా భారత ప్రభుత్వం దేశ వ్యాప్తంగా స్త్రీ ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేసింది. కానీ ఇప్పటికీ గ్రామాల్లోని పరిస్థితి పూర్తిగా సంతృప్తికరంగా లేదని చెప్పవచ్చు.

## 5.12 సారాంశము :-

భారతదేశంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రధానంగా కనిపించే సమస్య జనాభా పెరుగుదల. దీనివల్ల అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం విస్తృతంగా కుటుంబ నియంత్రణ / కుటుంబ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నది. గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అనేక వైద్య సదుపాయాలను, వ్యవస్థలను వివిధ స్థాయిలలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రజల ఉత్పాదకతా శక్తి వారు తీసుకునే ఆహారం పై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా గ్రామీణులు పోషకాహార లోపంతో బాధపడుతుంటారు. ప్రభుత్వం సంతులిత ఆహార ప్రాధాన్యతను గూర్చి వివరిస్తూ ప్రత్యేక న్యూట్రిషన్ పథకాలను ప్రవేశ పెట్టింది.

## 5.13 గుర్తుంచుకోవలసిన విషయాలు :-

1. గ్రామీణ జనాభా పెరుగుదల వల్ల ఉత్పన్నమయ్యే వివిధ సమస్యలు.
2. జనాభా నియంత్రణకు ప్రభుత్వం కుటుంబ నియంత్రణ, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నది.
3. గ్రామీణుల ఆరోగ్య పరిరక్షణకై ప్రభుత్వం కంకణం కట్టుకున్నది.
4. గ్రామీణుల కోసం వివిధ స్థాయిల్లో ఆరోగ్య, వైద్య వ్యవస్థలను ఏర్పాటు చేసింది.
5. గ్రామీణుల్లో కన్పించే ప్రధాన సమస్య పోషకాహార లోపం. ఈ లోపాన్ని నివారించడానికి ప్రత్యేక న్యూట్రిషన్ పథకాలను ప్రవేశ పెట్టింది.

## 5.14 కఠిన పదాలు :-

**పౌష్టికాహారం** - శరీరం తన విధులన్నింటినీ సక్రమంగా నిర్వహించటానికి సహాయపడేదే పౌష్టికాహారం.

**న్యూట్రిషన్ పథకాలు** - శరీరానికి తగినంత శక్తి నివ్వగల ఆహార పద్ధతిని న్యూట్రిషన్ అంటారు. అందుకు ప్రభుత్వం రూపొందించినవే న్యూట్రిషన్ పథకాలు.

## 5.15 నమూనా ప్రశ్నలు :-

**ఏ. వ్యాసరూప ప్రశ్నలు**

1. గ్రామాల్లో జనాభా పెరుగుదల వల్ల ఏర్పడే సమస్యలను వివరించి - జనాభా నియంత్రణకు అమలు చేస్తున్న కార్యక్రమాలను గూర్చి వివరించండి.

జ. గ్రామీణ జనాభా పెరుగుదల వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలను వ్రాసి, జనాభా నియంత్రణకు ప్రభుత్వం అమలు చేస్తున్న చర్యలను వ్రాయండి.

2. గ్రామాల్లో ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్య, వైద్య సౌకర్యాలను గూర్చి వ్రాయండి.

జ. గ్రామాలలో ఆరోగ్య పరిరక్షణ అర్థం వ్రాసి, గ్రామాలలో ప్రజల కోసం ఏర్పాటైన ఆరోగ్య, వైద్య సౌకర్యాలను గూర్చి వ్రాయండి.

3. గ్రామాల్లో స్త్రీల, పిల్లల విషయంలో ఆరోగ్య సమస్యలు ఎట్లున్నవి? మాతా, శిశు ఆరోగ్య పరిరక్షణకై ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలేవి?

జ. గ్రామాల్లో పిల్లల ఆరోగ్యం, పోషకాహార సమస్యలు, నివారణ చర్యలు మరియు గ్రామాల్లో స్త్రీ జనాభా విషయంలో ఆరోగ్య సమస్యలు, పోషకాహార సమస్యలు, నివారణకై ప్రభుత్వం చేపట్టిన చర్యలు వ్రాయండి.

**(బి) సంక్షిప్త వ్యాసరూప ప్రశ్నలు**

1. గ్రామాల్లో స్త్రీల పోషకాహార సమస్యలను వివరింపుము.

జ. గ్రామాల్లో స్త్రీల విషయంలో పోషకాహార సమస్యలను వివరించండి.

2. గ్రామీణ ఆరోగ్య పరిస్థితులు మరియు వైద్య సౌకర్యములను గూర్చి వ్రాయండి.

జ. గ్రామాల్లో ఆరోగ్య పరిరక్షణ అర్థం వ్రాసి, గ్రామాల్లో ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్య వైద్య సౌకర్యాలను గూర్చి వ్రాయండి.

3. భారత ప్రభుత్వం అవలంభించిన కుటుంబ నియంత్రణ మరియు కుటుంబ సంక్షేమ పథకాలను వివరింపుము.

జ. కుటుంబ నియంత్రణ, కుటుంబ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను గూర్చి వ్రాయండి.

**(సి) సంక్షిప్త ప్రశ్నలు**

1. పోషకాహారం

జ. పౌష్టికాహారం - అర్థం

2. P.H.C.

జ. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల గూర్చి వ్రాయండి.

3. మాతా - శిశు ఆరోగ్య సేవలు

జ. మాతా శిశు ఆరోగ్య సేవలను వ్రాయండి.

4. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు

జ. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను వ్రాయండి.

## 5.16 చదువదగిన గ్రంథాలు :-


1. Indian Economy - Dutt and Sundaram
2. Rural Development - Vasant Desai
3. అభివృద్ధి - అర్థశాస్త్రం, భారతదేశ ఆర్థిక అభివృద్ధి సమస్యలు - తెలుగు అకాడమీ


**శ్రీమతి. యన్. ధనేశ్వరి**

**పాఠం - 6**

# గ్రామీణ అక్షరాస్యత - ప్రాధాన్యత - వయోజన విద్య

## 6.0 లక్ష్యం :-

ఈ భాగంలో గ్రామీణ అక్షరాస్యత, విద్య ఈ రెండింటికీ గల తేడాలు, గ్రామీణ ప్రాంతాల్లో విద్యావ్యాప్తి జరగక పోవడానికి కారణాలు, గ్రామీణ విద్య పరిస్థితి, గ్రామీణ అక్షరాస్యతా రేట్లు, వయోజన విద్యలను గురించి వివరించటం జరిగింది. ఈ భాగం పూర్తి అయ్యేసరికి మీరు క్రింది పాఠ్యాంశాలను అవగాహన చేసుకుంటారు.

* అక్షరాస్యత, విద్య - అర్థం
* గ్రామీణ విద్య ప్రాముఖ్యత
* గ్రామీణ విద్య, అక్షరాస్యత ధోరణులు
* గ్రామీణ ప్రాంతాలలో విద్యావ్యాప్తి జరగకపోవుటకు గల కారణాలు
* గ్రామీణ విద్యావ్యాప్తికి ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమాలు
* వయోజన విద్య

## విషయసూచిక :-


**6.1 విషయ పరిచయము**

**6.2 (ఎ) అక్షరాస్యత - అర్థం**

**6.2 (బి) విద్య - నిర్వచనం**

**6.3 గ్రామీణ విద్య ప్రాముఖ్యత - స్త్రీ విద్య**

**6.4 గ్రామీణ విద్య - గ్రామీణ అక్షరాస్యత - పరిస్థితులు - స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో అక్షరాస్యత - విద్య ధోరణులు**

**6.5 భారతదేశంలో గ్రామీణ విద్యావ్యాప్తికై ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలు**

**6.6 వయోజన విద్య**

**6.7 సారాంశము**

**6.8 గుర్తుంచుకోవలసిన విషయాలు**

**6.9 కఠిన పదాలు**

**6.10 నమూనా ప్రశ్నలు**

**6.11 చదువదగిన గ్రంథాలు**

## 6.1 విషయ పరిచయము :-

ఒక దేశ ఆర్థికాభివృద్ధి రేటు ఆ దేశ ప్రజల అక్షరాస్యతా రేటు పై ఆధారపడి ఉంటుంది. ఏ దేశ ప్రజలకైనా ఆలోచనా శక్తి, అవగాహనా శక్తి, సమస్యలపట్ల స్పందించే శక్తి ఉండాలి. ప్రజలకు ఇవన్నీ తెలియాలంటే అక్షరాస్యత అవసరం.

"చదువుకున్న వ్యక్తి - దేశానికి శక్తి"

భారతదేశం గ్రామాల్లో జీవిస్తుంది. గ్రామీణులు విద్యావంతులైతే గ్రామీణ సమస్యలన్నింటికీ పరిష్కారం దొరికినట్లే. గ్రామీణులు అక్షరాస్యులైనపుడు వారిలో శాస్త్రీయ ఆలోచనా దృక్పథం పెరుగుతుంది. గ్రామీణ విద్యను సర్వ వ్యాప్తంగా చేస్తే తప్ప మన గ్రామాలు సమగ్ర అభివృద్ధిని సాధించలేవు.

స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం అక్షరాస్యత, విద్యావ్యాప్తికై కృషి చేస్తున్నది. వివిధ ప్రణాళికలలో విద్యా రంగానికి అత్యధిక కేటాయింపుల ద్వారా విద్యావ్యాప్తికై అనేక కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తున్నది.

## 6.2 (ఎ) అక్షరాస్యత - అర్థం, విద్య - నిర్వచనం :-

అక్షరాస్యత, విద్య పర్యాయ పదాలు కావు. ఈ రెండింటికీ మధ్య ఖచ్చితమైన వ్యత్యాసముంది. అక్షరాస్యత అనగా ఒక మనిషి ఏ భాషలో అయినా చదవగల, రాయగల సామర్థ్యం. చదవగల, వ్రాయగల శక్తి గల మనిషే తనకు తాను సహాయం చేసుకోగలడు. అక్షరాస్యతను బట్టి దేశ ఆర్థిక, సాంఘిక పురోగతిని గుర్తించవచ్చు. "అక్షరం అఖండ విజయాన్ని చేకూరుస్తుంది."

## 6.2 (బి) విద్య - నిర్వచనం :-

విద్య అనగా మనిషికి గల వ్రాయగల, చదవ గల శక్తితో పాటు తన పురోగతికి అవసరమైన విషయాలు తెలుసుకొని వాటి ద్వారా తమ సమస్యలు పరిష్కరించుకొని, జీవన ప్రమాణాన్ని మెరుగుపరుచుకొని పరిపూర్ణ వ్యక్తిగా జీవించడానికి ఉపయోగపడే సాధనం. విద్య సామాజిక మార్పుకు ప్రేరితంగా పని చేస్తుంది. విద్య మానవుని వ్యక్తిత్వాన్ని పెంచి ఆలోచనలో అభిలషణీయమైన మార్పును పెంపొందిస్తుంది. దేశ ఆర్థిక పురోగతికీ, మేథోపరమైన అభివృద్ధికి గట్టి లంకె ఉంది.

## 6.3 గ్రామీణ విద్య - ప్రాముఖ్యత :-

భారతదేశ జనాభాలో గ్రామీణ జనాభా శాతం 72.2 ఉన్నది. 2001 జనాభా లెక్కల ప్రకారం భారత దేశ జనాభాలో 65.4% మాత్రమే అక్షరాస్యులు. అందులో గ్రామీణ పురుషుల అక్షరాస్యతా శాతం 71.40 కాగా, గ్రామీణ స్త్రీలలో అక్షరాస్యత 46.70 శాతంగా ఉన్నది. స్వాతంత్ర్యం సాధించి అర శతాబ్ద కాలానికి మించినా, ప్రణాళికాబద్ధమైన కృషి జరుగుతున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో పూర్తి అక్షరాస్యతను సాధించలేకపోయాము.

వ్యక్తిపరంగా, సమాజపరంగా విద్య వల్ల అనేక ప్రయోజనాలు చేకూరతాయి. గ్రామీణుల ముఖ్య వృత్తి వ్యవసాయం. గ్రామీణులు విద్యావంతులు కావడం వల్ల వ్యవసాయ రంగపు ఉత్పాదకతా, ఉత్పత్తులు పెరుగుతాయి. అనేక అధ్యయనాలు - విద్యా వ్యాప్తికీ, వ్యవసాయ ఉత్పత్తికీ గల సంబంధాన్ని నొక్కి వక్కాణించాయి. దీనికి కారణం విద్యా గంథం గల రైతులు వ్యవసాయ ఉత్పాదకత, ఉత్పత్తిని పెంచగలరు. పెంచే మార్గాలను గూర్చి ఆలోచిస్తారు. ఈ అన్వేషణా శక్తిని విద్య వారికి ఇస్తుంది. ఆధునిక ఉత్పాదకాలైన మేలు రకమైన విత్తనాలు, ఎరువులు, యంత్రాలు. యంత్ర పరికరాలు మొదలైనవి సమర్థవంతంగా ఉపయోగించడానికి విద్య తోడ్పడుతుంది. విద్య భూమిని, శ్రమని గరిష్ట ప్రయోజనానికి వాడుకునే శక్తిని ఇస్తుంది. విద్య గ్రామీణులను చైతన్యవంతులను

చేస్తుంది. గ్రామీణాభివృద్ధికి కావలసిన ఆర్థిక, సాంఘిక విలువలను ప్రేరేపిస్తుంది. విద్యావంతులైన గ్రామీణులు కుటుంబ నియంత్రణ పాటించి, జనాభా పెరుగుదలను అరికట్టుటకు తోడ్పడతారు. విద్య గ్రామీణ శుభ్రతను పెంచి, గ్రామీణ ఆరోగ్యాన్ని, సామర్థ్యాన్ని పెంచుతుంది. గ్రామీణులు విద్యావంతులైతే గ్రామీణ ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం రూపొందించి అమలుపరుస్తున్న వివిధ కార్యక్రమాలను గూర్చి తెలిసికొని వారు లబ్ది పొందగలరు. గ్రామీణులు విద్యావంతులైతే గ్రామీణాభివృద్ధి పథకాలన్నీ విజయవంతం అవుతాయి.

1. **స్త్రీ విద్య - ప్రాముఖ్యత :-** "ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు" స్త్రీలు విద్యావంతులైతే సమకూరే ప్రయోజనాలు అనేకం. వాస్తవానికి పిల్లల్ని ఎక్కువగా ప్రభావితం చేసేది తల్లి. తల్లి ఒడి మొదటి బడి. ఒక స్త్రీ విద్యావంతురాలైతే ఆ కుటుంబమంతా విద్యావంతులు అయినట్లే. ఈ కారణంగానే మన తొలి ప్రధాని నెహ్రూజీ స్త్రీ విద్య ప్రాముఖ్యతను గూర్చి తరచూ చెప్పేవారు. నిజానికి స్త్రీ విద్య విజయానికి నాంది. గ్రామీణ స్త్రీలు విద్యావంతులైతే కుటుంబ నియంత్రణ పాటించే విషయాల్లో స్వంత నిర్ణయాలు తీసుకోగలుగుతారు. సంతులిత ఆహారం పట్ల, గ్రామీణ పరిశుభ్రత పట్ల అవగాహన పెరుగుతుంది. సాంఘిక దురాచారాలైన వరకట్నం, బాల్య వివాహాలు మొదలైనవి అరికట్టడానికి అవకాశాలు మెండు. దేశ జనాభాలో సగ భాగమైన స్త్రీలు విద్యావంతులైతే వారి శక్తి సామర్థ్యాలు తెలివితేటలు దేశ ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడతాయి. స్త్రీ విద్య వల్ల మూఢాచారముల ప్రభావం తగ్గుతుంది.

   విద్యావంతురాలైన స్త్రీ పిల్లల పెంపకంలో తగు జాగ్రత్తలు తీసుకొని వారిని ఉత్తమ పౌరులుగా తయారు చేస్తుంది. విద్యావంతులైన స్త్రీ వనరులపట్ల, వాటి వినియోగంపట్ల అవగాహన కలిగి ఉంటుంది. ఉదాహరణకు ప్రస్తుతం ఉన్న నీటి కొరతను తీసుకుంటే నీటి వృథాను అరికట్టగలరు. విద్యుచ్ఛక్తి వంటి వాటిని కూడా అభిలషణీయంగా వినియోగిస్తారు. స్త్రీలు సాధికారత వైపు దృష్టిని సారిస్తారు. మహిళా సాధికారతకై ప్రభుత్వం రూపొందించి అమలుపరుస్తున్న పథకాలు విజయవంతం కావాలంటే స్త్రీలు విద్యావంతులు కావలసిందే. "చదువుకున్న పడుచు - అన్నింటా ముందు నిలుచు."

## 6.4 గ్రామీణ అక్షరాస్యత - విద్య పరిస్థితులు / స్వాతంత్ర్యానంతరం అక్షరాస్యత - విద్య ధోరణులు :-

భారతదేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం ఒక నిర్దిష్టమైన విద్యావిధానం లేదు. స్వాతంత్ర్యానికి పూర్వం 1901లో అక్షరాస్యతా శాతం పురుషులలో 9.83 కాగా, స్త్రీలలో 0.63% గా ఉంది. గ్రామీణులు నిరక్షరాస్యత కారణంగా అనేక రకాల దోపిడీలకు గురయ్యేవారు. నిరక్షరాస్యత వల్ల ఆర్థికంగా, సాంఘీకంగా, సాంకేతికంగా గ్రామీణ ప్రజలు వెనుకబడినారు.

స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత భారత ప్రభుత్వం అక్షరాస్యత, విద్యా వ్యాప్తికై అవిరామమైన కృషి చేస్తున్నది. ఈ క్రింది పట్టిక 1951 నుండి 2001 మధ్య కాలంలో గ్రామీణ అక్షరాస్యత శాతాలను గూర్చి తెలుపుతుంది.

**1951 - 2001 మధ్య కాలంలో గ్రామీణ పట్టణ అక్షరాస్యతా శాతాలు**

| సంవత్సరం | పురుషులు (శాతం) | స్త్రీలు (శాతం) |
|---|---|---|
| 1951 | 19.02 | 4.87 |
| 1961 | 34.30 | 10.10 |
| 1971 | 48.60 | 15.50 |
| 1981 | 49.60 | 21.70 |
| 1991 | 57.90 | 30.60 |
| 2001 | 71.40 | 46.70 |

**గమనిక :-**

1. 1951, 61, 71 అక్షరాస్యతలు 5 సం॥ ఆ పై వారివి. మిగిలిన సంవత్సరాలలో 7 సం॥లు ఆ పై వారివి.
2. 1981లో అస్సాంను, 1991లో జమ్ము కాశ్మీర్‌ను లెక్కించలేదు.
3. 2001లో గుజరాత్ రాష్ట్రంలోని కొన్ని జిల్లాలు, హిమాచల్ ప్రదేశ్‌లో కిన్నార్ జిల్లాలకు జనాభా గణన జరగలేదు.

పై పట్టికను పరిశీలిస్తే గ్రామాలలో అక్షరాస్యతా శాతం గణనీయంగా పెరిగింది. స్త్రీలలో ఈ పెరుగుదల మరింత అధికం. అయినప్పటికీ దేశంలో నిరక్షరాస్యులు ఇప్పటికీ ఎక్కువగానే ఉన్నారు.

ఇటీవల ప్రభుత్వం అక్షరాస్యతా వ్యాప్తికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. అవి -

1. నిర్బంధ ప్రాథమిక విద్య
2. బలహీన వర్గాల వారికి ఉచిత విద్య
3. రిజర్వేషన్లు
4. మళ్ళీ బడికి పోదాం
5. D.P.E.P.
6. వయోజనులకు రాత్రి బడులు
7. నిరంతర విద్యా కేంద్రాలు
8. ఆపరేషన్ బ్లాక్ బోర్డ్ పథకం
9. అక్షర సంక్రాంతి
10. సర్వశిక్షా అభియాన్
11. చదువుల పండుగ

"అందరి విద్యా - మనందరి బాధ్యత" అన్న విధంగా ప్రభుత్వం పై కార్యక్రమాలను అమలుచేస్తే గ్రామీణ విద్య మిథ్య కాదు తథ్యం.

**స్వాతంత్ర్యానంతరం విద్యా సదుపాయాలలో పెరుగుదల :-**

ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక మాధ్యమిక, మాధ్యమికోన్నత మరియు వయోజన విద్యకు ప్రాముఖ్యతనిచ్చి విద్యావ్యాప్తికి కృషి చేస్తున్నది. 1986 సంవత్సరం గణాంక లెక్కల ఆధారంగా విద్యా సదుపాయాల్లో పెరుగుదలకు సంబంధించిన గణాంక సమాచారం క్రింది పట్టికలో ఇవ్వబడినది.

| సంవత్సరం | ప్రాథమిక పాఠశాలల సంఖ్య | | మాధ్యమిక పాఠశాలల సంఖ్య | | ప్రాథమికోన్నత పాఠశాలలు | |
|---|---|---|---|---|---|---|
| | పాఠశాలలు లక్షలలో | విద్యార్థులు కోట్లలో | పాఠశాలలు లక్షలలో | విద్యార్థులు కోట్లలో | పాఠశాలలు లక్షలలో | విద్యార్థులు కోట్లలో |
| **1950 - 51** | **2.09** | **1.92** | **0.13** | **0.31** | **0.07** | **1.48** |
| **1960 - 61** | **3.30** | **3.50** | **0.49** | **0.67** | **0.17** | **2.58** |
| **1970 - 71** | **4.08** | **5.70** | **0.90** | **1.33** | **0.36** | **7.16** |
| **1980 - 81** | **4.85** | **7.27** | **1.16** | **1.93** | **0.51** | **11.28** |
| **1984 - 85** | **5.79** | **8.39** | **1.30** | **2.62** | **6.58** | **13.82** |
| **1989 - 90** | **5.50** | **9.73** | **1.44** | **3.32** | **0.76** | **19.97** |
| **1990 - 91** | **5.58** | **9.91** | **1.47** | **3.33** | **0.79** | **20.89** |
| **1991 - 92** | **5.65** | **10.09** | N.A. | **3.45** | N.A. | **21.23** |

**మూలం :-** 7వ, 8వ పంచవర్ష ప్రణాళికలు

పై పట్టికను పరిశీలించగా స్వాతంత్ర్యానంతరం ప్రాథమిక, మాధ్యమిక, మాధ్యమికోన్నత పాఠశాలల సంఖ్య మరియు వీటిలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నట్లు తెలుస్తున్నది.

## 6.5 భారతదేశంలో గ్రామీణ విద్యా వ్యాప్తికి ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలు :-

భారత ప్రభుత్వం విద్యా వ్యాప్తికై మొదటి ప్రణాళికలో రూ॥ 1530 మిలియన్లు కేటాయించగా, 9వ ప్రణాళికలో రూ॥ 203816 మిలియన్లు కేటాయించింది. ప్రభుత్వం ప్రతి యేటా సెప్టెంబరు 8న అక్షరాస్యతా దినాన్ని జరుపుతున్నది. గ్రామీణ ప్రాంతాల్లో విద్యావ్యాప్తికై ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేసింది. అవి -

1. సంపూర్ణ అక్షరాస్యతా కార్యక్రమం
2. వయోజన విద్య
3. అనియత విద్య
4. సార్వజనీన విద్య

గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం కారణంగా ఎదురయ్యే ప్రధాన సమస్య (dropouts). బ్రిడ్జి స్కూల్స్ స్థాపించి drop outలకు శిక్షణ ఇచ్చి వీరిని రెగ్యులర్ స్కూలు విద్యార్థులకు కలుపుటకు ప్రయత్నిస్తుంది.

బాల కార్మిక నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు పరచడం ద్వారా పిల్లలలో విద్యా వ్యాప్తికై ప్రయత్నిస్తుంది. "పని వద్దు - చదువు ముద్దు" అనే నినాదంతో బాల కార్మికులను పాఠశాలకు పంపించే ఏర్పాటు చేస్తుంది. మధ్యాహ్న భోజన పథకం లేదా dry ration ను పాఠశాల వైపు ఆకర్షించుటకు ప్రభుత్వం ప్రయత్నించింది.

**ఆపరేషన్ బ్లాక్ బోర్డు పథకం :-**

1987 - 88 సంవత్సరంలో నిరక్షరాస్యతా నిర్మూలనా పథకం ప్రారంభమైంది.

1. **నవోదయ విద్యాలయాలు :-** ప్రమాణం గల విద్యను అందించేందుకు జిల్లాకు ఒకటి చొప్పున నెలకొల్పబడినవి. వీటిలో 75% సీట్లు గ్రామీణులకు కేటాయిస్తారు. ప్రతిభ ప్రాతిపదికగా ప్రవేశం ఉంటుంది. జాతీయ స్థాయిలో వలెనే SC, ST లకు రిజర్వేషన్లు ఉన్నాయి. వీరిని రెసిడెన్షియల్ పద్ధతిలో ఆదర్శప్రాయంగా నడుపుతారు.

2. **సర్వ శిక్ష అభియాన్ :-** అందరికీ ప్రాథమిక విద్యను అందించడం. ఈ పథకం లక్ష్యం. అందుకోసమే ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక ప్రాథమిక పాఠశాలను నెలకొల్పారు.

3. **అనియత విద్య :-** పాఠశాలలో చేరి నియమిత వేళల్లో విద్యను అభ్యసించే పద్ధతులకు భిన్నంగా అందించే విద్యను అనియత విద్య అంటారు. సార్వజనీన ప్రాథమిక విద్యను అందించే లక్ష్యంలో భాగంగా అనియత విద్య ప్రారంభమైంది. విద్యా విషయంగా వెనుకబడిన రాష్ట్రాలలో దీనిని ప్రవేశ పెట్టారు.

4. **వయోజన విద్య :-** 1988లో జాతీయ సాక్షరతా కమిటీని ఏర్పాటు చేసి, వయోజన విద్యా కార్యక్రమాన్ని రూపొందించడం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే చదువురాని పెద్ద వారికి చదువు నేర్పడమే వయోజన విద్య. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే దోపిడీ నుండి విముక్తి పొందాలంటే రైతులు అక్షరాస్యులు కావడమే మార్గము. గ్రామీణాభివృద్ధికై ప్రభుత్వం రూపొందించి అమలుపరుస్తున్న కార్యక్రమాలను అర్థం చేసుకోవాలన్నా లబ్ధి పొందాలన్నా వయోజనులు విద్య నేర్పడం తప్పనిసరి. అందుకే విస్తృత పరిధిలో వయోజన విద్యా కార్యక్రమాన్ని చేపట్టింది. స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా వయోజన విద్యా వ్యాప్తికి కృషి చేస్తారు. గ్రామీణ పాఠశాలలను విద్యా కేంద్రాలుగా (రాత్రి బడులు) ఉపయోగిస్తారు. మూడవ ప్రణాళిక అంతానికి ఈ కార్యక్రమం సఫలం కాలేదు అని భావించింది ప్రభుత్వం. అందుకే (ఎ) జాతీయ వయోజన విద్యా కార్యక్రమం, (బి) జాతీయ అక్షరాస్యతా ఉద్యమాలను చేపట్టింది.

   వయోజన విద్యనందించుట వలన వ్యవసాయ ఉత్పత్తులలో 81 శాతం వృద్ధి సాధ్యపడినట్లు పరిశోధనలు తెలిపాయి. గ్రామీణ విద్యా వ్యాప్తి వల్ల రైతులు, నైపుణ్యం గల, నైపుణ్యం లేని కార్మికులు తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి విద్యని పనిముట్టుగా ఉపయోగించుకుంటున్నారు. కనీస వేతనాలు పొందడం, పని పరిస్థితులను మెరుగు పరచుకోవడం, ప్రభుత్వ పథకాలను గూర్చి అర్థం చేసుకోవడం, బేరమాడగలగడం వంటి చర్యల ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోగలుగుతున్నారు.

## 6.7 సారాంశము :-

గ్రామీణ అభివృద్ధిలో గ్రామీణుల అక్షరాస్యత ప్రధాన అంశం. అక్షరాస్యత వేరు, విద్య వేరు. అనేక గ్రామీణ సమస్యలకు పరిష్కారం గ్రామీణ విద్యను ప్రోత్సహించడమే. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి గ్రామాలలో అక్షరాస్యతను పెంచడానికి చర్యలు తీసుకుంటున్నది. ఫలితంగా విద్యా సంస్థల సంఖ్య విద్యార్థుల సంఖ్య విశేషంగా పెరిగింది. వయోజనులకు విద్య నేర్పించడం వల్ల గ్రామాలు విలసిల్లుతాయని భావించి వయోజన విద్యను ప్రోత్సహించింది ప్రభుత్వం.

## 6.8 గుర్తుంచుకోవలసిన విషయాలు :-

1. గ్రామీణ నిరక్షరాస్యత అనేక సమస్యలకు కారణం.
2. అక్షరాస్యత వేరు - విద్య వేరు.
3. గ్రామీణ విద్యను ప్రోత్సహిస్తే అనేక సత్ఫలితాలు ఉంటాయి.
4. స్వాతంత్ర్యానంతరం గ్రామీణ అక్షరాస్యతా రేటు పెరిగింది.
5. భారత ప్రభుత్వం విద్యావ్యాప్తికై అనేక కార్యక్రమాలు చేపట్టింది.

## 6.9 కఠిన పదాలు :-

1. **అనియత విద్య** - పాఠశాలల్లో చేరి నియమిత వేళల్లో విద్యను అభ్యసించే పద్ధతులకు భిన్నంగా అందించే విద్యను అనియత విద్య అంటారు.
2. **వయోజన విద్య** - గ్రామాల్లో చదువురాని పెద్ద వారికి రాత్రి బడుల ద్వారా చదువునేర్పడము.

## 6.10 నమూనా ప్రశ్నలు :-

### (ఎ) వ్యాసరూప ప్రశ్నలు

1. గ్రామీణ విద్య ప్రాముఖ్యతను వివరించుము. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో అక్షరాస్యత, విద్య ధోరణులను గూర్చి వ్రాయుము.

జ॥ గ్రామీణ విద్య ప్రాముఖ్యతను వివరించి, స్వాతంత్ర్యం అనంతరం భారతదేశంలో అక్షరాస్యతా, విద్యా ధోరణులను గూర్చి వివరంగా వ్రాయండి.

### (బి) సంక్షిప్త వ్యాసరూప ప్రశ్నలు

1. గ్రామీణ విద్యావ్యాప్తికై భారత ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాలను గూర్చి వ్రాయము.

జ. గ్రామీణ విద్య నిర్వచనం వ్రాసి, విద్యావ్యాప్తికై ప్రభుత్వం చేపట్టిన ఫథకాలను వివరించండి.

2. వయోజన విద్యను గూర్చి వ్రాయుము.

జ. వయోజన విద్యను దాని ప్రాముఖ్యతను వ్రాయము.

3. స్త్రీ విద్య వలన ప్రయోజనాలు వివరింపుము.

జ. స్త్రీ విద్య వలన ప్రయోజనాలు వివరింపుము.

**(సి) సంక్షిప్త ప్రశ్నలు**

1. అక్షరాస్యత - విద్య

జ॥ అక్షరాస్యత - విద్యలను వివరించుము

2. నవోదయ పాఠశాలలు

జ॥ నవోదయ పాఠశాలల గురించి వివరించుము

## 6.11 చదువదగిన గ్రంథాలు :-


| | | | |
|---|---|---|---|
| 1. | Indian Economy | - | Dutt and Sundaram |
| 2. | Rural Development | - | Vasant Desai |
| 3. | అభివృద్ధి అర్థశాస్త్రం, భారతదేశం ఆర్థిక అభివృద్ధి సమస్యలు | - | తెలుగు అకాడమీ |


**శ్రీమతి. యన్. ధనేశ్వరి**

**పాఠం - 7**

# గ్రామీణ పేదరికం

## 7.0 లక్ష్యం :-

ఈ పాఠం చదివిన తరువాత మీరు ఈ క్రింది అంశాలను తెలుసుకోగలరు.

* పేదరికం - భావనలు
* పేదరికం - వివిధ అంశాలు
* పేదరికానికి కారణాలు, తగ్గింపునకు తీసుకోవలసిన చర్యలు

## విషయసూచిక :-


**7.1 ఉపోద్ఘాతము**

**7.2 పేదరికం - భావనలు**

**7.3 పేదరికం - వివిధ అంశాలు**

**7.4 పేదరికానికి కారణాలు**

**7.5 పేదరిక తగ్గింపుకు తీసుకోవలసిన చర్యలు**

**7.6 సారాంశము**

**7.7 నమూనా ప్రశ్నలు**

**7.8 చదువదగిన గ్రంథాలు**


## 7.1 ఉపోద్ఘాతము :-

ప్రపంచ వ్యాప్తంగా, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో, ప్రభుత్వాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య పేదరికం. పేదరికం అనే పదాన్ని వివిధ వర్గాల ప్రజలు - ప్రభుత్వాధికారులు, రాజకీయ నాయకులు, ప్రభుత్వేతర సంస్థలు, ప్రతినిధులు, విద్యావేత్తలు, సాధారణ పౌరులు తరచూ ఉపయోగిస్తుంటారు. పేదరికం అంటే ఏమిటి? గ్రామీణ ప్రాంతాలలో పేదరికంలో యిమిడి ఉన్న అంశాలు ఏవి? పేదరికం ఏ విధంగా వ్యక్తమవుతుంది? పేదరికానికి గల కారణాలు ఏవి? పేదరిక నిర్మూలన లేక తగ్గుదలకు ఎటువంటి చర్యలు అవసరం? ఈ ప్రశ్నలన్నింటికీ శాస్త్రీయ పరిశోధనల ఆధారంగా సమాధానాలు వివరించుటయే ఈ అధ్యాయం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

ఈ అధ్యాయం నాలుగు భాగాలుగా విభజించబడింది. మొదటి భాగంలో పేదరికం యొక్క వివిధ భావనలు వివరించటం జరిగింది. రెండవ భాగంలో గ్రామీణ పేదరికంలో యిమిడి ఉన్న వివిధ అంశాలు విశ్లేషించబడినాయి. మూడవ భాగంలో గ్రామీణ

పేదరికానికి గల కారణాలు వివరించటం జరిగింది. నాల్గవ భాగంలో పేదరిక నిర్మూలన లేక తగ్గుదలకు తీసుకోవలసిన చర్యలు వివరించటం జరిగింది.

## 7.2 పేదరికం - భావనలు :-

ముందుగా పేదరికం అంటే ఏమిటో తెలుసుకోవటం చాలా అవసరం. అందుకు పేదరికం పై గల వివిధ భావనలు పరిశీలించాలి. పేదరికం రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి దుర్భర పేదరికం (absolute poverty), రెండు సాపేక్ష పేదరికం (relative poverty) . దుర్భర పేదరికం కనీస అవసరాలు తీరని పరిస్థితిని సూచిస్తుంది. ఒక వ్యక్తి తనకు తన పై ఆధారపడిన వారికి కనీసం రోజుకు రెండుసార్లు భోజనం సమకూర్చలేని పరిస్థితిని దుర్భర పేదరికంగా భావించవచ్చు. సమాజంలో అధిక ఆదాయ సమూహాలతో పోలిస్తే అల్ప ఆదాయ సమూహాల జీవన ప్రమాణాలు (living standards) తక్కువగా ఉండుటను సాపేక్ష పేదరికంగా భావించవచ్చు. అంటే సమాజంలో వివిధ సాంస్కృతిక మరియు ఆర్థిక వర్గాలలో జీవన స్థాయి (scale of living) భిన్నంగా ఉంటుంది. ఒక వ్యక్తి తన వర్గంలోని ఇతరుల కన్నా పేదవాడుగా లేక సంపన్నుడుగా భావించవచ్చు.

ప్రపంచ బ్యాంకు అభిప్రాయంలో కనీస పోషక అవసరాలు, గృహవసతి, ఇతర వసతులకు కావలసిన ఆదాయం లేకపోవుటను దుర్భర పేదరికం అనవచ్చు. సాపేక్ష పేదరికం సమాజంలోని వివిధ వర్గాల మధ్య గల అసమానతలు, సాపేక్ష జీవన స్థితిగతులను సూచిస్తుంది. ఈ విధంగా చూస్తే సాపేక్ష పేదరికం కన్నా దుర్భర పేదరికానికి ప్రాధాన్యత ఇవ్వలసిన అవసరం స్పష్టంగా కనిపిస్తుంది.

ప్రజల జీవన ప్రమాణాలు, దారిద్ర్య రేఖ అన్ని సమాజాలలో, దేశాలలో ఒకే రకంగా ఉండదు. అమెరికాలోని ద్రారిద్య రేఖకు, భారతదేశంలోని దారిద్ర్యరేఖకు చాలా వ్యత్యాసం ఉంది. అలాగే నగర ప్రాంతాలలోని దారిద్ర్యరేఖకు, గ్రామీణ ప్రాంతాలలోని దారిద్ర్యరేఖకు కూడా చాలా వ్యత్యాసం ఉంది. అయితే ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ దారిద్ర్యరేఖ ఒకటి వాడుకలో ఉంది. ఒక వ్యక్తి ఆదాయం రోజుకు ఒక డాలర్ కన్నా తక్కువగా ఉంటే అంతర్జాతీయ దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్లు భావించవచ్చు.

రాబర్ట్ చాంబర్స్ అభిప్రాయంలో ప్రజలు సాధారణ జీవితం గడుపుటకు కావలసిన వనరులు కలిగి ఉండకపోవుటను పేదరికం అనవచ్చు. పేదరికం కొంతమందికి ఉన్న లేములు మరియు ప్రతికూల పరిస్థితులను సూచిస్తుంది. అయితే ఈ లేములు మరియు ప్రతికూల పరిస్థితులు ఏవి అన్న అంశం చర్చనీయాంశమైనది.

తరచూ పేదరికాన్ని తక్కువ ఆదాయాలకు (దారిద్ర్యరేఖ) ప్రతీకగా చూడటం జరుగుతుంది. సాంప్రదాయక దృక్పథంలో పేదరికాన్ని చూస్తే కనీస అవసరాలు తీర్చే కుటుంబ ఆదాయం లేక వినియోగం పై ఎక్కువ దృష్టిపెట్టినట్లు కన్పిస్తుంది. ఈ రకమైన భావనలో కొన్ని లోపాలు స్పష్టంగా కన్పిస్తాయి.

1. మార్కెట్‌ను అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పించే వ్యవస్థగా భావించటం జరిగింది. నిజానికి మార్కెట్ వ్యవస్థ సమాజంలోని అన్ని వర్గాలకు సమాన స్థాయిలో అందుబాటులో ఉండదు. సమాజంలోని వర్గ, కుల, లింగ మరియు ఇతర సాంఘిక సంబంధాలలో ఉన్న అసమానతలు మార్కెట్ వ్యవస్థలో కూడా ప్రతిబింబిస్తాయి.

2. కనీస అవసరాలు తీర్చే ముఖ్యమైన వ్యవస్థగా మార్కెట్‌కు ప్రాధాన్యత కల్పించుట, ఇతర వ్యవస్థలను పూర్తిగా విస్మరించుట జరిగింది. నిజానికి ప్రజలు తమ కనీస అవసరాలు వివిధ రకాల వనరుల ద్వారా తీర్చుకుంటారు. ఉదాహరణకు పేద ప్రజలు తాము కష్టాల్లో ఉన్నప్పుడు ఆహారం, బట్టలు మరియు గృహ వసతి బంధువుల నుండి పొందుతారు. అలాగే వారు పండ్లు, దుంపలు మరియు పశుగ్రాసం కొరకు ఉమ్మడి వనరుల పై ఆధారపడతారు. ప్రభుత్వం కల్పించే చిన్నపాటి పోషక పదార్థాలు మరియు ఆరోగ్య, విద్యా సేవలు కూడా వారు వినియోగించుకుంటారు. పేదవారి జీవన వ్యూహాలు (livlihood strategies) ఆదాయోత్పత్తి కార్యక్రమాలు లేక శ్రామిక మార్కెట్‌తో బాటు

సాంఘిక సంబంధాలు, వినియోగ విధానంలో మార్పులు, శ్రమ మరియు ఆస్తుల సమీకరణ, పొదుపులు, అప్పుల పై కూడా ఆధారపడి ఉంటాయి. ఈ విషయం ముఖ్యంగా మహిళల జీవనశైలిలో ప్రస్ఫుటంగా కన్పిస్తుంది.

3. మహిళలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు వంటి పేద వర్గాలు తమ ఆదాయాన్ని కనీస అవసరాలు తీర్చుకొనుటకు ఉపయోగపడకుండా అడ్డుకుంటున్న వ్యవస్థాపరమైన అవరోధాలను విస్మరించుట జరిగింది. ఉదాహరణకు కుటుంబంలోని అసమానతలు, సాంఘిక కట్టుబాట్లు మరియు ప్రభుత్వం/సమాజం యొక్క లింగ వివక్ష విధానాలు పెరిగిన ఆదాయాలను మహిళల ఆహార అవసరాలు తీర్చుటకు అవరోధంగా ఉన్నాయి. అలాగే కుల వివక్ష ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో దళితులు నూతన ఉపాధి కార్యక్రమాల ద్వారా తమ ఆదాయాన్ని పెంచుకోలేకపోతున్నారు. వారు మెరుగైన విద్యను అభ్యసించటానికి కూడా కుల వ్యవస్థ అవరోధంగా ఉంది. గిరిజన ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు సరిగా లేనందువలన ఆదివాసీలు తమ ఆదాయాన్ని కనీస అవసరాలు తీర్చుకొనుటకు ఉపయోగించలేక పోతున్నారు.

4. కుటుంబంలోని సభ్యుల మధ్య గల అసమానతలు విస్మరించటం జరిగింది. కుటుంబ ఆదాయం, పంపిణీ, సభ్యుల వయస్సు, శారీరక సామర్థ్యం మరియు లింగ వ్యవస్థల పై ఆధారపడి ఉంటుంది. పేదరికానికి సాంప్రదాయక కొలబద్దలయిన కుటుంబ ఆదాయం లేక సంక్షేమం మరియు తలసరి ఆదాయం కుటుంబం ఆధారంగా నిర్ణయింపబడతాయి. ఆదాయ పంపిణీ కుటుంబములోని సభ్యులందరికీ సమానంగా జరగదు. కాబట్టి ఇది కుటుంబ సభ్యులందరి సంక్షేమాన్ని వ్యక్తపరచలేవు. ముఖ్యంగా స్త్రీలు తమ శారీరక శ్రమను ఆదాయంగా మలచుకోవటం, సదరు ఆదాయాన్ని తమ సంక్షేమం కోసం ఉపయోగించటం సాంఘిక కట్టుబాట్లు మరియు సంస్కృతి పై ఆధారపడి ఉంటుంది. అంటే ఈ విషయంలో స్త్రీలకు చాలా తక్కువ స్వేచ్ఛ ఉంటుందనేది నిర్వివాదాంశం.

రాబర్ట్ చాంబర్స్ అభిప్రాయంలో పేదలు అయిదు రకాల ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. (1) ఆస్తులు లేకపోవటం, (2) శారీరక బలహీనత, (3) ఒంటరితనము, (4) నిస్సహాయత, (5) శక్తిహీనత.

గ్రామీణ ప్రాంతాలలో పేదలకు భూమి, పశుసంపద మొదలగు ఉత్పాదక ఆస్తులు అందుబాటులో ఉండవు. ఇందుకు ముఖ్య కారణం సమాజంలో ఆస్తులు మరియు సంపద పంపిణీలో అసమానతలు అలాగే కొనసాగటం. అంతేకాక ఆస్తి పంపిణీ అనువంశికత్వం పై ఆధారపడి ఉంటుంది. మార్కెట్ శక్తులు కూడా పేద ప్రజలకు అనుకూలంగా ఉండవు.

శారీరక బలహీనతకు ముఖ్య కారణం కనీస అవసరాలైన ఆహారం, పోషక పదార్థాలు, వైద్య సదుపాయాలు పేదలకు అందుబాటులో లేకపోవటమే. అందువల్ల పేదల ఉత్పాదక శక్తి క్షీణిస్తుంది.

సమాచారం అందుబాటులో లేకపోవటం, చదవలేక పోవటం, మారుమూల ప్రాంతాలలో నివసించటం ఇవన్నీ పేదలను ఒంటరివారిని చేస్తాయి. సామాజిక సేవలు, మార్కెట్‌లు మరియు ఆర్థిక సహాయం కూడా పేదలకు అందుబాటులో ఉండవు. దీనివల్ల పేదలు తమ శక్తి సామర్థ్యాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోలేకపోతారు.

నిస్సహాయత అనేది పేదలు వివిధ రకాల నష్ట భయము మరియు అనిశ్చితులను ఎదుర్కొనలేని పరిస్థితిని సూచిస్తుంది. దీనివల్ల పేదలు ఎటువంటి ఆకస్మికమైన విపత్తులను తీవ్రనష్టం లేకుండా ఎదుర్కొని నిలదొక్కుకోలేరు. ఈ నష్టం వల్ల పేదలు శారీరకంగా బలహీనులుగా, ఆర్థికంగా, సామాజికంగా మరియు మానసికంగా చితికిపోయే ప్రమాదం ఉంది.

శక్తిహీనత పేదలను వనరులు, ఉపాధి మరియు ఆదాయం విషయంలో చింతకు గురి చేస్తుంది. అందువల్ల పేదలు ఒక సముదాయములాగ ఏర్పడలేరు. బేరమాడే శక్తి కలిగి ఉండరు. శారీరక బలహీనత మరియు ఆర్థిక నిస్సహాయత పేదలను

ఎటువంటి ప్రాబల్యం లేనివారుగా చేస్తుంది. అందువల్ల బయటి వారైన ప్రభుత్వము, ప్రభుత్వేతర సంస్థలు మరియు ఇతరులు పేదలను వ్యవస్థీకృతం చేసి వారి ఉన్నతికి పాటుపడటం కష్టతరమవుతుంది.

రాబర్ట్ చాంబర్స్ అభిప్రాయంలో గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలు మూడు అంశాలకు అంచెలంచెలుగా ప్రాధాన్యత ఇస్తారు. మొదట ఏదో విధంగా బ్రతకటం చాలనుకుంటారు. ఆహారము, బట్టలకు సమస్యలేనపుడు తమ జీవనానికి భద్రత కావాలనుకుంటారు. ఈ భద్రత ఉత్పాదక ఆస్తులు ఉన్నప్పుడు, తగినంత ఉపాధి దొరికినపుడు, గృహవసతి తదితర సౌకర్యాలు ఉన్నప్పుడు కలుగుతుంది. ఆహారము, బట్టలు ఉన్నప్పుడు, భద్రత సమకూరిన తర్వాత, పేదలు ఆత్మగౌరవానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. కులపరమైన వివక్షత లేనపుడు, నిర్ణయాధికారం కలిగినపుడు, ప్రజా సంస్థలలో పాల్గొన్నప్పుడు మాత్రమే ఆత్మగౌరవం దక్కుతుంది.

ఈ అంశాలన్నిటినీ పట్టిక 1లో చూపటం జరిగింది. సాధారణంగా సరిపడినంత ఆదాయం లేనివారిని పేదలుగా గుర్తిస్తారు. భారతదేశం లాంటి అనేక దేశాలలో తలసరి వినియోగం ఆధారంగా దారిద్ర్య రేఖను నిర్ణయించి దానికి దిగువనున్న వారిని పేదలుగా పరిగణిస్తారు. మొదటి వరుసలో చూపిన ఈ పద్ధతి వల్ల పేదరికాన్ని సరిగా గుర్తించలేము. రెండు, మూడు వరుసలలో తలసరి వినియోగం దారిద్ర్యరేఖ కన్నా తక్కువ ఉన్నవారు, బ్రతుకుటకు కావలసిన కనీస అవసరాలు తీర్చుకొనుటకు ఉమ్మడి వనరులు మరియు ప్రభుత్వ సహాయం పై ఆధారపడుట చూపబడింది. నాల్గవ వరుసలో పేదల నిస్సహాయత నేపథ్యంలో ఆస్తుల ఆవశ్యకత చూపబడినది. ఈ ఆస్తులు పేదలకు క్లిష్ట సమయాలలో నిలదొక్కుకునేలా ఆదుకుంటాయి. ఆస్తులు కలిగి ఉండుట, వాటి పై నియంత్రణ కలిగి ఉండుట వల్ల పేదల జీవనానికి భద్రత చేకూరుతుంది. ఐదు, ఆరు వరుసలలో పేదలకు ఆత్మగౌరవం మరియు స్వయం నిర్ణయాధికారం యొక్క ఆవశ్యకత చూపబడినది.

**పట్టిక 1 - పేదరిక భావనలు**

1. తలసరి వినియోగం
2. తలసరి వినియోగం + ఉమ్మడి వనరులు
3. తలసరి వినియోగం + ఉమ్మడి వనరులు + ప్రభుత్వ సహాయం
4. తలసరి వినియోగం + ఉమ్మడి వనరులు + ప్రభుత్వ సహాయం + ఆస్తులు
5. తలసరి వినియోగం + ఉమ్మడి వనరులు + ప్రభుత్వ సహాయం + ఆస్తులు + గౌరవం
6. తలసరి వినియోగం + ఉమ్మడి వనరులు + ప్రభుత్వ సహాయం + ఆస్తులు + గౌరవం + స్వయం నిర్ణయాధికారం

పై చర్చ ఆధారంగా పేదరికాన్ని ఈ క్రింది విధంగా నిర్వచించవచ్చు.

- తక్కువ ఆదాయం వల్ల మరియు ఉత్పాదక వనరులు, ఆస్తులు అందుబాటులో లేక కనీస అవసరాలు తీర్చుకునే సామర్థ్యం లేకపోవుట.
- విద్య, ఆరోగ్య సదుపాయాలు తగినంతగా అందుబాటులో లేకపోవటం వల్ల మానవ వనరులను వినియోగించుకునే అవకాశాలు లేకపోవుట.
- భౌతిక పరిస్థితుల వల్ల మరియు తగినంత విద్య లేకపోవటం వల్ల ఒంటరితనాన్ని అనుభవించుట.
- సమాజంలో అంతస్తు, శక్తి లేకపోవటం వల్ల తమ పేదరిక పరిస్థితి నుంచి బయటపడ లేకపోవుట.
- ఉత్పాదక ఆస్తులు లేకపోవటం వలన మరియు ప్రకృతి వైపరీత్యాల బారిన పడటం వల్ల ఏర్పడిన నిస్సహాయ పరిస్థితి.

అయితే పేదరికం అనేది నిలకడగా ఉండక కాలంతోబాటు ప్రాంతాలను బట్టి మారుతుందని గమనించాలి. అలాగే వివిధ ఆర్థిక వర్గాలలో పేదరికం యొక్క భావన భిన్నంగా ఉంటుంది. కుటుంబ స్థాయిలో స్త్రీలు, పురుషులు పేదరికాన్ని అర్థం చేసుకునే తీరు కూడా భిన్నంగా ఉంటుంది. అందువల్ల పేదలందరినీ ఒక సజాతీయ సమూహంగా భావించకూడదు. పేదరికంలో వివిధ అంశాలు యిమిడి ఉన్నాయి.

## 7.3 పేదరికం - వివిధ అంశాలు :-

పేదరికంలో యిమిడి ఉన్న అంశాలను నాలుగు భాగాలుగా విభజించవచ్చు. ఆస్తులు, వనరులు, విజ్ఞానం మరియు హక్కులు. ఆస్తులు వస్తు రూపంలో ఉంటాయి. వనరులంటే విద్య, ఆరోగ్య వసతి, త్రాగునీటి వసతి, పరపతి, తదితర సౌకర్యాలు. విజ్ఞానం అంటే సమాచారం కలిగి ఉండటం తద్వారా సాంకేతిక, రాజకీయ విషయాలను అవగాహన చేసుకునే సామర్థ్యం. హక్కులు సామాజిక, ఆర్థిక, రాజకీయ, చట్టపరమైన మరియు సాంప్రదాయక రంగాలకు విస్తరించి ఉంటాయి.

పేదలు తమ ప్రస్తుత పరిస్థితి నుంచి బయటపడుటకు రెండు రకాల వ్యూహాలను ఉపయోగిస్తారని పరిశోధనలు తెలుపుతున్నాయి. మొదటి తరహా వ్యూహాలలో పేదలు ఆస్తులు మరియు వనరుల ఉపయోగం ద్వారా తమ ప్రస్తుత పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తారు. రెండవ తరహా వ్యూహాలలో పేద ప్రజలు లేక వారి ప్రతినిధులు ప్రభుత్వ విధానాలలో మార్పు తెచ్చుట మరియు వాటిని సక్రమంగా అమలు చేయుట ద్వారా వారి లక్ష్యాలను సాధించుటకు ప్రయత్నిస్తారు.

మొదటి తరహా వ్యూహంలో పేదలు వ్యక్తిగతంగా కాని స్థానిక సమూహాల ద్వారా కాని తమకు అందుబాటులో ఉన్న వనరులు, ఆస్తులు వినియోగించుకొని ఆర్థిక ప్రతికూలతలను అధిగమించే ప్రయత్నం చేస్తారు. వలసపోవుట, ఉత్పత్తి సహకార సంఘాలు, పరపతి సంఘాలు మరియు బంధువుల ద్వారా అప్పులు పొందుట, ఉత్పత్తిని వైవిధ్యం చేయుట, నూతన అవకాశాలు వినియోగించుకొనుట ఈ కోవలోకి వస్తాయి.

రెండవ తరహా వ్యూహాలలో ఇతరుల విధానాలు, ఆచరణలో మార్పు తెచ్చుట ద్వారా తమ స్థితిని మార్చుకోవటం కనబడుతుంది. వనరుల పునః పంపిణీ ద్వారా మాత్రమే పేదల పరిస్థితిలో మార్పు తీసుకురావచ్చనేది ఇందులో ముఖ్యాంశం. విధానాల రూపకల్పన మరియు అమలులో వ్యవస్థాపరమైన మార్పు తీసుకురావటం పై దృష్టి పెట్టటం జరుగుతుంది. అంటే పేదరిక తగ్గింపు వనరుల సమీకరణ, పేదల వ్యవస్థీకరణ, ప్రాతినిధ్యం మరియు సాధికారతల పై ఆధారపడి ఉంటుంది. ఈ సందర్భంగా పేదరిక ఉపశమనానికి, పేదరిక తగ్గింపుకు గల వ్యత్యాసాన్ని వ్యక్తీకరించవలసి ఉంది. పేదల మూలధనంలో స్వల్పకాలిక పెరుగుదల సాధించుటను పేదరిక ఉపశమనంగా చెప్పవచ్చు. అలా కాకుండా పేదలు సాంఘిక సంబంధాల పై ఆధారపడుట మరియు పర్యావరణ మార్పులకు తీవ్రంగా నష్టపోవుటను దీర్ఘకాలిక ప్రాతిపదికపై రూపమాపడాన్ని పేదరిక తగ్గింపుగా పేర్కొనవచ్చు. పేదరిక ఉపశమనం పేదల జీవనం పై ప్రభావం చూపే ఆస్తులు, వనరుల పై దృష్టి సారిస్తే, పేదరిక తగ్గింపు విజ్ఞానం, హక్కుల పై దృష్టి సారిస్తుంది. వ్యవసాయాభివృద్ధి, మార్కెట్లను పేదలకు అందుబాటులోకి తేవటం పేదరిక ఉపశమనాన్ని సాధించటానికి ఉపయోగపడితే, అభివృద్ధి పనులలో పేదలు చురుకుగా పాల్గొనుట పేదరిక తగ్గింపుకు దోహదం చేస్తుంది.

పేదరికం పై ఒక కార్యక్రమం యొక్క ప్రభావాన్ని మదింపు చేయాలంటే నాలుగు రకాల సూచికలను పరిశీలించవలసి ఉంటుంది. ఇవి (1) జీవన విధానాలు, (2) వనరులు, (3) విజ్ఞానం, (4) హక్కులు. పట్టిక - 2లో చూపిన ఈ సూచికలను కుల, వర్గ, లింగపరంగా విశ్లేషించవలసిన అవసరం ఉంది.

**పట్టిక 2 - పేదరిక తగ్గింపుకు సూచికలు**

| అంశము | ఏమి చూడాలి? | సూచికలు |
|---|---|---|
| జీవన విధానాలు | పెరుగుదల నుంచి దుర్భర పరిస్థితి వరకు | • పురుషుల, స్త్రీల, పిల్లల ఉపాధి<br>• స్త్రీల పై పని భారం<br>• ఆదాయ ఉత్పత్తి కార్యక్రమాలు<br>• ఆస్తుల యాజమాన్యం |
| వనరులు | అందుబాటు నుంచి అందుబాటు లేకపోవటం వరకు | • ఉత్పాదక ఆస్తులు, మార్కెట్లు, పరపతి, భూమి, సేద్యపు నీటి వనరుల అందుబాటు<br>• భావ ప్రసార సదుపాయం, త్రాగునీరు మరియు మరుగు దొడ్లు వంటి వసతుల అందుబాటు<br>• శిక్షణా కార్యక్రమాల అందుబాటు<br>• ఉమ్మడి వనరుల పై ఆధారపడుట<br>• రక్షణ కవచాలు, సాంఘిక సంబంధాలు<br>• వనరుల పంపిణీ<br>• స్కూలు ఫీజులు అందుబాటులో ఉండుట<br>• ఆరోగ్య పరిరక్షణ అందుబాటులో ఉండుట<br>• స్త్రీలకు ఖాళీ సమయం |
| విజ్ఞానం | విస్తరణ నుంచి తగ్గింపు వరకు | • పిల్లలు స్కూలుకు వెళ్ళుట<br>• సముదాయ ఆరోగ్య రక్షణ, స్త్రీల విద్య మరియు ఆరోగ్య స్థాయి<br>• సాంకేతిక, నిర్వహణ మార్కెటింగ్ మరియు నాయకత్వ నైపుణ్యత సాధించుట.<br>• తట్టుకొని నిలబడగలిగే పద్ధతులు |
| హక్కులు | పాల్గొనుట నుంచి దూరమగుట వరకు | • స్థానిక సంస్థలలో చురుకుగా పాల్గొనుట<br>• హక్కుల విషయంలో పేదలు వ్యవస్థీకృతమైనారా లేక పట్టుదలతో ఉన్నారా?<br>• ఆస్తి హక్కులు, స్త్రీల భూమి హక్కులు<br>• చట్టపరమయిన స్థాయి<br>• పునరుత్పత్తి హక్కులు<br>• అధికారుల నుంచి గౌరవం పొందుట<br>• స్వీయ భద్రత |

## 7.4 పేదరికానికి కారణాలు :-

పేదరికానికి కారణాలు అన్వేషించాలంటే పేదరికం యొక్క విభిన్న రూపాలను లోతుగా పరిశీలించాలి. పేద ప్రజలు పేదరికంలోని దిగువ అంశాలను గుర్తిస్తారు.

1. కనీస అవసరాలు తీర్చుకొనుటకు సరిపడే ఆదాయం మరియు ఆస్తులు లేకపోవడం.
2. ప్రభుత్వ మరియు సమాజంలోని వివిధ వ్యవస్థలలో మాట చెల్లకపోవటం మరియు శక్తిహీనత.
3. క్లిష్ట పరిస్థితులను తట్టుకునే సామర్థ్యం లేకపోవటం లేక నిస్సహాయత.

ప్రపంచ అభివృద్ధి నివేదిక 2000/2001 ప్రజల ఆస్తులను క్రింది విధంగా వర్గీకరించింది.

- మానవ సంపద (శ్రమకు కావలసిన సామర్థ్యం, నైపుణ్యం మరియు మంచి ఆరోగ్యం)
- సహజ సిద్ధమైన ఆస్తులు (భూమి, నీరు, అడవులు మొ॥)
- భౌతిక ఆస్తులు (వసతుల అందుబాటు)
- ఆర్థిక ఆస్తులు (పొదుపులు, అప్పుల అందుబాటు)
- సామాజిక ఆస్తులు (అవసరానికి ఆదుకునే సాంఘిక సంబంధాలు, వనరుల పై రాజకీయ ప్రాబల్యం)

ఈ ఆస్తుల నుంచి వచ్చే రాబడి మార్కెట్‌ల అందుబాటు పై మరియు ఈ మార్కెట్ల మరియు స్థానిక సంస్థల ప్రాబల్యం పై ఆధారపడి ఉంటుంది. అయితే ఈ రాబడి మార్కెట్ల ప్రవర్తన పైనే కాక సమాజ మరియు ప్రభుత్వ వ్యవస్థల పని తీరు పై కూడా ఆధారపడి ఉంటుంది. ఈ ఆస్తుల యాజమాన్యం మరియు వాటి నుంచి వచ్చే రాబడి ఆర్థిక శక్తుల పైనేకాక, సామాజిక, రాజకీయ శక్తుల పై కూడా ఆధారపడి ఉంటుంది. ఆస్తుల అందుబాటు సమాజంలో ఆస్తి హక్కులు నిర్ణయించే చట్టాల పై మరియు ఉమ్మడి వనరుల వినియోగ విషయంలో గల సాంఘిక కట్టుబాట్ల పై ఆధారపడి ఉంటుంది. సమాజంలోని లింగ, జాతి, కుల, సాంఘిక అంతస్థులలో వివక్షతలు కూడా ఆస్తుల అందుబాటును నిర్ణయిస్తాయి. అంతేకాక సమాజ మరియు ప్రభుత్వ వ్యవస్థలు వివిధ సమూహాల రాజకీయ ప్రాబల్యానికి అనుగుణంగా ఉంటూ ఆస్తులు మరియు వాటి నుండి వచ్చే రాబడి పై ప్రభావం చూపుతాయి.

ఈ రాబడి నిలకడగా లేకపోవుట మార్కెట్ హెచ్చు తగ్గులు, వాతావరణ పరిస్థితులు, అనిశ్చిత, రాజకీయ పరిస్థితుల పై ఆధారపడి ఉంటుంది. నిలకడ లేని రాబడి ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపిస్తూ సహజ సిద్ధ మరియు భౌతిక ఆస్తులను నాశనం చేస్తుంది. దీనివల్ల పొదుపులు క్షీణించి ఆస్తుల విలువ కూడా తగ్గే ప్రమాదం ఉంది.

పేద ప్రజల జీవితాన్ని మెరుగుపరుచుటలో ఉపాధి యొక్క పాత్ర చాలా ముఖ్యమయినది. ఇది దేశం యొక్క సంపద పై ఆధారపడి ఉంటుంది. ఒక దేశం సంపన్నమైతే పనికి ఎక్కువ కూలి లభిస్తుంది. అంటే ఆర్థికాభివృద్ధి వల్ల పేదరికం (ఆదాయ విషయంలో) తగ్గు ముఖం పడుతుంది. ఉదాహరణకు తూర్పు ఆసియా దేశాల స్థూల జాతీయోత్పత్తి (GDP) గడిచిన నాలుగు దశాబ్దాలలో 4 - 5 శాతం వృద్ధి పొందడం వల్ల ఆ దేశాల ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా పెరగటమే కాక పేద ప్రజల విద్య మరియు ఆరోగ్య స్థాయి కూడా పెరిగింది. ఇదే కాలంలో ఆఫ్రికా దేశాలలో ఆర్థికాభివృద్ధి జరగక పోవటం వల్ల సాధారణ జీవన ప్రమాణాలు ఏ మాత్రం మెరుగుపడలేదు.

ఆర్థికాభివృద్ధి వల్ల పేదరిక తగ్గుదల ఆదాయ పంపిణీలో అసమానతలు, మరియు అందులో కాలానుగుణంగా వస్తున్న మార్పుల పై ఆధారపడి ఉంటుంది. అలాగే స్థిరమయిన మరియు సమర్థవంతమైన ప్రభుత్వం ఉండుట కూడా పేదరిక తగ్గింపుకు దోహదం చేస్తుంది.

పేదల శక్తిహీనత మరియు వారి మాట చెల్లుబాటు కాకపోవుట వల్ల వారు తమకు వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకోలేకపోతారు. ఈ పరిస్థితి వల్ల పేద ప్రజలు అవమానాలకు దోపిడీకి గురి కావటం జరుగుతుంది. చట్టం లేకపోవుట, హింస, బలవంతపు వసూళ్ళు మరియు బెదిరింపు చర్యల నుంచి రక్షణ లేకపోవుట, ప్రభుత్వాధికారుల చర్యలలో నాగరికత, న్యాయం లేకపోవుట, తదితర విషయాలు పేదల పై పెనుభారం మోపుతాయి. ప్రభుత్వ వ్యవస్థలో జవాబుదారీతనం మరియు బాధ్యత లోపించుట వల్ల పేద ప్రజల విద్య, ఆరోగ్యం వంటి కార్యక్రమాలు నత్త నడక నడుస్తున్నాయి.

వ్యవసాయాధారిత సమాజాలలో పేద ప్రజలకు ఆస్తులు లేకపోవడం వల్ల ధనిక భూస్వాములతో వారి సంబంధాలు యజమాని - సేవకుల రూపంలో ఉంటాయి. మహిళలకు పొదుపులు, ఆస్తులు లేకపోవుట వల్ల వారు కుటుంబ, సముదాయ నిర్ణయాలలో స్వతంత్రంగా వ్యవహించలేరు.

సాంఘిక కట్టుబాట్లు, అవరోధాలు కూడా పేదల శక్తిహీనతకు దోహదం చేస్తాయి. దాదాపు అన్ని సమాజాలలో స్త్రీ పురుష అసమానతలు కన్పిస్తాయి. కుటుంబం, భూమి, వేతనాలు, పరపతి, మార్కెట్లు తదితర విషయాలలో స్త్రీలు వివక్షతకు గురికావటం వల్ల పేదరికం అలాగే కొనసాగుతుంది. మత, జాతి, సాంఘిక అంతస్థుల వివక్షత వల్ల కూడా పేదరికం కొనసాగుతుంది.

పేదల జీవితాలలో ఎదురయ్యే నష్ట భయాలు వారిని నిస్సహాయులుగా చేస్తాయి. పేద ప్రజల యొక్క స్వల్పస్థాయి, సహజ, భౌతిక మరియు ఆర్థిక వనరులు వారిని క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొని నిలదొక్కుకునే సామర్థ్యం లేకుండా చేస్తాయి. ఆర్థిక సమస్యలు ఎదురైనపుడు పిల్లలను స్కూలు మాన్పించుట, తక్కువ ధరలకే భూమి, పశువులు అమ్మే పరిస్థితి, పోషక విలువలు లేని ఆహారం తీసుకునే పరిస్థితి, పేదల నిస్సహాయతకు నిదర్శనం.

ప్రభుత్వం లేక సముదాయం కూడా పేదలు క్లిష్ట పరిస్థితులు అధిగమించటానికి సహాయపడలేని పరిస్థితి ఉంది. సాగునీటి వసతి, మౌళిక వసతులు, ప్రజారోగ్య పరిరక్షణ, నిజాయితీ గల పోలీసు వ్యవస్థ, సరైన న్యాయ వ్యవస్థ, క్లిష్ట పరిస్థితులలో సూక్ష్మ స్థాయి పరపతి సౌకర్యం, సాంఘిక సంబంధాల సహకారం, భీమా సౌకర్యం, దుర్భిక్ష పరిస్థితులలో ఉపశమనం వంటి కార్యక్రమాలు పేదల నిస్సహాయతను తగ్గించటానికి ఉపకరిస్తాయి. వివిధ దేశాలలో భిన్నమైన అనుభవాల ఆధారంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు పేదల సంక్షేమానికి పాటు పడాలి.

పేద ప్రజలు తమ సముదాయం వెలుపల జరిగే నష్టభయాలకు గురి కాబడతారు. ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం మరియు సమాజం పై ప్రాబల్యం చూపే ప్రతికూల పరిస్థితుల వల్ల కూడా పేద ప్రజలు తీవ్రంగా నష్టపోవటం జరుగుతుంది. సమాజంలోని అంతర్యుద్ధాలు, దేశాల మధ్య జరిగే యుద్ధాలు, ఆర్థిక సంక్షోభం, ప్రకృతి వైపరీత్యాల వల్ల పేద ప్రజలు తమ జీవన ప్రమాణాలను కోల్పోవటమే కాక పేదరికం నుండి బయటపడే అవకాశాలు కూడా కోల్పోతారు. ఈ మేరకు నిలకడలేని మూలధన సమీకరణ, ప్రపంచ వ్యాప్త పర్యావరణ మార్పులు మరియు ఆయుధాల అమ్మకం వంటి అంతర్జాతీయ అంశాలు కూడా పేద దేశాలలో సంక్షోభాలకు కారణమవుతాయి. పేద ప్రజల నిస్సహాయతను మరింత పెంచే ఇటువంటి పరిస్థితులను అధిగమించుటకు అంతర్జాతీయ సంస్థలు ఆశించిన స్థాయిలో ముందుకు రాకపోవటం కూడా చర్చనీయాంశమైనది.

## 7.5 పేదరిక తగ్గింపుకు తీసుకోవలసిన చర్యలు :-

పేదరికాన్ని సమర్థవంతంగా సమూలంగా తగ్గించాలంటే ఎటువంటి చర్యలు అవసరం? పేదరిక తగ్గింపుకు అతి ముఖ్యమైనది జాతీయ ఆర్థికాభివృద్ధి. అయితే, వివిధ ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రక్రియలు ఒకదానికొకటి సహకరించుకుంటూ బలపడుతూ పేద ప్రజలను నిత్యం సమస్యలకు గురి చేయటం వల్లనే పేదరికం ఉత్పన్నమవుతుంది. ఈ నేపథ్యంలో పేదరికాన్ని తగ్గించాలంటే పేదలకు మెరుగైన అవకాశాలు కల్పించుట, సాధికారతకు వీలు కల్పించుట మరియు భద్రత పెంచుట అత్యావశ్యకము అని

చెప్పవచ్చు. అందుకు స్థానిక, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలలో చర్యలు చేపట్టవలసిన అవసరం ఉంది. ఈ మూడు రంగాలలో అన్ని స్థాయిలలో చేపట్టే చర్యల వలన పేదరిక తగ్గింపుకు మార్గం సుగమమవుతుంది.

ఈ మూడు రంగాలలో చర్యలు తీసుకోవటం అభివృద్ధి ప్రక్రియ ఎంత క్లిష్టమైనదో సూచిస్తుంది. ఆచరణలో ప్రాధామ్యాలను ఎలా నిర్ణయించాలి? అన్ని రంగాలలో అన్ని చర్యలు ఒకేసారి చేపట్టాలా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. ఈ రంగాలు వ్యూహాల పై దృష్టి పెట్టి ప్రతి దేశం యొక్క ఆర్థిక, సామాజిక, రాజకీయ, నిర్మాణ మరియు సాంస్కృతిక అంశాల నేపథ్యంలో పేదరిక తగ్గింపుకు ఎటువంటి చర్యలు, ప్రాధామ్యాలను పరిగణనలోకి తీసుకోవాలి అనేది ఆధారపడి ఉంటుంది. ఇది వివిధ దేశాలలో కాక వివిధ సముదాయాల పరంగా చేస్తే చాలా బాగుంటుంది. అంటే స్థానిక పరిస్థితుల ఆధారంగా ఈ మూడు రంగాలలో- అవకాశాలు, సాధికరత మరియు భద్రత - ఎటువంటి చర్యలు అవసరమో నిర్ణయించాలి. ఎందుకంటే ఇవన్నీ ఒకదానికొకటి సహకరించుకుంటూ పని చేస్తాయి.

అవకాశాలు కల్పించాలంటే లేక అధికం చేయాలంటే ఆర్థికాభివృద్ధి కావాలి. ఆర్థికాభివృద్ధి వేగిరంగా, నిలకడగా పేదలకు అనుకూలంగా జరగాలంటే ఏం చేయాలి? ప్రభుత్వ ప్రైవేటు పెట్టుబడులకు అనువైన వాతావరణం అంటే రాజకీయ, సామాజిక సుస్థిరత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకు అభివృద్ధి యొక్క ఫలితాలు అన్ని వర్గాలకు సమాన స్థాయిలో అందేలా చూడటం చాలా ముఖ్యం.

మార్కెట్ సంస్కరణల ద్వారా అధిక అభివృద్ధిని సాధించవచ్చు. అయితే అనుభవంలో చూస్తే ఏ దేశాలలో నిర్మాణ, వ్యవస్థాపరమైన పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయో ఆ దేశాలు పటిష్టమైన ఆర్థిక విధానాలు మరియు మార్కెట్ సంస్కరణలు లబ్ది పొందాయని చెప్పవచ్చు. అయితే ఈ పరిస్థితి చాలా అభివృద్ధి చెందుతున్న దేశాలలో కనబడదు. సాధారణంగా మార్కెట్లు పేదలకు అనుకూలంగా ఉండవు. అందుకే పేదలకు తగిన రక్షణ కవచాలను ఏర్పాటు చేయటం ఎంతైనా అవసరం. పేదలకు అనుకూలమైన మార్కెట్ సంస్కరణల పై దృష్టి సారించాలి. సూక్ష్మస్థాయి వ్యాపారాలు, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల విషయంలో నిబంధనలు అనువుగా ఉండుట, చిన్న ఉత్పత్తిదారులకు తోడ్పాటునందించుట, మరియు భీమా సౌకర్యం కల్పించుట తదితర అంశాల పై విధి విధానాలు రూపొందించాలి.

పేదల అవకాశాలు పెరగాలంటే వారి ఆస్తుల పై దృష్టి పెట్టాలి. విద్య, ఆరోగ్య అభివృద్ధి ద్వారా వారి సామర్థ్యాన్ని పెంచవచ్చు. భూమి, మౌళిక సదుపాయాలు, ఆర్థిక వనరులు పేదలకు అందుబాటులో ఉండేలా చూడాలి. పేద ప్రజలకు ఆస్తులు కల్పించే విషయంలో ప్రభుత్వం చురుకైన పాత్రను నిర్వహించాలి. సమాజంలోని అసమానతలు తొలగాలంటే అర్థవంతమైన భూ సంస్కరణలు చేపట్టాలి.

రాజకీయ ప్రక్రియలో మరియు స్థానిక నిర్ణయాధికారంలో పేదలకు పూర్తి స్థాయి భాగస్వామ్యం కల్పించాలి. ఇందుకు గల రాజకీయ, సామాజిక మరియు చట్టపరమైన అవరోధాలను తొలగించి పేదప్రజల ఆస్తులు పెంచుట ద్వారా వారు మార్కెట్ వ్యవస్థను సక్రమంగా వినియోగించుకునేలా చూడాల్సిన ఆవశ్యకత ఉంది.

ప్రభుత్వ మరియు సామాజిక వ్యవస్థలు పేదలకు అనుకూలంగా ఉంటేనే వారి ఆర్థిక అవకాశాలు మెరుగవుతాయి. ప్రజాస్వామ్య సంస్థల ద్వారా పేద ప్రజలను సమీకరించి వ్యవస్థీకృతం చేస్తే వారు ప్రభుత్వ సంస్థలు తమకు అనుకూలంగా ఉండేలాగ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ వ్యవస్థలలో పటిష్టమైన పాలన, జవాబుదారీతనం ఉండేలా చూడాలి. ప్రభుత్వాలు పేదల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కార్యక్రమాలు చేపట్టేలా ప్రజా సంస్థలు పని చేయాలి. ఇందుకు నియంత్రణ వ్యవస్థలు పటిష్టంగా తయారుచేసి, అవినీతిని తగ్గించుటకు చర్యలు తీసుకోవాలి. సమాజంలో పేరుకునిపోయిన అన్ని రకాల వివక్షతలను రూపుమాపవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా లింగ వ్యవస్థలోని వివక్షతలు తొలగిస్తే సుస్థిర అభివృద్ధి సాధించవచ్చని ఇటీవలి అనుభవాలు సూచిస్తున్నాయి.

పేదలకు భద్రత పెంచటమంటే అనారోగ్యం, ఆర్థిక సంక్షోభం మరియు ప్రకృతి వైపరీత్యాలలో వారిని ఆదుకోవటం. పేద ప్రజలను నష్టభయాలు తట్టుకునే విధంగా సమాయత్తం చేయటం ఇందులో ముఖ్యమైనది. అలాగే ప్రభుత్వాలు జాతీయ, ప్రాంతీయ స్థాయిలలో ఏర్పడే ఆర్థిక సంక్షోభాల వల్ల పేద ప్రజలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి.

పేదలకు ఆస్తులు కల్పించటం ద్వారా వారి నిస్సహాయతను తొలగించవచ్చు. ఆరోగ్య భీమా, వృద్ధాప్య ఫించనులు, నిరుద్యోగ భీమా, పొదుపులు, అప్పుల వ్యవస్థ, ఆర్థిక సహాయం వంటి చర్యల ద్వారా వారి భద్రత పెరుగుతుంది. రక్షణ కవచాలు కల్పించుట ద్వారా వారు వినియోగ అవసరాలు తీర్చుకుంటూ ఆస్తులు సమీకరించుకునేలా చేయవచ్చు. దుర్భిక్ష పరిస్థితులలో పేదలను ఆదుకోవటం ద్వారా ప్రభుత్వాలు వారికి భద్రత కల్పించవచ్చు. అలాగే సమాచారం అందుబాటులో ఉంచుట మరియు భాగస్వామ్యం పెంపుదల ద్వారా పేదల నిస్సహాయతను కొంతవరకు తగ్గించవచ్చు.

పేదల అవకాశాలను విస్తరించేందుకు తీసుకునే చర్యల వల్ల వారికి సాధికారత చేకూరుతుంది. ఆదాయం, ఆస్తులు పెరుగుట వల్ల పేద ప్రజలకు భద్రత ఏర్పడుతుంది. మార్కెట్ సంస్కరణలు పేదవారికి అనుకూలంగా మలచాలంటే వారి సాధికారత అందుకు తోడ్పడుతుంది. పేదల నిస్సహాయత తగ్గించుట ద్వారా వారి ఆర్థికాభివృద్ధి, సంక్షేమానికి బాటలు వేయవచ్చు. ఈ చర్యలు ఒకదాని పై ఒకటి ఆధారపడి ఉంటాయి.

పేదరిక తగ్గింపుకు స్థానిక, జాతీయ స్థాయిలలో తీసుకునే చర్యలతో బాటు అంతర్జాతీయ స్థాయిలో కూడా కొన్ని చర్యలు తీసుకోవాలి. ప్రపంచ ఆర్థికాభివృద్ధి, అంతర్జాతీయ మార్కెట్ల అందుబాటు, ఆరోగ్యం, వ్యవసాయం మరియు ప్రసార వ్యవస్థలలో నూతన సాంకేతిక పరిజ్ఞానం వంటి చర్యలన్నీ పేదరిక తగ్గింపుకు దోహదం చేస్తాయి. పారిశ్రామిక దేశాలలో అవలంబిస్తున్న రక్షణాత్మక ధోరణులు తగ్గించి అంతర్జాతీయ ఆర్థిక ఒడిదుడుకులు నివారించాలంటే అంతర్జాతీయ సహకారం ఎంతైనా అవసరం. అంతర్జాతీయ స్థాయిలో పేదరిక తగ్గింపుకు తీసుకోవలసిన చర్యల ప్రాముఖ్యత దృష్ట్యా అంతర్జాతీయ సంస్థలలో పేద దేశాలకు, పేద ప్రజలకు తగినంత ప్రాతినిధ్యం కల్పించాలి. పేదరికంలో మగ్గుతున్న దేశాలకు ఆర్థిక సహాయం అందేలా చూడాలి.

ఋణగ్రస్థత సమస్యను ఎదుర్కొంటున్న దేశాలకు ఆర్థిక సహాయం చేయుట అభివృద్ధి సహకారంలో ఒక ముఖ్యమైన అంశం. ఈ దేశాల ఋణగ్రస్థతను తగ్గించుట కూడా పేదరిక తగ్గింపుకు దోహదం చేస్తుంది.

## 7.6 సారాంశము :-

ఈ అధ్యాయంలో పేదరికం యొక్క నిర్వచనంతో పాటు పేదరికం యొక్క రూపురేఖలు, అందులో ఇమిడి ఉన్న వివిధ అంశాలు, పేదరిక తగ్గింపుకు తీసుకోవల్సిన చర్యలు వివరించబడినాయి. పేదరికం ప్రపంచ వ్యాప్తంగా విస్తరించబడి ఉన్నదని, పేదరికాన్ని తగ్గించాలంటే వివిధ రంగాలలో వివిధ స్థాయిలలో చర్యలు తీసుకోవలసిన అవసరం ఉన్నదని స్పష్టమవుతుంది. పేదరిక తగ్గింపుకు మూడు రంగాలలో చర్యలు అవసరం. ఇవి అవకాశాలు, సాధికారిత మరియు భద్రత. ఈ మూడు రంగాలలో తీసుకునే చర్యలు ఒక దానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. వీటితోబాటు అంతర్జాతీయ స్థాయిలో కూడా పేద దేశాలకు, పేద ప్రజలకు అనుగుణంగా చర్యలు తీసుకొని పేదరికాన్ని తగ్గించవలసిన ఆవశ్యకత స్పష్టమవుతుంది.

## 7.7 నమూనా ప్రశ్నలు :-

1. పేదరికం - వివిధ భావనలు వివరించుము?
2. గ్రామీణ పేదరికం యొక్క రూపురేఖలు విశ్లేషించుము?
3. గ్రామీణ పేదరికంలో యిమిడి ఉన్న అంశాలు పరిశీలించుము?
4. గ్రామీణ పేదరికానికి గల కారణాలు విశ్లేషించి, పేదరిక నివారణ లేక తగ్గింపుకు తీసుకోవలసిన చర్యలు సూచించుము?

5. పేదరిక ఉపశమనానికి పేదరిక తగ్గింపుకు గల తేడాను విశదీకరించుము?

6. పేదరిక తగ్గింపుకు వివిధ స్థాయిలలో వివిధ రంగాలలో తీసుకోవలసిన చర్యలు తెల్పుము?

## 7.8 చదువదగిన గ్రంథాలు :-


1. Chambers, Robert (1995) - Poverty and Livelihoods, Whose Reality Country? Beighton, Institute of Development Studies.

2. Dandekar V.M. and Rath, Nilakanta (1971) - Poverty in India, Indian School of Political Economy, Bombay.

3. Datt, G - Poverty in India and Indian states : An update, washington, International Food Policy Research Institute.

4. Kabeer, Naila (1996) - Agency, Well-being and Inequality : Reflections on the Grender Dimentions of poverty, IDS Bulletin, 27(1).

5. Paderson, Lars - Engberg (1998) - "Studying Poverty - Concepts and Approaches" in Neil Webster (Ed). In search of Alternatives : Poverty, the poor and local organisations, CDR working paper, 98.10, CDR, Copenhagen Denmark.

6. World Bank (2001) - World Development Report 2000/2001 : Attacking Poverty, Washington D.C. : World Bank.


డా॥ జి. శ్రీధర్

పాఠం - 8

# గ్రామీణ పేదరికం - కారణాలు - పేదరిక పరిమాణం - గ్రామీణాభివృద్ధిలో పేదరిక నిర్మూలనా పథకం

## 8.0 లక్ష్యం :-

ఈ పాఠం చదివిన తరువాత విద్యార్థులు ఈ క్రింది విషయాలను తెలుసుకోగలరు.

గ్రామీణ పేదరికములో వుండే సమస్యలు - పేదరికమంటే ఏమిటి? పేదరికము విశ్లేషణ - ఏ స్థాయిలో వుంది, ఎన్ని రకాలుగా విశ్లేషించవచ్చు. గ్రామీణ పేదరికం కారణాలు, గ్రామీణ పేదరిక నిర్మూలనకు ప్రభుత్వము తీసుకున్న స్వల్పకాలిక చర్యలు మరియు గ్రామీణ పేదరికమును నిర్మూలించుటకు ప్రభుత్వము తీసుకున్న దీర్ఘకాలిక చర్యలు.

## విషయసూచిక :-


8.1 ఉపోద్ఘాతము

8.2 గ్రామీణ పేదరికము - విశ్లేషణ

8.3 పేదరిక పరిమాణం

8.4 పేదరికము - కారణాలు

8.5 1950 నుండి గ్రామీణాభివృద్ధిలో భాగంగా పేదరిక నిర్మూలనా చర్యలు

8.6 పేదరిక నిర్మూలనా పథకాలు లేదా స్వల్పకాలిక చర్యలు

8.7 వివధ ప్రభుత్వ పథకాలు లేదా దీర్ఘకాలిక చర్యలు

8.8 సారాంశము

8.9 గుర్తుంచుకోవలసిన విషయాలు

8.10 కఠిన పదాలు

8.11 నమూనా ప్రశ్నలు

8.12 చదువదగిన గ్రంథాలు


## 8.1 ఉపోద్ఘాతము :-

పేదరికమనేది ఒక విపత్కరమైన పరిస్థితి. పేదరికం పేదల సమస్య మాత్రమే కాదు. ఇది ఒక సామాజిక సమస్య. సామాజిక భద్రత, స్వేచ్ఛ, మనుగడ, ప్రశాంతత, సుస్థిర అభివృద్ధి అన్నీ పేదరిక నిర్మూలన పైనే ఆధారపడి ఉన్నాయి. పేదరికం శాపం కాదు, పాపం కాదు. కొన్ని శతాబ్దాలుగా మన సమాజం సృష్టించుకున్న అస్తవ్యస్థ పర్యవసానం. పేదరికం ఎక్కడ వుంటుందో అక్కడ అభద్రత, అనారోగ్యం, నిరక్షరాస్యత, మూఢ నమ్మకాలు, దుర్వ్యసనాలు, అంటరానితనం అన్నీ చెలరేగుతుంటాయి. పుష్కలంగా లభించే భౌతిక వనరులు, సామాజిక విలువలు మరియు కొరతగా వున్న ఆర్థిక వనరులను రాతి యుగం నాటి నుండి నేటి వరకు సక్రమంగా వినియోగించుకో లేకపోవడంతో మన దేశంలో పేదరికం బహుముఖంగా విస్తరించినది. జనాభా పెరుగుదల, నిరుద్యోగము,

అల్పాదాయములు మొదలగు విస్తృత పోకడలకు నాంది పలుకుతూ, ఛేధించలేని విషవలయంగా తాండవిస్తుంది. ఛేదించడానికి దేశ ప్రజలు, ప్రభుత్వం కలసి కఠోర కృషి చేయడం ఒక్కటే మార్గము. ఈ కృషిలో భాగంగా విద్యార్థులకు భారతదేశ పేదరికం గురించి బహుముఖ విశ్లేషణ అవసరం.

## 8.2 గ్రామీణ పేదరికం - విశ్లేషణ :-

పేదరికం అనేది వివిధ కోణాలతో కూడిన దీన పరిస్థితి. అనగా కనీసావసరాలు లేకపోవడం, వనరుల పై నియంత్రణ లేకపోవడం, నిరక్షరాస్యత, కొనుగోలు శక్తి క్షీణించడం, అంటరానితనం మొదలగు వివక్షలకు గురికావడం. పేదరికం మన దేశానికి ఒక అపాయకరమైన పరిస్థితి. అభివృద్ధిని కుంటుపడేటట్లు చేసి ఆర్థిక వ్యవస్థ తిరోగమన దశకు చేరుస్తుంది. ప్రపంచ జనాభాలో రోజూ రెండు పూటలా తిండికి నోచుకోని నిరుపేదలు కోట్ల మంది ఉన్నారు. ప్రపంచంలో 48 పేద దేశాల ఆదాయం కన్నా మూడు బహుళ జాతి సంస్థల రాబడి ఎక్కువగా ఉంది. అంటే ఆదాయ అసమానతలకు ఈ పరిస్థితి పరాకాష్ట. ప్రపంచ దేశాలు ఆయుధాల కోసం చేస్తున్న వ్యయంలో ఒక్క శాతాన్ని వెచ్చిస్తే పేద దేశాల్లోని పిల్లలందరూ అక్షరాస్యులవుతారు అని ఆంక్టాడ్ తాజ్ నివేదిక. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, అభివృద్ధి చెందిన దేశాలు, బహుళ జాతి సంస్థలు సంయుక్తంగా కృషి చేస్తే పేదరికాన్ని తగ్గించడం కష్టం కాదు. అవసరాల తీవ్రత వ్యక్తుల మధ్య సంబంధాలను దెబ్బ తీస్తుంది. ఇటువంటి పేదరికాన్ని విశ్లేషించుటకు లేదా కొలుచుటకు తలసరి ఆదాయము ముఖ్యమైన సూచిక. దీనితోపాటు తలసరి వినియోగ వ్యయము, జాతీయ కనీసావసరాల భావనలను మన దేశంలో పేదరికానికి కొలబద్ధగా తీసుకోవడం అవసరం. సామాజిక శాస్త్రవేత్తలు మరియు ఆర్థికవేత్తలు పేదరికాన్ని వేర్వేరు దృక్పథాలతో పరిశీలిస్తున్నారు. ఆర్థికవేత్తలు ఆదాయ వనరుల లభ్యత మరియు ఆదాయ అసమానతల ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని కనీస జీవన ప్రమాణ స్థాయికి కావలసిన తలసరి ఆదాయాన్ని నిర్ణయించి ఆ స్థాయిని పొందలేని జనాభాను పేదరికం కోరల్లో చిక్కుకున్న వారు అని అంటున్నారు. సామాజిక శాస్త్రవేత్తలు గ్రామీణ పేదరికాన్ని ఆదాయ సంబంధిత అంశాలు మరియు మానవ వనరుల సంబంధిత అంశాల ద్వారా వివరించినారు. తలసరి ఆదాయము, తలసరి వినియోగ వ్యయము మరియు తలసరి ఉపాధి అవకాశాలు మొ॥నవి. ఆదాయ సంబంధిత అంశాలు అని, తలసరి విద్య, వైద్య సదుపాయాలు, రోడ్డు రవాణా సౌకర్యాల లభ్యత, ఆర్థిక మరియు సామాజిక అవస్థాపనా సౌకర్యాలు మొ॥నవి. మానవ వనరుల సంబంధిత అంశాలుగా గుర్తించి వాటి లభ్యతను బట్టి పేదరికాన్ని విశ్లేషించినారు. టీన్‌సెండ్ (Tensend) ఉద్దేశ్యంలో పేదలు అనగా సగటు స్థాయి కన్నా అత్యల్ప ఆదాయ వనరులుండడం కారణంగా సమాజంలో సభ్యులు ఆర్థిక మరియు సామాజిక వనరులను పొందలేని వారు అని పేర్కొన్నారు. పేదరికాన్ని రెండు రకాలుగా విశదీకరించడం జరిగినది. 1. సాపేక్ష పేదరికం, 2. నిరపేక్ష పేదరికం.

1. **సాపేక్ష పేదరికం :-** సాపేక్ష పేదరికాన్ని సంపన్న దేశాలలో చూస్తారు. ఆదాయ అసమానతలను ఆధారంగా సాపేక్ష పేదరికాన్ని గుర్తిస్తాము. అత్యధిక ఆదాయ వర్గంలోని 5 నుండి 10 శాతం జనాభా యొక్క వినియోగ స్థాయి మరియు జీవన శైలిని అత్యల్ప ఆదాయ వర్గంలోని 5 నుండి 10 శాతం జనాభా యొక్క వినియోగ స్థాయి మరియు జీవనశైలితో పోల్చి పేదరిక స్థాయిని నిర్ణయించడం. మన దేశంలో ఆదాయ అసమానతలు ఎక్కువగా వున్నందున సాపేక్ష పేదరికం శాతం కూడా ఎక్కువగా ఉన్నది. నిరపేక్ష పేదరికం ద్వారా మన దేశ ప్రజల స్థితిగతులను ఎక్కువగా పరిశీలించగలము.

2. **నిరపేక్ష పేదరికం :-** ఇది అభివృద్ధి చెందుతున్న దేశాలలో వుండే పరిస్థితి. జాతీయ కనీసావసర వ్యయం చేయుటకు తగిన ఆదాయం పొందలేని వారు అనగా ఆకలిగా వున్నపుడు తినడానికి తిండి, వేసుకోవడానికి వస్త్రములు మరియు వుండుటకు ఇల్లు లేక మనోభావాలు దెబ్బతీసే జీవనాన్ని కొనసాగించే వారిని నిరుపేదలని, ఆ పరిస్థితిని నిరపేక్ష పేదరికం అని పేర్కొనడం జరిగినది. అనగా వ్యవసాయ కూలీలు, నిత్యం కూలి పై ఆధారపడేవారు, వెట్టిచాకిరీ చేసేవారు, ఒంటరి స్త్రీలు, జోగినీలు, ఏ ఆధారం లేనివారు, భూమి లేని వారిని "నిరుపేదలు" అంటాము.

పై విశ్లేషణ ఆధారంగా తీసుకుని మన దేశంలో పేదరిక పరిమాణాన్ని అంచనా వేయవచ్చును.

## 8.3 గ్రామీణ పేదరిక పరిమాణం :-

మన దేశంలో గ్రామీణ పేదరికాన్ని అంచనా వేయడానికి దారిద్ర్య రేఖను ఆధారంగా తీసుకుంటారు. ఐక్యరాజ్య సమితి వారి ఆహార వ్యవసాయ సంస్థ డైరెక్టర్ జనరల్ బాయ్డ్ - ఒర్ "ఆకలి రేఖ" భావన ఆధారంగా దారిద్ర్యరేఖ స్థాయిని నిర్ణయించడం జరిగినది. గ్రామీణ ప్రాంతాలలో సగటున ఒక వ్యక్తికి రోజుకు 2400 కాలరీలు శక్తి నివ్వడానికి కావలసిన ఆహార అవసరాలు పొందలేని వారిని ఆకలి రేఖ మీద ఉన్నట్లు గుర్తించారు. ప్రణాళికా సంఘం పైన పేర్కొనిన కనీసావసరాలు పరిమాణాన్ని పొందలేని వారిని దారిద్ర్యరేఖకు దిగువన వున్న వారిగా గుర్తించినారు. దారిద్ర్యరేఖ స్థాయికి కావలసిన కాయ ధాన్యాలు, పప్పు ధాన్యాలు, పాలు, వెన్న మొదలైన వస్తువుల పరిమాణాన్ని ఆయా వినియోగ వస్తువుల ధరలతో వెచ్చించి, కనీసావసరాల వస్తువుల ద్రవ్య విలువను కలిపి కనీస తలసరి వినియోగ వ్యయంను నిర్ణయించి ఆ వ్యయానికి తగిన ఆదాయాన్ని పొందలేని వారిని దారిద్ర్య రేఖ దిగువన వున్న వారని పేర్కొన్నారు. సుభాత్మ అంచనాల ప్రకారం పోషక విలువలతో కూడిన కనీస జీవన స్థాయికి కావలసిన కేలరీలు పొందలేని వారే దారిద్ర్య రేఖకు దిగువన వున్న వారని పేర్కొన్నారు.

ఓఝా పేదరికం అంచనాల ప్రకారంగా 1960 - 61 ధరలలో మనిషికి రోజుకు 2250 కాలరీల శక్తినిచ్చే ఆహారం కోసం గ్రామీణ ప్రాంతాలలో తలసరి వినియోగం రూ॥ 8 - 11 గల వారు, గ్రామీణ జనాభాలో 51.8 శాతం అనగా 184 మిలియన్లు వున్నారు. అదే పట్టణ ప్రాంతాలలో తలసరి వినియోగం రూ॥ 15 - 18 గల జనాభా 7.6 శాతం అనగా 6 మిలియన్లు ఉన్నారు. 1960 - 61లో మొత్తం దేశ జనాభాలో 44 శాతం పేదరికంలో వున్నారు. అనగా 190 మిలియన్లుండగా 1967 - 68 నాటికి గ్రామీణ ప్రాంతాలలో జనాభాలో 70 శాతం అంటే 289 మిలియన్లు పేదరికంలో వున్నారు. అదే విధంగా ధండేకర్, రాత్‌లు ప్రకారం 2250 కాలరీలను కనీస ప్రమాణంగా తీసుకుని 1968 - 69 ధరలలో గ్రామీణ ప్రాంతాలలో తలసరి ఆదాయం నెలకు రూ॥ 324. అయితే పట్టణ ప్రాంతాలలో రూ॥ 486గా వుండవలెనని నిర్ణయించినారు. ఈ ప్రకారంగా గ్రామీణ ప్రాంతాలలో 40 శాతం, పట్టణ ప్రాంతాలలో 50 శాతం పేదరికంలో ఉన్నట్లు పేర్కొన్నారు.

మిన్హాస్ ప్రకారం 1967 - 68లో గ్రామీణ జనాభాలో 50.6 శాతం తలసరి వార్షిక వినియోగం రూ॥ 240 గా వుండి పేదరికంలో వున్నట్లు అంచనా.

బర్దన్ అంచనాల ప్రకారం గ్రామీణ పేదరికం 1960 - 61లో 38 శాతం వుంటే 1968 - 69 నాటికి 54 శాతానికి పెరిగినట్లు అంచనా.

మాంటెక్ అహు వాలియా ప్రకారం గ్రామీణ పేదరికం 1956 - 57లో 54.1 శాతం వుండగా 1973 - 74కు 46.1 శాతానికి తగ్గినట్లు అంచనా. పేదరికం తీవ్రత పంటలు బాగా వున్న సంవత్సరాలలో తగ్గడం, పంటలు విఫలమైన సంవత్సరాలలో ఎక్కువగా వుండటంతో పాటు దారిద్ర్యరేఖ వ్యయం 1960 - 61 ధరలలో గ్రామీణ ప్రాంతాలలో రూ॥ 15గా పేర్కొన్నారు.

ప్రపంచ బాంకు అంచనాల ప్రకారం భారతదేశంలో గ్రామీణ ప్రాంతాల పేదరికం 1970లో 53 శాతం వుంటే 1988 నాటికి 42 శాతానికి తగ్గినది. సంఖ్యా రూపంలో అదే సమయంలో పేదవారి సంఖ్య 237 మిలియన్ల నుండి 252 మిలియన్లకు పెరిగినది. అయితే పట్టణ పేదరికం 1970లో 45.5 శాతం వుంటే 1988కి 39.6 శాతానికి తగ్గినది. సంఖ్యా రూపంలో అదే సమయంలో 50.5 మిలియన్ల నుండి 70.1 మిలియన్లకు పెరిగినది. వీరిలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల వారు మూడవ వంతు వున్నారు.

భారతదేశములో పేదరికం అంచనాలను డా॥ గోపాల్, సుమన్ చక్రీలు ఈ క్రింది పట్టిక ద్వారా తెలిపినారు. 2007 నాటికి పేదరికపు ప్రవృత్తి అంచనాలను కూడా పేర్కొన్నారు.

| సం॥ము | పేదల సంఖ్య మిలియన్లలో | | | పేదరికం శాతం | | |
|---|---|---|---|---|---|---|
| | గ్రామీణ | పట్టణ | ఉమ్మడి | గ్రామీణ | పట్టణ | ఉమ్మడి |
| 1973 - 74 | 261.3 | 60.0 | 321.3 | 56.4 | 49.0 | 54.9 |
| 1977 - 78 | 264.3 | 64.6 | 328.9 | 53.1 | 45.2 | 51.3 |
| 1983 | 252.0 | 70.9 | 322.9 | 45.7 | 40.8 | 44.5 |
| 1987 - 88 | 231.9 | 75.2 | 307.1 | 39.1 | 38.2 | 38.9 |
| 1993 - 94 | 244.0 | 76.3 | 320.3 | 37.3 | 32.4 | 30.0 |
| 1999 - 2000 | 193.2 | 67.1 | 260.3 | 27.1 | 23.6 | 26.1 |
| 2007 | 170.5 | 49.6 | 220.1 | 21.1 | 19.3 | 19.3 |

పట్టికలో ఇవ్వబడిన సుమన్ మరియు గోపాల్‌ల అంచనాల ప్రకారం సగటున మనిషికి 2250 కాలరీల పౌష్టికాహారం వుండవలెనని, ఇందుకు అవసరమైన కనీస తలసరి నెల వ్యయం గ్రామీణ ప్రాంతాలలో 1999 - 2000 ధరలలో రూ॥ 486.08 వుండవలెనని, పట్టణ ప్రాంతాలలో రూ॥ 854.96 గాను, ఉమ్మడిగా రూ॥ 590.98గా వుండవలెనని ఈ మేరకు తలసరి వ్యయం చేయుటకు ఆదాయం లేని వారిని పేదరికపు రేఖకు దిగువన వున్న వారిగా పేర్కొన్నారు. ఇటువంటి జనాభా 1999 - 2000 నాటికి మన దేశంలో గ్రామీణ ప్రాంతాలలో 27 శాతం అనగా 193.2 మిలియన్లని 2007 నాటికి ఈ జనాభా 170.5 మిలియన్లకు తగ్గుతుందని అంచనా.


1973 - 74లో పై పట్టిక ప్రకారం దేశ జనాభాలో 54.9 సాతం అనగా 321.3 మిలియన్ల పేదరికం గీతకు క్రింద వున్నారు. అయితే మొత్తం పేదరిక జనాభాలో 56.4 శాతం గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు. 1977 - 78 నాటికి గ్రామీణ పేదరిక జనాభా 53.1 శాతంనకు తగ్గుతూ 1999 - 2000 నాటికి 27.1 శాతం అనగా 193.2 మిలియన్లుండగా, పట్టణ ప్రాంతంలో 23.6 శాతం అనగా 67.1 మిలియన్లు వున్నారు. 2007 నాటికి గ్రామీణ పేదరిక జనాభా 170.5 మిలియన్లు అనగా 21, 1 శాతం గాను, పట్టణ ప్రాంత పేదరిక వర్గం వారు 49.6 మిలియన్లు అనగా 15.1 శాతంగానూ తగ్గుతుందని అంచనా వేశారు. అయితే పేదరిక నిర్మూలనా కార్యక్రమాలను వ్యూహాత్మకంగా అమలు చేయడం వలన గ్రామీణ పేదరికం జనాభా తగ్గుదలకు కారణమని గోపాల్ మరియు సుమన్ చక్రీలు తెలియజేశారు. 1973 నుండి పేదరిక అంచనాలు వేయడానికి మంచి కృషి జరిగినది. దారిద్ర్యరేఖను నిర్ణయించుటకు ప్రైవేటు వ్యక్తుల వినియోగం మరియు ప్రభుత్వ వ్యయాన్ని జత చేయడం జరిగినది. ప్రభుత్వ వ్యయమనగా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, నీటి సరఫరా, పరిశుభ్రత, విద్య, పాలనా సంబంధిత పోలీసు జైళ్ళు, కోర్టులు, రోడ్లు, సాంఘీక సంక్షేమ ఖర్చు మొదలైనవి. ఈ వ్యయాలను ఆధారంగా తీసుకుని వృద్ధి చేసిన దారిద్ర్యరేఖను నిర్ణయించి 1999 - 2000 నాటికి 260.3 మిలియన్లు (మొత్తం జనాభాలో 26.1 శాతం)గాను, గ్రామీణ ప్రాంతాలలో 193.2 మిలియన్లు (మొత్తం జనాభాలో 27.1 శాతం) గాను మరియు పట్టణ ప్రాంతాలలో 67.1 మిలియన్లు (మొత్తం జనాభాలో 20.6 శాతం) గాను వున్నారు. దేశం మొత్తం మీద 13 రాష్ట్రాలలో పేదరికం గీతకు దిగువన వున్న వారు ఎక్కువ శాతంలో వున్నారు. ఆంధ్రప్రదేశ్ కూడా వీటిలో ఒకటిగా మనం గమనించుకోవాలి.

## 8.4 పేదరికము - కారణాలు :-


ఏదైనా ఒక దేశం వెనుకబడి ఉండడానికి కారణం ఆ దేశం హానికరమైన పేదరికపు విష వలయంలో కొనసాగడమే. ఆ

భావనను రగ్నార్‌నర్క్స్ (Ragnar Nurkse), రూపొందించాడు. దీనిలో అభివృద్ధి చెందుచున్న దేశాలలో కొన్ని శక్తులు చక్రగతిని ఒక దాని పై మరొకటి ప్రభావం కలిగి వుంటాయి. ఆ శక్తుల ప్రభావం వలన ఒక పేద దేశం, పేద దేశం గానే మిగిలిపోతుంది. అందుచేతనే ఒక దేశం ఎందుకు పేదగా ఉందంటే అది అతి పేద దేశం కాబట్టి అనే సూక్తి ప్రచారంలోనికి వచ్చింది. ఈ పేదరికపు చక్రం ఈ దేశాలలో డిమాండ్, సప్లయిల రెండు వైపుల నుండి పని చేస్తుంది. ఇది ఏ విధంగా జరుగుతుందో ఈ క్రింది పటాలు తెలియచేస్తాయి.

**డిమాండు వైపు పేదరిక చక్రం**




**సప్లయి వైపు పేదరికపు చక్రం**




పై పటాలను బట్టి పేదరికపు చక్రం ఏ విధంగా పని చేస్తుందో మనం చూద్దాము. డిమాండు వైపు చక్రాన్ని పరిశీలిస్తే తక్కువ ఉత్పాదకత, సహజంగానే తక్కువ ఆదాయానికి దారి తీస్తుంది. ఆదాయం తక్కువగా ఉన్నపుడు వస్తు సేవలకు డిమాండు కూడా తక్కువగానే ఉంటుంది. డిమాండ్ తక్కువగా ఉన్నపుడు ఎక్కువ పెట్టుబడి, తక్కువ మూలధనం సంచయనం ద్వారా మూలధనం కొరతకు దారి తీస్తుంది. ఇదే సప్లయి వైపు చక్రాన్ని పరిశీలిస్తే తక్కువ ఉత్పత్తి, తక్కువ ఆదాయానికి, తక్కువ ఆదాయం తక్కువ పొదుపునకు దారి తీస్తుంది. ప్రజల పొదుపు చేసే శక్తి తక్కువగా ఉండడం వలన పెట్టుబడి కూడా తక్కువగానే ఉంటుంది. తక్కువ పెట్టుబడి సహజంగానే మూలధనం కొరతకు దారి తీస్తుంది.

ఈ రెండు విధానాలు గానే గాక మెయిర్, బాల్డ్విన్‌లు మూడవ పేదరికపు చక్రాన్ని గూర్తించారు. అది సహజ వనరులను ఉపయోగంలోనికి తీసుకురాకపోవడం వలన ఏర్పడుతుంది. వీరి ప్రకారం మార్కెట్‌లో ఉండే అస్తవ్యస్త విధానాలు, సహజ వనరులు పూర్తిగా వినియోగంలోకి రాకుండా అడ్డుపడతాయి. ఆ విధంగా సహజ వనరులు సరిగ్గా ఉపయోగించకపోవడం ప్రజలలో పేదరికానికి దారి తీస్తుంది.

విష వలయంలో చిక్కుకున్న భారతదేశ పేదరికానికి గల కారణాలు, నివారణ చర్యలను గురించి ఆర్థిక విశ్లేషకులు, సంఘ సంస్కర్తలు, పరిశోధకుల అధ్యయనాలు విశ్లేషణకు పరిమితమయి సక్రమమైన ఫలితాలు పొందుట లేదు. పటిష్టమైన నిర్మూలనా చర్యలను అమలుపరుచుటకు పేదరికమునకు వివిధ కారణాలు తెలుసుకొనుట అవసరం.

1. **అల్పాదాయాలు :-** దేశ జనాభాలో ఎక్కువ భాగం కనీస నిత్యావసరాలను కూడా పొందలేరు. భారతదేశంలో ఆర్థికవృద్ధి రేటు సంవత్సరానికి 1.5 శాతానికి మించి పెరగడం లేదు. పెరుగుతున్న జనాభాకు కావలసిన ఆర్థిక వృద్ధిరేటు తక్కువగా వుండి తక్కువ తలసరి ఆదాయం ఏర్పడి ప్రజల జీవన ప్రమాణ స్థాయి పడిపోయి, ఆదాయ అసమానతలు పెరిగి పేదరికపు స్థాయి నానాటికి పెరుగుతుంది.

2. **జనాభా పెరుగుదల :-** జనాభా పెరుగుదల ఆర్థికాభివృద్ధికి ప్రతిబంధకంగా ఏర్పడుతుంది. మన దేశంలో 1901లో జనాభా 23.84 కోట్ల నుండి 2001 నాటికి 102.70 కోట్లకు పెరిగినది. జనాభా పెరుగుదల రేటు పురోగామాభివృద్ధిలో వున్నది. అనగా 5.75 శాతం నుండి 330.80 శాతం వరకు పెరిగినది. ప్రపంచ జనాభాలో రెండవ స్థానాన్ని ఆక్రమించినది. 1911 నుండి 1921 వరకు జనాభా క్షీణదశలో వుండగా, 0.56 నుండి 0.03కు తగ్గితే, 1921 నుండి 1991కు 2.14 శాతానికి పెరిగి 2001 నాటికి 1.93 శాతానికి తగ్గినది. అయితే జనాభా పెరుగుదల ఉత్పత్తి పెరుగుదల కంటే 2 రెట్లు ఎక్కువగా వుంటుంది. ఉత్పత్తి పెరుగుదల రేటు 1.2 శాతం వుంటే జనాభా పెరుగుదల 2.14 అయినచో ఆహార ధాన్యాల కొరత, వస్తూత్పత్తి డిమాండుల మధ్య అంతరం ఎక్కువై ప్రజల కనీసావసరాలు కూడా తీరక పేదరికం తీవ్రతరమవుతున్నది.

3. **అసమానతలు :-** ఆదాయ సంపదల పంపకంలో అసమానతలు విపరీత ధోరణులలో వుంది. సహజ వనరులు మరియు సాంకేతిక వనరుల పంపిణిలో అసమానతలు, గ్రామ ప్రాంతాలలో భూకమతాలు మరియు పశువులు, పట్టణ ప్రాంతాలలో యంత్ర సామాగ్రి, భవనాలు, చర మూలధనం పరపతి వనరుల పంపిణీలో అసమానతల వలన తలసరి ఆదాయమును పెంచుకున్న ధనికులు పొదుపు మరియు మూలధన సంచయనాన్ని పెంచుకుని అధిక పెట్టుబడులు పెట్టి అధిక లాభాలు గడించి మరింత ధనికులుగా మారుతున్నారు. కాబట్టి ఈ ఆదాయ అసమానతలు ధనికుల్ని మరింత ధనికులు గాను, పేదవారిని మరింత పేదవారుగా చేస్తుంది. మన జాతీయాదాయంలో 61 శాతాన్ని గ్రామాలలోని 50 శాతం మంది ధనికులు అనుభవిస్తుంటే 31 శాతం జాతీయాదాయాన్ని మిగిలిన వారు అనుభవిస్తున్నారని రిజర్వు బాంకు పేర్కొంది.

4. **నిరుద్యోగం :-** నిరుద్యోగానికి పేదరికానికి సహసంబంధం ఉన్నది. పేదవారిలో ఎక్కువ భాగం నిరుద్యోగులు. మన దేశంలోని నిరుద్యోగులలో గ్రామీణ ప్రాంతాలలో ప్రచ్ఛన్న నిరుద్యోగులు, పట్టణ ప్రాంతాలలో విద్యాధికుల నిరుద్యోగం ఎక్కువగా వున్నది. నిరుద్యోగము ఆర్థిక అసమానతలను పెంచుతుంది ఆర్థికాభివృద్ధికి ప్రతిబంధకంగా వుంటుంది. 1983లో 21.76 మిలియన్లు అంటే 8.3 శాతం నిరుద్యోగులుండగా 2000 నాటికి 26.58 మిలియన్లు 7.32 శాతానికి పెరిగింది. అనగా 1993 నుండి 2000 నాటికి 4.74 శాతానికి పెరిగినది. గ్రామీణ ప్రాంతాలలో 16.26 మిలియన్లుండగా 2000 నాటికి 19.50 మిలియన్లకు పెరిగినది. 1980 అంచనాల ప్రకారం సుమారు 33 మిలియన్ల మంది అల్ప ఉద్యోగితకు, 17 శాతం మంది ప్రచ్ఛన్న నిరుద్యోగితకు గురవుతున్నట్లు తెలుస్తున్నది. తత్ఫలితంగా ఋతుసంబధమైన నిరుద్యోగిత ఏర్పడుతుంది. తద్వారా ఉపాంత ఉత్పత్తి తగ్గి ఆదాయాలు పడిపోయి పేదరికం ఏర్పడుతుంది.

5. **ప్రాంతీయ అసమానతలు :-** ప్రాంతీయ అసమానతల వలన కొన్ని ప్రాంతాల ప్రజలు పేదరికంలో మరికొన్ని ప్రాంతాల ప్రజలు భాగ్యవంతులుగాను వున్నారు. బీహార్, ఒరిస్సా, రాజస్థాన్, యు.పి., యం.పి.లు వెనుకబడి వుండడం వల్ల ఆ రాష్ట్రాలలో పేదరికం ఎక్కువగా వుంది.

6. **అల్పస్థాయి ఉత్పత్తి మరియు అల్పస్థాయి వినియోగం :-** నిత్యావసరాల లభ్యత తక్కువగా వుంటే పేదరికం పెరుగుతుంది. ప్రణాళికాభివృద్ధి కాలంలో నిత్యావసరాల తలసరి లభ్యత పెరిగినది. కాయ ధాన్యాల తలసరి లభ్యత 1951లో రోజుకు 360 గ్రాములుంటే, 1985కు 424 గ్రాములకు పెరిగినది. పప్పు ధాన్యాల లభ్యత అదే సమయంలో 70 గ్రాముల నుండి 39 గ్రాములకు తగ్గినది. వంటనూనె తలసరి లభ్యత సంవత్సరానికి 2.5 కిలోల నుండి 5.5 కిలోలకు పెరిగనది. ఈ తలసరి పరిమాణాలు ధరల ప్రభావం వలన మనిషికి రోజుకు కావలసిన పరిమాణంలో పేదవారు వినియోగించరు. తద్వారా పేదవారి తలసరి వినియోగం అల్పస్థాయిలో వుంటుంది. ఒక వినియోగ వస్తువులే కాక భూమి, నీరు మొదలగు సహజ వనరుల తలసరి వినియోగం కూడా తక్కువగా వుంటుంది. మన

దేశంలో 350 మిలియన్లు హెక్టార్ల వ్యవసాయ భూమి వుండగా 44 శాతము మాత్రమే సాగుచేయుచున్నది. అదే విధంగా మనకు లభించే నీటి పరిమాణంలో 30 శాతం మాత్రమే ఉపయోగించుకుంటున్నాము. మన దేశంలో సౌరశక్తి, అణుశక్తి మొదలగునవి సక్రమంగా వినియోగించుకోవడానికి తగిన సాంకేతిక విజ్ఞానం లేదు. పెరుగుతున్న జనాభా అవసరాలకు కావలసిన ఉత్పత్తిని పెంచలేక అల్పాదాయాలు పేదరికానికి దారి తీస్తుంది.

7. **ద్రవ్యోల్బణం :-** ధరలు పెరిగితే కొనుగోలు శక్తి తగ్గుతుంది. మన దేశంలో పెరుగుతున్న జనాభాకు కావలసినంత నిత్యావసరాల ఉత్పత్తి పరిమాణం పెరగక అధిక డిమాండు వలన ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. నిత్యావసరాల ఉత్పత్తిని పెంచుట అభివృద్ధి వ్యూహంలో ఒక అల్ప భాగం మాత్రమే. ఆధునిక విజ్ఞానం లభ్యతతో ఈ హైటెక్ యుగంలో నిరుద్యోగిత పెరుగుతుంది. తద్వారా ఆదాయాలు పడిపోయి పెరుగుతున్న ధరలలో కొనుగోలు శక్తి తగ్గి ద్రవ్యోల్బణము ఏర్పడి పేదరికం నానాటికి పెరుగుతుంది.

8. **రాజకీయ మరియు సాంఘిక అంశాలు :-** 1947కు పూర్వం వలస ఆర్థిక వ్యవస్థగా వున్న మన దేశంలో ఆర్థిక ప్రగతి కుంటుపడినది. 1947 తరువాత స్వేచ్ఛా వ్యాపారానికి అనుకూలంగా పారిశ్రామిక రంగం అభివృద్ధి లేకపోవడం, దేశంలో 70 శాతం జనాభా వ్యవసాయ రంగం మీద ఆధారపడడం మరియు చిత్తశుద్ధి లేని పాలకులు, రాజకీయ అనిశ్చిత పరిస్థితులు, ఆర్థికాభివృద్ధికి ఆటంకాలుగా ఏర్పడి పేదరికం 1970 నాటికి తారాస్థాయికి చేరుకుంది.

మన సాంఘీక వ్యవస్థలో ఉమ్మడి కుటుంబ ప్రాబల్యము, కులమత ఆచారాలు, అజ్ఞానం మరియు మూఢనమ్మకాలు, నిరక్షరాస్యత, కర్మ సిద్ధాంతంనకు ఎక్కువ ప్రాధాన్యత మొదలగునవి కాగా ప్రాచీన ఉత్పత్తి పద్ధతులు, కుల వివక్షత, సాంఘీక దురాచారాలు, అధికవడ్డీలు, పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, రవాణా సౌకర్యాలు లేకపోవడం, సాగునీరు లేకపోవడం, పేదవారికి రాజకీయ అధికారం లేకపోవడం, లంచగొండితనం, కరువు కాటకాలు, సంవత్సరంలో ఎక్కువ కాలం పని దొరకకపోవడం మొదలగు కారణాలు పేదరికాన్ని ఎక్కువ చేస్తున్నాయి.

## 8.5 1950 నుండి పేదరిక నిర్మూలనా చర్యలు - గ్రామీణాభివృద్ధి :-

1950 నుండి జరుగుతన్న ప్రణాళికాభివృద్ధి కృషిలో భాగంగా గ్రామీణ పేదరికాన్ని నిర్మూలించి తద్వారా గ్రామీణాభివృద్ధిని సాధించుటకు అనేక చర్యలు చేపట్టడం జరిగినది. కొన్ని వ్యవస్థాపూర్వకమైన మార్పులకు సంబంధించినవి మరికొన్ని అభివృద్ధికి సంబంధించినవి. వ్యవస్థా పూర్వక చర్యలు దీర్ఘకాలానికి సంబంధించినవి. అభివృద్ధికి సంబంధించిన చర్యలు స్వల్పకాలంలో పేదరిక నిర్మూలనకు తోడ్పడతాయి. పేదరిక నిర్మూలనా చర్యలు రెండు రకాలుగా విభజించవలెను.

1. స్వల్పకాలిక చర్యలు, 2. దీర్ఘకాలిక చర్యలు.

## 8.6 స్వల్పకాలిక చర్యలు :-

అభివృద్ధి చెందుతున్న మన దేశంలో అభివృద్ధితోపాటు ద్రవ్యోల్బణం వుంటుంది. ద్రవ్యోల్బణం వలన పేదరికంలో వున్న వారి ఆర్థిక పరిస్థితి దెబ్బతింటుంది. పేదరికం నిర్మూలనకు ఉద్యోగిత కల్పించాలి. అల్ప ఉద్యోగితలో వున్న వారికి ఉత్పాదకతను పెంచాలి. వాటిలో ముఖ్యమైనది గరీబీ హటావో కార్యక్రమం. ఈ కార్యక్రమం ఐదవ ప్రణాళికలో పేదరిక నిర్మూలనకై ప్రత్యేకంగా అమలులో పెట్టినది. తద్వారా ఎనిమిదవ ప్రణాళికా కాలానికి గ్రామీణ పేదరికం 39.14 శాతం 231 మిలియన్లు నుండి 2000 నాటికి 27.1 శాతానికి తగ్గుతుందని ఆశించారు. ఏడవ ప్రణాళికా కాలంలో అనగా 1983లో పేదవారి సంఖ్య 252 మిలియన్లు అనగా 45.7 శాతానికి చేరుకుంది. అదే ప్రకారంగా 2007 నాటికి అంటే పదవ ప్రణాళికా చివరి నాటికి గ్రామీణ పేదరికపు జనాభాను 170.5 మిలియన్లకు అనగా 21.1 శాతానికి తగ్గించాలని నిర్దేశించడమైనది. అందుకై పేదరిక నిర్మూలనకు ఈ క్రింది పేర్కొన్న పథకాలను దశల వారీగా అమలుపరుస్తూ వచ్చారు.

1. **పేదరిక నిర్మూలనా పథకాలు** R.W.P., S.F.D.A., M.F.A.L.D.A., E.G.P. :- గ్రామీణ పనుల కార్యక్రమం, చిన్న రైతుల అభివృద్ధి ఏజన్సీ, ఉపాంత రైతుల మరియు వ్యవసాయ కూలీల అభివృద్ధి ఏజన్సీ. వర్షాభావ ప్రభావిత ప్రాంతాల కార్యక్రమం, పనికి ఆహార పథకం, ఉద్యోగ హామీ పథకం మొదలైన పథకాలను ప్రవేశపెట్టి ఉద్యోగావకాశాలను కల్పించడం ద్వారా ఆదాయాలు, ఉత్పత్తిని పెంచి పేదరికాన్ని నిర్మూలించవచ్చని ప్రభుత్వం నిశ్చయించినది.

2. **సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం** (I.R.D.P.) :- పైన పేర్కొన్న పథకాలన్నింటిని అమలు చేయడంలో పాలనాపరంగా వున్న ఇబ్బందులను తొలగించుటకు 1980 అక్టోబరు 2వ తేదీన సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకము ద్వారా పైన పేర్కొనబడిన వివిధ పథకాలన్నింటిని అమలులో పెట్టడం జరిగినది. సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకంలో పేదరికం నిర్మూలనకు ప్రత్యక్ష చర్యలను తీసుకోవాలని నిర్ణయించినారు. ఈ పథకం ద్వారా 1986 నాటికి 30.61 లక్షల మంది, 1987 నాటికి 37.47 లక్షల మంది లబ్ధిపొందారు. ప్రత్యేకంగా 1993 - 94 నాటికి 8.54 లక్షల మంది గ్రామీణ ప్రాంతాలలో పేద మహిళలకు ఆర్థిక సహాయాన్ని అందించడమైనది. 1992 నాటికి ప్రణాళికలలో ఈ పథకానికి వివిధ శ్రేణులలో వనరుల కేటాయింపు జరిగినది.

3. **పనికి ఆహార పథకం** (F.W.P. - Food for Work Programme) :- ఆరవ పంచవర్ష ప్రణాళికలో పేదరికపు గీతకు దిగువన ఉన్న జనాభా క్రమేపి పెరుగుతుండడం రాజకీయ అస్థిరత్వం వలన ఆహార ధాన్యాల పంపిణీ సక్రమంగా లేక 20 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల బఫర్ నిల్వలను దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి పంచుటకు 1977లో పనికి ఆహార పథకాన్ని ప్రవేశ పెట్టినారు. ఈ పథకం ద్వారా శాశ్వత ఆస్తులు సృష్టించడానికి సాంఘీక అవస్థాపనా సౌకర్యాలను పటిష్ఠం చేయడానికి గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉద్యోగితను కల్పించి ఆహార ధాన్యాల నిల్వలను నిజ వేతనాల రూపంలో చెల్లించుటకు పంచాయితీలు, మండలాలు, జిల్లా పరిషత్‌లు అమలు పరిచేటట్లుగా రూపొందించినారు. 1979 - 80లో కేంద్ర ప్రభుత్వం 27 లక్షల టన్నులను కేటాయించగా రాష్ట్రాలలో 50 శాతం మాత్రమే ఉపయోగించినారు. ఈ పథకంలో పనిచేసే వారిలో 70 శాతం శ్రామికులకు, 22.4 శాతం రైతులకు ఉద్యోగిత లభించినది. ఈ పథకం ద్వారా సమాజ ఆస్తులు అనగా పాఠశాల భవనాలు, ఆస్పత్రులు, మంచినీటి బావులు, వరద నివారణ, చెరువుల త్రవ్వకం పెరిగినది.

4. **జాతీయ గ్రామీణ ఉద్యోగితా పథకం** (N.R.E.P.) :- పనికి ఆహార పథకమునే 1980 అక్టోబరు నుండి జాతీయ గ్రామీణ ఉద్యోగితా పథకంగా పేరు మార్చారు. ఈ పథకం కింద శాశ్వత సమాజ ఆస్తులు సృష్టించాలనే నిర్ణయంతో 1843.76 కోట్లు ఖర్చు చేసి 1774.37 మిలియన్ల పని దినాలకు ఉద్యోగితను కల్పించగా, 1987లో 395.23 మిలియన్ల పని దినాలకు, 1988లో 370.77 మిలియన్ల పని దినాలకు, 1989 నాటికి 394.96 మిలియన్ల పని దినాలకు ఉద్యోగిత కల్పించడమైనది.

5. **గ్రామ ప్రాంతాలలో భూమిలేని శ్రామికుల ఉద్యోగితా హామీ పథకం** (R.R.E.G.P.) :- గ్రామీణ ప్రాంతాలలో లాభసాటి ఉద్యోగిత, ఉత్పాదకత ఆస్తులు సృష్టించి గ్రామీణ జీవితం నాణ్యతను పెంచుటకు గ్రామ ప్రాంతాలలో భూమి లేని శ్రామికుల ఉద్యోగితా హామీ పథకము 1983 ఆగష్టు 15న ప్రవేశ పెట్టినారు. భూములు లేని శ్రామికులు, మహిళలు, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు ఉద్యోగితను కల్పించడం ప్రధాన ఆశయం. 1986 - 87 నుండి 1989 వరకు రూ॥ 1743 కోట్లు ఖర్చు చేసి 258 మిలియన్ పని దినాల ఉద్యోగత కల్పించారు. ఈ పథకం వలన 5.2 లక్షల హెక్టారులలో సామాజిక అడవుల పెంపకం జరిగినది. 4.27 లక్షల గృహాల నిర్మాణం జరిగింది.

6. **జవహర్ రోజ్‌గార్ యోజనా** (J.R.Y.) :- 1980లో ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉద్యోగితా పథకం మరియు 1983లో ప్రవేశపెట్టిన గ్రామ ప్రాంతాలలో భూమి లేని శ్రామికుల ఉద్యోగితా హామీ పథకాన్ని కలిపి 1989లో రాజీవ్‌గాంధి

జవహర్ రోజ్‌గార్ యోజనా పథకాన్ని ప్రకటించారు. దారిద్ర్యరేఖకు దిగువన వున్న 4 కోట్ల 40 లక్షల కుటుంబాలకు ఈ పథకాన్ని అమలుపరుచుటకు 1989 - 90లో రూ॥ 2160 కోట్లు కేటాయించి 8643.87 లక్షల పని దినాలు కల్పించారు. 1990 - 91 నాటికి 8745.59 లక్షల పని దినాలు, 1991 - 92 నాటికి 8081 లక్షల పని దినాలు కల్పించడమైనది. ఈ పథకం క్రింద లభించే ఉద్యోగవకాశాలలో 30 శాతం మహిళలకు కేటాయించినారు.

7. **స్వర్ణ జయంతి గ్రామస్వరాజ్‌గార్ యోజన పథకం** (S.G.S.Y. - 1999) :- 1999 ఏప్రియల్ 1వ తేదీ నుండి సమగ్ర గ్రామీణాభివృద్ధి క్రింద ఉన్న పథకాలన్నింటిని మరియు గ్రామీణ పేద మహిళలు మరియు శిశువుల అభివృద్ధి పథకాన్ని, అదే విధంగా గ్రామీణ వృత్తుల వారికి కావలసిన పనిముట్లను సప్లయి చేయడం, గంగా కళ్యాణ యోజన (G.R.Y.) మరియు (Million Wells Scheme (MWS)) నీటి పారుదల అభివృద్ధి పథకము మొదలగు వాటన్నింటిని కలిపి స్వర్ణ జయంతి స్వరోజ్ ఘార్ యోజనా అనే పథకాన్ని ప్రవేశ పెట్టినారు. ఈ పథకంలో గ్రామీణ పేదల సర్వతోముఖాభివృద్ధికి పటిష్టమైన చర్యలను చేపట్టినది. లబ్దిదారులను స్వరోజ్ ఘార్స్ అని పిలవబడి వారి అభివృద్ధికి ప్రోత్సాహకరమైన వాతావరణాన్ని కల్పించడమైనది.

## 8.7 దీర్ఘకాలిక చర్యలు :-

5వ పంచవర్ష ప్రణాళికలో మొదలుపెట్టిన పేదరిక నిర్మూలనా చర్యలు స్వల్పకాలానికి సంబంధించిన పథకాలేకాక వ్యవస్థాపరంగా అభిలషణీయమైన చర్యలు అవసరాన్ని కనుగొని దీర్ఘకాలికమైన చర్యలను ప్రతిపాదించినారు. అవి

1. **భూ సంస్కరణలు :-** వ్యవసాయ భూమి యాజమాన్యం ఎక్కువ మందికి లభించే విధంగా వ్యవసాయ సంబంధాలుండాలి. పటిష్ఠమైన కౌలు సంస్కరణలుండాలి. తద్వారా కౌలు భద్రత అవసరం. దీర్ఘకాలిక గ్రామీణ పేదరిక నిర్మూలనా పథకాలు వ్యవస్థాపరమైన మార్పులు చేయజాలవు. పైగా దీర్ఘకాలిక పేదరిక నిర్మూలనా పథకాలు, సన్న చిన్నకారు రైతుల కనుగుణంగా భూమి పంపిణీ చేయడంతో పాటు పరపతి సౌకర్యాలు, మంచి ఉత్పాదకత సాధనాలనందించి వారిని పేదరికం గీత పైకి తీసుకురావాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో అల్ప ఉద్యోగితలో ఉన్న వారి ఉత్పాదకతను పెంచాలి. ముఖ్యంగా 18 - 25 ఎకరాల భూ గరిష్ఠ పరిమితిని నిర్ణయించి తీసుకున్న మిగులు భూమిని చిన్న, సన్నకారు రైతులకు పంపిణీ చేయాలి. కౌలుదారులకు కౌలు సంస్కరణల ద్వారా కౌలు భద్రత నిర్వహించాలి. వ్యవసాయ యోగ్యం కాని భూములు, బంజరు భూములు, బీడు భూముల పై 5.63 మిలియన్ల కుటుంబాలకు ఉద్యోగిత కల్పించే పథకం రూపొందించాలి.

2. **గ్రామీణ పారిశ్రామికీకరణ :-** శ్రమ సాంద్రమైన పద్ధతులలో గ్రామీణ పారిశ్రామికీకరణ చర్యలు చేపట్టాలి. ప్రజలందరూ ఎక్కువగా వుపయోగించే వస్తువులను ముఖ్యంగా వేతన వస్తువులు, చిన్న తరహా, కుటీర పరిశ్రమలు ఉత్పత్తి చేయడాన్ని ప్రోత్సహించడం ద్వారా ఉద్యోగిత పెరుగుతుంది. మరియు అల్పాదాయ వర్గాల వారి ఆదాయ స్థాయి కూడా పెరుగుతుంది. గ్రామీణ పారిశ్రామికీకరణతో పాటు శ్రమ సాంద్రతమైన పద్ధతుల ద్వారా గ్రామీణ అవస్థాపనా సౌకర్యాలు అభివృద్ధి చెంది గ్రామీణ ప్రజల స్థితి గతులు మెరుగుపరచాలి. 10వ ప్రణాళికా కాలంలో ప్రభుత్వము గ్రామీణ విద్యుద్ధీకరణను, గ్రామీణ ఆరోగ్యం, విద్య మరియు గ్రామీణ పరిశ్రమలభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నది. విద్యాభివృద్ధి లేకుండా గ్రామ ప్రాంతాలలో సైతం హైటెక్ ఉత్పత్తి విధానాలు మరియు మార్కెటింగు సాధ్యం కాదు. అందుబాటులో వున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తి స్థాయిలో వుపయోగించుటకు నిరక్షరాస్యత నిర్మూలన అవసరం. 1951లో 16.67 శాతం వున్న అక్షరాస్యత 2001 నాటికి 65.37 శాతంకు పెరిగినది. జనాభాలో 35 శాతం నిరక్షరాస్యులుగా వుండి సాంకేతిక విజ్ఞానం నిరుపయోగమవుతున్నది. గ్రామీణ పారిశ్రామికీకరణ నిరుద్యోగాన్ని తద్వారా పేదరికాన్ని నిర్మూలిస్తుంది.

3. **గ్రామీణ ఉద్యోగితను కల్పించుట :-** గ్రామీణాభివృద్ధి పథకాలు ముఖ్యంగా J.R.Y. క్రింద 1999 - 2000 నాటికి 5.87 లక్షల పని దినాలు కల్పించడమైనది. E.A.S. ద్వారా 1999 - 2000 నాటికి 752.49 లక్షల పని దినాలు కల్పించడమైనది. TRYSEM, DWCRA, IAY, MWS, ARWSP, Central Rural Sanitation Programme, NSAP (NOAPS, NFBS, NMBS) మొదలగు పథకాలన్నింటిని 1999 నుండి SJSY ద్వారా శాశ్వత మూలధన ఆస్తులను సృష్టిస్తూ గ్రామీణ ప్రాంతాలభివృద్ధికి తోడ్పడుచున్నది. ఈ పథకాల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో శాశ్వత ఆస్తులను సృష్టించడానికి కాంట్రాక్టర్ల విధానం తక్కువ వేతనాలకు మరియు నాణ్యత లేని పనికి దారి తీస్తుంది. ఈ పథకాల అమలుకు ప్రతి గ్రామంలోనూ శాశ్వత యంత్రాంగం అవసరం. ఈ శాశ్వత యంత్రాంగంలో గ్రామస్తులు ముఖ్యంగా చిన్న రైతులు, భూమిలేని కూలీలకు అధికారం, బాధ్యత ఉండాలి. స్థానిక శ్రమ, ముడి సరుకులు ఉపయోగించి 10,000 నుండి 20,000 జనాభా వుండే చిన్న పట్టణాలను వృద్ధి కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. దీనికోసం జిల్లా స్థాయి ప్రణాళికలుండాలి. వృద్ధి కేంద్రాలలో పాడి పరిశ్రమ, కోళ్ళ పెంపకం, చేపల పెంపకం, చిన్న తరహా పరిశ్రమలభివృద్ధికి పెట్టుబడి పెట్టాలి. చిన్న తరహా నీటి పారుదల పథకాల ద్వారా మెట్ట ప్రాంతాలకు నీరు లభించాలి. గ్రామీణ పట్టణ ప్రాంతాలకు నీరు లభించారు. గ్రామీణ పట్టణ ప్రాంతాలలో అల్పాదాయ వర్గాల వారికి సూక్ష్మ పరపతినందించడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలి.

4. **జనాభా నియంత్రణ :-** రోజు రోజుకీ పెరుగుతున్న జనాభా అభివృద్ధికి అవరోధకమని అనేక పరిశోధనల ద్వారా వెల్లడయినది. ప్రభుత్వం ప్రణాళికలలో కుటుంబ సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టినప్పటికి జనాభా పెరుగుదల రేటు 2.14 శాతంగా వుండి అభివృద్ధి రేటు 1.4 శాతంగా వుంటే అభివృద్ధి ఫలితాలు తక్కువగా వుంటాయి. ప్రభుత్వం ప్రజలలో స్వచ్ఛందంగా మార్పులు వచ్చేటట్లుగా పెరుగుతున్న జనాభా అవరోధాలను గురించి మీడియా ద్వారా, సంఘ సంస్కర్తల ద్వారా, స్వచ్ఛంద సంస్థల ద్వారా ఎయిడ్స్ వ్యాప్తి, ఆరోగ్య పరిరక్షణ గురించి మరియు కుటుంబ నియంత్రణ సాధనాల గురించి పౌష్ఠికాహారం లభ్యతను గురించి, కుటుంబ సమస్యల గురించి వున్న అధ్యయనాలను గ్రామ ప్రాంతాలలో పెద్ద ఎత్తున సెమినార్లు నిర్వహించి తెలియజేయాలి.

5. **వ్యవస్థాపూర్వకమైన మార్పులు :-** 1980లో జరిగిన పేదరిక నిర్మూలనా చర్యలలో భాగంగా సంస్థపరమైన చర్యలు విరివిగా చేపట్టిన ఇండోనేషియా మరియు మలేషియాలలో సత్ఫలితాలు లభించాయి. అదే విధంగా 1993లో అంతర్జాతీయ ద్రవ్యనిధి సమావేశంలో అభివృద్ధి చెందుచున్న దేశాలలో గ్రామీణ ప్రాంతాలలో స్వయం ఉపాధి అవకాశాలను విశ్లేషించడం జరిగినది. గ్రామీణ అవస్థాపన, గ్రామీణ పారిశ్రామికీకరణ మొదలగు శ్రమ సాంద్రత పద్ధతులను అవలంభించుటకు అనేక ప్రోత్సాహకాలను అందించుటకు ప్రపంచ బ్యాంకు సన్నద్ధమైనది. బంగ్లాదేశ్‌లో గ్రామీణ బాంకు లక్ష్యాల ఆధారంగా తీసుకుని 1999 ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థలను స్థాపించి వెలుగు పథకం ద్వారా గ్రామీణ నిరుద్యోగులకు, గ్రామీణ పేద మహిళలకు, గ్రామీణ అవస్థాపనా సౌకర్యాల కొరకు సూక్ష్మ పరపతినందించడం మరియు పేదవారిని స్వయం సహాయక గ్రూపులుగా ఏర్పరచి అభివృద్ధి మార్గాలను నిర్దేశించినారు. గ్రామీణ ప్రాంతాలలో మహిళా సాధికారతకు డ్వాక్రా పథకం ద్వారా 1982 నుండి దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టినారు. అయితే ఈ చర్యలను సమర్థవంతంగా నిర్వహించుటకు ప్రత్యేకమైన గ్రామీణాభివృద్ధి విభాగం వుంటే పేదరిక నిర్మూలనా చర్యలు సత్ఫలితాలిస్తాయి.

## 8.8 సారాంశము :-

పేదరికం పేదల సమస్య మాత్రమే కాదు. మొత్తం సమాజం బాధ్యత. ఎప్పటికపుడు పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు పలు పేర్లతో కొత్త పథకాలు ప్రవేశ పెట్టడం కన్నా ఉన్న పథకాలు సక్రమంగా కొనసాగిస్తూ అత్యవసర సమయాలలో ముఖ్యంగా అనావృష్టి

కరువు కాటకాలు, వరదలు, భూకంపాలు మొదలగు విపత్కర పరిస్థితులలో అదనపు వనరులను బాధితులకు అందించడం ద్వారా పథకాల అమలు పై గట్టి పర్యవేక్షణ ఏర్పాటు చేయడం ద్వారా పథకాలు లబ్దిదారులకు లభింప చేసి పేదరికాన్ని నిర్మూలించవచ్చు. మన దేశంలో పేదరికం నిర్మూలనా పథకాలు ఆచరణలో విఫలమవుతున్నాయి. ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు సంక్షేమ పథకాలకు వెచ్చించడం జరుగుతున్నది. అయితే అభివృద్ధి, పాలనా యంత్రాంగం, విత్త సంస్థలు, పంచాయితీలు, మధ్యవర్తులు, రాజకీయ నాయకుల ప్రమేయంతో ఈ పథకాల సహాయం నిజమైన పేదవారికి లభించడం లేదు. తీవ్ర పేదరికంలో వున్న వారికి శాశ్వత పునరావాసాలు కల్పించడం లేదు. కనుక ఈ పథకాలు అమలు జరిపే యంత్రాంగంలో గ్రామ స్థాయిలో లబ్ది పొందేవారు ప్రధాన పాత్ర వహించాలి. గ్రామ స్థాయిలో వున్న పేదలను సమన్వయపరిచి వారికి కనీస జీవన ప్రమాణాన్ని అందించుటకు ప్రభుత్వం మరియు పర్యవేక్షకులు విశాల దృక్పథంతో పేదవారి ఆదాయ స్థాయి పెరిగి దారిద్ర్య రేఖ దాటి పైకి వస్తారు. తద్వారా గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుంది.

## 8.9 గుర్తుంచుకోవలసిన విషయాలు :-

- భారతదేశంలో పేదరికం గురించి బహుముఖ విశ్లేషణ అవసరం. పేదరికం ఒక సామాజిక సమస్యగా ఆవిర్భవించడం వలన విష వలయంగా మారిన పేదరిక నిర్మూలన చర్యలు గురించి తెలుసుకోవాలి. వనరుల అల్ప వినియోగం, జనాభా పెరుగుదల, నిరుద్యోగము, ఆకలి చావులు మొదలగు సమస్యల బారి నుండి బయటపడుటకు మార్గాలన్వేషించటం ప్రజలందరి ముందు ఉన్న సామాజిక బాధ్యత.

- పేదరికం రెండు రకాలు. (1) సాపేక్ష పేదరికం, (2) నిరపేక్ష పేదరికం. సాపేక్ష పేదరికం సంపన్న దేశాలలో చూస్తాము. నిరపేక్ష పేదరికాన్ని అభివృద్ధి చెందుచున్న దేశాలలో చూస్తాము. నిరుపేదలు మరియు పేదరికపు గీతకు దిగువన వున్న వారిని నిరపేక్ష పేదరికంలో వున్న వారని అంటాము.

- పేదరికపు గీత - దీనినే దారిద్ర్య రేఖ, ఆకలి రేఖ అని కూడా అంటారు. ఐక్యరాజ్య సమితి అంచనాల ప్రకారం గ్రామీణ ప్రాంతాలలో సగటున రోజుకు 2400 కాలరీలు, పట్టణ ప్రాంతాలలో సగటున రోజుకు 2100 కాలరీలు శక్తి నివ్వడానికి కావలసిన ఆహార అవసరాలు పొందలేని వారిని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్లు అంచనా. సుఖాత్మ అంచనాల ప్రకారం పోషక విలువలతో కూడిన కనీస జీవన స్థాయికి కావలసిన కేలరీలు పొందలేని వారిని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారని పేర్కొంటాము.

- పేదరికపు అంచనాలు - ఓఘా, మిన్హాస్, బర్ధన్, రాత్ మరియు దండేకార్, సుమన్ మరియు గోపాల్ మొదలగు అంచనాల ప్రకారం 1999 - 2000 నాటికి గ్రామీణ పేదరిక జనాభా 193.2 మిలియన్లు 27.1 శాతం వుండగా 2007 నాటికి గ్రామీణ పేదరిక జనాభా 170.5 మిలియన్లు అనగా 21.1 శాతంగాను, పట్టణ ప్రాంతాలలో 49.6 మిలియన్లు అనగా 15.1 శాతానికి వుంటుందని అంచనా.

- డిమాండు కారణాలు

- డిమాండు వైపు పేదరికపు విష వలయం - తక్కువ డిమాండు, తక్కువ పెట్టుబడి, మూలధనం కొరత, తక్కువ ఉత్పాదకత, తక్కువ ఆదాయం.

- సప్లయి వైపు పేదరికపు విష వలయం - తక్కువ పొదుపు, తక్కువ పెట్టుబడి, మూలధన కొరత, తక్కువ ఉత్పాదకత, తక్కువ ఆదాయం. ఇవికాక జనాభా పెరుగుదల, ఆదాయ అసమానతలు, నిరుద్యోగం, ప్రాంతీయ అసమానతలు, అల్పస్థాయి ఉత్పత్తి మరియు అల్పస్థాయి వినియోగం, ద్రవ్యోల్బణం, రాజకీయ మరియు సాంఘీక కారణాలు.

- పేదరిక నిర్మూలనా చర్యలు
- స్వల్పకాలిక చర్యలు - గ్రామీణ పనుల కార్యక్రమము, చిన్న రైతులు, అభివృద్ధి ఏజన్సీ, ఉపాంత రైతులు మరియు వ్యవసాయ కూలీల అభివృద్ధి ఏజన్సీ, వర్షాభావ ప్రభావిత ప్రాంతాల కార్యక్రమం, పనికి ఆహార పథకం, సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం, పనికి ఆహార పథకం, జాతీయ గ్రామీణ ఉద్యోగితా పథకం, గ్రామ ప్రాంతాలలో భూమి లేని శ్రామికుల ఉద్యోగితా హామీ పథకం, జవహర్ రోజ్‌గార్ యోజనా, స్వర్ణ జయంతి స్వరోజ్ గార్ యోజన, డ్వాక్రా పథకం మొదలగునవి.
- దీర్ఘకాలిక చర్యలు - భూ సంస్కరణలు, గ్రామీణ పారిశ్రామికీకరణ, గ్రామీణ ఉద్యోగితను కల్పించుట, జనాభా నియంత్రణ, వ్యవస్థాపరమైన మార్పులు.

## 8.10 కఠిన పదాలు :-

| | | | |
|---|---|---|---|
| 1. | **పేదరికము విష వలయము** | - | పేదరికానికి పేదరికమే కారణము. డిమాండు వైపు కారణాలు, సప్లయి వైపు కారణాలు. |
| 2. | **పేదరిక గీత** | - | గ్రామీణ ప్రాంతాలలో మనిషికి రోజుకు 2400 కాలరీలు, పట్టణ ప్రాంతాలలో 2200 కాలరీలు శక్తినిచ్చే పౌష్టికాహారం పొందలేని జనాభాను పేదరికపు గీతకు దిగువన వున్నవారని అర్థము. |
| 3. | **సాపేక్ష పేదరికము** | - | |
| 4. | **నిరపేక్ష పేదరికము** | - | |
| 5. | R.W.P. | - | గ్రామీణ పనుల కార్యక్రమము (Rural Works Programme) |
| 6. | S.F.D.A. | - | చిన్న రైతుల అభివృద్ధి ఏజన్సీ (Small Farmers Development Agency) |
| 7. | M.F.A.L.D.A. | - | ఉపాంత రైతులు, వ్యవసాయ శ్రామికులభివృద్ధి ఏజన్సీ (Marginal Farmers and Agricultural Labours Development Agency) |
| 8. | E.G.P. | - | ఉద్యోగితా హామీ పథకం (Employment Guarantee Programme) |
| 9. | E.P. | - | జాతీయ గ్రామీణ ఉద్యోగితా పథకం (National Rural Employment Programme) |
| 10. | R.L.E.G.P. | - | గ్రామ ప్రాంతాలలో భూమి లేని శ్రామికుల ఉద్యోగితా హామీ పథకం (Rural Landless Employment Guarantee Programme) |
| 11. | J.R.Y. | - | జవహర్ రోజ్‌గార్ యోజన (Jawahar Rojgar Yojana) |
| 12. | S.J.S.Y. | - | స్వర్ణ జయంతి స్వరాజ్ ఘార్ యోజన (Swarna Jayanti Swarojghar Yojana) |
| 13. | D.W.C.R.A. | - | Development of Women and Children in Rural Areas |

## 8.11 నమూనా ప్రశ్నలు :-

I. **వ్యాసరూప ప్రశ్నలు**

1. పేదరికము అనగానేమి? ఎన్ని రకములు, గ్రామీణ పేదరికము కారణాలు మరియు నిర్మూలనా చర్యలను క్లుప్తముగా వివరింపుము?

జ. గ్రామీణ పేదరికము అర్థము, గ్రామీణ పేదరికము రకాలు, గ్రామీణ పేదరికము కారణాలు, గ్రామీణ పేదరికము నిర్మూలనా చర్యలు.

2. గ్రామీణ పేదరికమును విశ్లేషించి, నిర్మూలనా చర్యలను పేర్కొనుము?

జ॥ గ్రామీణ పేదరికము నిర్వచనము, గ్రామీణ పేదరికం అంచనాలు, నిర్మూలనా చర్యలు.

II. **సంక్షిప్త వ్యాసరూప ప్రశ్నలు**

1. పేదరికము కారణాలు, నివారణ చర్యలు

జ. పేదరికము అర్థం, కారణాలు - పేదరికం అంచనాలు - క్లుప్తంగా

2. పేదరికము రకాలు - విశ్లేషణ

జ. పేదరికం అర్థము, రకాలు - విశ్లేషణ - కారణాలు - క్లుప్తంగా - నివారణ చర్యలు.

III. **సంక్షిప్త ప్రశ్నలు**

1. పేదరికము - విష వలయము

జ. పేదరికము నిర్వచనము, విషవలయము

2. పేదరికము - కారణాలు

జ. గ్రామీణ పేదరికము కారణాలు

3. పేదరికము రకాలు

జ. గ్రామీణ పేదరిక రకాలు

4. పేదరికము - నివారణ చర్యలు

జ. గ్రామీణ పేదరికము నివారణ చర్యలు, స్వల్పకాలిక మరియు దీర్ఘకాలికము

5. పేదరికము విశ్లేషణ

జ. పేదరికపు అంచనాలు

## 8.12 చదువదగిన గ్రంథాలు :-


1. A Study of Rural Economics - Vasant Desai
2. తెలుగు యోజన
3. Kurukshetra
4. Fundamentals of Rural Economics - S.S.M. Desai
5. Indian Economy - Ruddar Dutt & K.P.S. Sudaram 49th Revised Edition
6. Economics and Political Weekly - Journal
7. Indian Economy - P.K. Dhas
8. Artical on Poverty - Rath and Dandekar


**డా॥ వై. ఇందిరా కుమారి**

పాఠం - 9

# గ్రామీణ ఋణగ్రస్థత, పరపతి ఆవశ్యకత, సరఫరా - స్థూలనాత్మక పరిశీలన

## 9.0 లక్ష్యం :-

ఈ పాఠ్య భాగం చదివిన తరువాత మీరు ఈ క్రింది అంశాలను తెలుసుకోగలరు. అవి

- గ్రామీణ ఋణగ్రస్థతకు గల కారణాలు, ఋణభారం, దాని వల్ల వచ్చే సమస్యల గురించి వివరించ గలగాలి
- గ్రామీణ పరపతి ఆవశ్యకత, డిమాండు, వర్గీకరణ మున్నగు విషయాల పై అవగాహన పెరగాలి
- గ్రామీణ పరపతి సరఫరా మార్గాలు, వాటి పాత్ర, ప్రాముఖ్యతతో బాటు వాటి గుణగణాలను గూర్చి తెలియపరచగలగాలి
- లీడ్ బాంకు పథకం గురించి తెలియాలి
- అసంతులిత వడ్డీరేట్ల పథకం గురించి వివరించగలగాలి
- గ్రామీణ ఋణభార నివారణకు మరియు పరపతి సౌకర్యాలు మెరుగుపరచుటకు తీసుకోవలసిన చర్యలను విశదీకరించగలగాలి

## విషయసూచిక :-


**9.1 ఉపోద్ఘాతము**

**9.2 గ్రామీణ ఋణగ్రస్థత - సమస్యలు**

**9.3 పరపతి ఆవశ్యకత**

**9.4 పరపతి డిమాండ్**

**9.5 పరపతి వర్గీకరణ**

**9.6 పరపతి సరఫరా మార్గాలు - వాటి పాత్ర మరియు ప్రాముఖ్యత**

**9.7 లీడ్ బ్యాంకు పథకం**

**9.8 వడ్డీరేట్ల వ్యత్యాస పథకం / అసంతులిత వడ్డీ రేట్ల పథకం**

**9.9 గ్రామీణ ఋణభార నివారణ - పరపతి పెరుగుదలకు తీసుకోవలసిన చర్యలు**

**9.10 సారాంశము**

**9.11 ముఖ్య పదాలు**

**9.12 స్వయం సమీక్షా ప్రశ్నలు**

**9.13 చదువదగిన గ్రంథాలు**

## 9.1 ఉపోద్ఘాతము :-

పరాయి పాలనలో భారతీయ వ్యవసాయరంగం స్తబ్దతకు గురి అయింది. దీనికి తోడు, కరువులు, కాటకాలు, వరదలు, ప్లేగు, మశూచి మున్నగు భయంకర వ్యాధులు, ఆర్థిక మాంద్యం రైతుల ఆర్థిక వ్యవస్థను బాగా క్షీణింప జేసింది. ఈ క్షీణ దశ చాలా కాలం కొనసాగినందున రైతులు తాము చేసిన ఋణాలు తీర్చలేక, ఋణగ్రస్తులయ్యారు. ఈ దైనందిన పరిస్థితులలో నున్న రైతాంగాన్ని ఆదుకొనుటకు స్వాతంత్ర్యానికి పూర్వమే, ప్రభుత్వ పరంగాను, వ్యక్తిగతంగా ఉదారవంతులైన ధార్మికులు, ప్రభుత్వోద్యోగులు అనేక ప్రయోగాలు చేసారు. అయితే సమస్య తీవ్రత, విస్తృతి దృష్ట్యా ఆ ప్రయోగాలు రైతాంగానికి అంతగా ఉపశమనం కల్గించలేకపోయాయి. ఈ ప్రయోగాలకు బదులు శాశ్వత నివారణోపాయాలు కల్పించుటకై 1904లో సహకార పరపతి సంఘాలు ఏర్పాటు చేశారు. అనంతరం క్షేత్ర స్థాయి సమస్యలను దృష్టిలో నుంచుకొని సహకార చట్టాలకు అనేక మార్పులు చేయటం, నూతన చట్టాలను తీసుకురావటం వగైరా అనేక ప్రయత్నాలను ప్రాంతీయ ప్రభుత్వాలు చేపట్టాయి.

స్వాతంత్ర్యానంతరం, భారత ప్రభుత్వం వ్యవసాయ పరపతిలో విస్తృత పాత్ర వహించాలని రిజర్వు బ్యాంకును భారత ప్రభుత్వం ఆదేశించింది. ఈ దిశగా చర్యలు తీసుకోవటానికి ముందుగా వ్యవసాయరంగ స్థితి గతులను, పరపతి సౌకర్యాలను కూలంకషంగా పరిశీలించి, పటిష్టతకు సూచనలు చేయుటకై రిజర్వు బాంకు వారు 'భారత గ్రామీణ పరపతి దర్యాప్తు కమిటీ'ని (All India Rural Credit Survey Committee) నియమించింది. ఆ కమిటీ వారు అధ్యయనం చేసి 1954లో సమర్పించిన నివేదికలో 'సహకార వ్యవస్థ విఫలమయ్యింది, కానీ సహకారం వర్థిల్లాలి' (Co-Operation has failed but cooperation must succeed) అని తెలియజేస్తూ సహకార పరపతి వ్యవస్థ అభివృద్ధికి సూచనలు చేయటం జరిగింది.

ఆ సూచనలలో సహకార రంగంలో ప్రభుత్వ భాగస్వామ్యం (state partnership) అనేది ప్రధానమైనది.

పై కమిటీ వారి సలహాల మేరకు, సహకార పరపతి సంఘాల పటిష్టతకు, వాటిని పునర్వ్యవస్థీకరించటం, సహకార లా కమిటీ వారు (Committee Cooperative Law) 1958లో రూపొందించిన నమూనా సహకార చట్టం, నమూనా నిబంధనల కనుగుణంగా 1964 నాటికి అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాష్ట్రాలలో నూతన సహకార చట్టాలు రూపొందించి, అమలు చేసి, సహకార సంస్థలలో భాగస్వాములవటం జరిగింది.

1960 దశకం మధ్యలో వ్యవసాయరంగంలో ఆవిర్భవించిన మార్పులు ప్రధానంగా హరిత విప్లవం, దానికి సంబంధించిన ఉత్పాదకాల కొనుగోలుకు అవసరమయిన అధిక ఉత్పత్తి పరపతిని సహకార పరపతి వ్యవస్థ ఎంతవరకు అందజేయగలదో పరిశీలించుటకై 'భారత గ్రామీణ పరపతి సమీక్షా కమిటీ' (All india Rural Credit Review Committee)ని 1969 భారత ప్రభుత్వం నియమించినది. ఈ తరుణంలోనే అనగా 1969లో బ్యాంకులను జాతీయం చేయుట కూడా జరిగినది. ఈ సమీక్షా కమిటీ వ్యవసాయ పరపతి అవసరాలు, సహకార వ్యవస్థ సామర్థ్యం మున్నగు విషయాలను పరిశీలించిన ఈ కమిటీ గ్రామీణ పరపతికి 'బహు సంస్థా విధానం' (Multi Agency Approach) అవసరం అని సిఫారసు చేసింది.

1969 నుంచి వ్యవసాయ పరపతిలో, సహకార పరపతి ఏకస్వామ్యానికి ప్రతిగా వాణిజ్య బ్యాంకులు ప్రవేశించినవి. 1972లో దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన కాలంలో 20 సూత్రాల ఆర్థిక పథకం ప్రవేశపెట్టటం జరిగింది. ఈ పథకంలో భాగంగా గ్రామీణ ఋణగ్రస్థత నిర్మూలనకు చర్యలు తీసుకోవటం జరిగింది. ఈ దృష్ట్యా ప్రైవేటు సంస్థలస్థానే సన్నకారు, చిన్న రైతులకు, గ్రామీణ చేతి వృత్తుల వారికి, వ్యవసాయ కూలీలకు మున్నగు వారికి పరపతి అందజేయుటకై 1975 నుండి ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను స్థాపించటం జరిగింది. (RRB's).

ప్రస్తుతం దేశంలో వ్యవసాయ మరియు గ్రామీణ ఆర్థిక రంగానికి సంస్థాపరంగా పరపతి అందచేయుటకు, సహకార పరపతి సంఘాలు, వాణిజ్య బ్యాంకులు మరియు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఉన్నాయి.

స్వాతంత్ర్యానంతరం వ్యవసాయ మరియు గ్రామీణ పరపతి అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టినది. ఈ కారణంగా ఈ రంగంలో ప్రైవేటు వ్యక్తులు, వడ్డీ వ్యాపారుల ప్రాబల్యం బాగా తిగ్గపోయింది. అయితే పెరుగుతున్న అవసరాల మేరకు సంస్థాపరంగా పరపతి అందటం లేదు. వ్యవసాయ పరపతికి సంబంధించిన అనేక విషయాలు ఈ పాఠ్య భాగంలో తెలియపరుచట జరిగినది.

## 9.2 గ్రామీణ ఋణగ్రస్థత - సమస్యలు :-

భారతీయ వ్యవసాయం చిన్న కమతాల వ్యవసాయం. వ్యవసాయ ఉత్పాదకాల కొనుగోలుకు, తిండి ఖర్చు, విద్య, వైద్య మరియు సామాజిక అవసరాలకు రైతులు అప్పులు చేస్తారు. అయితే వారికి వ్యవసాయం నుంచి వచ్చే ఆదాయం తగినంత లేనందువల్ల కాని, అప్పుల భారం ఎక్కువ అవటం వల్ల కాని, కరువు కాటకాల వల్ల కాని, కారణాలేవైనా రైతుల ఋణభారం పెరిగిపోతున్నది. దీనినే 'గ్రామీణ ఋణగ్రస్థత' అంటారు. ఈ పరిస్థితుల ఆధారంగానే 'భారతీయ వ్యవసాయదారుడు అప్పులలో పుట్టి, అప్పులలో పెరిగి అప్పులతో మరణిస్తాడు' అనే నానుడి ఏర్పడినది.

భారత రైతాంగ ఋణగ్రస్థత పై అనేక అధ్యయనాలు జరిగాయి, అంచనాలు వేయబడ్డాయి. ఈ అధ్యయనాలు రైతులు చేసిన అప్పులలో ఎక్కువ భాగం ప్రస్తుత ఉత్పత్తి అవసరాలకు వినియోగిస్తారని, పెట్టుబడులకు తమ స్వంత నిధుల పై ఆధారపడతారని తెలియజేస్తున్నవి. వ్యవసాయదారుల ఆదాయాలు పెరగటంతో పాటు, ఖర్చులు, దానితో అప్పులు కూడా పెరిగాయి. అయితే ప్రస్తుతం వ్యవసాయదారులు చెల్లించే వడ్డీ రేట్లు అధికంగా ఉన్నవా? తగ్గినవా? వ్యవసాయరంగానికి వ్యవస్థాగత పరపతి పెరిగినందున, వాటి ప్రభావం గ్రామీణ ఆర్థిక స్థితిగతుల పై ఎలా ఉన్నది? పై అధ్యయనాల నుంచి ఇతమిద్దమైన సమాధానాలు చెప్పటం కష్టం.

గత శతాబ్ది పూర్వార్థంలో వ్యవసాయరంగంలో స్తబ్దత, అప్పులు, అధిక వడ్డీల బాధతో రైతాంగం మరియు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగా చితికిపోయింది. ఈ కారణంగా గ్రామీణ ఋణగ్రస్థత పెరిగి భారంగా మారింది. ఈ సమస్యల తీవ్రత డెక్కన్ పోరాటాలతో (Deccan Riots) బయట పడింది. స్వాతంత్ర్యానికి పూర్వం రైతాంగ ఋణగ్రస్థతను విపులంగా విశ్లేషించి, అంచనాలు రూపొందించిన అధ్యయనాలలో 1901, 1913, 1918, 1919, 1925, 1936, 1940, 1946 సం॥లలో చేసినవి పేర్కొనదగినవి.

స్వాతంత్ర్యానంతరం భారతీయ రిజర్వు బ్యాంకు వారు చేసిన 1951 - 52 మరియు 1961 - 62 ఋణగ్రస్థ సర్వేలు, రిజర్వు బ్యాంకు మరియు నేషనల్ శాంపుల్ సర్వే (N.S.S.) వారు కలసి చేసిన 1971 - 72, 1981 - 82 సర్వేలు, N.S.S. ఒక్కటే చేసిన 1991 - 92 సర్వేలు గ్రామీణ ఋణగ్రస్థత ప్రవృత్తిని తెలియజేస్తాయి. ఈ సర్వేల ప్రకారం గ్రామీణ ఋణాలను తీసుకున్న కుటుంబాల శాతం 1951లో 63.3, 1961లో 62.8 నుంచి 1971 నాటికి 41.3కు తగ్గింది. అయితే ఈ శాతం 1981లో 19.4కు తగ్గి, మరల 1991 నాటికి 32కు పెరిగింది. గ్రామీణ కుటుంబాలు తీసుకున్న సగటు ఋణం 1971 నుంచి క్రమంగా పెరిగింది. ఈ సగటు ఋణం 1971లో రూ॥ 590 కాగా, 1981 నాటికి రూ॥ 793 మరియు 1991 నాటికి రూ॥2546కు పెరిగినది. ఈ మూడు సర్వేల ప్రకారం రైతులు తమ ఋణాలలో ఉత్పత్తి నిమిత్తం చేసే ఖర్చు 1971లో 92 శాతం ఉండగా 1991 నాటికి 29.4కు తగ్గినది. పెట్టుబడి ఖర్చులు తగ్గించటం, ఇతర ఖర్చులు పెరగటం, పై తగ్గుదలకు ప్రధాన కారణం.

1. **గ్రామీణ ఋణగ్రస్థతకు కారణాలు :-** గ్రామీణ ఋణగ్రస్థతకు ప్రధాన కారణం పేదరికం అని చెప్పవచ్చును. పేదరికం వల్ల పొదుపు చేయలేకపోవటం, పొదుపు లేని కారణంగా, అన్ని అవసరాలకు అప్పుల మీద ఆధారపడటం జరుగుతుంది. ఈ పేదరికం మూలంగా ఆదాయాలు స్వల్పం కావటంతో తిరిగి అప్పులు చెల్లించలేకపోవటం, అందుమూలముగా బకాయిలు పేరుకొని పోయి ఋణభారం అధికం కావటం జరుగుతున్నది.

    రైతుకు భూమి పై మక్కువ (Attachment) ఎక్కువ. భూమి కొనుటకు, భూమికి మరమ్మత్తులు చేయాలని రైతు ఉత్సాహపడటం సహజం. అయితే సొంత నిధులతో ఈ పనులు చేయగలిగేతే మంచిదే కాని అప్పు చేసి తిరిగి చెల్లించని పరిస్థితులలో ఋణభారం పెరుగుతుంది. ఇది రెండవ కారణంగా చెప్పవచ్చును.

గ్రామీణ ప్రాంతాలలో సాంఘిక కట్టుబాట్లు, మర్యాదలు, ఆచారాలు తప్పని సరిగా పాటించటం పరిపాటి. పండుగలు, వివాహాలు, పూజలు, పుట్టిన రోజులు, కర్మ దినాలు మొదలయిన అనేక సందర్భాలలో తమ ఆర్థిక స్థోమతకు మించి సాటి వారితో పోటీగా, సమానంగా గానీ, వారి కన్నా ఎక్కువగా గానీ ఖర్చు పెట్టటం జరుగుతుంది. దీనితో పాటు సామాజకంగా క్రింది అంతస్థులో ఉన్నవారు, తమ కంటె పై అంతస్థుల వారి ఆచారాలు, వేష భాషలు, జీవన విధానాన్ని అనుసరించటం కూడా అప్పుల ఊబిలో పడటానికి మరొక కారణం.

నూతన ఆర్థిక విధానాల ప్రభావం వల్ల విద్య, ఆరోగ్యం మున్నగు వాటిలో ప్రభుత్వరంగ సదుపాయాలు, సేవలు తగ్గుముఖం పట్టినందున ఈ అవసరాలకు రైతులు కొత్తగా అప్పులు చేయవలసి రావటం కూడా ఋణభారం పెరుగుటకు మరొక కారణంగా భావించవచ్చును.

అనువంశికంగా, తాత నుంచి తండ్రికి, తండ్రి నుంచి బిడ్డలకూ ఋణాలు సంక్రమించటం, అవి చక్రవడ్డీతో కలిపి అధిక ఋణంగా మారటం ఋణగ్రస్థతకు మరొక కారణం.

అవ్యవస్థీకృత రంగం (Unorganised or non institutional sources)లోని వడ్డీ వ్యాపారులు, అధిక అప్పులు ఇవ్వటం, వాటిపై అధిక వడ్డీలు వసూలు చేయటం ఋణగ్రస్థతకు వేరొక కారణమని చెప్పవచ్చును.

ఈ మధ్యకాలంలో వ్యవసాయ పెట్టుబడి ఖర్చులు పెరగటం, కల్తీ విత్తనాలు, అధికంగా ఎరువులు, పురుగు మందులు వాడటం, తద్వారా పంట నష్టాలు జరగడం కూడా ఋణగ్రస్థతకు ఒక ప్రధాన కారణం అయినది.

2 **గ్రామీణ ఋణగ్రస్థత వల్ల సమస్యలు :-** ఋణగ్రస్థత వల్ల అనేక అనర్థాలున్నాయి.

ప్రధానంగా చిన్న మరియు సన్నకారు రైతులు ఋణభారం కారణంగా వ్యవసాయ భూములు పోగొట్టుకొని కూలీలుగా మారటం, వారి సంతానాన్ని కట్టు బానిసలుగా (Bonded Labour) ఋణదాతల దగ్గర ఉంచటం మున్నగు అనర్థాలకు దారి తీస్తుంది.

ఋణాలు వర్తకులు, కమీషను వ్యాపారుల నుంచి తీసుకొన్నచో రైతులు తాము ఆ వర్తకుల నుండి కొనే ఉత్పాదకాలకు అధిక ధరలు చెల్లించటం, తాము విక్రయించే వ్యవసాయోత్పత్తులను తక్కువ ధరలకు అమ్మడం అనే రెండు విధాలా నష్టపోవటం జరుగుతుంది.

సామాజికంగా సొంత వ్యవసాయదారులు వ్యవసాయ కూలీలు, కౌలుదార్లు గాను దిగజారిపోవటానికి కూడా ఋణ భారం ప్రధాన కారణం.

దేశంలో అనేక రాష్ట్రాలలో రైతుల ఆత్మహత్యలకు ఋణభారం కూడా ప్రధాన కారణమని, వార్తా పత్రికలు మరియు ఈ విషయాలపై చేసిన పరిశోధనా అధ్యయనాలు తెలియజేస్తున్నవి.

ఆంధ్ర రాష్ట్రంలో గిరిజన భూములను, గిరిజనేతరులు వడ్డీ వ్యాపారులు దగా చేసి తీసుకోవటం అటవీ ప్రాంతాలలో వస్తున్న ఉద్యమాలకు ప్రధాన కారణంగా భావిస్తారు.

3. **ఋణగ్రస్థ నివారణా చర్యలు :-** వడ్డీ వ్యాపారుల మీద ఆధారపడటాన్ని తగ్గించటం, పాత బకాయిలను రద్దు చేయుట లేదా శ్రేణి తగ్గించటం, పరపతి నియంత్రణ, గ్రామీణులు అనవసర ఖర్చులు తగ్గించుకొనుటకు మీడియా ద్వారా ప్రచారం, ప్రభుత్వమే విద్య, ఆరోగ్యం మున్నగు సదుపాయాలను ఇతోధికంగా పెంచి రైతాంగాన్ని, గ్రామీణ ప్రజానీకాన్ని అప్పుల ఊబి నుంచి రక్షించడం, ఆత్మహత్యలకు దిగకుండా చూడటం ఋణగ్రస్థ నివారణకు ఉపకరిస్తాయి.

## 9.3 పరపతి ఆవశ్యకత :-

వ్యవసాయం ప్రకృతి సంబంధ పరిశ్రమ. ఈ కారణంగా వ్యవసాయంలో పెట్టుబడికి దాని ఫలసాయం చేతికి అందటానికి కొంత కాలవ్యవధి ఉంటుంది. అందువలన వ్యవసాయదారుడికి అనేక పరపతి అవసరాలు ఉంటాయి.

వ్యవసాయదారుడు ఉత్పత్తికి అవసరమయిన ఉత్పాదకాలు అనగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలి ఖర్చులు మున్నగు వాటికి పరపతి అవసరం. అలాగే అతను పశువులు, బండ్లు చిన్నతరహా పనిముట్లు కొనటానికి పరపతి కావాలి. భూమి అభివృద్ధికి, గొట్టపు బావుల త్రవ్వకానికి, ట్రాక్టర్లు వగైరా పెద్ద వ్యవసాయ పనిముట్లు కొనుగోలుకు కూడా పరపతి అవసరం ఉంటుంది.

వ్యవసాయ అవసరాలకే కాక, తను భూమి పై శ్రమ చేసే కాలంలో కుటుంబానికి అవసరమయిన తిండి గింజలు, ఇంటికి సంబంధించిన ఇతర అవసరాలకు కూడా పరపతి అవసరం.

ఈ అవసరాలకు తీసుకొనే పరపతిని కాల, వినియోగ అవసరాలను బట్టి సాధారణంగా రెండు రకములుగా వర్గీకరణ చేస్తారు. ఈ అంశాలు ఈ పాఠ్య భాగంలోని 9.6లో విశదీకరించబడ్డాయి.

## 9.4 పరపతి డిమాండ్ (Demand For Credit) :-

పరపతి డిమాండ్ వ్యవసాయరంగంలో ఈ క్రింది అంశాల పై ఆధారపడుతుంది.

1. స్వల్పకాల ఉత్పత్తి పరపతి డిమాండు ఉత్పాదకాల స్థాయి, ఆ పైన రైతు తనకు తానుగా పెట్టుబడులు పెట్ట గల స్థోమత మీద ఆధారపడి ఉంటుంది. పై రెండు సంబంధాలు విలోమ నిష్పత్తిలో ఉంటాయి.
2. పరపతి పై వసూలు చేసే వడ్డీ రేటును బట్టి కూడా డిమాండు ప్రభావితం అవుతుంది.
3. వడ్డీ రేటు పెరుగుతుంటే పరపతికి డిమాండు తగ్గుతుంటుంది.
4. వ్యవసాయ పరపతి డిమాండు సాంకేతిక అంశాల పై కూడా ఆధారపడి ఉంటుంది.
5. సన్నకారు మరియు చిన్న రైతులలో పరపతి డిమాండు ఉత్పాదకాల మరియు ఉత్పత్తి ధరల పై ఆధారపడి ఉంటుంది.
6. దీర్ఘకాల పెట్టుబడికి అవసరమయ్యే పరపతి డిమాండు రైతుల ఆస్తుల, క్షేత్ర సహజ వనరుల పై ఆధారపడి ఉంటుంది.

## 9.5 పరపతి వర్గీకరణ :-

సాధారణంగా పరపతిని రెండు రకాలుగా వర్గీకరించెదరు. అందులో ఒకటి కాల పరిమితిని బట్టి కాగా రెండవది వినియోగావసారాల ఆధారంగా చేసేది.

**ఎ) కాల ప్రాతిపదికపై పరపతి వర్గీకరణ :-** పరపతి తీసుకొనే కాలాన్ని బట్టి పరపతిని మూడు రకాలుగా వర్గీకరించవచ్చును.

1. స్వల్పకాలిక, 2. మధ్యకాలిక, 3. దీర్ఘకాలిక

**1. స్వల్పకాలిక పరపతి :-** సాధారణంగా 12 నుండి 15 మాసాల కాల పరిమితితో తీసుకొనే పరపతిని స్వల్పకాలిక పరపతి అంటారు. ఈ పరపతిని ముఖ్యంగా పంట ఉత్పత్తి వ్యయానికి వినియోగిస్తారు.

**2. మధ్యకాలిక పరపతి :-** 15 మాసముల పై బడి 5 సం॥ కాల పరిమితితో తీసుకొనే పరపతిని మధ్యకాలిక పరపతి అంటారు. ఈ రకమైన పరపతి వ్యవసాయోత్పత్తికి అవసరమయ్యే చిన్నతరహా పెట్టుబడులకు తీసుకొంటారు.

3. **దీర్ఘకాలిక పరపతి :-** 5 సం॥ల పై బడి మరియు 20 సంవత్సరాలలోపు కాల పరిమితి కలిగిన పరపతిని దీర్ఘకాలిక పరపతి అంటారు. వ్యవసాయ మూలధన పెట్టుబడులకు ఈ తరహా పరపతి అవసరం.

బి) **వినియోగ ప్రాతిపదిక పరపతి వర్గీకరణ :-** వినియోగాన్ని బట్టి వ్యవసాయ పరపతిని రెండు రకాలుగా విభజించెదరు. 1. ఉత్పత్తి పరపతి, 2. పెట్టుబడి పరపతి.

1. **ఉత్పత్తి పరపతి :-** వ్యవసాయ ఉత్పత్తులకవసరమయిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనటానికి, యంత్రాల లేక దున్నడు పశువుల బాడుగ, శ్రామికుల వేతనాలు మున్నగు ఖర్చులకు వినియోగించే పరపతిని ఉత్పత్తి పరపతి అంటారు.

2. **పెట్టుబడి పరపతి :-** వ్యవసాయాభివృద్ధికి, ఉత్పాదక పెంపుదలకు మూలధన పెట్టుబడులు అవసరం. అదనపు భూమి కొనుగోలు, భూమి మరమ్మత్తులకు, గొట్టపు బావుల త్రవ్వకం, యంత్రాల కొనుగోలు మున్నగు వాటికి అవసరమైన పరపతిని పెట్టుబడి పరపతి అంటారు.

## 9.6 వ్యవసాయ / గ్రామీణ పరపతి సరఫరా మార్గాలు :-


వ్యవసాయ మరియు గ్రామీణ రంగాలకు అవసరమయిన పరపతిని అందచేసే మార్గాలు అనేకం. స్థూలంగా వాటిని ఎ. సంస్థాగతేతర, బి. సంస్థాపర మార్గాలుగా విభజించవచ్చును.

ఎ) **సంస్థాగతేతర మార్గాలు :-** వడ్డీ వ్యాపారస్థులు, వ్యవసాయదారు/వడ్డీ వ్యాపారస్థులు, వ్యాపారస్థులు, కమీషను ఏజెంట్లు, బంధువులు మున్నగు వారు సంస్థాగతేతర మార్గాలలోకి వస్తారు. ఈ మార్గాలకు కొన్ని లక్షణాలున్నాయి. అన్ని అవసరాలకు అడిగిన వెంటనే కాలవ్యవధి, తనిఖీలు లేకుండానే అడిగిన వారందరికి ప్రామిసరీ నోటుతో పరపతి అందజేయుట ఈ మార్గాల ప్రత్యేకత. అయితే ఈ మార్గాలలో వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీలు వసూలు చేయటం, వ్యాపారులు, కమీషను ఏజెంట్లు వారు అమ్మే వస్తువులకు ఎక్కువ ధర తీసుకొంటూ, కొనే వాటిని తక్కువ ధరకు కొనుగోలు చేసే అనర్థాలు ఈ మార్గంలో ఉన్నాయి. ఈ సమస్యలను నివారించి రైతులకు సంస్థాపర సంస్థల ద్వారా ఋణ సదుపాయాలు అందించటానికి స్వాతంత్ర్యానంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు చేపట్టాయి. ఈ చర్యల వల్ల గ్రామీణ పరపతి రంగంలో వడ్డీ వ్యాపారుల ప్రాముఖ్యత గత అర్థ దశాబ్దకాలంలో బాగా తగ్గినది. ఉదాహరణకు రైతులు తీసుకొన్న మొత్తం ఋణాలలో 1950 - 52లో 69.7 శాతం వడ్డీ వ్యాపారస్తులు సరఫరా చేయగా, 1991 - 92 నాటికి ఈ శాతం 17.6కు తగ్గినది. అయితే 1991 - 92 తర్వాత, అనగా బ్యాంకింగు సంస్కరణల అమలు తదుపరి తిరిగి వడ్డీ వ్యాపారస్తుల ప్రాబల్యం పెరిగనట్లు కొన్ని రాష్ట్రాలలో ఇటీవల చేసిన అధ్యయనాల ద్వారా తెలియుచున్నది. ఉదా॥ 1997లో పంజాబు రైతుల ఋణ భారాన్ని వివరిస్తూ షెర్గిల్ అనే ఆయన, పంజాబు రైతులు 46.3 శాతం ఋణాలు కమీషను వ్యాపారస్తుల నుంచి తీసుకొన్నారని చెప్పారు. 1999లో రాజస్థాన్‌లో వడ్డీ వ్యాపారస్థుల పాత్ర అధికంగా ఉందని సింగ్ గారు వ్రాశారు.

బి) **సంస్థాగత పరపతి మార్గాలు :-** ఉపోద్ఘాతంలో పేర్కొనట్లుగా, స్వాతంత్ర్యానంతరం గ్రామీణ రైతాంగాన్ని వడ్డీ వ్యాపారస్తుల పరిధి నుంచి తప్పించుటకై సంస్థాగత పరపతి విస్తరణకు ప్రభుత్వం చాలా కృషి చేసింది. ఆ సంస్థల ఆవిర్భావం, అవి అందజేసే పరపతి సేవలు, గ్రామీణ పరపతి రంగంలో వాటి పాత్ర, ప్రాబల్యం మరియు అవి ఎదుర్కొంటున్న సమస్యల గురించి స్థూలంగా ఈ దిగువ తెలియ జేయటం జరిగింది. వ్యవసాయ మరియు గ్రామీణ పరపతి సంస్థాపర నిర్మాణము ఒకటవ పటములో చూపబడినది.

పటము - 1

**భారతీయ వ్యవసాయ మరియు గ్రామీణ పరపతి వ్యవస్థా నిర్మాణము - మార్చి 31, 2003 నాటికి**




**గమనిక -** 1) డి.సి.సి.బి.లు - జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు

2) పి.సి.ఎ.ఆర్.డి.బి.లు ప్రాథమిక సహకార, వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బ్యాంకులు

జాతీయ స్థాయిలో రిజర్వుబ్యాంకు వారు మరియు భారత ప్రభుత్వ ఆర్థిక సహాయ, సహకారాలతో జాతీయ వ్యవసాయ మరియు గ్రామిణాభివృద్ధి బ్యాంకు వ్యవసాయ మరియు గ్రామీణ పరపతి వ్యవస్థలో శిఖరాగ్రాన ఉండి, పునః ధన సహాయం, మార్గదర్శక నిర్దేశం, సమన్వయం మున్నగు ప్రకార్యాలు నిర్వహిస్తుంది. నాబార్డు, సహకార పరపతి వ్యవస్థ. వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ బ్యాంకులకు వారు వ్యవసాయ గ్రామిణాభివృద్ధి రంగాలకు అందజేసిన పరపతి పై పునః ధన సహాయం చేస్తూ వివిధ సంస్థల కార్యకలాపాలను సమన్వయ పరచుతుంది. వ్యవస్థాపరంగా సహకార పరపతి వ్యవస్థ, వాణిజ్య బ్యాంకులు,

మరియు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు వ్యవసాయ మరియు గ్రామీణ పరపతి రంగంలో ఉన్నాయి. ఈ మూడింటిని గురించి విపులంగా ఈ క్రింద వివరించటం జరిగింది.

1. **సహకార పరపతి వ్యవస్థ :-** వ్యవస్థాపర గ్రామీణ పరపతిలో సహకార పరపతి వ్యవస్థకు 2004 మధ్య కాలానికి శత సంవత్సరాలు నిండాయి. ఈ వ్యవస్థ పటములో చూపినట్లుగా రెండు విభాగాలుగా నిర్మితమయినది. స్వల్పకాలిక వ్యవస్థ, దీర్ఘకాలిక వ్యవస్థ.

**స్వల్పకాలిక వ్యవస్థ :-** స్వల్పకాలిక పరపతి వ్యవస్థలో కొద్ది రాష్ట్రాలలో మినహా మూడంచెల విధానము అమలులో ఉన్నది. మూడంచెల విధానములో గ్రామస్థాయిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (PACS), జిల్లా స్థాయిలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు (DCCB's), రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర సహకార బ్యాంకు (APSCB) ఉన్నవి.

గ్రామ స్థాయిలో సంఘాలు సాధారణంగా ఉత్పత్తి అవసరాలకు మాత్రమే ఋణాలు ఇస్తాయి. ఈ సంఘాలకు అవసరమయిన నిధులు అందజేసి, అవి సకాలంలో రైతులకు పరపతి సహాయం అందించేటట్లు చూడవలసిన బాధ్యత జిల్లా కేంద్ర సహకార బ్యాంకులది. జిల్లా సహకార బ్యాంకులకు నిధులు అందజేసి, అవి వాటి కార్యకలాపాలు ఎలా నిర్వహిస్తున్నవో పర్యవేక్షణ చేయవలసిన బాధ్యత రాష్ట్ర సహకార బ్యాంకులది.

**దీర్ఘకాలిక వ్యవస్థ :-** రైతులకు స్వల్పకాలిక ఋణాలతో పాటు, మూలధన పెట్టుబడులకు దీర్ఘకాలిక ఋణాలు అవసరం. ఈ ఋణాలను దీర్ఘకాల సహకార పరపతి వ్యవస్థ అందజేస్తుంది. అయితే ఈ విషయంలో అన్ని రాష్ట్రాలలో ఒకే పద్ధతి లేదు. ప్రస్తుతం అనుసరణలో నాలుగు పద్ధతులున్నవి. (ఎ) ఏక నిర్మాణము (Unitary structure), (బి) సంయుక్త నిర్మాణము (Federal structure), (సి) మిశ్రమ నిర్మాణము (Mixed structure), (డి) సమగ్ర నిర్మాణము (Integrated structure).

ఏక నిర్మాణములో, రాష్ట్ర స్థాయిలో, రాష్ట్ర వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బ్యాంకు దాని శాఖల ద్వారా నేరుగా రైతులకు దీర్ఘకాల ఋణాలు అందజేస్తుంది. సంయుక్త నిర్మాణంలో ప్రాథమిక వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బ్యాంకులు రైతులకు నేరుగా దీర్ఘకాలిక ఋణాలు అందజేస్తాయి. ఈ ప్రాథమిక బ్యాంకులన్నీ రాష్ట్ర స్థాయిలో, రాష్ట్ర వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బ్యాంకులో సమాఖ్యగా ఏర్పడతాయి. మిశ్రమ నిర్మాణంలో సంఘాలన్నీ ఏకంగాను లేక సంయుక్తం గాను పని చేస్తాయి. సమగ్ర నిర్మాణంలో స్వల్పకాలిక మరియు దీర్ఘకాలిక ఋణాలన్నీ ఒకే సంస్థ అందజేస్తుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అమలులోనున్న ఏక గవాక్ష విధానము సమగ్ర నిర్మాణమునకు చక్కని ఉదాహరణ.

ఒకటవ పటంలో చూపినట్లుగా క్షేత్ర స్థాయిలో దాదాపు ఒక లక్ష ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, 887 రాష్ట్ర వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బ్యాంకులు, 768 ప్రాథమిక వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బ్యాంకులు మరియు వాటి 1091 శాఖలతో, పరిమాణాత్మకంగా సహకార పరపతి వ్యవస్థ దేశంలో చాలా పెద్ద వ్యవస్థ. అయితే ఈ సంస్థల సాంద్రత, అవి అందజేసే పరపతి, వాటి పటిష్టత మరియు నాణ్యతలలో ప్రాంతీయ వ్యత్యాసాలు ఉన్నాయి.

గ్రామీణ పరపతి రంగంలో 1969 వరకు సహకార వ్యవస్థ ఏకస్వామ్యం ఉన్నది. స్వాతంత్ర్యానంతరం, ప్రభుత్వ భాగస్వామ్యం, రిజర్వు బ్యాంకు, నాబార్డు మున్నగు జాతీయ సంస్థల కృషితో గ్రామీణ పరపతి రంగంలో సహకార పరపతి వ్యవస్థ చాలా ప్రగతి సాధించినది. గ్రామీణ పరపతిలో 1951 - 52 నాటికి సహకార పరపతి వ్యవస్థ అందజేసిన ఋణాల శాతం కేవలం 3.1 మాత్రమే కాగా, 1961 - 62లో 15.5 శాతానికి, 1971 - 72లో 20.1 శాతం,

1980 - 81లో 28.6 శాతం వరకు పెరిగినది. అయితే 1991 - 92లో తిరిగి 21.6కు తగ్గినది. మార్చి 31, 2003 నాటికి సహకార పరపతి వ్యవస్థ వ్యవసాయరంగానికి దాని అనుబంధ కార్యకలాపాలకు రూ॥ 24, 310 కోట్లు అందజేసింది. అయితే మొత్తం సంస్థాపర ఋణ వితరణ రూ॥ 70,810 కోట్లలో సహకార వ్యవస్థ అందించిన ఋణాల శాతం 34.31గా ఉన్నది.

స్వల్పకాలిక ఉత్పత్తి ఋణ వితరణలో సహకార పరపతి వ్యవస్థ అందించిన పరపతి 44 శాతం కాగా, మధ్య మరియు దీర్ఘ కాలిక ఋణాలలో 17 శాతంగా ఉన్నది.

సహకార పరపతి వ్యవస్థ స్వాతంత్ర్యానంతరం బాగా పురోభివృద్ధి చెంది. గ్రామీణ ఋణ వితరణకు ఎంతో దోహదం చేసినది. అయితే అభివృద్ధితోపాటు, అనేక లోపాలు, సమస్యలు చోటు చేసుకోవటంతో వీటి ప్రాముఖ్యత, వాణిజ్య బ్యాంకులతో పోల్చి చూచిన యెడల తగ్గినదని చెప్పవచ్చును. అధిక స్థాయిలో అప్పుల బకాయిలు, నిరర్ధక ఆస్తులు, ప్రభుత్వ నియంత్రణ, రాజకీయాకరణం (Politicisation). ఎన్నికలు వాయిదా వేయటం మున్నగునవి, ప్రస్తుతం ఈ వ్యవస్థ దుస్థితికి ప్రధాన కారణాలుగా చెప్పవచ్చును. దీనికో తోడు సరైన పరిపాలన లేకపోవటం, వీటి నిర్వహణ పట్ల సభ్యులలో నిర్లిప్తత, ఈ వ్యవస్థ బలహీనపడుటకు కారణభూతాలుగా చెప్పవచ్చును.

2. **వాణిజ్య బ్యాంకులు - గ్రామీణ పరపతి :-** బ్యాంకులు జాతీయం చేయుటకు ముందు గ్రామీణ పరపతిలో వాణిజ్య బ్యాంకుల పాత్ర లేదని చెప్పవచ్చును. అయితే జాతీయకరణ పిమ్మట, గ్రామీణ శాఖలు విస్తరించటం, వ్యవసాయాధికారులను నియమించటం, మరియు ప్రత్యేక వ్యవసాయాభివృద్ధి శాఖలు నెలకొల్పటం ద్వారా గ్రామీణ పరపతిలో క్రియాశీలక భాగస్వామిగా ఎదగటానికి వాణిజ్య బ్యాంకులు కృషి చేసాయి.

బ్యాంకులు జాతీయం చేసే నాటికి అనగా 1969 జూలై నాటికి ఈ బ్యాంకుల గ్రామీణ శాఖలు దేశం మొత్తం మీద కేవలం 1833 మాత్రమే కాగా 2002 మార్చి 31వ తేదీ నాటికి ఈ శాఖల సంఖ్య 32, 460కి పెరిగింది. అదే విధంగా, 1969 జూన్ నాటికి వాణిజ్య బ్యాంకులు 0.2 మిలియన్ల మంది గ్రామీణులకు రూ॥ 160 కోట్లు మాత్రమే అప్పు ఇవ్వగా 2002 మార్చి నాటికి 16 మిలియన్ల మంది వ్యవసాయదారులకు రూ॥ 63,080 కోట్ల ఋణాలు అందజేస్తాయి.

వాణిజ్య బ్యాంకులు వ్యవసాయదారులకు నేరుగా ఋణాలు అందజేయడంతో పాటు, పరోక్షంగా వ్యవసాయరంగానికి సేవలందించే ఉత్పాదకాల పంపిణీదారులకు ఋణ సదుపాయాలు అందజేస్తున్నాయి. వీరితో పాటు, జిల్లా సహకార బ్యాంకులు ఆర్థికంగా బలహీనంగా ఉన్న ప్రాంతాలలో ప్రాథమిక సహకార పరపతి సంఘాలకు కూడా బ్యాంకులు ఋణ సదుపాయం అందజేసేవి. వ్యవసాయ ఉత్పాదకాల డీలర్లతో పాటు, మార్కెటింగ్, ప్రాసెసింగు, పాల పరిశ్రమ, కోళ్ళ పెంపకం, చేపల పెంపకం మున్నగు కార్యకలాపాలకు కూడా ఋణ సదుపాయం అందిస్తున్నాయి.

వ్యవసాయదారులలో సన్నకారు, చిన్న రైతులు అధికంగా ఉన్నందున వారికి 'చిన్న రైతుల అభివృద్ధి సంస్థల' (small farmer's development agencies) ద్వారా అనువైన పథకాలను తయారు చేసి వారికి వాణిజ్య బ్యాంకులు ఋణ సదుపాయం అందజేసాయి. పేదరిక నిర్మూలనకు ఏర్పాటు చేసిన 'సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం' (Integrated Rural Development Programme) క్రింద దారిద్య రేఖకు దిగువనున్న వారికి పాడి పశువులు, వ్యాపారాలు చేసుకొనుటకు, షాపులు పెట్టుకొనుటకు ఈ బ్యాంకులు ఆర్థిక సహాయం చేసేవి. అయితే ఈ బ్యాంకులు సహకార వ్యవస్థ బలహీనంగా ఉన్న ప్రాంతాలలో ఆ లోటు తీర్చలేకపోయాయి. ఇవి కూడా సహకార

సంఘాలు, బ్యాంకులు ఉన్నచోట, వ్యవసాయ రంగం అభివృద్ధి గాంచిన దక్షిణాది మరియు పశ్చిమ రాష్ట్రాలలోనే వాటి వ్యవసాయ పరపతి కార్యకలాపాలు సాగించాయి.

వ్యవసాయ, గ్రామీణ రంగాలకు వాణిజ్య బ్యాంకులు పరపతి సేవలను పెంచినప్పటికీ చాలా అపరిష్కృత సమస్యలు ఉన్నాయి. భారత వ్యవసాయరంగ పరపతి అవసరాలు రానున్న కొద్ది సంవత్సరాలలో దాదాపు రూ॥ 100,000 కోట్లుగా అంచనా వేయబడింది. పరిమాణాత్మకం గానే కాక 5,50,000 గ్రామాలలో ఉన్న అసంఖ్యాక సన్నకారు, చిన్న రైతులకు ఋణాలు అందచేయుటకు ప్రస్తుతం ఉన్న గ్రామీణ శాఖలు సరిపోవు. అంతేకాక చిన్న చిన్న ఋణాల బట్వాడా తిరిగి వసూలు చేయటంలో ఖర్చులు అధికంగా ఉంటాయి. ఇదీ గాక ఋణాల బకాయిలు, నిరర్థక ఆస్తులు, పరపతి వితరణకు మేళాలు గ్రామీణ శాఖల మనుగడకు సవాళ్ళుగా మారాయి. వీటి నీలి నీడలు గ్రామీణ శాఖల మీద గ్రామీణ పరపతి మీద పడినాయి. ఉదాహరణకు 1994 మార్చిలో 33,126 గ్రామీణ శాఖలు ఉండగా, మార్చి 31 2003 నాటికి వీటి సంఖ్య 32, 244కు తగ్గినది. అదే విధంగా వ్యవసాయ ఋణాల ఖాతాలు 1995 మార్చిలో 213 మిలియన్లు ఉండగా మార్చి 2003 నాటికి 168 మిలియన్లకు తగ్గాయి. బ్యాంకుల మొత్తం ఋణ నిల్వలలో వ్యవసాయ నిల్వల శాతం 1977లో 16.3 ఉండగా మార్చి 31, 2003 నాటికి ఈ శాతం 15.3కి తగ్గినది. బ్యాంకింగు రంగ సంస్కరణల అనంతరం అనగా 1990 నుంచి పరిమాణాత్మకంగా బ్యాంకులు వ్యవసాయ మరియు గ్రామీణ రంగాలకు అందజేస్తున్న ఋణ సహాయం పెరిగినప్పటికీ, అవి నేరుగా వ్యవసాయదారులకిచ్చే ఋణాలు, సన్నకారు మరియు చిన్న రైతులకు ఇచ్చే ఋణాల పెరుగుదల తగ్గినది. ఉదా॥ బ్యాంకులు నేరుగా ఇచ్చే ఋణాల వార్షిక పెరుగుదల రేటు సన్నకారు రైతుల విషయంలో 1980లో ఉన్న 18.1 శాతం నుంచి 1990లో 13 శాతానికి తగ్గగా, అదే కాలంలో చిన్న రైతుల విషయంలో ఈ పెరుగుదల రేటు 15.1 నుంచి 11.0 శాతానికి తగ్గినది. బ్యాంకులు ప్రాధాన్యతా రంగానికి ఇచ్చే పరపతిని, గ్రామీణ సేవా పథకాల నిధిలో డిపాజిట్లు చేయుటకు అనుమతించటం పై తగ్గుదలకు ప్రధాన కారణం.

ప్రస్తుతం అనేక రాష్ట్రాలలో రైతులు ముఖ్యంగా సన్నకారు, చిన్న రైతులు, కౌలుదార్లు వడ్డీ వ్యాపారస్తుల నుండి అధిక వడ్డీ పై ఋణాలు తీసుకొని ప్రకృతి వైపరీత్యాలు, మార్కెట్ అనిశ్చితం కారణంగా, ఋణాలను తీర్చలేక ఆత్మహత్యలు చేసుకోవటం అందరికీ తెలిసిన విషయమే. దీనిని బట్టి సంస్థాపర ఋణ విస్తరణ రైతాంగ అవసరాల మేరకు అందటం లేదని ఋజువయింది. ఈ సమస్య నివారణకు ప్రభుత్వాలు, రిజర్వు బ్యాంకు వారు బ్యాంకు అధ్యక్షులకు, ఉన్నతాధికారులకు అందజేసే మార్గదర్శక సూత్రాలు, వ్యవసాయ పరపతి విస్తరణకు అనుకున్నంతగా అందటం లేదు. గ్రామీణ పరపతికి సంబంధించి అన్ని స్థాయిల బ్యాంకు సిబ్బంది వైఖరులలో నిర్దిష్ట మార్పు రానిదే, బ్యాంకుల నుంచి గ్రామీణ రంగానికి తగినంత పరపతి విస్తరణ జరగటం సాధ్యపడదు.

3. **ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు - గ్రామీణ పరపతి :-** 20 సూత్రాల ఆర్థిక పథకంలో భాగంగా గ్రామీణ ఋణగ్రస్థతను రూపుమాపి బలహీన వర్గాల పరపతి అవసరాలను ఆదుకొనుటకు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు వర్కింగ్ గ్రూపు అన్ రూరల్ బ్యాంక్సు (1975) వారి సిఫారసు మేరకు ఏర్పాటు చేయబడినవి. గ్రామీణ పేదలకు, తక్కువ ఖర్చుతో, వారి స్థాయికి అందుబాటులో ఉండి వారు తడబాటు లేకుండా వెళ్ళగలిగిన పరపతి సంస్థ అవసరం అని ఆ వర్కింగ్ గ్రూపు అభిప్రాయపడింది. సహకార సంఘాల వలె గ్రామీణ పరిస్థితుల పై అవగాహన, స్థానిక సంస్థ అనే భావన, స్థాపించిన మాతృ వాణిజ్య బ్యాంకుల వ్యాపార దక్షత మరియు ఆధునికతల మేలు కలయిక, గ్రామీణ బ్యాంకులు. పేదలకు పరపతి అందజేయుటకు అనువైన సంస్థలుగా భావించి వాటిని ఏర్పాటు చేయటం జరిగింది. స్థానిక ప్రజలు, వారి అవసరాలు, సమస్యలు, పరిమితులు తెలిసిన స్థానికులనే సిబ్బందిగా చేర్చుకొనుటకు కూడా నిర్ణయం జరిగినది.

ప్రథమంగా ఒక ప్రాంతీయ గ్రామీణ బ్యాంకును అక్టోబరు 2వ తేదీ 1975 సం॥లో ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్, గోరఖ్ పూర్, హర్యానా రాష్ట్రంలోని భివాని, రాజస్థాన్‌లోని జయపూర్, పశ్చిమ బెంగాలులోని మాల్డా జిల్లాలలో ఏర్పాటు చేసారు. ఒక కోటి రూపాయల మూలధన పరపతిలో రూ॥ 25 లక్షలు చెల్లించబడిన మూలధనంతో ఈ బ్యాంకులను ఏర్పాటు చేసారు. ఈ బ్యాంకుల షేరు ధనంలో 50 శాతం కేంద్ర ప్రభుత్వం, 15 శాతం రాష్ట్ర ప్రభుత్వం, మిగిలిన 35 శాతాన్ని మాతృ బ్యాంకు (sponsor bank) పెట్టుబడి పెడతాయి.

సాధారణంగా ఈ బ్యాంకుల వ్యాపార విస్తీర్ణం ఒకటి లేక ఎక్కువ జిల్లాలకు విస్తరించి ఉంటుంది. ఈ బ్యాంకులు ఋణాలను కేవలం సన్నకారు, చిన్న రైతులకు, గ్రామీణ చేతి వృత్తుల వారికి, వ్యవసాయ కూలీలు, ఇతర బలహీన వర్గాలకు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించారు. అయితే కొద్ది సం॥ల తర్వాత వీటి వికసనశీలత (viability) దృష్ట్యా ఇతరులకు కూడా కొంత మేరకు సేవలు అందించటానికి అనుమతించుట జరిగినది. ఈ సంస్థలు పటిష్టంగా పని చేయుటకు మాతృ సంస్థ మరియు రిజర్వు బ్యాంకు వారు అనేక రాయితీలు కల్పించారు. ఉదాహరణకు మాతృ సంస్థ 8.5 శాతం ఋణం అందజేసి, పరిపాలన సిబ్బంది మరియు ఆర్థిక సహాయం అందజేయగా రిజర్వు బ్యాంకు వారు రొక్కపు నిల్వల నిష్పత్తిని 3 శాతం, చట్ట నిబంధ ద్రవ్యత్వ శాత నిష్పత్తిని 25 శాతం మేరకు అనుమతించగా, నాబార్డు పునఃధన సహాయం అందజేస్తుంది.

ప్రస్తుతం దేశంలో ఉన్న 196 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు 23 రాష్ట్రాలలో ఉన్నవి. మార్చి 31వ తేదీ 2002 నాటికి ఈ బ్యాంకుల శాఖలు 14,390 గానూ, ఖాతాదారుల సంఖ్య 50 లక్షలకు చేరింది. ఈ బ్యాంకులు ఈ క్రింది విధంగా మార్చి 31వ తేదీ 2002 నాటికి ఋణాలు అందజేసినవి.

**ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఇచ్చిన ఋణాలు**

**మార్చి 31 వ తేదీ 2002 నాటికి**

**(రూ॥ కోట్లలో)**

| ఋణ వివరణ | ఇచ్చిన మొత్తం |
|---|---|
| స్వల్ప కాలిక ఉత్పత్తి ఋణాలు | 3812 |
| వ్యవసాయ మూలధన ఋణాలు | 782 |
| గ్రామీణ చేతివృత్తుల వారికి | 198 |
| గ్రామీణ వ్యాపారం | 1279 |
| ఇతరములు | 4500 |
| మొత్తం బట్వాడా చేసిన ఋణాలు | 10571 |

గ్రామీణ బ్యాంకులు బలహీన వర్గాలకు పరపతి అందజేయుటలో వాటి లక్ష్యాలు చాలా వరకు చేరుకున్నట్లుగా 1989 - 90లో రిజర్వు బ్యాంకు అభిప్రాయం వ్యక్తం చేయింది. అయితే వాస్తవానికి ఈ బ్యాంకులు నిర్వహణలో చాలా సమస్యలను ఎదుర్కొన్నాయి. నిర్మాణ పరంగా పరిమిత వ్యాపార ప్రదేశం, బలహీన వర్గాలకు చెందిన ఖాతాదారులు, పెరుగుతున్న బకాయిలు, నిరర్థక ఆస్తులు, చాలా బ్యాంకులను నష్టాల ఊబిలోకి దించాయి. ఉదాహరణకు 1994 - 95లో 196 బ్యాంకులలో 150 బ్యాంకులు అయిదు సంవత్సరాలు వరుసగా నష్టాలలో ఉన్నట్లు తేలింది. సిబ్బందికి తగిన శిక్షణ లేకపోవటం, పరిపాలనాపర లోపాలు కూడా పై స్థితికి కారణంగా చెప్పవచ్చును. ఈ బ్యాంకుల పునరుద్ధరణకు, భారత ప్రభుత్వం, నాబార్డు వారు అనేక పథకాలు రూపొందించి అమలు చేసారు. ఈ చర్యల ఫలితంగా ప్రస్తుతం 196 బ్యాంకులలో 167 లాభాలతో నడుస్తున్నవి.

## 9.7 లీడ్ బ్యాంకు పథకము (Lead Bank Scheme):-

1969వ సం॥లో బ్యాంకులు జాతీయం చేసిన తరువాత చాలా సంవత్సరాలకు ఈ పథకం ప్రవేశ పెట్టబడినది. 1978వ సం॥లో లీడ్ బ్యాంకు స్కీమును ప్రవేశ పెట్టినప్పటి నుంచి వార్షిక ప్రణాళికలను, జిల్లా పరపతి ప్రణాళికలను తయారు చేయుట మొదలైనవి. ఈ పథకంలో జిల్లాకొక బ్యాంకు లీడ్ బ్యాంకుగా ఉండి జిల్లాలో గల అన్ని బ్యాంకులను సమన్వయ పరచి, బ్రాంచి విస్తరణ కార్యక్రమమును, పరపతి అవసరాలు తీర్చేటందుకు కావలసిన ప్రణాళికలు తయారుచేసి అమలుపరచెడివారు. లీడ్ బ్యాంకుగా జిల్లాలోని ఒక ప్రముఖ వాణిజ్య బ్యాంకును - ఆ జిల్లాలో అత్యధిక శాఖలు ఉన్న బ్యాంకును ఎంపిక చేస్తారు.

జిల్లా స్థాయిలో ఋణ వితరణకు, వివిధ బ్యాంకింగు సంస్థలను ప్రభుత్వ సమన్వయంలో ముందుకు నడిపించడానికి, జిల్లా అభివృద్ధికి అడ్డుతున్న సమస్యలను గుర్తించి, సంబంధిత సంస్థ పై ఒత్తిడి తెచ్చి సమస్యల నివారణకు ఈ పథకం కొంతమేరకు తోడ్పడుతుంది. దీనితోపాటు బ్యాంకు శాఖల విస్తరణ నియంత్రణ, మార్గదర్శకత్వాన్ని కూడా పటిష్టం చేయుటకు ఈ పథకం దోహదం చేస్తుంది.

అయితే ఈ పద్ధతిలో ఏ బ్యాంకు, ఏ ప్రదేశంలో ప్రాధాన్యతా రంగానికి అభివృద్ధి కార్యక్రమములకు పరపతి నందించవలెనో నిర్దిష్టముగ లేనందున కొన్ని గ్రామములు ఏ విధమైన సహాయము పొందకుండాను, కొన్ని గ్రామములకు అనేక బ్యాంకుల ద్వారా సహాయము పొందుట జరిగినది. అదే కాకుండా కేవలం ఈ పథకంలో అప్పులు సరఫరా చేయుట మాత్రం జరిగినది గాని, అట్టి అప్పులనిచ్చుట వల్ల సదరు ఏరియాను అభివృద్ధి చేయుటకు కావలసిన సామర్థ్యము వున్నదీ లేనిదీ గమనించలేదు. దీనివలన బ్యాంకులు అప్పులు అందించినందువల్ల సహజ సంపదలను, వనరులను వెలికి తీయుటకు, అభివృద్ధి చేయుటకు ఆశించినంతగా ఉపయోగపడలేదు. జిల్లా పరపతి ప్రణాళికలో పరపతేతర సౌకర్యముల లభ్యత, అనుకూల వాతావరణం మొదలుగా గల విషయములను గురించి ఆలోచనలోనికి తీసుకోలేదు. దీనికంతకు జిల్లా యొక్క సమగ్రమైన అభివృద్ధి ప్రణాళిక లేకపోవుటయేనని గ్రహింపబడినది.

పై అనుభవాల దృష్ట్యా 1987వ సం॥లో రిజర్వు బ్యాంకు గవర్నరు గారు జాతీయం చేయబడిన బ్యాంకుల యాజమాన్యములను వివిధ జిల్లాలలో సర్వే జరుపవలసినదిగా సూచించారు. ఈ సర్వే పని తీరును బ్యాంకు అధ్యక్షుల సెమినార్‌లో చర్చించి సర్వీసు ఏరియా పథకమును అమలు చేయవలసినదిగా సిఫార్సు చేసారు. ఈ పద్ధతిలో ప్రతి బ్యాంకు బ్రాంచి కొన్ని గ్రామముల సముదాయమునకు, సామర్థ్యమును బట్టి పరపతిని ముందుగా కనుగొనుట ఆ సర్వీసు ఏరియా బ్రాంచి బాధ్యత అయి ఉన్నది. ఈ పద్ధతిలో సదరు బ్రాంచి తమ గ్రామములొక్కక్క, దానికి పరపతి ప్రణాళికను, సామర్థ్యాన్ని, అనుకూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రూపొందించి, దానిని అమలు జరిగేలా చూస్తూ అమలులో జరిగే అభివృద్ధిని మూడు నెలలకొకసారి సమీక్ష చేస్తూ ఉండాలి. అటువంటి పరపతి ప్రణాళికను సంవత్సరమునకొకసారి తయారు చేయాలి.

## 9.8 వ్యత్యాస / అసంతులిత వడ్డీ రేట్ల పథకం (Differential Rates of Interest Scheme):-

20 సూత్రాల పేదరిక నిర్మూలనా పథకంలో భాగంగా ఈ వ్యత్యాస వడ్డీ రేట్ల పథకం 1972లో భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టినది. ఈ పథకమును దేశంలోని అన్ని షెడ్యూల్డు వాణిజ్య బ్యాంకులు అమలు చేస్తున్నాయి. ఈ పథకం క్రింద, ఉత్పత్తి తదితర లాభసాటి వ్యాపకాలు చేపట్టిన బలహీన వర్గాల వారికి సం॥కి 4 శాతం వడ్డీ పై బ్యాంకులు ఋణ సహాయం చేస్తాయి. ఈ పథకంలో బ్యాంకులు వాటి గత సం॥ అడ్వాన్సులలో కనీసం 1 శాతం అడ్వాన్సులను ఈ పథకం క్రింద అడ్వాన్సు చేయాలి. ఈ అడ్వాన్సులలో 2/3వ వంతు గ్రామీణ మరియు అర్థ - గ్రామీణ శాఖల ద్వారా అడ్వాన్సు చేయాలి. ఈ పథకంలో ఋణాలు పట్టణ వాసులయితే వార్షిక ఆదాయం రూ॥ 7200లు, గ్రామీణులు అయితే రూ॥ 6200కు మించని వారికి మాత్రమే ఇవ్వాలి. మార్చి 31, 2003 నాటికి ఈ పథకం క్రింద బ్యాంకులు ఋణాలుగా ఇచ్చిన నిల్వలు రూ॥ 300 కోట్లు కాగా, లబ్ధిదారులు 3.70

మంది ఉన్నారు. ఇదే కాలానికి ఈ పథకం క్రింద బ్యాంకులు క్రితం సం॥ము వాటి మొత్తము అడ్వాన్సులలో 0.08 శాతం మాత్రమే ఇచ్చాయి. అంటే బ్యాంకింగు సంస్కరణల తరువాత ఈ పథకం అమలులో బ్యాంకులు పూర్వపు శ్రద్ధ కనబరచుట లేదని తెలియుచున్నది.

ఈ పథకం ప్రారంభించిన నాటి నుంచి 1999 మార్చి వరకు బ్యాంకులు ఈ పథకం క్రింద ఇచ్చిన అడ్వాన్సులు, లబ్ధిదారుల సంఖ్య, మున్నగు వివరాలు ఈ క్రింది పట్టికలో చూపబడినవి.

**పట్టిక - 2**

**వ్యత్యాస వడ్డీ రేట్ల పథకం (DRI Scheme) క్రింద**

**జాతీయ బ్యాంకులు ఇచ్చిన ఋణాలు, ఖాతాదారుల వివరాలు**

1992 - 1999

| డిశంబరు చివరకు | ఖాతాదారుల సంఖ్య (000'లో) | ఋణాల నిల్వలు మొత్తం రూ॥ కోట్లలో | గత సం॥ ఇచ్చిన అడ్వాన్సులలో ఈ పథకం క్రింద ఇచ్చిన అడ్వాన్సుల శాతం |
|---|---|---|---|
| 1972 | 26 | 0.87 | 0.02 |
| 1975 | 465 | 20.99 | 0.31 |
| 1980 | 2510 | 193.56 | 1.04 |
| 1985 | 4318 | 462.70 | 1.10 |
| 1990 మార్చి | 4229 | 703.59 | 0.89 |
| 1998 మార్చి | 905 | 544.00 | 0.28 |
| 1999 మార్చి | 729 | 485.00 | 0.21 |

ఈ పథకం క్రింద బ్యాంకింగు రంగం అడ్వాన్సులు 1980 నాటికి నిర్ణయించబడిన 1 శాతానికి కొంచెం పైగానే ఉన్నాయి. 1990 వరకు ఈ స్థితిలో కొనసాగినదని చెప్పవచ్చును. 1990లో ఈ పథకం క్రింద షెడ్యూల్ట్ కులాల మరియు షెడ్యూల్డ్ తెగల లబ్ధిదారులకు రూ॥ 335.85 కోట్లు అనగా 47.7 శాతం ఋణాలు బ్యాంకులు ఇచ్చినవి. ఈ వర్గాల వారికి ఇవ్వవలసిన 40 సాతం కంటే, ఇచ్చిన ఋణాల శాతం ఎక్కువ. 1991 నుంచి బ్యాంకింగు రంగం సంస్కరణల ప్రారంభంలో ఈ పథకం క్రింద బ్యాంకులు వాటి మొత్తం అడ్వాన్సులలో ఇవ్వవలసిన 1 శాతం నిబంధనను అనుసరించుట లేదు. అంతేకాక రిజర్వు బ్యాంకు వారు ప్రతి ఏటా ప్రచురించే రిపోర్టు అన్ కరెన్సీ అండ్ ఫైనాన్స్‌లో ఈ పథకాల సమీక్షను 1990 - 91 నుంచి చేయుటలేదు.

## 9.9 ఋణగ్రస్థ నివారణకు, పరపతి వితరణకు తీసుకోవలసిన చర్యలు :-

ఋణగ్రస్థత అనే సమస్య నివారించటానికి స్వల్ప కాలిక, దీర్ఘకాలిక పథకాలు చేపట్టటం ఎంతైనా అవసరం. ఈ భారం నుంచి వెంటనే ఉపశమనం కల్గించటానికి పాత బకాయిలను రద్దు చేయుట లేదా వాటి భారం తగ్గించుటకు చర్యలు తీసుకోవటం, వడ్డీ వ్యాపారుల మీద గ్రామీణులు పరపతికి ఆధారపడటాన్ని తగ్గించుటతో బాటు, కొత్త ఋణాల పై నియంత్రణ ఉండటం అవసరం.

పైనుదహరించినవి తాత్కాలికమయిన ఉపశమనాలు మాత్రమే. ఈ సమస్యకు అసలు కారణం, అతి చిన్న వ్యవసాయ కమతాలు, వర్షాధార వ్యవసాయం, వరదలు, కరవులు, పెరిగిన వ్యవసాయ పెట్టుబడులు, మార్కెట్టులో ధరల అనిశ్చలత, దీనితో ప్రభుత్వం విద్య మరియు ఆరోగ్య, వైద్య రంగాలలో దాని పాత్రను తగ్గించుకోవటం, వ్యవసాయేతర ఉపాధి సౌకర్యాలు తగినంతగా లేకపోవటం ప్రధాన కారణాలు. ఈ సమస్యల నివారణకు పటిష్టమైన చర్యల ద్వారానే ఋణగ్రస్థతను నివారించుట సాధ్యపడుతుంది.

ఋణగ్రస్థ నివారణతో పాటు, పరపతి విస్తరణ చర్యలు తీసుకొంటేనే రైతాంగం వ్యవసాయోత్పత్తి కార్యకలాపాలలో పాల్గొనటానికి వీలుంటుంది. ఈ క్రింది చర్యలు పరపతి వితరణకు దోహదం చేస్తాయి.

1. రైతుల పరపతి పరిమితులు నిర్ణయించేటప్పుడు వారి వ్యవసాయ ఖర్చులే కాక, కొంతమేర వినియోగ ఖర్చులను కూడా దృష్టిలో ఉంచుకోవాలి.
2. ఉత్పత్తి అవసరాలకే కాక, వ్యవసాయదారులకు మార్కెటింగ్ అవసరాలకు కూడా పరపతి అవసరం. ఇందు నిమిత్తం వారికి 'గిడ్డంగి రసీదు' (Ware House Receipts) ఆధారంగా పరపతి అందజేస్తే వారు తమ ఉత్పత్తులను గిట్టబాటు ధరలకు విక్రయించుకొని, ఋణ బాధలను అధిగమించగలగటానికి అవకాశం ఉంటుంది.
3. ప్రస్తుతం కౌలుదార్లకు వ్యవస్థా పరపతి సంస్థల నుంచి ఋణ సహాయం అందుట లేదు. కౌలుదారీ చట్ట సవరణ కాల వ్యయంతో కూడిన పని. అందువలన వీరిని కూడా స్వయం సహాయక బృందాలుగా ఏర్పాటు చేసి, వాటి ద్వారా ఋణ సహాయం అందజేస్తే కొంతమేరకైనా వారి అవసరాలు తీర్చటానికి వీలవుతుంది.
4. అర్హులయిన వారందరికి కిసాన్ క్రెడిట్ కార్డులు ఇచ్చి పరపతి పరిమితులను కాలానుగుణంగా మార్పు చేయటం కూడా పరపతి వితరణకు, ఆ విధంగా ఋణభార విముక్తికి తోడ్పడుతుంది.
5. వ్యవస్థాపర పరపతి వ్యవస్థను ముఖ్యంగా సహకార వ్యవసాయ పరపతి వ్యవస్థను, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను పటిష్టం చేయటం ద్వారాను పరపతి వితరణ పెంచుటకు వీలుపడుతుంది.

ప్రస్తుతం వ్యవస్థాపర వ్యవస్థలో, గ్రామీణ పరపతి వితరణలో వాణిజ్య బ్యాంకులు ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి. అయినప్పటికీ, బ్యాంకింగు రంగ సంస్కరణల తరువాత, ఈ సంస్థలు వ్యవసాయ రంగానికిచ్చే ఋణాల శాతం తగ్గింది. ఈ తగ్గుదలను అరికట్టుటకు వాటి అడ్వాన్సులలో 18 శాతం గ్రామీణ పరపతికి అందజేసిన యెడల, ఈ రంగానికి పరపతి బాగా మెరుగుపడుతుంది.

వ్యవసాయదారులను గ్రామ స్థాయిలో సంఘాలుగా లేక సమూహాలుగా ఏర్పాటు చేసి ఋణాల సద్వినియోగం, సకాలంలో తిరిగి చెల్లించవలసిన ఆవశ్యకత, అలా చేయని యెడల చివరకు నష్టపోయేది వారేనని, వారిలో అవగాహన తీసుకురావలసిన ఆవశ్యకత చాలా అవసరం. దీనితో పాటు ముఖ్యంగా, సహకార పరపతి సంఘాలలో సభ్యులను చైతన్యపరచి, సంఘ కార్యకలాపాలలో వారిని ఇతోధికంగా పాల్గొనేటట్లు చేసి వాటిని పటిష్టపరచి తద్వారా వారు మేలు పొందాలని, ఎవరో వచ్చి ఏదో చేస్తారని చూస్తూ ఉంటే వారికి, నిరాశ, నిస్పృహలే చివరకు మిగులుతాయని తేల్చి చెప్పాలి.

## 9.10 సారాంశము :-

గ్రామీణ రంగంలో పూర్వం కంటే ఋణగ్రస్థత బాగా పెరుగుతుంది. ఉత్పాదకాల ఖర్చులు, వినియోగ ఖర్చులు, విద్య, వైద్య, ఆరోగ్య సంబంధ ఖర్చులు పెరుగుటతో పాటు, ప్రకృతి వైపరీత్యాలు, ధరల అనిశ్చలత ఇందుకు కారణమయ్యాయి. ఈ ఋణ భారాలు, కొందరు అభాగ్యులను ఆత్మహత్యలకు కూడా పురికొల్పుతున్నాయి అనే విషయం అందరికీ తెలిసినదే. ప్రభుత్వం వారు ఋణ విమోచన చర్యలు చేపట్టి, వడ్డీ వ్యాపారస్థుల కార్యకలాపాల పై నియంత్రణ చేపట్టి వ్యవస్థాగత పరపతి పెంపు చేసే

చర్యలు చేపట్టారు. అయితే అంతిమంగా ఈ సమస్య పరిష్కారం రైతుల ఆదాయాలు పెరుగుట పై ఆధారపడుతుంది. గాన ఈ దిశగా చర్యలు అవసరం ముఖ్యంగా వ్యవసాయేతర ఉపాధి అవకాశాలు గ్రామాలలో కల్పించటం ఎంతో అవసరం.

వ్యవసాయానికి కవసరమయిన స్వల్ప, మధ్య మరియు దీర్ఘ కాలిక ఋణాలను వ్యవస్థాపరంగా వితరణ చేసి, వడ్డీ వ్యాపారుల ప్రాబల్యాన్ని గ్రామీణ రంగంలో రూపుమాపుటకు స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకొని, వివిధ పథకాలు రూపొందించింది. ఈ చర్యల ఫలితంగా ఈ రంగంలో ప్రైవేటు సంస్థల ప్రాబల్యానికి అడ్డుకట్ట వేయటం జరిగింది. బలహీన వర్గాల వారికి పరపతి సహాయం అందజేసే నిమిత్తం 1972లో వ్యత్యాస వడ్డీ రేట్ల పథకం, 1995లో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను ఏర్పాటు చేయటం జరిగింది.

సహకార పరపతి సంస్థ పెరుగుతున్న వ్యవసాయ మరియు గ్రామీణ రంగ అవసరాలు తీర్చలేదని నిర్ధారించుకొని 1969 నుంచి బహుళ సంస్థ విధానమును ప్రవేశ పెట్టుట జరిగినది. ప్రస్తుతం, గ్రామీణ పరపతిలో సింహ భాగాన్ని సహకార బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులు సమకూర్చుతున్నాయి. ఈ కార్యనిర్వహణా భారంలో ఈ సంస్థలు కూడా ఆటుపోట్లకు గురి అయి నష్టాలను చవిచూడటం, నిరర్థక ఆస్తులు, బకాయిలు పెరగటం ద్వారా వాటి పరపతి విస్తరణ సామర్థ్యం తగ్గిపోయింది. ఈ సంస్థల సమస్యల నివారణకు ప్రభుత్వం అనేక పథకాలు రూపొందించి, నిరంతర పరపతి విస్తరణ కృషి చేస్తుంది. ఈ చర్యలు కాలక్రమేణా సత్ఫలితాలనిస్తాయని ఆశిద్దాం.

## 9.11 ముఖ్య పదాలు :-

**ఋణగ్రస్థత** - ఎల్లప్పుడు అప్పులలో ఉండుట

**స్వల్పకాలిక పరపతి** - స్వల్ప వ్యవధి పరపతి - అనగా 12 మాసముల కాల పరిమితితో అందజేసే పరపతి

**మధ్యకాలిక పరపతి** - మధ్య వ్యవధి పరపతి - 12 మాసాలకు మించి 5 సం॥రాల లోపు కాల పరిమితితో కూడినది.

**దీర్ఘకాలిక పరపతి** - దీర్ఘ వ్యవధి పరపతి - 5 సం॥లకు మించి 20 సం॥ల లోపు కాలపరమితితో కూడినది

**లీడ్ బ్యాంకు పథకం** - 1978లో జిల్లా స్థాయిలో పరపతి ప్రణాళికలు తయారు చేసి, బాంకు శాఖల విస్తరణ కార్యక్రమములను సమన్వయపరచి పరపతి అవసరాలు తీర్చుటకు ఉద్దేశించిన పథకము

**వ్యత్యాస వడ్డీ రేటు పథకం** - 1972లో బలహీన వర్గాలకు అతి తక్కువ వడ్డీతో (4 శాతం) బ్యాంకు ఋణాలు అందించుటకు ఏర్పాటు చేసిన పథకం

**వికసన శీలత (viability)** - నిర్వహణ ఖర్చులకు తగిన ఆదాయం ఉండటం

## 9.12 స్వయం సమీక్షా ప్రశ్నలు :-

1. గ్రామీణ ఋణగ్రస్థతకు గల కారణములు వివరించి, వాటి నివారణోపాయమునకు చర్యలు సూచించుము.
2. వ్యవసాయ పరపతిని వర్గీకరించి, వ్యవసాయానికి వాటి ప్రాధాన్యతను తెలియజేయుము.
3. వ్యవసాయ మరియు గ్రామీణ పరపతి రంగాలలో వ్యవస్థాగత సంస్థల పాత్రను కూలంకషముగా తెలియజేయుము.
4. గ్రామీణ పరపతిలో ప్రస్తుత తీరుతెన్నులను పేర్కొని, ఋణగ్రస్థ నివారణకు, పరపతి వితరణకు తగు సూచనలు తెలుపుము.

## 9.13 చదువదగిన గ్రంథాలు :-

1. నాబార్డు 2003 - NABARD and Rural Credit 2003
2. నాబార్డు 2003 - NABARD's Annual Report 2002 - 2003

**ఆచార్య. ఆర్.యమ్. మోహనరావు**

పాఠం - 10

# గ్రామీణ పరపతి - జాతీయ వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బాంకు పాత్ర

## 10.0 లక్ష్యం :-

ఈ పాఠ్య భాగం చదివిన తరువాత ఈ క్రింది విషయాలను తెలుసుకోగలరు. అవి

- నాబార్డు లక్ష్యములు
- సంస్థాగత గ్రామీణ పరపతి వ్యవస్థలో నాబార్డు పాత్ర
- నాబార్డు నిర్మాణము, ప్రకార్యాలు మరియు గ్రామీణ పరపతి వ్యవస్థను పటిష్టపరచుటకు ఈ సంస్థ ఎలా కృషి చేస్తున్నది?
- నాబార్డు నిధులు ఏమిటి? ఆ నిధులను జాతీయ బాంకు ఎలా వినియోగిస్తున్నది ?

## విషయసూచిక :-


**10.1 ఉపోద్ఘాతము**

**10.2 జాతీయ వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బాంకు - లక్ష్యములు**

**10.3 నాబార్డ్ నిర్మాణము**

**10.4 నాబార్డ్ ప్రకార్యములు**

**10.4.1 పరపతి సంబంధ ప్రకార్యాలు**

**10.4.2 ప్రోత్సాహక మరియు అభివృద్ధి సంబంధ ప్రకార్యాలు**

**10.4.3 వ్యవసాభివృద్ధి మరియు పర్యవేక్షణా ప్రకార్యాలు**

**10.4.4 సలహా సంప్రదింపు సేవలు**

**10.5 నాబార్డ్ నిధులు**

**10.6 సారాంశము**

**10.7 ముఖ్య పదాలు**

**10.8 స్వయం సమీక్షా ప్రశ్నలు**

**10.9 చదువదగిన గ్రంథాలు**

## 10.1 ఉపోద్ఘాతము :-

నాబార్డు ఏర్పడక ముందు గ్రామీణ పరపతికి సంబంధించిన అనేక విషయాలు భారతీయ రిజర్వు బ్యాంకులోని వ్యవసాయ పరపతి శాఖ ఆధీనంలో జరిగేవి. దేశ కేంద్ర బ్యాంకు అయిన భారతీయ రిజర్వు బ్యాంకు తన దృష్టిని గ్రామీణ పరపతి పై సారించుట కష్టము గావున, జాతీయ వ్యవసాయ బ్యాంకు ఆవశ్యకత పై పలు సంఘాలు/కమిటీలు దృష్టి సారించాయి. ప్రథమంగా 'జాతీయ వ్యవసాయ కమీషను' (National Commission Agriculture) 1976 లో ఒక వ్యవసాయ అభివృద్ధి బ్యాంకును రిజర్వు బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయుటకు ప్రతిపాదించినది. 1979 లో బి. శివరామన్ గారి నేతృత్వంలో ఏర్పాటయిన 'వ్యవస్థాగత వ్యవసాయ పరపతి మరియు గ్రామీణాభివృద్ధి సమీక్షా సంఘం' (Committee to Review Institutional Credit for Agriculture and Rural Development) ఆనాటి పరిస్థితులు, అనగా సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం, గ్రామీణ పరపతిలోని లోపాలు, గ్రామీణ పరపతి సమస్యలను బృహత్తరమైన గ్రామీణాభివృద్ధిలో అనుసంధానించటం, మరియు గ్రామీణ పరపతి పై పూర్తి దృష్టిని సారించే ఏకైక వ్యవస్థ ఆవశ్యకతను దృష్టిలో నుంచుకొని 'జాతీయ వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బ్యాంకు' ఏర్పాటును ప్రతిపాదించినది. భారత ప్రభుత్వం, పై కమిటీ ప్రతిపాదనలను 1981 లో ఆమోదించినది. 1982 జూలై 12వ తేదీన పార్లమెంటు చేసిన చట్టం ద్వారా జాతీయ వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బాంకు స్థాపించబడినది. ఈ బ్యాంకు జూలై 15 1982 నాటి నుంచి కార్యకలాపాలను ప్రారంభించినది. ఈ బ్యాంకు క్రితంలో అగ్రికల్చరల్ రిఫైనాన్స్ కార్పోరేషన్ (ఎ. ఆర్.డి.సి.) ప్రకార్యములతో పాటు, రిజర్వు బ్యాంకులోని వ్యవసాయ పరపతి శాఖను కూడా అనుసంధానము చేసుకొనెను. రిజర్వు బ్యాంకులోని వ్యవసాయ పరపతి శాఖకు, సహకార బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు మరియు వాణిజ్య బ్యాంకులకు రిజర్వు బాంకు అందజేయు పునః ధనం (Refinance) సమకూర్చే బాధ్యత ఉండేది.

నాబార్డుకు రిజర్వు బ్యాంకుతో నిర్మాణ సంబంధ అనుబంధం ఉంది. నాబార్డు షేరు ధనంలో రిజర్వు బ్యాంకుకు సగం వాటా ఉండగా, మిగతా సగం వాటా భారత ప్రభుత్వానిది. నాబార్డు పాలక వర్గంలో ముగ్గురు రిజర్వు బ్యాంకు కేంద్ర పాలక వర్గ సభ్యులు ఉంటారు. వారిని రిజర్వు బ్యాంకు నియామకం చేస్తుంది. అంతేకాక నాబార్డు అధ్యక్ష పదవికి రిజర్వు బ్యాంకు డిప్యూటీ గవర్నరులను సర్వ సాధారణంగా నియమిస్తారు. అయితే ప్రస్తుతం నాబార్డు అధ్యక్షురాలు శ్రీమతి రంజనా కుమార్ ఈ పదవి చేపట్టక ముందు ఇండియన్ బ్యాంకు అధ్యక్షురాలుగా పని చేసారు.

## 10.2 నాబార్డు లక్ష్యములు :-

నాబార్డు ప్రధాన లక్ష్యాలను నాలుగుగా చెప్పవచ్చును. అవి -


1. గ్రామీణాభివృద్ధికవసరమైన ఉత్పత్తి లేక పంట ఋణాలు మరియు దీర్ఘ కాలిక ఋణాలు అందజేసే అర్హత కలిగిన బ్యాంకింగు సంస్థలకు అనగా, రాష్ట్ర సహకార భూమి అభివృద్ధి బ్యాంకులు, రాష్ట్ర సహకార బ్యాంకులు, షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు మరియు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు పునః ధనం / రీ ఫైనాన్స్ సమకూర్చుట.
2. గ్రామీణ పరపతి వ్యవస్థను పటిష్ట పరచుటకు అవసరమయిన సంస్థలను స్థాపించుట, అందుకవసరమయిన పునరావాస పథకాలు, శిక్షణా కార్యక్రమాలు, పరపతి సంస్థల పునర్నిర్మాణ పథకములను రూపొందించుట.
3. క్షేత్ర స్థాయి అభివృద్ధి కార్యక్రమాలలో నిమగ్నమయిన వివిధ సంస్థల కార్యకలాపాలను సమన్వయ పరచుట మరియు గ్రామీణ పరపతి విధానాల రూప కల్పనలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, రిజర్వు బ్యాంకు మున్నగు ఇతర జాతీయ సంస్థలతో సంబంధాలు కొనసాగించుట.
4. నాబార్డు పునః ధనం సమకూర్చిన పథకాలను పరిశీలించుటతో బాటు మూల్యాంకన చేయుట (Evaluation)

## 10.3 నాబార్డు నిర్మాణము :-

నాబార్డు ప్రధాన కార్యాలయం ముంబాయిలో ఉన్నది. పోర్టు బ్లెయిర్ మినహాయించి అన్ని రాష్ట్రాలలో ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నవి. నాబార్డు పాలక వర్గంలో కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల ప్రతినిధులు (గ్రామీణాభివృద్ధి), బ్యాంకింగు డిపార్టుమెంటు రిజర్వు బ్యాంకు ప్రతినిధులతో పాటు, ప్రముఖ వ్యవసాయ ఆర్థికవేత్తలకు కూడా ప్రాతినిధ్యం ఉన్నది. పాలకవర్గం నిర్ణయాల మేరకు, అధ్యక్షుడు, పరిపాలనాధికారి నాబార్డు కార్యకలాపాలను నిర్వహిస్తారు. వీరికి సహాయంగా కార్యనిర్వాహక అధికారులతో బాటు, కేంద్ర కార్యాలయంలో 26 శాఖలు ఉన్నాయి. ప్రధాన కార్యాలయ శాఖలతో బాటు, ప్రాంతీయ స్థాయిలో 28 కార్యాలయాలు, ఒక ఉప కార్యాలయము ఉన్నాయి. జిల్లా స్థాయిలో 330 జిల్లా పరిపాలనాధికారుల కార్యాలయాలు ఉన్నాయి. ఈ సంస్థలో 2853 మంది అధికారులు, 2399 మంది ఇతర ఉద్యోగులు పని చేస్తున్నారు. మార్చి 31, 2003 నాటికి నాబార్డు నిర్మాణము ఈ దిగువ పటములో చూపబడినది.

**నాబార్డు నిర్మాణము**

**(మార్చి 31, 2003 నాటికి)**



మొత్తం సిబ్బంది - అధికారులు 2853

ఇతరులు 2399

**గమనిక** - అన్ని రాష్ట్ర రాజధానులలో ప్రాంతీయ కార్యాలయములు పోర్టు బ్లెయిరులో ఒక ఉప కార్యాలయము ఉన్నవి.

## 10.4 నాబార్డు ప్రకార్యములు (Functions):-

గ్రామీణ పరపతి వ్యవస్థలో శిఖరాగ్ర స్థాయి సంస్థగా మరియు పునః ధనం చేకూర్చే సంస్థగా ఈ జాతీయ బ్యాంకు ద్విపాత్రాభినయం చేయవలసి ఉంటుంది. వ్యవసాయ పరపతికి సంబంధించి పూర్వం రిజర్వు బ్యాంకు చేపట్టిన ప్రకార్యాలన్నింటిని ఈ బ్యాంకు నిర్వహిస్తుంది. దీనితోపాటు, క్రితంలో ఎ.ఆర్.డి.సి. చేపట్టిన ప్రకార్యాలన్నిటినీ చేపట్టి గ్రామీణ వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధికి పరపతి అందజేస్తున్న అన్ని బ్యాంకులకు, ఆర్థిక సంస్థలకు పునః ధనం సమకూర్చుతుంది.

స్థూలంగా నాబార్డు ప్రకార్యాలను నాలుగు ప్రధాన భాగాలుగా ఆ సంస్థ విభజించింది. అవి

1. పరపతి సంబంధ ప్రకార్యాలు
2. ప్రోత్సాహక మరియు అభివృద్ధి సంబంధిత ప్రకార్యాలు
3. వ్యవస్థాభివృద్ధి మరియు పర్యవేక్షణ ప్రకార్యాలు
4. సలహా, సంప్రదింపులకు సంబంధించిన ప్రకార్యాలు

**10.5.1 పరపతి సంబంధ ప్రకార్యాలు :-** పరపతి సంబంధ ప్రకార్యములను సౌలభ్యం కొరకు రెండుగా విభజించారు. అవి

ఎ) పరపతి ప్రణాళిక మరియు మానిటరింగ్ ప్రకార్యాలు

బి) ఆర్థిక సేవా ప్రకార్యాలు

**ఎ) పరపతి ప్రణాళిక మరియు మానిటరింగ్ (monitoring) సంబంధిత ప్రకార్యాలు :-**

జాతీయ బ్యాంకు చేపట్టే పరపతి ప్రణాళిక సంబంధిత ప్రకార్యాలు జిల్లా, రాష్ట్ర మరియు జాతీయ స్థాయి వరకు విస్తరించి యున్నవి.

**జిల్లా స్థాయి ప్రణాళికలు :-** జిల్లా స్థాయిలో, ప్రతి సంవత్సరం సామర్థ్య సంబంధిత వార్షిక పరపతి ప్రణాళికలు (potential linked annual credit plan) ప్రాంతీయ కార్యాలయాలు తయారు చేస్తాయి. ఈ ప్రణాళికలు జిల్లాలోని వ్యవసాయ మరియు వ్యవసాయ సంబంధిత కార్యకలాపాలలో బ్యాంకుల పరపతితో ఉపయోగించగల సామర్థ్య పటిమను తెలియజేస్తాయి. ఈ ప్రణాళికలను రూపొందించుటలో, జిల్లాలో గల దీర్ఘకాలిక భౌతిక సామర్థ్యం, అందుబాటులో నున్న ప్రజా సౌకర్యాలు (Infrastructure) వనరులు, విస్తరణ సేవలు, మార్కెటు తోడ్పాటు, గ్రామీణ పరపతి సంస్థల సామర్థ్యం బలహీనతలు మున్నగు అంశాలను దృష్టిలో ఉంచుకొనెదరు.

పరపతి సంబంధ ఆర్థిక కార్యకలాపాలను చేపట్టే అనేక సంస్థలు ఈ ప్రణాళికలలో పొందుపరచిన విస్తృత సమాచారాన్ని వినియోగించుకొంటారు. ఈ ప్రణాళికలోని మార్గదర్శక సూచీలను అన్ని ప్రభుత్వ సంస్థలు ఉపయోగించుకోవలెనని కర్ణాటక రాష్ట్ర ప్రణాళిక మండలి సిఫార్సు చేసినది.

**రాష్ట్ర స్థాయి పరపతి ప్రణాళిక :-** జిల్లా స్థాయి పరపతి ప్రణాళికల ఆధారంగా రాష్ట్రస్థాయి కేంద్రీకృత పత్రం (state Focuspaper) ప్రతి సంవత్సరం తయారు చేస్తారు. ఈ పత్రం రాష్ట్రంలో వ్యవసాయ మరియు వ్యవసాయ సంబంధిత

కార్యకలాపాలలో ఉన్న సామర్థ్యం గూర్చి సమగ్రంగా వివరిస్తుంది. ఈ ప్రణాళిక రాష్ట్రస్థాయి బ్యాంకులు, వ్యవసాయ మరియు వ్యవసాయ సంబంధిత రంగాలలో పెట్టుబడి పెట్టుటకు ఆచరణీయ ప్రణాళికలుగా ఉపయోగపడతాయి. అంతేకాక ఈ ప్రణాళిక ఇతరత్రా పెట్టుబడులకు గల అవకాశాలకు రహదారి పటంలా (Road Map) ఉంటుంది.

ఈ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయాలు, ప్రతి ఏటా రాష్ట్ర స్థాయి పరపతి సదస్సులు నిర్వహిస్తాయి. ఈ సదస్సులో పరపతికి సంబంధించిన వారందరిని అనగా రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, బ్యాంకు అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని పరపతి సంబంధ విషయాలను కూలంకషంగా చర్చించి, వ్యవసాయ మరియు వ్యవసాయ సంబంధిత రంగాలలోని ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించుటలో ఎదురయ్యే ఆటంకాలను అధిగమించటానికి అవసరమైన విధానాలు మరియు ఆచరణీయ చర్యలను రూపొందిస్తారు.

**జాతీయ స్థాయి ప్రణాళికలు :-** జాతీయ స్థాయి, వ్యవసాయ మరియు వ్యవసాయ సంబంధిత రంగాలకు పరపతి సరఫరా, విధాన నిర్ణయాలలో భారత ప్రభుత్వం మరియు రిజర్వు బ్యాంకుకు జాతీయ బ్యాంకు తోడ్పడుతుంది. అంతేకాక అట్టడుగు స్థాయిలో పరపతి విస్తరణను మానిటరు చేయటంతో బాటు గ్రామీణ ఆర్థిక సంస్థలకు, విధాన మరియు ఆచరణీయ మార్గదర్శక సూత్రాలను నాబార్డు అందజేస్తుంది.

**బి) ఆర్థిక సేవా ప్రకార్యాలు :-**

ఆర్థిక సేవా ప్రకార్యములలో సహకార బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు మరియు వాణిజ్య బ్యాంకులకు స్వల్ప కాలిక, మధ్యకాలిక మరియు దీర్ఘకాలిక పరపతి, పునః ధన సహాయంతో బాటు అనేక సేవలను ఈ బ్యాంకు అందజేస్తుంది. ఇవి కాక సూక్ష్మ పరపతి (Micro finance)తో పాటు, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు స్వచ్ఛంద సంస్థలకు నేరుగా పరపతి అందజేయటం కూడా ఈ బ్యాంకు ఆర్థిక సేవల ప్రకార్యాలలో భాగం.

ఈ ప్రకార్యములను అయిదు భాగాలుగా (1) పునః ధనం సమకూర్చుట, (2) ప్రత్యక్షంగా ఋణాలు ఇవ్వటం, (3) సూక్ష్మ పరపతి, (4) సంయుక్త పెట్టుబడులు, (5) సలహా సంప్రదింపు సేవలుగా వర్గీకరించవచ్చును.

**1. పునః ధనం సమకూర్చుట** (Refinance) **:-** సమగ్ర గ్రామీణాభివృద్ధికి చేయూతనిచ్చుటకు వ్యవసాయ, కుటీర, గ్రామీణ మరియు చిన్నతరహా పరిశ్రమలు, చేతివృత్తుల వారికి, ఆర్థిక కార్యకలాపాలకవసరమైన పునః ధన సహాయం చేయుట జాతీయ బ్యాంకు ఆర్థిక సేవా ప్రకార్యలలో ప్రధానమైనది.

ఈ బ్యాంకు రాష్ట్ర స్థాయి సహకార బ్యాంకులు, రాష్ట్ర భూమి అభివృద్ధి బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, మరియు రిజర్వు బ్యాంకు అనుమతించిన ఆర్థిక సంస్థలకు, ఆ సంస్థలు వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి కార్యకలాపములకు అందజేసిన స్వల్పకాలిక, మధ్యకాలిక మరియు దీర్ఘకాలిక పరపతికి పునః ధన సహాయం చేయును.

నాబార్డు అందించు పునః సహాయాన్ని వివిధ కాల పరిమితులు గల ఋణాల క్రింద వివరించబడినది.

**ఏ. స్వల్పకాలిక ఋణాల పై పునః ధనం సమకూర్చుట :-** నాబార్డు పై విధమైన ధన సహాయం బ్యాంకులు, వ్యవసాయ ఉత్పత్తికి, పంటల విక్రయానికి, చేపల పెంపకం, వ్యవసాయ ఉద్పాదకాలైన విత్తనములు, రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందుల పంపిణీ మున్నగు అవసరాలకు ఇచ్చిన ఋణాల పై పునః ధనం సమకూర్చుతుంది.

వ్యవసాయేతర కార్యకలాపాలైన చేనేత, పారిశ్రామిక సహకార సంఘాలు, గ్రామీణ కుటీర మరియు చిన్న పరిశ్రమలు, చేతి వృత్తుల వారికి బ్యాంకులు ఇచ్చిన ఋణాల పై పునః ధన సహాయం చేస్తుంది.

**బి. మధ్యకాలిక ఋణాలపై పునః ధన సహాయం :-** రాష్ట్ర సహకార బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, అనుమతించబడిన వ్యవసాయ పెట్టుబడులకు రైతులకిచ్చిన ఋణాల పై పునః ధనం సమకూర్చుతుంది.

అంతేకాక ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు నష్టపడి వారు ఉత్పత్తి అవసరాలకు తీసుకొన్న స్వల్పకాలిక ఋణాలు తీర్చలేని పరిస్థితులు (కరవు, కాటకములు) ఏర్పడినవని ప్రభుత్వము వారు ప్రకటించిన సందర్భాలలో, స్వల్పకాలిక ఋణాలను మధ్యకాలిక ఋణాలుగా మార్చుటకు (conversion) బ్యాంకులకు పునః ధనాన్ని నాబార్డు సమకూర్చుతుంది. ఈ విధమైన మధ్యకాలిక ఋణ సహాయం ద్వారా రైతులను తిరిగి స్వల్పకాలిక ఉత్పత్తి ఋణాలు తీసుకొనుటకు అర్హులుగా చేసి, వారి వ్యవసాయోత్పత్తి కార్యకలాపాలు నిరాటంకంగా కొనసాగటానికి జాతీయ బాంకు వీలు కల్గిస్తుంది.

**సి. దీర్ఘకాలిక ఋణాలపై పునః ధన సహాయం :-** రాష్ట్ర వ్యవసాయ మరియు భూమి అభివృద్ధి బ్యాంకులు, రాష్ట్ర సహకార బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులు, పట్టణ సహకార బ్యాంకులు, వ్యవసాయ, వ్యవసాయేతర అవసరాలకు గ్రామీణ పరిశ్రమలు, గ్రామీణ గృహ నిర్మాణము మున్నగు వాటికి ఇచ్చిన పరిమిత కాల ఋణాల పై (term loans) జాతీయ బ్యాంకు పునఃధనం అందిస్తుంది.

పై తరహా ఋణాలు, వ్యవసాయ యాంత్రికీకరణకు, చిన్నతరహా నీటిపారుదలకు, పండ్ల తోటల పెంపకమునకు, పశువుల చావడి, గిడ్డంగులు నిర్మించుకొనుట, దేశీయ మరియు సముద్ర చేపల పెంపకం, వ్యాపారములకు, కౌలుదార్లు, సన్నకారు మరియు చిన్న రైతులు వ్యవసాయ భూములు కొనుక్కొనుటకు పేదరిక నిర్మూలనలో భాగంగా వివిధ పథకాల ద్వారా ఇచ్చే ఋణాలు, పునః ధన సహాయ పరిధిలో ఉన్నాయి.

ఋణగ్రస్థుల స్థితి, ఋణాలు ఇచ్చిన అవసరములను, ఋణాలు ఇచ్చిన సంస్థ, ప్రాంతీయ పరపతి విస్తరణ మున్నగు వాటిని దృష్టిలో ఉంచుకొని, బ్యాంకులు బట్వాడా చేసిన ఋణాలలో 90 నుంచి నూరు శాతం వరకు జాతీయ బ్యాంకు పునః ధనం అందిస్తుంది.

**2. ప్రత్యక్షంగా ఋణాలు ఇవ్వటం :-** బ్యాంకులకు పునః ధన సహాయమందించుటయే గాక, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు ప్రభుత్వేతర సంస్థలకు నాబార్డు నేరుగా ఋణాలు ఇస్తుంది.

**ఎ. రాష్ట్ర ప్రభుత్వాలకు ఋణాలు :-** రాష్ట్ర ప్రభుత్వాలు సహకార సంస్థల షేరు ధనంలో పెట్టుబడి పెట్టుటకు నాబార్డు రాష్ట్ర ప్రభుత్వాలకు దీర్ఘకాలిక ఋణాలు ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రాథమిక సహకార పరపతి సంఘాలు మొదలుకొని రాష్ట్ర స్థాయి బ్యాంకుల వరకు వాటి స్వంత నిధులు మెరుగుపరుచుకొని, తద్వారా ఋణ సామర్థ్యతను పెంపొందించుకొని, గ్రామీణ పరపతి విస్తరణకు తోడ్పడుటకై సహకార సంస్థల షేరు ధనంలో పెట్టుబడులు పెడతాయి. నాబార్డు ఈ ఋణాలను తేలికపాటి షరతులతో 12 సంవత్సరాల కాల పరిమితితో రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేస్తుంది. జూలై 1వ తేది 2003 నుండి ఈ ఋణాల పై 8 శాతం వడ్డీని రాష్ట్ర ప్రభుత్వాలు నాబార్డుకు చెల్లించవలెను. ఈ ఋణాలలో అత్యధిక మొత్తం రూ॥ 107.78 కోట్లు 1995-96 లో ఇవ్వగా 2002-03లో ఇచ్చినది రూ॥ 28.16 కోట్లు మాత్రమే.

నాబార్డు 1995-96 నుంచి గ్రామీణ ప్రజా సేవల అభివృద్ధి పథకాలు అమలు చేయుటకు, రాష్ట్ర ప్రభుత్వాలకు 'గ్రామీణ ప్రజా సేవల అభివృద్ధి నిధి' నుండి (Rural Infrastructure Development Fund) ఋణాలు అందజేస్తున్నది. పైనుదహరించిన నిధిని 1995-96 కేంద్రబడ్జెట్‌లో రూ॥ 2000 కోట్లతో నాబార్డు ఏర్పాటు చేశారు. తరువాత ప్రతి సం॥ము ఈ నిధికి కేంద్రబడ్జెట్‌లో కేటాయింపులు చేస్తున్నారు. ఇవికాక వాణిజ్య బ్యాంకులు కూడా ఈ నిధికి ధనం సమకూర్చుతాయి. 2003 మార్చి 31 నాటికి ఈ నిధి రూ॥ 34,000 కోట్లకు చేరింది.

ఈ నిధి నుంచి, భారీ మధ్య తరహా నీటి పారుదల పథకాలకు, గ్రామీణ రోడ్లు, వంతెనలు, భూ పరిరక్షణ, నీటి పరీవాహక ప్రాంత అభివృద్ధి పథకం, (watershed development projects) చిన్న తరహా విద్యుదుత్పాదన, గ్రామీణ మార్కెట్లు, అడవులు, జల మార్గాల అభివృద్ధి, గ్రామీణ త్రాగునీటి పథకాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రాథమిక పాఠశాలల భవన నిర్మాణం, బాలల శిక్షణా కేంద్రాలు, అంగన్‌వాడి మున్నగు పథకాలు అమలుచేయుటకు నాబార్డు రాష్ట్ర ప్రభుత్వాలకు ఋణాలు మంజూరు చేస్తుంది. 1999-2000 నుంచి రాష్ట్ర ప్రభుత్వాల హామీ పై పంచాయితీ రాజ్ సంస్థలకు, స్వయం సహాయ బృందాలకు, స్వచ్ఛంద సంస్థలకు ఈ నిధి నుంచి నాబార్డు ఋణాలు మంజూరు చేస్తుంది.

మార్చి 31వ తేదీ 2003 నాటికి ఈ నిధి నుంచి నాబార్డు 2,54,974 పథకాలకు రూ॥ 29,475 కోట్లు మంజూరు చేసి రూ॥ 17,145 కోట్లు విడుదల చేసినది. మార్చి 31, 2003 నాటికి మంజూరు చేసిన నిధులలో 34 శాతం నీటిపారుదల పథకాలకు, 49.35 శాతం రోడ్లు, వంతెనల నిర్మాణాలకు కేటాయించుట జరిగినది.

ఈ పథకాల నిర్వహణను జాతీయ బ్యాంకు స్వయంగా పరిశీలించటమే కాక, ప్రత్యేక అధ్యయనాలను చేయించి, తద్వారా వీటి పటిష్టతకు చర్యలు చేపడుతుంది. ప్రజా భాగస్వామ్యం ఈ పథకాల సమగ్ర నిర్వహణకు బాగా తోడ్పడినట్లు జాతీయ బ్యాంకు చేయించిన అధ్యయనాలు సూచించినవి.

**3. సూక్ష్మ పరపతి వితరణ మరియు అభివృద్ధికి చర్యలు :-** గ్రామీణ ప్రాంతాలలో పరపతి సౌకర్యాలు అందని భూమి లేని వారు, వ్యాపార కూలీలు, పేద స్త్రీలు మున్నగువారికి పరపతి అందజేయుటకు ఉద్దేశించిన అనుబంధ పరపతి వ్యూహాన్ని సూక్ష్మ పరపతి అనవచ్చును. ఈ పథకాన్ని 1992 - 93లో ఈ జాతీయ బ్యాంకు ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసింది. పైన పేర్కొన్న వర్గాల నుంచి 20 మంది సభ్యులతో స్వయం సహాయక బృందాలు ఏర్పరచి, వాటిని బ్యాంకులకు అనుబంధం చేసి, పరపతి సహాయం అందజేయటం సూక్ష్మ పరపతి పథకంలోని ప్రధానోద్దేశ్యం.

ఈ పథకం క్రింద 2007 నాటికి 1 మిలియను స్వయం సహాయక బృందాలు ఏర్పాటు చేసి 100 మిలియన్ల గ్రామీణ పేదలను ఆదుకోవాలని ఈ జాతీయ బ్యాంకు లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం అభివృద్ధికి నాబార్డు ఈ క్రింది కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

- స్వయం సహాయక గ్రూపులకు బ్యాంకులు ఆర్థిక సహాయం చేయుటకు పునః ధనం సమకూర్చుట
- పై బృందాలను ఏర్పాటు చేసి, కొంత కాలం వాటిని పోషించి, బ్యాంకులతో అనుబంధం కల్పించుటకు, స్వచ్ఛంద సంస్థలకు/గ్రామీణ బ్యాంకులకు ఆర్థిక సహాయం చేయుట
- స్వయం సహాయక బృందాల సభ్యులకు స్వచ్ఛంద సంస్థల మరియు బ్యాంకు అధికారులకు, సూక్ష్మ పరపతి పథకాలు అమలు చేయుటలో వారి సామర్థ్యం పెంపొందించుటకు తగిన పథకాలు రూపొందించి అమలుచేయుట.

**4. వాణిజ్య బ్యాంకులతో కలిసి సంయుక్త పెట్టుబడులు పెట్టడం :-** వ్యవసాయయ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక విజ్ఞానంతో అమలులోకి వస్తున్న హైటెక్ వ్యవసాయ పద్ధతులు, గ్రీన్‌హౌస్ వ్యవసాయం, మరియు అధిక పెట్టుబడులతో కూడిన ఎగుమతి సంబంధ వ్యవసాయోత్పత్తులకు కావలసిన అధిక పెట్టుబడి పథకాలకు వాణిజ్య బ్యాంకులు ప్రోత్సాహం అందజేయుటకై జాతీయ బ్యాంకు వాణిజ్య బ్యాంకులతో కలసి సహాయ సంయుక్త పెట్టుబడులు పెట్టుటకు అవగాహనా ఒప్పందాలు (Memorandum of understanding) చేసుకొంది. వ్యవసాయ పథకాలలో సంయుక్త పెట్టుబడులు పెట్టుటకు 2003 నాటికి ఈ జాతీయ బ్యాంకు 6 వాణిజ్య బ్యాంకులతో - (యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దేనా బ్యాంకు, కార్పోరేషన్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మరియు పంజాబు నేషనల్ బ్యాంకు) అవగాహనా ఒప్పందాలు చేసుకుంది.

**10.4.2 ప్రోత్సాహక మరియు అభివృద్ధి సంబంధ ప్రకార్యాలు** (Promotinal and Development Initiatives) **:-** పునః ధన సహాయం, ప్రత్యక్ష ఆర్థిక సహాయం చేయుటతోపాటు, వ్యవసాయ మరియు గ్రామీణ రంగాలకు పరపతి అందుబాటును వృద్ధిపరచుటకు నాబార్డు అనేక ప్రోత్సాహక మరియు అభివృద్ధి చొరవలను (Initiatives) తీసుకొంటున్నది. వీటిలో బ్యాంకు చేపట్టిన కిసాన్ క్రెడిట్ కార్డులు, వాటర్ షెడ్ అభివృద్ధి పథకం, సూక్ష్మ పరపతి అభివృద్ధి పథకానికి సంబంధించిన ప్రోత్సాహక ప్రకార్యాలు ప్రత్యేకంగా పేర్కొనదగినవి. ఇవికాక వ్యవసాయేతర రంగాలలో గ్రామీణ వాణిజ్యాన్ని నడపగల వర్తకుల అభివృద్ధి పథకం (Rural Enterpreneurship Development Programme) జిల్లా గ్రామీణ పరిశ్రమల పథకం, గ్రామీణ విపణుల పటిష్టపరచు పథకం (strengthening village markets) పర్యావరణ అభివృద్ధికి, తీసుకొనే చొరవలు, మహిళలు, బలహీన వర్గాల అభివృద్ధికి తీసుకొంటున్న చర్యలు చెప్పదగినవి. వీటి గురించి క్లుప్తంగా ఈ క్రింద వివరించబడినది.

**1. కిసాన్ క్రెడిట్ కార్డుల పథకం :-** ఈ పథకాన్ని ప్రథమంగా 1998 - 99 కేంద్ర బడ్జెటులో ప్రవేశపెట్టారు. ఈ పథకాన్ని అన్ని జాతీయ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకులు అమలు చేస్తున్నాయి. ఈ పథకం అమలు చేయుటకు కమత విస్తీర్ణం, వాడే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, తదితర ఉత్పత్తి కారకాల కొనుగోలుకు అవసరమయిన నగదు తీసుకొనుటకు, అన్ని బ్యాంకులు ఒకే నియమాన్ని ఆచరించుటకు వీలుగా నమూనాగా ఈ పథకాన్ని రూపొందించారు.

రైతులు సకాలంలో వారి ఉత్పత్తి అవసరాలకు సరిపడా ఉత్పాదకాలను సరియైన ధరలకు కొనుగోలు చేసుకొనుటకు సౌలభ్యం కల్పించుట ఈ పథకం ప్రధాన ఆశయం. వ్యవసాయ ఉత్పత్తి ఋణాలు తీసుకొనుటకు అర్హులయిన అందరి రైతులకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ కార్డు మరియు పాసు పుస్తకం నగదు తీసుకొని, తిరిగి చెల్లించుటకే కాక, రైతుకు గుర్తింపు కార్డుగా కూడా ఉంటుంది. సాధారణంగా 3సం॥ కాల పరిమితితో జారీ చేయబడే ఈ కార్డు తిరిగి పునరుద్ధరించబడుతుంది. ఈ కార్డు కొన్నవారికి జీవిత భీమా మరియు ప్రమాద భీమా సదుపాయం ఉన్నది. ఇందుకై నాబార్డు భారతీయ సాధారణ భీమా సంస్థతో సంప్రదించి ఈ భీమా సదుపాయాలు కిసాన్ కార్డు లబ్ధిదారులకు ఏర్పాటు చేసింది. ఈ భీమా పథకం క్రింద రైతు చనిపోయినచో రూ॥ 50,000లు, ప్రమాదానికి గురి అయినచో రూ॥ 25,000 భీమా కంపెనీ చెల్లిస్తుంది.

ఈ పథకం క్రింద, పరపతి పరిమితులను నిర్ణయించుటలో కమత విస్తీర్ణం, పండించే పంటలు, ఉత్పత్తి అవసరాలు, జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ నిర్ణయించిన ఆర్థిక శ్రేణులను (scales of finance) పరిగణనలోకి తీసుకొంటారు. అనుమతించబడిన పరిమితులకు లోబడి, రైతులు వారి కార్డు పై ఎన్ని పర్యాయములైనా నగదు తీసుకోవటం, తిరిగి చెల్లించటం చేయవచ్చును. మార్చి 31వ తేదీ 2003 నాటికి దేశం మొత్తం మీద 3,13,44,249 కిసాన్ క్రెడిట్ కార్డులను వివిధ బ్యాంకులు (సహకార, వాణిజ్య, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు) జారీ చేసినవి.

**2. నీటి వాలు పరీవాహక ప్రాంత అభివృద్ధి పథకం** (watershed development programme) **:-** ఎత్తు ప్రదేశమున పడిన వర్షపు నీరు, పల్లపు ప్రాంతముల ద్వారా ఒక కాలువలోనికి చేరుకుంటుంది, ఆ ప్రాంతమంతటినీ కలిపి, అనగా ఎత్తు ప్రదేశము నుండి పల్లపు ప్రాంతము వరకు గల ఎగుడు - దిగుడు, మెఱక - పల్లపు మరియు మైదానపు ప్రాంతమునంతటిని నీటి వాలు పరివాహక ప్రాంతము అని అంటారు.

దీనినే ఇంగ్లీషులో 'వాటర్ షెడ్' అంటారు. వర్షాధారిత పరిస్థితులలో వ్యవసాయ దిగుబడులను పెంచుటకు ఈ పథకం అత్యంత ప్రాచుర్యం పొందింది. భూమి నీటిని, వృక్ష సంపదను కాపాడి, భూగర్భ జలాలకు తోడుగా నీటి సంపదను పెంచి, అధిక ఫల సాయం పొందటం మొ॥ వాటికి ఈ పథకం పటిష్టమైన చర్యలు చేపట్టింది. ప్రజా భాగస్వామ్యంతో ఈ పథకాన్ని అభివృద్ధి చేయుటకు నాబార్డు విశేషముగా కృషి సల్పుతున్నది.

ఈ పథకాభివృద్ధికి 1999 - 2000 నుంచి, రూ॥ 200 కోట్ల మూలధనంతో వాటర్ షెడ్ అభివృద్ధి నిధిని జాతీయ బ్యాంకులో ఏర్పాటు చేశారు. ఈ నిధికి నాబార్డు మరియు ప్రజా భాగస్వామ్య పద్ధతిలో ఈ పథకాన్ని వ్యాప్తి చేయటం ఈ నిధి ప్రధాన లక్ష్యం.

మార్చి 31వ తేదీ 2003 నాటికి, ఆంధ్రప్రదేశ్‌తో సహా 7 రాష్ట్రాలు ఈ నిధిని వినియోగించుకున్నాయి. ఈ పథకం ప్రస్తుతం వర్షాభావం గల 82 జిల్లాలలో అమలులో ఉంది. గుర్తించబడిన 297 వాటర్ షెడ్‌లలో 213కి నిధులు మంజూరు చేశారు. మంజూరు చేసిన మొత్తంలో 33 ప్రాజెక్టులకు రూ॥ 1.47 కోట్లు గ్రాంటు రూపంలోను, 178 ప్రాజెక్టులకు రూ॥ 8.60 కోట్లు ఋణాల రూపేణా నాబార్డు నిధులను అందజేసింది. రాష్ట్ర ప్రభుత్వాలకు 9 సం॥ కాల పరిమితి తిరిగి 3 సం॥ల వ్యవధితో వాటర్‌షెడ్ అభివృద్ధి కొరకు మంజూరు చేసే ఋణాల పై 6 శాతం వడ్డీ వసూలు చేస్తారు.

**3. సూక్ష్మ పరపతి విస్తరణ :-** సూక్ష్మ పరపతికి పునః ధన సహాయం చేయటం గూర్చి ఇంతకు ముందు వివరించటం జరిగింది. అయితే ఇక్కడ ఈ పథకం వ్యాప్తికి నాబార్డు అందించే ప్రోత్సాహకాలను గురించి తెలుసుకోవాలి. సూక్ష్మ పరపతి విస్తరణకు మరియు పటిష్టపరచుటకు ఈ బ్యాంకు అనేక చర్యలు చేపట్టింది. అవి

- వెనుకబడిన ప్రాంతాలు, రాష్ట్రాలలో నాణ్యమైన స్వయం సహాయక బృందాలకు అధిక సంఖ్యలో ప్రోత్సాహం అందజేయటం.
- ఈ కార్యక్రమాలలో భాగస్వాములైన వారందరికి, తగిన శిక్షణ మరియు అవగాహన పథకాలు రూపొందించి, వాటి నిర్వహణకు ఆర్థిక సహాయం అందజేయటం
- ఆర్థిక సహాయం అందించే ముందు ఈ బృందాల నాణ్యతను పరిశీలించవలసిందిగా వాణిజ్య బ్యాంకులను ఉత్తేజపరచుట.
- స్వయం సహాయక బృందాల భావనను గ్రామాలలో భారీ ఎత్తున వ్యాప్తి చేయటం

మార్చి 31వ తేది 2003 నాటికి 7,17,360 బృందాలకు వాణిజ్య బ్యాంకులు ఋణ సహాయం అందించగా వాటిలో 90 శాతం స్త్రీల బృందాలు కావటం విశేషం. ఈ పథకం అమలు చేస్తున్న 504 బ్యాంకులు, (48 వాణిజ్య బ్యాంకులు, 192 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, 264 సహకార బ్యాంకులు) వాటి 30,942 శాఖల ద్వారా స్వయం సహాయ బృందాలకు ఆర్థిక సహాయం అందచేయుచున్నవి. ఈ పథకం 2003 నాటికి 523 జిల్లాలకు విస్తరించినది. ఇందులో మొత్తం 2800 భాగస్వామ్య సంస్థలు ఉన్నాయి. మార్చి 31, 2003 నాటికి బృందాలకు వాణిజ్య బ్యాంకులు రూ॥ 20.49 బిలియన్ల ఋణాలు ఇవ్వగా, అందులో రూ॥ 14.19 బిలియన్ల మేరకు జాతీయ బ్యాంకు పునః ధనం అందజేసినది. ఈ పథకం ద్వారా 11.6 మిలియన్ల కుటుంబాలు ఆర్థిక సహాయం పొందాయి. ఈ పథకం ద్వారా సభ్య కుటుంబాలకు సగటున రూ॥ 1785 ఋణ సహాయం అందినది.

**4. వ్యవసాయేతర రంగము :-** వ్యవసాయేతర రంగంలో గ్రామీణాభివృద్ధి కొరకు ఈ జాతీయ బ్యాంకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించి, అమలుపరుచుచున్నది. ఈ పథకాల గురించి క్లుప్తంగా ఈ క్రింద వివరించటం జరిగినది.

**ఎ) గ్రామీణ వాణిజ్యాన్ని నడపగల వర్తకుల అభివృద్ధి కార్యక్రమాలు** (Rural Enterpreneurship Development Programme) :- ఈ పథకం ద్వారా 1999 - 2000 నుంచి 2003 - 04 వ సం॥లో ఒక లక్ష మంది సామర్థ్యం గల వ్యాపారులను తయారు చేయుటను ఈ జాతీయ బ్యాంకు లక్ష్యంగా పెట్టుకొన్నది. గత నాల్గు సం॥లో 70,000 వేల విద్యావంతులైన గ్రామీణ నిరుద్యోగ యువకులకు ఈ కార్యక్రమం క్రింద శిక్షణ ఇవ్వటం జరిగింది. శిక్షణతో పాటు కొంత ఆర్థిక సహాయం అందజేసి, స్వయం ఉపాధి కల్పనకు ఈ పథకం దోహదం చేస్తుంది.

**బి) జిల్లా గ్రామీణ పరిశ్రమల పథకం** (District Rural Industries Project) :- గ్రామీణ పరిశ్రమలకు పరపతి ప్రోత్సాహకములనందజేసి నిరంతరమూ గ్రామీణ ఉపాధి అవకాశాలు పెంపొందించటం ఈ పథకం యొక్క ప్రధాన ఆశయం.

1993 - 94లో 52 జిల్లాలలో ప్రయోగాత్మకంగా ప్రారంభమయిన ఈ పథకం మార్చి 31, 2003 నాటికి 61 జిల్లాలకు వ్యాప్తి చెందినది.

**సి) గ్రామీణ మార్కెట్‌లను పటిష్టపరచుట** (Strengthening village markets) :- గ్రామీణ పారిశ్రామిక పథకం అమలుతో రెండు జిల్లాలలో గ్వాలియర్, గంజాంలలో గ్రామీణ మార్కెటుల ఏర్పాటు కొరకు నాబార్డు చర్యలు చేపట్టి, పరిమిత ఆర్థిక సహాయం అందజేసింది. ఈ పథకంలో కనీస ప్రజా సౌకర్యాలు అభివృద్ధి చేసి, తక్కువ వడ్డీతో 10 - 15 షాపుల నిర్మాణం చెపట్టి, గ్రామాలకు కావలసిన కనీస సదుపాయాలు - సైకిలు రిపేరు షాపు, వైద్యుడు, మందుల షాపు, దూర శ్రవణ సదుపాయం మున్నగు సౌకర్యాలు కల్పిస్తారు.

**డి) పర్యావరణ పరిరక్షణ :-** గ్రామీణ ప్రకృతి సంపదలు క్షీణించుటకు గల కారణములు తెలుసుకొని, వాటి నిరంతర అభివృద్ధికి సాయపడటం. ప్రజలలో పర్యావరణ పరిరక్షణ పై అవగాహన పెంపొందించటం స్వచ్ఛంద సంస్థలు మరియు ఇతర పరిశోధనా సంస్థలకు ఆర్థిక సహాయము చేయటం ఈ కార్యక్రమ ఉద్దేశములు.

**5. మహిళా అభివృద్ధి** (Gender development) :- దేశ జనాభాలో సగ భాగమైన స్త్రీలలో, 75 శాతం గ్రామాలలో నివసిస్తున్నారు. వారి సామర్థ్యాలు పెంచి, వారికి పరపతి సౌకర్యాలు అందజేసి, ఉపాధి కల్పించటం ఈ అభివృద్ధి పథకం యొక్క ప్రధాన ఆశయం. ఈ దిశగా జాతీయ బ్యాంకు గ్రామీణ స్త్రీల అభివృద్ది కొరకు ఈ క్రింది కార్యక్రమాలు నిర్వహించుచున్నది.

**ఎ) గ్రామీణాభివృద్ధి కొరకు గ్రామీణ స్త్రీలకు సహాయం అందజేయటం** (Assistance to Rural Women for Rural Development (ARWIND)) :- ఈ పథకం క్రింద గ్రామీణ స్త్రీల శక్తి సామర్థ్యాలను, వ్యాపార లక్షణాలను వెలికి తీసి అభివృద్ధి చేసే సంస్థలకు ప్రోత్సాహం అందించుట, స్త్రీల కొరకు ఉమ్మడి సౌకర్య కేంద్రాలు స్థాపించుట, స్త్రీలను సంఘటితపరచటం, స్త్రీలు తయారు చేయుటకనువైన ఉత్పత్తులు రూపొందించటం, నాణ్యతా ప్రమాణాలు అమలు చేయటం మున్నగు కార్యక్రమాలు చేపట్టే వారికి, వాణిజ్యాన్ని నడపగలిగే స్త్రీ వర్తకులకు (women enterpreneures) బ్యాంకులు ఇచ్చే పరపతిని నూటికి నూరు శాతం నాబార్డు పునః ధన సహాయం చేస్తుంది.

**బి) గ్రామీణ స్త్రీలు ఉత్పత్తి చేసే వ్యవసాయేతర ఉత్పత్తుల విక్రయానికి సహాయం అందజేయుట** (Assistance for Marketing of Non-Farm Products of Rural Women (MAHIMA)) :- మార్కెట్ సర్వేలు చేపట్టటం, గ్రామీణ స్త్రీలకు మార్కెటింగులో శిక్షణ ఇచ్చుట, నాణ్యాతా ప్రమాణాలు తెలియజేయుట, ప్రచారము చేయుట మొదలు కార్యక్రమములకు బ్యాంకులు ఇచ్చే పరపతిని నూటికి నూరు శాతం ఈ పథకం క్రింద నాబార్డు పునః ధన సహాయం అందిస్తుంది. సాంకేతికాభివృద్ధి ఉమ్మడి మార్కెటింగు అవకాశాలు, విక్రయ శాలలు ఏర్పరచుట కూడా ఈ పథకంలోకి వస్తాయి.

పైన ఉదహరించిన వాటితో బాటు, స్త్రీల స్వయం సహాయక బృందాలు ఏర్పరచుట, చేనేత రంగంలోని కార్మికులకు నూతన డిజైన్లు, మార్కెట్ సదుపాయములకు సహాయము చేయుట, స్త్రీ అభివృద్ధి మండళ్ళను గ్రామీణ మరియు సహకార బ్యాంకులలో ఏర్పాటు చేయుటకు తగిన ఆర్థిక సహాయమును అదించటం ఈ జాతీయ బ్యాంకు మహిళాభివృద్ధికి చేపట్టిన ఇతర కార్యక్రమములు.

**6. బలహీన వర్గాల అభివృద్ధి** (Development of Weaker Sections) :- బలహీన వర్గాల అభివృద్ధికి నాబార్డు ఎన్నో కార్యక్రమాలను చేపట్టినది. ఈ పథకం క్రింద సన్నకారు మరియు చిన్న రైతులకు, దారిద్ర్య/పేదరిక రేఖకు దిగువనున్న షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల వారికి బ్యాంకులు ఇచ్చే పరపతిలో కొంతమేర కేటాయించటం, ఆటవికులు ప్రధానంగా ఉన్న ప్రాంతాలలో వారి కోసం ఏర్పాటు చేయబడి, వారికి ఉత్పత్తి, పెట్టుబడికి, వినియోగావసరాలకు ఋణాలు అందించే

సహకార పరపతి సంస్థలకు, మరియు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు ప్రత్యేకంగా సులభతర నిబంధనలతో నాబార్డు ఆర్థిక సహాయం అందించుచున్నది. దీనితో పాటు అటవీ ప్రాంతంలోనున్న ఆటవికులు, చిన్న తరహా అటవీ ఉత్పత్తులను సేకరించి, విక్రయం చేసుకోవటానికి అవసరమయిన పరపతి సహాయం అందజేయుటకు, సహకార బ్యాంకులకు ప్రత్యేక పరపతి పరిమితులను జాతీయ బాంకు ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమాల అభివృద్ధి, పర్యవేక్షణకు, సహకార బ్యాంకులలో ప్రత్యేక అటవీ జాతుల పరపతి అధికారులను నియమించుకొనుటకు నాబార్డు ఆర్థిక సహాయాన్ని అందజేస్తుంది.

**10.4.3 వ్యవసాభివృద్ధి మరియు పర్యవేక్షణ ప్రకార్యాలు** (Institutional Development and Supervision) :- గ్రామీణాభివృద్ధికి పటిష్టమైన పరపతి వ్యవస్థ అవసరం. ఈ ప్రాధాన్యతను గుర్తించిన ఈ జాతీయ బ్యాంకు ఈ దిశగా ఎన్నో చర్యలు తీసుకొన్నది. ఇందులో, అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికల రూపకల్పన చేసి అమలు చేయటం, పరపతి సంస్థలతో అవగాహనా ఒప్పందాలు చేసుకోవటం, సంస్థల సామర్థ్యాన్ని పెంచుటకవసరమైన శిక్షణ, అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం మరియు సంస్థల పునరుజ్జీవనకు సహాయం అందించుట ప్రధానమైనవి.

సహకార బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సాంకేతికాభివృద్ధికి మానిటరింగు (monitoring) మండళ్ళు (cells) ఏర్పరచుకొనుటకు ఆర్థిక సహాయం అందించటం, ఎంపిక చేయబడిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల విస్తృతాభివృద్ధికి చర్యలు చేపట్టుట, పరపతి సంస్థలకు రావలసిన ఋణాల బకాయిలు తగ్గించుటలో ఆ సంస్థలకు సహకరించుటకై గ్రామాలలో వికాస వాలంటీర్ వాహినులను ఏర్పాటు చేయుట, సహకార సంస్థలు ముఖ్యంగా ప్రాథమిక సహకార అభివృద్ధి నిధిని ఏర్పాటు చేయటం, ఈ జాతీయ బ్యాంకు ఈ దిశగా తీసుకొనే ఇతర చర్యలు.

**1. సహకార సంస్థల పై పర్యవేక్షణ :-** సంస్థల అభివృద్ధితో పాటు, అవి సక్రమంగా విధులు నిర్వహించునట్లు చూచుటకు సరియైన నియంత్రణ మరియు పర్యవేక్షణ కూడా ఎంతో అవసరము. ఇందు నిమిత్తం, విధాన రూపకల్పన, విధాన నిర్ణయం, మార్గదర్శక సూత్రాలను రూపొందించుట కొరకు నాబార్డు తన బ్యాంకులో అంతర్గత నియంత్రణ పరిషత్తు (Board of supervision)ను ఏర్పాటు చేసినది. క్షేత్ర స్థాయి పర్యటనలలో తనిఖీలతో బాటు, నియత కాలంలో సంస్థలకు వెళ్ళి వాటి నిర్వహణ పై నిరంతర నిఘా వేసి ఉండటం, పర్యవేక్షణ ప్రకార్యములలో ప్రధానమైనది. ఇందుకవసరమయిన చర్యలనన్నీ నాబార్డు సమర్థంగా నిర్వహించటానికి ప్రత్యేకంగా తనిఖీ శాఖ కూడా ఈ బ్యాంకులో ఉన్నది.

పైన ఉదహరించినవే కాక, చట్టసంబంధ ప్రకార్యములను కూడా నాబార్డు చేపడుతుంది.

**2. పథకాల మానిటరింగ్ మరియు మూల్యాంకన (**Monitoring and Evaluation**) :-** వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధికి అధిక మొత్తాలలో మూలధన పెట్టుబడులకు, గ్రామీణాదాయాల అభివృద్ధికి మరియు ఉపాధి కల్పనా పథకాలకు నాబార్డు ఇతోధికంగా ప్రత్యంక్షంగాను, పునః ధన సహాయపరంగాను అందజేస్తున్నది. ఈ పథకాల మానిటరింగ్ మరియు మూల్యాంకాలను చేపట్టడం ద్వారా, ఇవి ఎంతవరకు కార్యసాధనకు ఉపయోగపడ్డాయి, అమలులో ఎదురయ్యే సమస్యలు ఏమిటి? ఏ విధమైన మార్పులు చేర్పులు పథకాల పటిష్టతకు తోడ్పడతాయి అనే విషయాలను నాబార్డు తెలుసుకొంటుంది. ఇందు నిమిత్తం బ్యాంకు తన సొంత సిబ్బందితోను మరియు బయట నిపుణులతో కూడా మూల్యాంకన అధ్యయనాలు చేయిస్తుంది.

**10.4.4 సలహా సంప్రదింపు సేవలు** (Consultancy Services) :- నాబార్డు వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధిలో దాదాపు రెండు దశాబ్దాల కాలంలో గడించిన అనుభవాన్ని తనకున్న సాంకేతిక మరియు సాధారణ నిపుణుల అనుభవాలను పరిగణనలోనికి తీసుకొని 2000ల సంవత్సరం నుండి సలహా సంప్రదింపు సేవలు ప్రారంభించినది. ఇందుకొరకు ఈ బ్యాంకు చట్టం 38 (v) సెక్షనును 2000ల సం॥లో సవరించుట జరిగినది. గ్రామీణాభివృద్ధి, తత్సంబంధ పథకాల గుర్తింపు,

రూపకల్పన, మదింపు చేయుట (appraisal) మానిటరింగ్, పర్యవేక్షణ మున్నగు అంశాలలో దేశ విదేశాలలో సలహా సంప్రదింపు సేవలను నాబార్డు అందజేస్తుంది.

ఈ బ్యాంకు వారు, ఈ సేవలు ప్రారంభించిన మొదటి సం॥లోనే రూ॥ 94 లక్షల విలువ గల వ్యాపార ఒప్పందాలు చేసుకోగలిగారు. ఈ సేవలను వినియోగించుకొనే ఖాతాదారులలో భారత ప్రభుత్వము, ప్రణాళికా సంఘం, రాష్ట్ర ప్రభుత్వాలు, బ్యాంకులు, బ్యాంకు ఆఫ్ ఉంగండా, యెమెన్ ప్రభుత్వం మున్నగునవి ఉన్నవి.

ఈ బ్యాంకు అందించే సలహా సంప్రదింపు సేవలు 16 రంగాలలోను, 18 విశిష్ట రంగాలలోను ఉన్నాయి.

## 10.5 నాబార్డు నిధులు మరియు వాటి వినియోగాలు :-

నాబార్డుకు నిధులు ఈ విధంగా సమకూరుతున్నవి. అవి

1. స్వంత నిధులు
2. జాతీయ గ్రామీణ పరపతి దీర్ఘకాల నిధి
3. జాతీయ గ్రామీణ పరపతి స్థిరత్వ నిధి
4. గ్రామీణ ప్రజాసౌకర్యాల అభివృద్ధి డిపాజిట్లు
5. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఋణాలు
6. రిజర్వు బ్యాంకు ఇచ్చే నిధులు
7. విదేశీ ద్రవ్య ఋణాలు
8. మార్కెట్ ఋణాలు

జాతీయ బ్యాంకుకు అనుమతించబడిన షేరు ధనం ప్రస్తుతం రూ॥ 2000 కోట్లు. వ్యవసాయాభివృద్ధి దీర్ఘకాలిక మరియు స్థిరత్వ నిధులు రిజర్వు బ్యాంకు నుంచి నాబార్డుకు బదిలీ చేయబడ్డవి. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ (International Development Agency - IDA) వారు ఆర్థిక సహాయం చేసిన పథకాల అమలుకు సంబంధించిన నిధులు నాబార్డు నిధులకు సమకూరుతాయి.

గత కొద్ది సం॥రాలుగా జాతీయ బ్యాంకు నిధులు బాగా అభివృద్ధి చెందాయి. ఇందుకు ప్రధానంగా మూడు కారణాలు తోడ్పడినవి.

- బ్యాంకింగు రంగంలో మార్పుల అనంతరం వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ ప్రజా సౌకర్యాల నిధికి చెల్లించే డిపాజిట్లు బాగా వృద్ధి చెందటం.
- పన్నురహిత బాండ్ల ద్వారా నిధులను సేకరించటం
- ప్రైవేటు బ్యాంకులు ప్రాముఖ్యతారంగానికి (Priority Sector) చెల్లించే డిపాజిట్లను అనుమతించటం

మార్చి 31వ తేదీ 2003 నాటికి జాతీయ బ్యాంకు నిధులు రూ॥ 50,884 కోట్లకు చేరింది. ఈ నిధుల వివరాలు ఈ క్రింది పట్టికలో చూపబడినవి.

**నాబార్డు నిధులు - మార్చి 31, 2003 నాటికి**

**రూ॥ కోట్లలో**

| వరుస సంఖ్య | నిధి వివరము | మొత్తము |
|---|---|---|
| 1 | మూలధనము (1981 నాబార్డు చట్టం సెక్షన్(4) క్రింద) | 2000.00 |
| 2 | క్షామ నిధి మరియు ఇతర నిధులు | 4319.44 |
| 3 | జాతీయ గ్రామీణ పరపతి నిధి (దీర్ఘకాలిక నిధి) | 12495.00 |
| 4 | జాతీయ గ్రామీణ పరపతి నిధి (స్థిరత్వ నిధి) | 1474.00 |
| 5 | అంతర్జాతీయ సంస్థల ద్వారా గ్రాంటుల రూపంలో వచ్చిన నిధులు | 189.44 |
| 6 | బహుమతులు, గ్రాంటులు, డొనేషన్లు వగైరా | 127.24 |
| 7 | ఇతర నిధులు | 414.18 |
| 8 | డిపాజిట్లు | 12248.56 |
| 9 | బాండ్లు మరియు డిబెంచర్లు | 8702.19 |
| 10. | ఋణాలు | 6882.76 |
| 11. | ప్రస్తుత అప్పులు మరియు వాటి చెల్లింపు ఏర్పాట్లు (current liabilities expensions) | 1782.04 |
| | **మొత్తం నిధులు** | **50,884.85** |

**ఆధారం -** నాబార్డు వార్షిక రిపోర్డు 2002 - 03.

## 10.6 సారాంశము :-

వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి పరపతి విషయాల పై దృష్టి సారించే జాతీయ బ్యాంకు అవసరాన్ని గుర్తించి జాతీయ వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బ్యాంకును 1981లో ప్రారంభించారు. పై రంగాలకు పరపతి అందచేస్తూ అర్హత కలిగి ఉన్న బ్యాంకింగు సంస్థలన్నింటికీ పునః ధన సహాయం చేయుట, పరపతి వ్యవస్థను పటిష్ట పరచుటకవసరమయిన సంస్థలను స్థాపించుట, పునరావాస, శిక్షణా కార్యక్రమాలు రూపొందించి అమలు చేయుట మరియు ఈ రంగాలలో అభివృద్ధికి నిమగ్నమయిన వివిధ బ్యాంకింగు సంస్థల కార్యకలాపాలను సమన్వయపరచు లక్ష్యాలతో ఈ బ్యాంకు స్థాపించబడినది.

ఈ బ్యాంకు పాలకవర్గంలో కేంద్ర మంత్రిత్వ శాఖల, రిజర్వు బ్యాంకు ప్రతినిధులతో పాటు ప్రముఖ వ్యవసాయ ఆర్థికవేత్తలు కూడా సభ్యులుగా ఉంటారు. వీరి ఆధీనంలో బ్యాంకు అధ్యక్షుడు, పరిపాలనాధికారి, కార్య నిర్వహణాధికారుల సహాయ సహకారాలతో బ్యాంకు లక్ష్యసాధనకు కృషి చేస్తాడు. నాబార్డుకున్న బృహత్తర కార్యక్రమాల నిర్వహణకు, కేంద్ర కార్యాలయంలో 26 శాఖలు, రాష్ట్ర

రాజధానులలో 28 ప్రాంతీయ కార్యాలయాలు, జిల్లా స్థాయిలో 330 కార్యాలయాలు ఉన్నాయి. ఈ సంస్థలో మొత్తం 2583 అధికారులు, 2399 మంది ఇతర సిబ్బంది పని చేయుచున్నారు.

జాతీయ బ్యాంకు ప్రకార్యములను ప్రధానంగా నాలుగు భాగాలుగా విభజించారు. ఇందులో మొదటిది, పరపతికి సంబంధించినది. ఈ ప్రకార్యంలో భాగంగా, పరపతి ప్రణాళికల రూపకల్పన, ఆర్థిక సేవలు అందించటం - పునః ధనం సమకూర్చుట, రాష్ట్ర ప్రభుత్వాలకు నేరుగా ఋణాలు ఇవ్వటం, సూక్ష్మ పరపతికి సహాయం అందించుట, వాణిజ్య బ్యాంకులతో కలసి ఆధునిక మరియు ఎగుమతి సంబంధ వ్యవసాయ ఉత్పత్తుల అభివృద్ధి ఆర్థిక సహాయం చేయటం మున్నగు కలాపాలు ఉంటాయి.

నాబార్డు నిర్వహించే ప్రకార్యాలలో రెండవది ప్రోత్సాహక మరియు అభివృద్ధి చొరవలకు సంబంధించినది. ఇందులో కిసాన్ క్రెడిట్ కార్డు పథకం, నీటి వాలు పరీవాహక అభివృద్ధి పథకం, సూక్ష్మ పరపతి విస్తరణకు ప్రోత్సాహం, వ్యవసాయేతర రంగంలో, గ్రామీణ వర్తకుల అభివృద్ధి, జిల్లా గ్రామీణ పరిశ్రమల పథకం, మహిళాభివృద్ధి కార్యక్రమాలు, బలహీన వర్గాల అభివృద్ధి పర్యావరణ పరిరక్షణ చర్యలు పేర్కొనదగినవి.

వ్యవసాయాభివృద్ధి మరియు పర్యవేక్షణ నాబార్డు ప్రకార్యాలలో మూడవది. ఇందులో భాగంగా గ్రామీణ పరపతి వ్యవస్థను పటిష్టం చేసే కార్యక్రమాలు, సహకార సంస్థల పర్యవేక్షణ, అభివృద్ధి పథకాల మూల్యాంకన ప్రధానమైనవి.

సలహా సంప్రదింపులు నాబార్డు నాలుగవ ప్రకార్యం. ఇందులో దేశ విదేశాలలో గ్రామీణాభివృద్ధి పథకాలు గుర్తించుట, రూపకల్పన మదింపు చేయుట, మూల్యాంకన సేవలను నాబార్డు అందజేస్తుంది.

నాబార్డు నిధులు అనేక రకములు. స్వంత నిధులు, జాతీయ వ్యవసాయ పరపతి (దీర్ఘకాలిక మరియు స్థిరీకరణ) నిధులు, గ్రామీణ ప్రజాసౌకర్యాల డిపాజిట్లు కేంద్ర ప్రభుత్వం, రిజర్వు బ్యాంకు నుంచి వచ్చే ఆర్థిక వనరులతో బాటు విదేశీ ద్రవ్య ఋణాలు, మరియు పన్ను రహిత బాండ్ల ద్వారా దేశీయ మార్కెటు నుంచి సేకరించే డిపాజిట్లు మున్నగునవి. ప్రస్తుతం 50 వేల కోట్లకు మించిన నిధులతో నాబార్డు గ్రామీణ పరపతిలో అగ్రగామి సంస్థగా రూపొంది అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయుచున్నది.

## 10.7 ముఖ్య పదాలు :-

1. సామర్థ్య సంబంధిత వార్షిక పరపతి ప్రణాళికలు - ప్రతి జిల్లాలో ఉన్న వనరులు, ఆర్థిక సంస్థల పటిష్టత, అభివృద్ధి అవకాశాలను పరిశీలించి నాబార్డు ప్రాంతీయ కార్యాలయాలు ప్రతి సం॥ రూపొందించే ప్రణాళికలు.

2. ప్రజా సౌకర్యాల అభివృద్ధి నిధి - గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు, వంతెనలు, చిన్న నీటి పారుదల పథకాలు, ఆరోగ్య కేంద్ర, పాఠశాల భవన నిర్మాణములకు రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులు అందచేయుటకు నాబార్డులో ఏర్పాటు చేయబడిన నిధి.

3. సూక్ష్మ పరపతి - సంస్థాపరంగా పరపతి అందని గ్రామీణులకు ముఖ్యంగా పేదలకు ఋణ సహాయ నిమిత్తం వారిని స్వయం సాహాయక బృందాలుగా ఏర్పాటు చేసి, ఉమ్మడి బాధ్యతలో బ్యాంకుల నుండి పరపతి అందించుటకు ఏర్పాటు చేసిన పథకం.

| | | |
|---|---|---|
| 4. | కిసాన్ క్రెడిట్ కార్డులు | - రైతులు వారి ఉత్పత్తి అవసరాలకు అవసరమైన మేర, అనుమతించిన పరిమితులకు లోబడి బ్యాంకుల నుండి నగదు తీసుకొనుటకు ఉద్దేశించబడినవి. |
| 5. | నీటి వాలు పరీవాహక అభివృద్ధి పథకం | - ఎత్తు ప్రదేశమున పడిన వర్షపు నీరు పల్లపు ప్రాంతములకు ఒక కాలువ ద్వారా చేరుతుంది. ఆ విధముగా నీరు చేరు ప్రాంతమంతటిని నీటి వాలు పరీవాహక ప్రాంతం అంటారు. నీటిని అభివృద్ధి చేసి వర్షాభావ ప్రాంతాలలో వ్యవసాయాభివృద్ధికి చేపట్టిన పథకం. |
| 6. | మూల్యంకన | - ఒక పథకం ప్రారంభం నుంచి గాని, లేక పూర్తి అయిన తరువాత గాని, దాని అమలు, అది పథకంలో ఉద్దేశించిన ఆశయాలు ఎంత వరకు నెరవేర్చగలదు, దాని ప్రభావం, పథకం పరిధిలోనున్న లబ్ధిదారులు లేక ప్రాంతం పై ఎలా ఉన్నది అని అధ్యయనం చేయుట. |

## 10.8 స్వయం సమీక్షా ప్రశ్నలు :-

1. గ్రామీణ పరపతిలో జాతీయ వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బ్యాంకు పాత్రను స్థూలనాత్మకముగా వివరించుము.
2. నాబార్డు యొక్క పరపతి మరియు ఆర్థిక సంబంధ ప్రకార్యములను సోదాహరణముగా వివరించుము.
3. జాతీయ వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బ్యాంకు చేపట్టిన ప్రోత్సాహక మరియు అభివృద్ధి చొరవలను వివరంగా తెలుపుము.
4. జాతీయ బ్యాంకు నిధులను గూర్చి వివరింపుము.

## 10.9 చదువదగిన గ్రంథాలు :-


1. నాబార్డు ప్రచురణ, బొంబాయి 2003 - రూరల్ క్రెడిట్ అండ్ నాబార్డు 2003
2. నాబార్డు - నాబార్డు యాన్యువల్ రిపోర్టు 2002 - 03
3. రుద్ర ప్రతాప్ సింగ్ - నాబార్టు ఆర్గనైజేషన్ మేనేజ్మెంట్ అండ్ రోల్


**ఆచార్య. ఆర్.యమ్. మోహనరావు**

పాఠం - 11

# గ్రామీణ విపణి - భావన, పరిణామము, వర్గీకరణ మరియు విధులు

## 11.0 లక్ష్యం :-

ఈ పాఠ్య భాగం చదివిన తరువాత విద్యార్థులు ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి. అవి

- మార్కెటు, గ్రామీణ మార్కెటు అనగానేమి? వాటి పరిణామక్రమము ఎలా ఉన్నది?
- మార్కెట్లను ఎన్ని రకాలుగా వర్గీకరించారు? ఆ వర్గీకరణకు గల కారణాలు.
- మార్కెట్ల ప్రకార్యాలను గురించి వివరంగా తెలియాలి.

## విషయసూచిక :-

**11.1 ఉపోద్ఘాతం**

**11.2 గ్రామీణ విపణి - భావన**

**11.3 గ్రామీణ మార్కెట్ల - పరిణామము**

**11.4 మార్కెట్ల వర్గీకరణ**

**11.5 గ్రామీణ మార్కెటింగు - ప్రకార్యాలు**

**11.6 సారాంశము**

**11.7 ముఖ్య పదాలు**

**11.8 స్వయం సమీక్షా ప్రశ్నలు**

**11.9 చదువదగిన గ్రంథాలు**

## 11.1 ఉపోద్ఘాతం :-

వ్యవసాయ రంగంలో మార్కెటింగు ప్రధానమైనది. ఉత్పత్తి కార్యక్రమాలన్నీ మార్కెటింగు కార్యక్రమంతో ఆఖరి దశకు వస్తాయి. గ్రామీణ ఉత్పత్తులే కాదు, ఏ ఉత్పత్తులయినా మార్కెటింగుతో తుది దశకు వస్తాయి. ఈ రెండు ప్రకార్యాలు అనగా ఉత్పత్తి - మార్కెటింగు మధ్య ఉన్న సహేతుక సంబంధం వల్ల మార్కెటింగులో సామర్థ్యం ఉత్పత్తి సామర్థ్యాన్ని అనుకూలంగా ప్రభావితం చేస్తుంది. ఈ కారణంగా ఉత్పత్తి ప్రోత్సాహక కార్యక్రమాలేవైనా పటిష్ఠమైన మార్కెటింగు సౌకర్యాలు ఏర్పాటు చేయటానికి పూనుకోవాలి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న మార్కెటింగు గురించి తెలుసుకోవటం చాలా అవసరం.

వ్యవసాయ రంగంలో మార్కెటింగు ప్రాధాన్యత దృష్ట్యా, మార్కెటింగు అనగానేమి? ఆర్థికవేత్తలు వాటిని ఎలా నిర్వచించారు? గ్రామీణ మార్కెట్ల పరిణామం ఎలా ఉంది? వాటిని ఏ విధంగా వర్గీకరించారు? మార్కెటింగు అంటే కేవలం సరుకులను విక్రయించడమేనా? లేని యెడల మార్కెటింగులో ఏ ప్రకార్యాలు ఇమిడి ఉన్నాయి అని తెలియటం అవసరం. ఈ విషయాలన్నింటి గురించి ఈ పాఠ్యాంశంలో తెలియపరచుట జరిగినది.

## 11.2 గ్రామీణ విపణి - భావన :-

గ్రామీణ విపణి గురించి తెలియపరచే ముందు విపణి అంటే ఏమిటో తెలుసుకోవటం అవసరం. సామాన్యంగా మనం ప్రతి రోజూ వాడే పదాలనే అర్థశాస్త్రంలో ప్రత్యేకార్థం స్ఫురించేటట్లు సాంకేతిక పదాలతో రూపొందిస్తారు. మార్కెట్ అనే పదానికి కూడా ఇది వర్తిస్తుంది. వస్తువును విక్రయించే ప్రదేశాన్ని మనం మార్కెట్ లేక విపణి అని అంటాము. అర్థశాస్త్రంలో 'మార్కెట్టు' గురించి చెప్పేటప్పుడు స్థలానికి ప్రాధాన్యత లేదు. అమ్మకపుదారులు, కొనుగోలుదారులు ప్రత్యక్షంగా గాని, ప్రతినిధుల ద్వారా గాని, వస్తు సేవల క్రయ విక్రయాలలో సంప్రదింపులు చేసుకొని వ్యవహారాలు జరపడాన్ని మార్కెట్టుగా వ్యవహరిస్తారు. ధర ఉన్న ప్రతి వస్తువుకు, సేవకు ఒక మార్కెటు ఉన్నదని ప్రత్యేకంగా చెప్పవచ్చు.

ధర నిర్ణాయక శక్తులు పరస్పరం సంప్రదించుకొని అవగాహనకు వచ్చే గుర్తించదగిన ప్రదేశాన్ని మార్కెటు అనవచ్చును. అమ్మకందార్ల, కొనుగోలుదార్ల సంబంధాలు ఒకే రకమైన వస్తువుల ధరపై సమతుల్యాన్ని సాధించే ఏ ప్రాంతాన్నైనా మార్కెటుగా భావించ వచ్చునని మార్షల్ నిర్వచించాడు.

గ్రామీణ మార్కెటింగు వ్యవసాయ ఉత్పాదకాలు, వినియోగ వస్తువులు మరియు ప్రధానంగా గ్రామీణ వ్యవసాయ ఉత్పత్తులు బయటికి వెళ్ళటానికి, గ్రామీణుల వినియోగ వస్తువులు గ్రామాలకు చేరటాన్ని తెలియజేస్తాయి. వ్యవసాయ మార్కెటింగు ప్రధానంగా వ్యవసాయోత్పత్తులు గ్రామాల నుంచి తరలి వెళ్ళటానికి సంబంధించిన ప్రక్రియ. అందువలన వినియోగావసర వస్తువులు బయట నుంచి గ్రామాలకు చేరే విషయం పై అంతగా సంబంధం ఉండదు. అయితే ఈ స్వల్ప తేడాలకు ప్రాముఖ్యత ఇవ్వకుండా రెండింటిని ఒకటిగా భావించటం పరిపాటి.

## 11.3 గ్రామీణ మార్కెట్ల పరిణామము :-

చారిత్రకంగా, గ్రామీణ మార్కెట్లు పురాతన కాలం నుంచి ఉన్నాయి. అయితే ద్రవ్య ఆర్థిక వ్యవస్థ రాక పూర్వం, గ్రామీణ మార్కెట్లలో వస్తు మార్పిడి (Barter System) పద్ధతిలో అమ్మక వినియోగ కార్యక్రమాలు జరిగేవి. మధ్య యుగంలో రాజులకు చెల్లించవలసిన సుంకాలు వ్యవసాయోత్పత్తుల ద్వారా వారికివ్వగా మిగిలినది, స్వంత వినియోగానికో లేక సేవలందిన వారికి వస్తురూపేణా వేతన చెల్లింపులకో సరిపోయేది. ఆ కాలంలో అమ్మకపు మిగులు (Marketed Surplus) చాలా స్వల్పంగా ఉండటంతో, గ్రామీణ మార్కెట్లు బాగా పరిమితంగా ఉండేవి. మధ్య యుగంలో శతాబ్దాల తరబడి వ్యవసాయరంగంలో ఆవరించిన స్థబ్దత గ్రామీణ మార్కెట్లు అభివృద్ధి చెందకపోవటానికి ప్రధానకారణమైంది.

మన దేశంలో బ్రిటీషు పాలనలో గ్రామీణ మార్కెటింగులో అనేక మార్పులు వచ్చినవి. వ్యవసాయ రంగంలో అధికోత్పత్తులను సాధించే దిశగా 'గ్రామీణ స్వయం సమృద్ధి'తత్వాన్ని బాగా బలహీనపరచి, వ్యవసాయంలో వ్యాపారతత్వాన్ని పెంచి, భారత ఆర్థిక వ్యవస్థలో విలీనం చేయుట జరిగినది. వాణిజ్య సంపదలకు ప్రోత్సాహమిచ్చుటకు, ఆహారధాన్యాల ఉత్పత్తి పెంచుటకు, నీటిపారుదల ప్రాజెక్టులు విజ్ఞాన పరిశోధనాభివృద్ధి, మార్కెట్లు అభివృద్ధి చేయుటకు 20వ శతాబ్దం ప్రథమ భాగంలో గ్రామీణ మార్కెట్లు, ప్రధానంగా వ్యవసాయ మార్కెట్లు బ్రిటీషు వారి హయాంలో చాలా వరకు విస్తరించినవి. వ్యవసాయంలో బ్రిటీషు వారు ప్రవేశపెట్టిన వ్యాపారతత్వం, అమ్మకపు మిగుళ్ళ పెరుగుదలకు, చిల్లర మార్కెట్లు, వాటితోపాటు వర్తక శ్రేణులు పెరగటానికి పునాదులు వేసినది. దీనితోపాటు

విస్తృతమైన రైలు మార్గాలు, టీ, కాఫీ, జనపనార, ప్రత్తి, చెరకు, నూనె గింజలు మున్నగు వ్యవసాయోత్పత్తులకు వ్యవస్థాగత మార్కెటింగు సంస్థలు ఏర్పడుటకు తోడ్పడినవి.

స్వాతంత్ర్యానంతరం ఆర్థిక, వ్యవసాయాభివృద్ధిలో మార్పుల కారణంగా గ్రామీణ మార్కెట్లు వ్యవసాయ మార్కెట్లు బాగా విస్తృతమవటమే కాక పరిమాణాత్మకంగా వృద్ధి చెందటం జరిగినది. అయినప్పటికీ, గ్రామీణ మార్కెట్లలో పరిమాణాత్మక, నాణ్యాతాపర, ప్రాంతీయ వ్యత్యాసాలు, సేవలలోపం, దళారుల ప్రాభవం మున్నగు సమస్యలు ఉన్నాయి.

## 11.4 మార్కెట్ల వర్గీకరణ :-

మార్కెట్లను సాధారణంగా మూడు రకాలుగా వర్గీకరిస్తారు. అవి 1. పరిమాణాన్ని బట్టి, 2. పోటీని బట్టి, 3. కాలాన్ని బట్టి.

1. **పరిమాణ ప్రాతిపదిక వర్గీకరణ :-** పరిమాణాన్ని బట్టి మార్కెట్లను స్థానిక మార్కెటు (local market), జిల్లా మార్కెట్ (district market), రాష్ట్ర మార్కెట్ (state market), జాతీయ మార్కెట్ (National Market), ప్రపంచ మార్కెట్ (Terminal Market) అని విభజించవచ్చును.

వ్యవసాయోత్పత్తులు ముఖ్యంగా త్వరగా చెడిపోయే పాలు, కూరగాయల వంటి వస్తువులను సాధారణంగా స్థానిక మార్కెట్లలోనే విక్రయిస్తారు. అయితే స్థానిక మార్కెట్లలో నిల్వ ఉంచదగిన ఆహారధాన్యాలు, నూనె గింజలు, తదితర వస్తువుల విక్రయాలు కూడా జరుగుతాయి. రవాణా సౌకర్యాలు లేని ప్రాంతాలలో సన్నకారు, చిన్నరైతులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో స్థానిక మార్కెట్లలోనే అన్ని రకాల వ్యవసాయోత్పత్తుల విక్రయాలు జరుగుతుంటాయి. ఒక ప్రాంతానికే పరిమితమైన డిమాండు ఉన్న వస్తువులు సాధారణంగా స్థానిక మార్కెట్లలో విక్రయిస్తారు. కొన్ని వ్యవసాయోత్పత్తులకు, జిల్లా, ప్రాంతీయ లేక రాష్ట్రస్థాయి మార్కెట్లు ఉంటాయి. స్థానిక మార్కెట్లలో కంటే అధిక ధరలు లభించినప్పుడే గ్రామీణులు తమ ఉత్పత్తులను జిల్లా స్థాయి మార్కెట్లలో విక్రయిస్తారు.

కొన్ని గ్రామీణ ఉత్పత్తులకు మార్కెటు రాష్ట్ర లేక దేశీయంగానే పరిమితమై ఉంటుంది. కొన్ని వస్తువులకు ఇతర దేశాలలో కూడా మార్కెటు ఉండవచ్చు. ఉదా॥ మన దేశంలో పండే బాస్మతీ బియ్యం, పొగాకు, మిరియాలు, కాఫీ, టీ పొడి మున్నగు ఉత్పత్తులకు ఇతర దేశాలలో కూడా గిరాకీ ఉంది.

గ్రామీణ ఉత్పత్తులలో అన్ని ప్రాంతాలలో వాడకం విరివిగా ఉన్న వస్తువులకు ఉదా॥ గోధుమలు మున్నగు ఆహార ధాన్యాలకు ప్రపంచ మార్కెట్లు ఉన్నాయి.

ఈ దిగువనుదహరించిన సౌకర్యాలు, లక్షణాలు ఉన్నప్పుడే మార్కెటు విస్తృతమవుతుంది.

(ఎ) **రవాణా సౌకర్యాలు :-** వస్తువులను తక్కువ ఖర్చుతో త్వరితంగాను, సురక్షితంగాను రవాణా చేయడానికి సదుపాయాలుంటే అలాంటి వస్తువులకు మార్కెటు పరిమాణం వృద్ధి చెందుతుంది. ఉదాహరణకు హిమాచల్‌ప్రదేశ్‌లోని ఆపిల్ పండ్లు దేశమంతటా విక్రయిస్తున్నారంటే లేదా, బెంగుళూరు టమోటా ఆంధ్రప్రదేశ్‌లో, కృష్ణాజిల్లా పాలు హైదరాబాదులోనూ, భీమవరం ప్రాంత చెరువు చేపలు కలకత్తాలోను విక్రయించటం కేవలం రవాణా పద్ధతులలో వచ్చిన ఆధునిక మార్పుల వల్లనే సాధ్యపడింది.

(బి) **ప్రసార సౌకర్యాలు :-** రవాణా సౌకర్యాలు, వస్తువులను ఒక ప్రాంతము నుంచి వేరొక ప్రాంతానికి చేర్చి విక్రయించటానికి తోడ్పడినట్లే, ప్రసార సౌకర్యాలు అభివృద్ధి చెందటం వల్ల వివిధ ప్రాంతాలలోని వ్యాపారస్థుల మధ్య, వినియోగదారుల మధ్య వర్తక సంబంధాలు పెంపొంది మార్కెట్ విస్తృతమవటానికి, టెలిఫోను, టెలెక్సులు ప్రాధాన్యత వహిస్తాయి. ఈ

సౌకర్యాల ద్వారా ఒక చోటనున్న వారు ఇంకొకరితో ధరల గురించి సంప్రదించటం, మార్కెట్‌లో సరుకు రావటం గురించి తెలుసుకొనుటకు, కొనుగోలు అమ్మక నిర్ణయాలు చేసుకొని సరుకు సప్లై చేయుటకు ఆదేశాలు ఇవ్వటానికి ఎంతగానో ఉపయుక్తంగా ఉన్నాయి.

(సి) **వస్తువులు ఒకే జాతికి లేదా వర్గానికి చెందినవిగా విభజించే అవకాశం ఉండటం :-** నాణ్యతను బట్టి పరిమాణాన్ని బట్టి సరుకును పలు రకాలుగా విభజించి విక్రయించటం మన అందరికీ తెలిసిన విషయమే. ఉదాహరణ బియ్యం, పత్తి, పొగాకు మున్నగు వాటిని సరుకు నాణ్యత రకాన్ని బట్టి పలురకాలుగా విభజించి విక్రయించటం మనం చూస్తుంటాము. ఈ విధంగా చేయటాన్ని వస్తు ప్రమాణీకరణ, శ్రేణీకరణ (Standardization and grading) అంటారు. అలా చేయటం వల్ల కొనుగోలుదారు సరుకును పరిశీలించే అవసరం లేకుండానే కొనటానికి అంగీకరిస్తాడు. మచ్చు (sample)ను బట్టి వస్తు విక్రయం జరిగేటప్పుడు కూడా మార్కెట్ విస్తృతమవుతుంది.

(డి) **దీర్ఘకాలము నిల్వ ఉండటం :-** త్వరగా పాడయ్యే వస్తువులకు ముఖ్యంగా పండ్లు, కూరగాయలు మున్నగు వాటికి మార్కెటు పరిమితంగా ఉండటం సహజమే. అయితే విజ్ఞాన శాస్త్రాభివృద్ధి మూలంగా వచ్చిన సదుపాయాల వల్ల ఇటువంటి వస్తువులకు కూడా మార్కెటు పెరిగింది. శీతల గిడ్డంగులు (cold storages) ఈ సదుపాయాలలో ప్రధానమైనవిగా చెప్పవచ్చును. ఈ సదుపాయాల వల్ల పాలు, పండ్లు, కూరగాయలు, రొయ్యలు, చేపలు, మాంసము మొదలైన వాటికి ఇప్పుడు విస్తృతమయిన మార్కెట్లు వచ్చాయి.

(ఇ) **వస్తు వినియోగ పరిమితి :-** వస్తు వినియోగము ఒక ప్రాంతానికే పరిమితమైందా లేదా అన్ని ప్రాంతాలలోను ఉన్నదా అన్న దానిని బట్టి కూడా మార్కెటు పరిమాణము ఉంటుంది.

ఉదా॥ పంజాబులో వరి పండించినా దానిని విరివిగా దక్షిణాది మార్కెట్‌కి పంపుతారు. కేరళాలో పండిన మసాల దినుసులు (spices) అన్ని రాష్ట్రాలకు సరఫరా అవుతాయి.

(ఎఫ్) **ఉత్పత్తి పరిమితి :-** కొన్ని పరిమితంగా ఉత్పత్తి అయ్యే వస్తువులకు, లేక కొన్ని ప్రాంతాలలోనే ఉత్పత్తి పరిమితి అయిన వస్తువులకు ప్రపంచ మార్కెట్లు ఉంటాయి.

ఉదా॥ పొగాకు ఆంధ్ర, గుజరాత్, కర్ణాటకలలో ఎక్కువగా పండినా అన్ని రాష్ట్రాలకు అంతర్జాతీయ మార్కెట్‌కు సరఫరా అవుతుంది.

2. **పోటీ ప్రాతిపదిక వర్గీకరణ :-** వివిధ వినియోగదారుల మధ్య అమ్మకందారుల మధ్య ఉన్న పోటీని బట్టి మార్కెట్లను సంపూర్ణ పోటీ, అసంపూర్ణ పోటీ, పోటీలేని లేక గుత్తాధిపత్యము ఉన్న మార్కెట్లు అని వర్గీకరిస్తారు.

సంపూర్ణమైన పోటీ ఉన్న వస్తువునకు మార్కెట్ అన్ని ప్రాంతాలలోను ఒకే ధర ఉంటుంది. రవాణా ఛార్జీల మేరకు ధరలో తేడా ఉండే అవకాశము ఉన్నది. వస్తువుకు చెల్లించే ధర అన్ని ప్రాంతాలలోనూ ఒకటిగానే ఉండటం సంపూర్ణమైన పోటీ ఉన్న మార్కెట్‌కి మంచి నిదర్శనము. కాని సాధారణంగా వాస్తవిక పరిస్థితులలో ఈ రకం మార్కెట్లు ఉండవు.

పోటీ లేని మార్కెటును గుత్తాధిపత్యము ఉన్న మార్కెటు అని చెప్పవచ్చును. సప్లయి అంతా ఒకరి ఆధీనంలోనే ఉండటం చేత ధర నిర్ణయంలో గుత్తాధికారికి కొంతమేరకు స్వేచ్ఛ ఉంటుంది. ధర లేక విక్రయము ఎంతమేరకు ఉండవలెను అనే రెంటిలోను ఏ ఒకటయినా ఇతడు నిర్ధారణ చేయగలడు. కానీ ఏ వస్తువుకు లేక ఏ మార్కెట్‌లోనూ ఈ విధమైన నిరాటంకమైన గుత్తాధిపత్యము కొనసాగదు.

వాస్తవికంగా, నిత్య జీవితంలో అనేక వస్తువులకు తటస్థపడే మార్కెట్లు అటు పూర్తిగా పోటీ పద్ధతి ఉన్నవి కావు. అలాగే పూర్తిగా గుత్త వ్యాపారి స్వాధీనంలో ఉన్నవి కావు. ఈ రెండు పద్ధతులతోనూ ఉన్న లక్షణాల కలయికతోనే అనేక వస్తువులకు మార్కెట్లు ఉంటాయి.

3. **కాల ప్రాతిపదిక వర్గీకరణ :-** వస్తువుకు స్వల్ప కాలంలోను, దీర్ఘ కాలంలోను ఉన్న డిమాండ్, సప్లయిలను బట్టి కూడా మార్కెట్లను వర్గీకరించవచ్చు. కాల గమనంలో అభిరుచులు, ఆదాయాలు మున్నగు వాటిలో మార్పులు రావడం వల్ల డిమాండులో మార్పు కలుగుతుంది. అదే విధంగా సప్లయిలో కూడా మార్పులు వస్తాయి. ఇవి అతి ముఖ్యమైనవి. స్వల్ప కాలంలో వాడుకలోనున్న ఉత్పత్తి సాధనాలు స్థిరాలై ఉంటాయి. ఉత్పత్తి విధానంలో మార్పులు రావడం కూడా దీర్ఘ కాలంలోనే వీలుపడుతుంది. శాస్త్ర సాంకేతికాభివృద్ధి తదితర మార్పుల మూలంగా ఉత్పత్తి విధానము, పరిమాణములు మార్పు చెంది, సప్లయి కూడా డిమాండుకు అనుకూలంగా సర్దుబాటు జరిగే అవకాశముంటుంది. ఈ కారణంగా, మార్కెట్‌లను కాలాన్ని బట్టి కూడా వర్గీకరిస్తారు. అయితే స్వల్పకాలం, దీర్ఘకాలం అనే భావన, నెలలు, సంవత్సరాలు అనే దాని మీద గాక వస్తు స్వభావము, దాని ఉత్పత్తి స్థాయి మొదలగు వాటి మీద ఆధారపడి ఉంటాయి. ఈ కారణాల వల్ల ఒక వస్తువు స్వభావము, దాని ఉత్పత్తి స్థాయి మొదలగు వాటి మీద ఆధారపడి ఉంటాయి. ఈ కారణాల వల్ల ఒక వస్తువు సప్లయి విషయంలో దీర్ఘకాలంగా పరిగణించే సమయమే ఇంకొక వస్తువు విషయంలో స్వల్పకాలికంగా లెక్కించవచ్చు. ఉదా॥ ప్రత్తి, నూలు విషయంలో దీర్ఘకాలికంగా పరిగణించే సమయమే ఉక్కు సప్లయి విషయంలో స్వల్పకాలము కావచ్చును.

**గ్రామీణ మార్కెట్ల వర్గీకరణ :-** గ్రామీణ సంతలు, అమ్మక కేంద్రాలు మినహాయించితే గ్రామీణ మార్కెట్లను స్థూలంగా మూడు రకాలుగా విభజించవచ్చును.

1. తాలూకా లేక మండల స్థాయిలో ఉన్న ప్రధాన రహదార్లలో నెలకొని పట్టణాలుగా మారగలిగే పెద్ద గ్రామాలలో ఉండే మార్కెట్లను మొదటి రకంగా చెప్పవచ్చును. ఇవి పట్టణ లక్షణాలు కలిగి, గ్రామాలలోని దుకాణాలకు సప్లయి కేంద్రాలుగాను, గ్రామీణులు చిల్లర సరుకుల విక్రయ కేంద్రాలుగా ఉంటాయి.
2. రెండవ రకం గ్రామీణ మార్కెట్లు రహదారి కేంద్రాలలో, కూడళ్ళలో దుకాణాలు కేంద్రీకృతమైనవి లేక ఒకటి రెండు దుకాణాల బజారులున్నవి.
3. మూడవ రకం మార్కెటు దూరప్రాంత గ్రామాలలో ఇండ్లలోనే దుకాణాలు ఏర్పరచుకొని ఉండేవి.

వీటిలో మొదటి రకం మార్కెట్లు లాభసాటివి. ఈ మార్కెట్లలో ప్రచార, ప్రోత్సాహక కార్యకలాపాలను ఉత్పత్తి లేక పంపిణీ కంపెనీలే చేపడతవి. అంతేకాక ఈ మార్కెట్లు పంపిణీ కంపెనీల పంపిణీ మార్గాలలో ఉంటవి. కాబట్టి సరుకులు వాళ్ళ దుకాణాలకు నేరుగా అందుతవి. రెండవ రకం మార్కెట్లకు ప్రచార ప్రోత్సాహక చర్యలు కొంతవరకు అందినా, సరుకును వారి దుకాణం ముందు సరఫరా చేయటానికి వీలుండదు. మూడవ రకం మార్కెట్లు రవాణా సదుపాయాలకు దూరంగా ఉంటవి కాబట్టి ఈ దుకాణదారులు దగ్గరనే ఉన్న వ్యాపార కేంద్రాలకు, లేక పట్టణాలకు వెళ్ళి సరుకు తెచ్చుకోవటం సాధారణంగా జరుగుతుంది. అందువల్ల ఇక్కడ ధరలు స్వల్పంగా అధికంగా ఉండవచ్చు. అయితే ఈ మార్కెట్లలో గ్రామీణులకు వస్తువులను అరువుగా విక్రయించటం సర్వ సాధారణం. ముఖ్యంగా వ్యవసాయ ఉత్పాదకాలైన రసాయనిక ఎరువులు, పురుగు మందులు అరువుగా ఇవ్వటం తెచ్చుకోవటం గ్రామీణ విపనీలో మామూలు. రెండు, మూడు రకాల గ్రామీణ మార్కెట్లలోనే ఈ సదుపాయాలు ఉంటవి.

## 11.6 గ్రామీణ మార్కెటింగు - ప్రకార్యాలు :-

గ్రామీణ మార్కెటింగు ప్రకార్యాలను, (1) గ్రామీణ వినియోగ మార్కెటింగు మరియు (2) గ్రామీణ ఉత్పత్తులు ప్రధానంగా వ్యవసాయోత్పత్తుల క్రింద చేయడం జరిగింది.

1. **గ్రామీణ వినియోగ మార్కెటింగు :-** గ్రామీణ వినియోగ మార్కెటింగ్‌లో వ్యవసాయోత్పత్తులు, ముఖ్యంగా వ్యవసాయ ఉత్పాదకాలైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు లాంటి అనేక విధములైన పారిశ్రామిక ఉత్పత్తులు ఉంటాయి. ఈ మార్కెట్‌లో సాధారణంగా అమ్మకందార్లలో ఎక్కువ మంది వ్యాపారులే ఉంటారు. ఈ మార్కెటింగ్‌లో భాగస్వాములయిన ఉత్పత్తిదారులు, అమ్మకందారులు ఈ క్రింది మార్కెటింగు ప్రకార్యాలు నిర్వహిస్తారు. అవి

(ఎ) ఈ మార్కెట్‌లో రాణించటానికి అన్నిటికన్నా ప్రథమంగా మార్కెట్ సామర్థ్యాన్ని (market potential) అంచనావేయాలి. ఇది ప్రతి ఉత్పత్తి సంస్థ స్థాయిలోనే కాక జాతీయ స్థాయి ప్రణాళికలో భాగంగా ఉండాలి. ఇది దృష్టిలో ఉంచుకొనటం, లేక పట్టించుకోకపోవటం బట్టి సంస్థల వ్యాపారం ఉంటుంది. ముఖ్యంగా చిన్న పరిశ్రమల వారికిది ఎంతో అవసరం. ఈ అంచనాలు వేయటంలో ముఖ్యంగా గమనించవలసినవి (1) మార్కెట్ వాతావరణం, (2) ఉత్పత్తి నిర్వచనం మరియు రూపకల్పన.

మార్కెట్ వాతావరణం, ప్రాంతాలను బట్టి, అక్కడ నివసించే వారి సామాజిక ఆర్థిక స్థితిగతులను బట్టి, నివాస ప్రాంతం బట్టి, ప్రభుత్వ విధానాల ప్రభావం ప్రస్తుతం అన్నిటికన్నా ప్రసార సాధనాలయిన టి.వి. ద్వారా ప్రభావితం అవుతాయి. ఈ పరిస్థితులనన్నిటినీ దృష్టిలో ఉంచుకొని మార్కెట్ సామర్థ్యం, డిమాండు మున్నగు వాటిని అంచనా వేయాలి. ఇది ఒక నిరంతర ప్రక్రియ.

ఉత్పత్తి నిర్వచన, రూపకల్పన మార్కెట్ డిమాండును ప్రభావితం చేయటంలో ప్రధాన పాత్ర వహిస్తాయి. ఈ ఉత్పత్తుల నిర్వచనం రూపకల్పన, వినియోగదారులను, వారి స్థితిగతులను, అవసరాలను, అభిరుచులను దృష్టిలో ఉంచుకొని చేస్తే ఫలితాలు అనుకూలంగా ఉంటాయి. ఉదాహరణకు బస్తీలలో కొళాయిల దగ్గర నీళ్ళు పట్టుకొనుటకు వాడే ప్లాస్టిక్ బకెట్లు, గ్రామీణ స్త్రీలు దూర ప్రాంతాల నుంచి తల మీద రెండు మూడు కడవలు మోసుకొని రావటానికి పనికి రావు. ఇది గమనించి ప్లాస్టిక్ కడవలు, బిందెలు తయారు చేస్తున్నారు. అలాగే పేదలను, వ్యవసాయ కూలీలను దృష్టిలో ఉంచుకొని అనేక రకాల ఉత్పత్తులను చిన్న చిన్న పరిమాణాలలో ఉదా॥ షాంపూ ప్యాకెట్ మాదిరి అమ్మటం మనం చూస్తూనే ఉన్నాం. అయితే ఈ ప్రాధాన్యతను గుర్తించని చిన్న పరిశ్రమల, సంస్థల వ్యాపారం దెబ్బతినే ప్రమాదం ఉంది.

(బి) ధర - కొత్త ఉత్పత్తుల తయారీలో గ్రామీణ సగటు వినియోగదారుడు ఆ వస్తువును ఎంత ధరకు కొనగలడు అనే విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. ధరను కేవలం ఉత్పత్తి ఖర్చులలో అంచనా వేస్తే గ్రామీణ మార్కెంగులో రాణించటం కష్టం అవుతుంది. ఈ సమస్యను అధిగమించటానికి చాలా మంది ఉత్పత్తిదారులు వస్తువు అందరికి అందుబాటులో ఉండే విధంగా పరిమాణాన్ని తగ్గించి, రూపాయి ప్యాకెట్లు, రెండు రూపాయల ప్యాకెట్లు, అయిదు రూపాయల ప్యాకెట్లుగా విక్రయించటం మనం చూస్తూనే ఉన్నాము.

(సి) పంపిణీ - వినియోగదారులు ముఖ్యంగా గ్రామీణ వినియోగదారులకు వారికనువైన రీతిలో వస్తువులను వారికి అతిసామీప్యంలో పంపిణీ చేయనిచో, ఆ వస్తువులకు డిమాండ్ కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. చాలా వుత్పత్తులు ముఖ్యంగా, దైనందినంగా వాడే టీ పొడి, సబ్బులు, పేస్టులు వగైరాల పంపిణీకి విస్తృతమైన ఏర్పాట్లు చేసుకొని గ్రామీణ మార్కెట్టును ఆకట్టుకొనటం మనందరికి తెలుసు.

(డి) ప్రోత్సాహక చర్యలు - పట్టణాలలో పెద్ద పెద్ద డిపార్టుమెంటు స్టోర్లు, సూపర్ మార్కెట్లు మున్నగు వాటి దగ్గర పెద్ద కంపెనీలు వారు ఉత్పత్తులకు మార్కెట్ పెంచుకొనుటకై ఆ వస్తువుల ప్రదర్శన, తగ్గింపు ఆఫర్‌లు లేదా ఒకటి కొంటే మరొకటి ఉచితం మున్నగు ప్రోత్సాహక చర్యలు గ్రామీణ వినియోగదారులు దైనందిన జీవితంలో వాడే వస్తువులకు గ్రామీణ మార్కెట్టులో తక్కువ అని చెప్పవచ్చు. అయితే వ్యవసాయ ఉత్పాదక వస్తువుల విషయంలో ముఖ్యంగా, ఎరువులు, పురుగుమందుల కంపెనీలు ప్రచారంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో విస్తరణ కార్యక్రమాలు, ప్రదర్శన క్షేత్రాలు (demonstration farms) ఏర్పాటు చేయటం మున్నగు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ విషయంలో భారత రైతాంగ సహకార ఎరువుల కంపెనీ (Indian farmers fertiliser cooperatores) వారి కార్యక్రమాలు పేర్కొనదగినవి. ఈ చర్యలు గ్రామీణ మార్కెట్టులో ఆయా వస్తువుల అమ్మకాలను బాగా పెంచుటకు తోడ్పడతాయి.

(ఇ) ప్రచార సాధనాలు (communication media) - గ్రామీణ వినియోగదారుల మార్కెటింగు కొరకు ప్రచారం (advertising), ప్రోత్సాహం (promotion) ఎంతో అవసరం. ప్రధానంగా వస్తువుల సేవల లక్షణాలు, వినియోగదారులకు తెలియజేసి ఆ వస్తువులకు డిమాండు పెంచుకోవటమే ప్రచార సాధనాల యొక్క ప్రధాన లక్ష్యం. గ్రామీణ మార్కెటింగ్‌లో దీని ఆవశ్యకత పట్టణాలలో కంటే ఎక్కువగా ఉంది.

2. **గ్రామీణ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ ప్రకార్యాలు :-** గ్రామీణ వస్తువులు ప్రధానంగా వ్యవసాయోత్పత్తుల మార్కెట్ల ప్రకార్యాలను స్థూలంగా అయిదు క్రింద విభజించవచ్చును. అవి

**(ఏ) వస్తు సేకరణ** - వ్యవసాయోత్పత్తులను అనేక ప్రాంతాలలో అసంఖ్యాక రైతాంగం ఉత్పత్తి చేస్తారు. వీరందరి దగ్గర నుంచి ఉత్పత్తులను సేకరించి వాటిని కొంత మేరకు వర్గీకరించి అమ్మకానికి సిద్ధం చేయుట వ్యవసాయ మార్కెట్ ప్రకార్యాలలో మొదటి అధ్యాయం మరియు ప్రధానమైనది.

**(బి) వర్గీకరణ మరియు ప్రాసెసింగ్** - ఒకే రకమునకు లేక జాతికి చెందిన వ్యవసాయోత్పత్తులలో కూడా పరిమాణం, నాణ్యత, రంగు, రుచి, వాసన, తేమ శాతం మున్నగు విషయాలలో తేడాలుంటాయి. ఉదా॥ వడ్లలో అనేక రకాలున్నాయి అలాగే ఇతర వ్యవసాయోత్పత్తులలో కూడా చాలా రకాలు ఉంటవి. అమ్మకం ధర రీత్యా వినియోగదారుల కొనుగోలు సౌలభ్యత, అభిరుచులను బట్టి, ఉత్పత్తులను వర్గీకరించి, ప్రమాణీకరించటం ఎంతో అవసరం.

వ్యవసాయోత్పత్తులలో కొన్నిటిని వినియోగించటానికి ముందుగా ప్రాసెసింగ్ చేయవలసి ఉంటుంది. ఉదా॥ వడ్ల నుంచి బియ్యం తీయటం, చెరకు నుంచి బెల్లం, చక్కెర తయారు చేయటం వంటి ప్రాసెసింగు కార్యకలాపాలను చేపట్టటం వ్యవసాయ మార్కెట్టు ప్రకార్యాలలో ముఖ్యమైన వాటిలో ఒకటి.

**(సి) నిల్వ చేయటం** - చాలా వ్యవసాయోత్పత్తులు సంవత్సర కాలంలో ఒకసారి మాత్రమే ఉత్పత్తి చేయటానికి ప్రకృతి అనుకూలిస్తుంది. కాని వాటి వినియోగం మాత్రం సంవత్సర కాలమంతా ఉంటుంది. ఈ కారణంగా, సరుకును నిరంతరంగా సరఫరా చేయుటకు, సరుకును భద్రంగా, నాణ్యత క్షీణించకుండా నిల్వ చేసేందుకు గిడ్డంగి సౌకర్యాలను సమకూర్చుకోవటం మార్కెటింగు ప్రకార్యాలలో మరొకటి. ఈ గిడ్డంగులు, దీర్ఘ కాలం నిల్వ, మన్నిక ఉండే వస్తువులకు ఒక రకమైతే త్వరగా చెడిపోయే పండ్లు, కూరగాయలు మున్నగు వాటిని నిల్వ చేయటానికి వేరొక రకమైన శీతల గోడౌన్లు అవసరమవుతాయి.

**(డి) సరుకు రవాణా చేయుట** - ఉత్పత్తి కేంద్రాల నుంచి వినియోగ లేక పంపిణీ కేంద్రాలకు ఈ వస్తువులను సరఫరా చేయటం మార్కెటింగు ప్రకార్యాలలో మరొక అంశం. ఈ ప్రక్రియలో రవాణా చేసే వస్తువులను బట్టి, దూరాన్ని బట్టి

ప్యాకింగు మున్నగు వాటిలో తగు జాగ్రత్తలు తీసుకొని సరుకును వివిధ ప్రాంతాలకు రవాణా చేయటం మార్కెటింగు ప్రకార్యాలలో మరొక భాగం.

**(ఇ) వ్యాపార ఒడంబడికలు తీర్మానం చేయటం** - ఉత్పత్తిదారులకు నిర్ణయించుకొన్న ధరను, ఒప్పందం చేసుకొన్న కాలపరిమితిలో అమ్మకందారు/వ్యాపారస్తుడు డబ్బు చెల్లించడం, దానికి అవసరమైన మేరకు కొనుగోలుదార్ల నుంచి డబ్బు వసూలు చేసుకొని వ్యాపార ఒడంబడికలు సవ్యంగా పూర్తి చేయటం, వ్యవసాయ మార్కెటింగ్ ప్రకార్యాలలో మరొకటి.

## 11.6 సారాంశము :-

గ్రామీణుల ఉత్పాదకాలను బయటకు చేర్చటానికి, వారికి అవసరమైన వినియోగ లేక ఉత్పాదకాలను గ్రామాలకు అందించటానికి గ్రామీణ మార్కెట్లు ఉద్భవించాయి. ఈ మార్కెట్లలో ద్రవ్య విధానం అమలులోకి వచ్చిన తరువాత ప్రధానంగా ఉత్పత్తి సరళిలో వాణిజ్య భావన పెంపొందిన తర్వాత విస్తరించినవి. రవాణా సదుపాయాలు, ప్రచార సాధనాల ద్వారా సమాచార వ్యాప్తి గ్రామీణ మార్కెట్లు అభివృద్ధి చెందుటకు బాగా తోడ్పడినవి.

గ్రామీణ మార్కెట్లను వర్గీకరించుటలో వినియోగ వస్తువుల మార్కెటు, వ్యవసాయోత్పత్తుల మార్కెట్లను వేరు వేరుగా పరిగణనలోనికి తీసుకోవలెను. వినియోగ వస్తువుల మార్కెట్లు స్థూలంగా మూడు రకాలు.

1. తాలూకా స్థాయి మార్కెట్లు, 2. ప్రధాన రహదారిలో నున్న పెద్ద గ్రామాలలో నున్న మార్కెట్లు మరియు 3. చిన్న గ్రామాలలో ఉన్న మార్కెట్లు. వ్యవసాయోత్పత్తుల పరంగా గ్రామీణ మార్కెట్లను అయిదు విధాలుగా విభజించవచ్చును. అవి 1. స్థానిక మార్కెట్లు, 2. జిల్లా మార్కెట్లు, 3. రాష్ట్ర మార్కెట్లు, 4. జాతీయ మార్కెట్లు, 5. ప్రపంచ మార్కెట్లు. సాధారణంగా ఈ మార్కెట్లు ఉత్పత్తి కేంద్రాలలో కేంద్రీకృతమై ఉంటవి. వాటి మార్కెటు పరిమాణమును బట్టి వాటి స్థాయి నిర్ణయించటం జరుగుతుంది.

మార్కెటింగు ప్రకార్యాలలో వినియోగదారుల మార్కెటింగులో ప్రధానమైనవిగా డిమాండ్ అంచనా, ఉత్పత్తి నిర్వచన మరియు రూపకల్పన, ధర నిర్ణయం, పంపిణీ, ప్రోత్సాహకాలు మరియు ప్రచారం ముఖ్యమైనవిగా చెప్పబడతాయి. అయితే వ్యవసాయ మార్కెటింగ్‌లో వస్తు సేకరణ, వర్గీకరణ మరియు ప్రాసెసింగ్, నిల్వ చేయుట, రవాణ చేయుట మరియు వ్యాపార ఒడంబడికలను సవ్యంగా అమలుపరచటం ప్రధానమైన ప్రకార్యాలుగా భావించవచ్చును.

## 11.7 ముఖ్య పదాలు :-

| | | |
|---|---|---|
| మార్కెట్ భావన | - | మార్కెటు అనగా ఏమిటో విశదీకరించుట |
| మార్కెటింగు | - | ఉత్పత్తిదారుడి నుండి వినియోగదారుడికి ఉత్పత్తులను అందజేసే కార్యక్రమాలు |
| మార్కెటెడ్ ఉత్పత్తి | - | అమ్మబడిన ఉత్పత్తి |
| మార్కెట్ పరిణామము | - | మార్కెట్ అభివృద్ధిలోని వివిధ దశలు |
| మార్కెట్ ప్రకార్యాలు | - | ఉత్పత్తిదారుడి నుంచి ఉత్పత్తి సేకరించుట మొదలు అంతిమ వినియోగదారుడికి అందించే వరకు నిర్వహించే సేవలను మార్కెట్ ప్రకార్యాలు అంటారు. |
| ప్రోత్సాహకాలు | - | ఏదైనా అభివృద్ధి చేయుటకు అందజేసే సహాయ, సహకారాలు లేక చర్యలు. |

## 11.8 స్వయం సమీక్షా ప్రశ్నలు :-

1. గ్రామీణ మార్కెటు అనగానేమి? వాటిని ఎన్ని రకములుగా విభజించవచ్చును.

2. గ్రామీణ మార్కెట్ల పరిణామములను తెలిపి, మార్కెటింగ్‌లోని ముఖ్య ప్రకార్యాల గురించి వివరముగా తెలుపుము.

## 11.9 చదువదగిన గ్రంథాలు :-


1. Indian Society of Agricultural Marketing - Vistas in Agricultural Marketing (1987-1996), Vol. I
2. Manendra Mohan (1987) - Marketing in Rural India, 'Readings in Integrated Rural Development' Oxford, IBH
3. Sharma D.P. & Desai V.V. - Chap IX 'Rural Marketing' in Rural Economy of India


ఆచార్య. ఆర్.యమ్. మోహనరావు

పాఠం - 12

# గ్రామీణ విపణి - వ్యవస్థాగత లోపాలు, చట్టాలు, నియంత్రణ విపణులు - సహకార విపణులు

## 12.0 లక్ష్యం :-

ఈ పాఠ్యభాగం చదివిన తరువాత ఈ క్రింది విషయాలు మీకు తెలియాలి. అవి

- గ్రామీణ ప్రధానంగా వ్యవసాయ మార్కెటింగులోనున్న లోపాలను వివరించగలగాలి
- నియంత్రణ మార్కెట్లు అంటే ఏమిటో, వాటి ఆశయాలు, వ్యవసాయ మార్కెటింగులో వాటి పాత్ర గురించి తెలియాలి
- వ్యవసాయ మార్కెటింగులో సహకార మార్కెటింగు సంఘాల పాత్రను విశదీకరించగలగాలి.
- గ్రామీణ విపణులు, ప్రధానంగా వ్యవసాయ మార్కెటింగు వ్యవస్థ పటిష్టతకు తీసుకోవలసిన చర్యలను సూచించ గలగాలి.

## విషయసూచిక :-


**12.1 ఉపోద్ఘాతము**

**12.2 భారత వ్యవసాయ మార్కెట్లలోని లోపాలు**

**12.3 మార్కెటింగు చట్టాలు**

**12.4 నియంత్రణ మార్కెట్లు**

**12.5 సహకార మార్కెటింగ్**

**12.6 గ్రామీణ మార్కెట్ల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు**

**12.7 సారాంశము**

**12.8 ముఖ్య పదాలు**

**12.9 స్వయం సమీక్షా ప్రశ్నలు**

**12.10 చదవదగిన గ్రంథాలు**

## 12.1 ఉపోద్ఘాతము :-

గ్రామీణ మార్కెట్ల అభివృద్ధికి ప్రభుత్వం వారు స్వాతంత్ర్యానంతరం అనేక చర్యలు చేపట్టారు. అయినప్పటికి నేటికీ గ్రామీణ మార్కెట్‌లకు సరియైన సదుపాయాలు లేవు. ఈ సందర్భంగా ఉత్పత్తుల నిల్వకు సరిపడ గిడ్డంగులు లేకపోవడం గిట్టుబాటు ధర కోసం ఆగగల్గిన ఆర్థిక స్థోమత లేక వడ్డీ వ్యాపారులకు వర్తకుల ఋణాలు తీర్చుటకై తప్పనిసరిగా పంట విక్రయాలు జరపటం, తగిన రవాణా సదుపాయాలు లేకపోవటం, ఎక్కువ మంది దళారీల బెడద, తాజా మార్కెట్ సమాచారం అందకపోవటం మున్నగునవి ప్రధాన లోపాలుగా గుర్తించవచ్చును.

వ్యవసాయ మార్కెట్ లోపాలను సవరించే దిశగా ప్రభుత్వము వారు మార్కెట్ నియంత్రణకు సంస్కరణలు చేపట్టి చట్టాలు చేసి అమలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా అధిక సంఖ్యలో వ్యవసాయ మార్కెట్లను నియంత్రణ మార్కెట్లుగా (regulated market) ప్రకటించి ఈ మార్కెట్లలో చట్టపరమైన నిబంధనలు అమలు చేయుటకు, సేవలు మెరుగుపరచటానికి అమ్మకందారుల, కొనుగోలుదారులతో మార్కెటింగ్ కమిటీలు ఏర్పరచటం జరిగింది.

మార్కెట్ల నియంత్రణతో పాటు దళారీల బెడద నుంచి ఉత్పత్తిదారులకు విముక్తి కలిగించి, వారికి వినియోగదారుడు చెల్లించే ధరలో సింహభాగం అందజేయుటకు సహకార మార్కెటింగు వ్యవస్థను దళారీలకు ప్రత్యామ్నాయంగా ఏర్పరచడం ప్రభుత్వం చేపట్టిన మరొక ప్రధాన చర్య.

ప్రభుత్వం వారు చేపట్టిన పై చర్యలు వ్యవసాయ మార్కెటింగును సరైన దారిలో పెట్టుటలో కొంతవరకు సఫలీకృతమైనా మరెన్నో అపరిష్కృత లోపాలు వ్యవసాయ మార్కెటింగు రంగాన్ని పట్టి పీడిస్తున్నాయి. ఈ విషయాలన్నింటిని ఈ పాఠ్యాంశంలో చర్చించటం జరిగినది.

## 12.2 భారత వ్యవసాయ మార్కెట్లలోని లోపాలు :-

మార్కెటు నుంచి ఉత్పత్తిదారుడు లాభించటానికి కొన్ని కనీస సదుపాయాలుండాలి. వీటిలో సరుకు నిల్వ చేసుకొనే సదుపాయం, గిట్టుబాటు ధర వచ్చే వరకు పంట విక్రయించకుండా ఉండగలిగిన ఆర్థిక స్థోమత, తక్కువ ఖర్చుతో సరుకును ప్రధాన మార్కెట్లకు తరలించటానికి తగిన రవాణా సదుపాయాలు, వివిధ మార్కెట్లలో ఆయా వస్తువుల విక్రయధరలు, మార్కెటుకు వచ్చే సరుకు పరిమాణం మున్నగు విషయాలకు సంబంధించిన తాజా సమాచారం రైతుకు ఎక్కువ ఆదాయం అందుటకు వీలుగా అవసరమైన మేరకు సేవలందించే దళారులు ఉండటం కనీస సదుపాయాలుగా పేర్కొనవచ్చును.

పైన ఉదహరించిన కనీస సదుపాయాల దృష్ట్యా ప్రస్తుతం ఉన్న పరిస్థితులను పోల్చి చూస్తే వ్యవసాయ మార్కెట్ల సదుపాయాలలో చాలా లోపాలున్నవని తెలుస్తుంది. వాటిని గురించి ఈ క్రింద వివరంగా ప్రస్తావించటం జరిగింది.

1. **అసంఖ్యాకమైన దళారీలు :-** వ్యవసాయదారుల నిరక్షరాస్యత, పేదరికం వల్ల వారు సంఘటితంగా లేనందువల్ల మార్కెటింగు ప్రకార్యాలలో ఎక్కువ భాగం దళారీలు నిర్వహించి మార్కెటును నడిపిస్తున్నారు. అధిక సంఖ్యలో దళారీలు ఉన్నందున, ప్రతి వారు వారి సేవలకు ప్రతిఫలం తీసుకోవటంతో ఉత్పత్తిదారులకు తగినంత ఫలం రాకపోవడమే కాక వినియోగదారులు కూడా అధిక ధరలు చెల్లించిరావటం పరిపాటి అయినది. అవసరం మేరకు మార్కెటింగు ప్రకార్యాలు నిర్వహించుటకు దళారీల అవసరం ఉన్నది. అయితే ఎక్కువ సంఖ్యలో వారు ఉండటం వల్ల అటు రైతు, ఇటు వినియోగదారుడు నష్టపోవటం జరుగుతుంది. ఈ దళారీలు ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క పేరుతో పిలవబడుతుంటారు. స్థూలంగా ఈ దళారీలను నాలుగు రకాలుగా విభజించవచ్చును.

**ఎ. గ్రామీణ వర్తకులు :-** వ్యవసాయోత్పత్తుల అమ్మకం గ్రామాలలో ప్రాథమిక మార్కెట్లలో ప్రారంభం అవుతుంది. సన్నకారు, చిన్న రైతులు ఎక్కువ మంది తమ పంటలను గ్రామీణ వర్తకులకు అమ్ముతారు. సాధారణంగా గ్రామీణ వర్తకులు వడ్డీ వ్యాపారం కూడా చేస్తారు. వీరు రైతులకు నగదు రూపంలోను, వస్తు రూపేణా ఋణాలు అందించి, పంట కోత కోసి ఇంటికి చేరిన వెంటనే తమ బాకీల కింద పంటను కొనుగోలు చేస్తారు. ఈ విధమైన లావాదేవీలలో వ్యవసాయదారుడు తన పంటను మార్కెట్ ధరకన్నా తక్కువకే విక్రయించవలసి వస్తుంది.

**బి. సంచార వర్తకులు :-** ఈ చిన్న వ్యాపారులు గ్రామాలలో పంటలను కొనుగోలు చేసి, ఒక చోట చేర్చుటకు అన్ని గ్రామాలలోను తిరిగి వ్యాపారం చేస్తారు. వీళ్ళు నగదు చెల్లించి సరుకు కొనుగోలు చేసినప్పటికి, మార్కెటు కన్నా తక్కువ ధరలనే రైతుకు చెల్లిస్తారు.

**సి. కమీషన్ ఏజెంట్లు :-** వీరు, ప్రాథమిక మార్కెట్ల నుంచి అమ్మకానికి సరుకు వచ్చే ద్వితీయ శ్రేణి మార్కెట్లలో (secondary markets) అమ్మకందారులకు కొనుగోలుదారులకు సంబంధాలు ఏర్పరుస్తారు. వీరు సాధారణంగా సరుకు కొనుగోలు చేయరు. అమ్మకందార్లకు కొనుగోలుదార్లకు మధ్య సంధానకర్తలుగా ఉండి, ఇరువర్గాల నుంచి కమీషను తీసుకొంటారు.

**డి. టోకు వర్తకులు :-** వీరు ఎక్కువ పరిమాణంలో సరుకు కొనుగోలు చేసి అమ్మకాలు నిర్వహిస్తారు. సరుకును కమీషన్ ఏజెంట్ల ద్వారా కొనుగోలు చేస్తారు. వీరిని వ్యవసాయ మార్కెటింగు గొలుసులో చివరివారు గాను, పట్టణ ప్రాంతాలకి సరుకు పంపిణీలో ప్రథమవారు గాను భావించవచ్చును. వీరు వ్యవసాయోత్పత్తుల పంపిణీలో ప్రాథమిక పంపిణీదారులు. ఈ స్థితిలో వారు వ్యవసాయ మార్కెటింగు నిర్మాణములో శిఖరాగ్రాన ఉంటారు.

పైనుదహరించిన దళారీలు కాక, మిల్లులు, ప్రాసెసింగ్ యూనిట్‌లు మున్నగునవి వ్యవసాయోత్పత్తుల పంపిణీ మరియు మార్కెటింగ్ మధ్యవర్తుల పెరుగుదలకు దోహదపడతాయి.

2. **అధిక మార్కెటింగు ఖర్చులు :-** ఉత్పత్తిదారుడి నుండి వస్తువు వినియోగదారుడికి చేరే వరకు అయ్యే ఖర్చులను మార్కెటింగు ఖర్చులు అంటారు. ఇందులో నిల్వ చేయుట, రవాణా, ప్యాకింగు, దళారీల కమీషన్లు మున్నగు ఖర్చులు ఇమిడి ఉంటాయి. స్థూలంగా చెప్పాలంటే వినియోగదారుడు చెల్లించే ధరకు, ఉత్పత్తిదారునికి దక్కే ధర మధ్య తేడాను మార్కెటింగు ఖర్చులుగా చెప్పవచ్చును. ఈ ఖర్చులు పంటను బట్టి ప్రాంతాన్ని బట్టి మారుతుంటాయి. సాధారణంగా ఈ ఖర్చులు వినియోగదారుడు చెల్లించే రూపాయిలో 28 నుంచి 40 పైసలు వరకు ఉంటాయని అంచనాలు సూచిస్తున్నాయి.

ఆ అధిక మార్కెటింగు ఖర్చులకు అనేక కారణాలు ఉన్నాయి. వస్తువుల నిల్వకు సరిపడినంత గిడ్డంగి సౌకర్యాలు లేకపోవటం, సరియైన రోడ్లు లేకపోవటం, రవాణా సౌకర్యాలలో లోపాలు, అసంఖ్యాక బ్రోకర్లు, దళారీలు, కమీషను ఏజెంట్లు ఈ అధిక మార్కెటింగు ఖర్చులకు కారణాలుగా చెప్పవచ్చును.

3. **పలు మార్కెటింగు రుసుములు :-** ప్రమాణీకర విధానాలు, చట్టపరమైన నిబంధనలు లేనందున ఉత్పత్తిదారులు రకరకాల రుసుముల క్రింద దళారీలకు / వ్యాపారులకు ఎక్కువ ఛార్జీలు చెల్లించవలసి వస్తున్నది. ధర్మం, ఊడ్చేవాళ్ళకు, నీళ్ళుపోసేవాళ్ళకు, హమాలీ మున్నగు వారికి చెల్లింపులు, వ్యాపారస్తులు తేమ వస్తువులను కొనేటప్పుడు వీరు దుమ్ము, పొట్టు, మట్టి, రాయి రప్ప మున్నగు వాటి క్రింద ధరను తగ్గింపు చేయటం పరిపాటి.

4. **పలురకాల తూనికలు, కొలతలు :-** వస్తువుకు వస్తువుకు, ప్రాంతానికి ప్రాంతానికి తూనికలలో కొలతలలో తేడాలు ఉండటమే కాక కొనటానికి, అమ్మటానికి వేరు వేరు తూనికలు, కొలతలు ఉంటాయి. ఈ తేడాలతో ఉత్పత్తిదారులు,

కొనుగోలుదారులు తూనికలు కొలతల విషయంలో నష్టపడేవారు. అయితే ప్రస్తుతం చట్టపరమైన చర్యల ద్వారా ఈ సమస్యలను నివారించటం జరిగినది.

5. **తగినంత సదుపాయాలు లేకపోవటం :-** మార్కెటింగు వ్యవస్థ పటిష్టంగా ఉండటానికి కొన్ని కనీస సౌకర్యాలు ఉండాలి. వర్గీకరణ, సరకు నిల్వ చేయటం, ఆర్థిక సేవలు, రవాణా సమాచార వ్యవస్థ మున్నగు సదుపాయాలు మార్కెటింగుకు కావలసిన కనీస అవసరాలుగా చెప్పవచ్చును.

వర్గీకరణ అనగా సరుకును ప్రభుత్వము వారు నిర్ణయించిన ప్రమాణకాలకు అనుగుణంగా విభజించి, అమ్మకమునకు సిద్ధము చేయుట. ఈ పని చేపట్టుటకు గ్రామాలలో వసతులు గాని, విస్తరణ కార్యక్రమాలు గాని లేవు. వర్గీకరణ లేమి వల్ల మంచి సరుకుకు కూడా తక్కువ నాణ్యత గల సరుకు వలే రైతుకు షావుకార్లు చెల్లిస్తారు. అంతేకాక విక్రయాలలో అనేక రకాలను కలిపి లాభం పొందుటకు వ్యాపారస్థులు ప్రయత్నిస్తారు. ఈ కారణాల వల్ల కూడా ఉత్పత్తిదారులు, వినియోగదారులు, నష్టపడటం మధ్య దళారీలు బాగుపడటం జరుగుతుంది.

రైతులలో చాలా మంది సన్నకారు, చిన్న రైతులు. వారికి సరిపడినంత నివాస వసతులు ఉండవు. ఈ పరిస్థితులలో వ్యవసాయోత్పత్తులను నిల్వ చేయుటకు ప్రత్యేక వసతులు వారికి ఉండవు. ఈ కారణాల వల్ల కూడా పంట చేతికి రాగానే ధరలు తక్కువగా ఉన్నా నిల్వ చేయలేని స్థితిలో అమ్మటం మినహా వేరొక మార్గం లేదు. ఈ విధంగా రైతు తక్కువ ధరకు సరుకు అమ్ముకొని నష్టపడుతున్నాడు.

ఆర్థిక సహాయం ఉంటే, రైతు తన పంటను గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేయటానికి ప్రయత్నిస్తాడు. ఈ సదుపాయం లేనందు వలన, ఆర్థిక వత్తిడుల వల్ల ధర తక్కువ ఉన్నా కూడా పంటను విక్రయించి, ఆర్థికంగా చితికి ఋణగ్రస్తులవుతారు.

అన్ని కాలాలలో సరుకు రవాణా చేయడానికి తగిన రోడ్డు సదుపాయం ఉంటే, రైతులు తమ పంటను మార్కెటింగు కేంద్రాలకు చేర్చి గిట్టుబాటు ధరలకు అమ్ముకొనటానికి వీలవుతుంది. అయితే మన దేశంలో దాదాపు 52 శాతం గ్రామాలకు 2000 నాటికి కూడా రోడ్డు సదుపాయం లేదు. అందువల్ల మారుమూల గ్రామాలలో ఉన్న రైతాంగం ధర తక్కువైనా తమ పంటను గ్రామాలలో అమ్ముచున్నారు.

## 12.3 మార్కెటింగు చట్టాలు :-

మార్కెటింగు నియంత్రణకు మార్కెటింగులోని లోపాలు సవరించుటకు, బ్రిటీషు కాలంలోనే ప్రభుత్వము మార్కెటింగు చట్టాలు ప్రవేశపెట్టింది. ఈ మార్కెటింగు చట్టాలు 1897 లో చేయబడిన బీరార్ ప్రత్తి మరియు ధాన్యపు మార్కెట్ల చట్టంతో ప్రారంభమయినవి. ఈ చట్టం బ్రిటీషు రెసిడెంట్లకు ఏ ప్రాంతానైనా ప్రత్తి అమ్మకం కొనుగోలు మార్కెటుగా ప్రకటించే అధికారంతో బాటు, మార్కెట్ల పర్యవేక్షణకు మార్కెట్ కమిటీలను ఏర్పాటు చేయుటకు అధికారం ఇచ్చినది. 1927 లో చేయబడిన బొంబాయి ప్రత్తి మార్కెటు చట్టం వ్యవసాయ మార్కెట్లలో న్యాయపరమైన విధానాలు ప్రవేశపెట్టుటకు ఉద్దేశించబడినది.

1935 లో డైరెక్టరేట్ ఆఫ్ మార్కెటింగ్ స్థాపించారు. ఈ సంస్థ 1938 లో వ్యవసాయ మార్కెట్ల నియంత్రణ నమూనా బిల్లును రాష్ట్రాలకు అందజేసింది. దీని ప్రకారం ఎక్కువ రాష్ట్రాలు వ్యవసాయ మార్కెట్ల నియంత్రణకు చట్టాలు చేసినవి. అయినప్పటికి స్వాతంత్రం రాక పూర్వం ఈ చట్టాల అమలు సరిగా లేదు.

స్వాతంత్ర్యానంతరం కూడా దాదాపు 1965 వరకు వ్యవసాయ మార్కెట్ల నియంత్రణ నత్త నడక నడిచిందని చెప్పవచ్చును. ఉదా॥ 1965 నాటికి దేశం మొత్తం మీద 1012 వ్యవసాయ మార్కెట్ల నియంత్రణ జరిగినది. ఇది దేశం మొత్తం మీదనున్న టోకు వ్యవసాయ మార్కెట్లలో 15 శాతం మాత్రమే.

1965 తర్వాత, జమ్ము - కాశ్మీర్, మిజోరామ్ మినహాయించి అన్ని రాష్ట్రాలలో వ్యవసాయ మార్కెట్ల నియంత్రణ చట్టాలు చేసి అమలు చేస్తున్నారు. ఈ చట్టాల క్రింద మార్కెటు నియంత్రణ ఎక్కువగా ప్రాథమిక, సెంకడరీ స్థాయి మార్కెటు కేంద్రాలలో, యార్డుల నిర్మాణం తదితర సేవల పైనే ఎక్కువ దృష్టి పెట్టాయి. నిజానికి మార్కెటు శక్తుల నియంత్రణ ఈ చట్టాల ద్వారా జరగలేదు. ఈ నియంత్రణ చట్టాలతోబాటు, ఇతర చట్టాలను ముఖ్యంగా నియంత్రణ దిశగా రూపొందించటం జరిగినది. ఆహార వస్తువుల కల్తీ నిరోధక చట్టం 1954 (Prevention of Food Adulteration Act) నిత్యావసర వస్తువుల చట్టం 1955 (Essential commodities Act) మాంసము ఆహార పదార్థాల ఆర్డరు 1973, స్టాండర్స్ ఆఫ్ వెయిట్స్ అండ్ మెజర్స్ యాక్ట్ 1976, పప్పుధాన్యాలు, వంటనూనె విత్తనాలు, వంట నూనెల (స్టోరేజి కంట్రోల్) ఆర్డర్ 1977, వినియోగదారుల రక్షణ చట్టం 1986 మున్నగునవి మార్కెటు నియంత్రణకు తీసుకొన్న వివిధ చర్యలు మరియు చట్టాలు.

## 12.4 నియంత్రణ మార్కెట్లు (Regulated Markets) :-

కొనుగోలుదార్లు, అమ్మకందార్లు బ్రోకర్ల తప్పుడు విధానాల నుంచి (malpractices) రైతులను రక్షించటానికి ప్రభుత్వం నియంత్రణ మార్కెట్లను ఏర్పాటు చేసింది. ఈ మార్కెట్ల నిర్వహణకు ప్రభుత్వం స్థానిక సంస్థల ప్రతినిధులు, వ్యాపారులు, బ్రోకర్లు, రైతు ప్రతినిధులతో కూడిన మార్కెట్టు కమిటీ ఏర్పాటు చేస్తుంది. ఈ కమిటీ ఈ క్రింది చర్యలు చేపడతాయి. అవి

1. తూనికలు, కొలమానాలకు, కమీషను ఛార్జీలను నిర్ణయించటం
2. వర్తకుల నిషిద్ధ కార్యకలాపాలను, చట్ట రహిత తగ్గింపులను నివారించటం
3. ప్రామాణిక తూకాలు వాడుటను అమలుపరచుట
4. రైతులకు తాజా మార్కెటు సమాచారం అందజేయుట
5. మార్కెట్టు లావాదేవీలలో వివిధ భాగస్వాముల మధ్య ఏర్పడే వివాదాలను పరిష్కరించటం మొ॥

పై ప్రకార్యాలతో పాటు వ్యాపారులకు, బ్రోకర్లలకు లైసెన్సులను రద్దు చేసే అధికారం కూడా ఈ కమిటీలకు ఉన్నది. ఈ నియంత్రణ మార్కెట్లు రైతులకు న్యాయమైన ధరలు చేకూర్చుటకు దోహదపడతాయని అనుకొన్నారు.

ప్రప్రథమ నియంత్రణ మార్కటును 1897 లో బీరారులో (ప్రస్తుత కర్ణాటక రాష్ట్రం) ఏర్పాటు చేశారు. 1950 - 51 లో ఈ నియంత్రణ మార్కట్ల సంఖ్య 265 ఉండగా, 2002 నాటికి వీటి సంఖ్య 7177కు పెరిగినది. అయితే ఈ మార్కెట్ల వృద్ధి అంత త్వరితంగా జరుగుట లేదు. కేరళ, నాగాలాండ్, మిజోరామ్, సిక్కిమ్, అండమాన్ మరియు నికోబార్ ద్వీపాలు మున్నగు రాష్ట్రాలలో నియంత్రణ మార్కెట్ల రూపకల్పనకు ఇంకా చట్టాలు చేయలేదు. ఈ మార్కెట్ల నిర్వహణ ఆశించినంత సంతృప్తికరంగా లేదు. అమ్మకం మిగులు (marketed surplus) ఉన్న పెద్ద రైతులు మాత్రమే వీటి వల్ల లాభపడ్డారు. వీటి నిర్వహణ లోపాల కారణంగా, చేయవలసిన ఎన్నో ముఖ్యమైన ప్రకార్యాలలో పురోభివృద్ధి ఆశించినంతగా లేదు. ఉదా॥ వస్తువుల వర్గీకరణకు తగిన సదుపాయాలు కాని, విస్తరణను గాని ఈ మార్కెట్లు చేయలేకపోయాయి. సరుకులు నిల్వ చేయటానికి కూడా తగినంత నిల్వ వసతులు ఈ నియంత్రణ మార్కెట్‌లు యార్డులలో లేవు. ఈ మార్కెట్లు వసూలు చేస్తున్న రుసుమును ఉత్పాదక కేంద్రాలకు మార్కెటు కేంద్రాలకు మధ్య రహదారి మార్గాలు మెరుగుపరచటానికి వినియోగించవలసి ఉన్నా ఈ విధంగా జరుగుట లేదు. రైతులకు కమిటీలలో ప్రాతినిధ్యం ఉన్నా వర్తకులు, షావుకార్లదే మార్కెట్ నిర్వహణలో పై చేయిగా ఉంది.

## 12.5 సహకార మార్కెటింగ్ :-

వ్యవసాయ మార్కెటింగులో ఉన్న లోపాలను నివారించి, రైతులకు న్యాయమైన ధరలు అందించటానికి ప్రభుత్వం చేపిట్టన చర్యలలో సహకార మార్కెటింగు వ్యవస్థను నెలకొల్పడం ఒక భాగం. సహకార మార్కెటింగు సక్రమంగా జరిగితే రైతులకు ఈ క్రింది ప్రయోజనాలు చేకూరతాయి. అవి

1. **బేరం చేసే శక్తి :-** ఈ సంఘాలు రైతుల బేరం చేసే శక్తిని పెంచుతాయి. మార్కెటింగు సమస్యలలో అధిక భాగం రైతుల నిరక్షరాస్యత వల్ల దళారీల తెలివితేటల వల్లనే సంభవిస్తాయి. రైతులు సహకార సంఘాల ద్వారా సంఘటిత పడినచో దళారీల మోసాలను ఎదుర్కొనే శక్తి పెరుగుతుంది.

2. **దళారీల రద్దు :-** నేరుగా ఆఖరు కొనుగోలుదార్లతో బేరం చేయవచ్చును. కొన్ని సందర్భాలలో సహకార మార్కెటింగు సంఘాలు మధ్యవర్తులను పూర్తిగా లేకుండా చేసి చివరి కొనుగోలుదారులకే సరుకు అమ్మటం ద్వారా అనవసర ఖర్చులు తగ్గించి రైతుకు లాభం చేకూరే ధరకు సరుకుల విక్రయానికి వీలుపడుతుంది.

3. **పరపతి సహాయం :-** పంటను కోతలయిన వెంటనే తక్కువ ధరకు అమ్మకుండా నిల్వ చేసే శక్తిని పరపతి సహాయం ద్వారా మార్కెటింగు సంఘాలు పెంచుతాయి. దీనివల్ల రైతులు మంచి ధరకు వారి పంటల విక్రయానికి అవకాశాలు పెరుగుతాయి.

4. **తక్కువ ఖర్చుతో రవాణా సదుపాయం :-** ఈ సంఘాలు ఎక్కువ పరిమాణంలో సరుకు రవాణా చేపట్టడం ద్వారా మరియు తమ స్వంత వాహనాల ద్వారా సరుకు చేరవేయటం వల్ల రైతులు సులువుగాను, తక్కువ ఖర్చుతో తమ పంటను మార్కెటింగు కేంద్రాలకు తరలించవచ్చును.

5. **నిల్వ సదుపాయాలు :-** మార్కెటింగు సంఘాలు సాధారణంగా వాటి స్వంత గిడ్డంగులు నిర్మించుకోవటం గాని, లేని యెడల వాటిని అద్దెకు తీసుకొనటం గాని జరుగుతుంది. ఈ గోడౌనులలో రైతులు పంట నిల్వ చేసుకొని, తమ పంటలను భద్రపరచుకోవచ్చు.

6. **వర్గీకరణ మరియు ప్రమాణీకరణ (**grading and standardisation**) :-** రైతులు తమంత తాము చేయటం కష్టమైన వర్గీకరణ, ప్రమాణీకరణ కార్యకలాపాలను ఈ సంఘాలే చేస్తాయి. ఈ పని నిర్వహణకు అవి ప్రభుత్వ సహాయం కూడా తీసుకోవచ్చును.

7. **మార్కెటింగ్ సమాచారము :-** సహకార సంఘాలు, వివిధ మార్కెట్‌లలోని ధరలు, ఆయా వస్తువుల డిమాండు మరియు సప్లయి వివరాలు తరచు సేకరించుకొని, తమ సరుకును అనువైన కాలాలలో, లాభసాటి మార్కెట్లలో అమ్ముటకు ప్రణాళికలను సిద్ధం చేసుకోవచ్చును.

8. **మార్కెట్ ధరలను ప్రభావితం చేయుటం :-** ఈ సంఘాలు ఏర్పడక ముందు ధరలను దళారీలు, బ్రోకర్లు నిర్ణయించితే రైతులు నిస్సహాయంగా వాటిని ఆమోదించవలసి వచ్చేది. ఈ సంఘాలు వచ్చిన తరువాత బేరమాడే శక్తి పెరగటంతో రైతులకు మంచి ధరలు వచ్చే అవకాశాలు పెరిగాయి.

9. **ఉత్పాదక మరియు వినియోగ వస్తువుల సరఫరా :-** రైతులు పంటలు పండించడానికవసరమైన విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పనిముట్లు మరియు వారి గృహావసరాల వస్తువులను సరసమైన ధరలకు ఈ సంఘాలు సరఫరా చేసి వీటి పై రైతులు పెట్టే వ్యయాన్ని తగ్గించుటకు వీలవుతుంది.

10. **వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ :-** కొన్ని సహకార సంఘాలు, స్వంతగా మిల్లులు ఏర్పాటు చేసుకొని, ధ్యాన్యము, ప్రత్తి, నూనె గింజలు మున్నగు వాటిని ప్రాసెసింగు చేసి రైతులకు అధిక రాబడులు చేకూర్చుతాయి.

పైనుదహరించిన లాభాలతో పాటు, సహకార మార్కెటింగు వ్యవస్థ రైతాంగంలో స్వయం ప్రతిపత్తిని, సంఘటిత శక్తిని పెంపొందించుటకు ఎంతగానో తోడ్పడుతుంది.

**సహకార మార్కెటింగు సంఘాల అభివృద్ధి :-**

మన దేశంలో సహకార మార్కెటింగు వ్యవస్థ రెండు విధములుగా ఉన్నది. మొదటి రకములో రెండంచెల పద్ధతి, ఇంకొక రకములో మూడంచెల పద్ధతి ఉన్నది. మొదటి రకములో అట్టడుగు స్థాయిలో ప్రాథమిక సహకార మార్కెటింగు సంఘాలు, పై స్థాయిలో రాష్ట్ర మార్కెటింగ్ సంఘాలు ఉంటాయి. రెండవ రకంలో గ్రామ స్థాయిలో ప్రాథమిక మార్కెటింగ్ సంఘాలు, జిల్లా స్థాయిలో కేంద్ర మార్కెటింగ్ సంఘాలు, అత్యున్నత స్థానంలో రాష్ట్ర సహకార మార్కెటింగు సంఘాలు ఉన్నవి. ప్రస్తుతము అనగా మార్చి, 2002 నాటికి మన దేశంలో 2,633 సాధారణ ప్రాథమిక మార్కెటింగు సంఘాలు, 3,290 ప్రత్యేక ప్రాథమిక మార్కెటింగు సంఘాలు ఉన్నవి. సాధారణ సంఘాలు అన్ని రకముల ఉత్పత్తులను మార్కెటింగు చేస్తుంది. ప్రత్యేక సంఘాలు కొన్ని వస్తువుల మార్కెటింగు మాత్రమే చేపడతాయి. ఉదాహరణకు, ప్రతి మార్కెటింగు సంఘాలు, పోక చెక్కల మార్కెటింగు సంఘాలు, ఆ పంటలను మాత్రమే మార్కెట్ చేస్తాయి, పైనుదహరించిన ప్రాథమిక సంఘాలతో పాటు 172 జిల్లా/కేంద్ర స్థాయి మార్కెటింగ్ సంఘాలు ఉన్నాయి. రాష్ట్రస్థాయిలో రాష్ట్ర మార్కెటింగు సంఘాల సమాఖ్య సంఘాలు, జాతీయ స్థాయిలో జాతీయ మార్కెటింగ్ సంఘాల సమాఖ్య సంఘం (NAFED) ఉన్నాయి. నాఫెడ్ జాతీయ స్థాయిలో వ్యవసాయోత్పత్తుల సేకరణ, పంపిణీ, ఎగుమతి, దిగుమతి కార్యకలాపాలను కూడా నిర్వహిస్తుంది. నాఫెడ్, గవర్నమెంట్ వారు అపరాలు, నూనె గింజలు మున్నగు వ్యవసాయోత్పత్తులకు ప్రభుత్వమిచ్చే మద్దతు ధరలకు, ఆయా పంటల సేకరణకు బిందువుగా (nodal agency) వ్యవహరిస్తుంది. ఇంతేకాక త్వరగా చెడిపోయే వ్యవసాయోత్పత్తులు ఉదా॥ బంగాళా దుంపలు, ఉల్లి, ద్రాక్ష, నారింజ, ఆపిల్, మిర్చి, నల్ల మిరియాలు మున్నగు వాటి ధరల స్థిరీకరణకు మార్కెట్ జోక్యం చేసుకొంటుంది.

ఈ సంఘాల ద్వారా మార్కెటింగు చేయబడే వ్యవసాయోత్పత్తుల విలువ గణనీయంగా పెరిగినది. ఉదా॥ ఇవి విక్రయం చేసిన వ్యవసాయోత్పత్తుల విలువ 1960 - 61 లో రూ॥ 169 కోట్లు ఉండగా, 1980 - 81 లో రూ॥ 1950 కోట్లు, 1995 - 96 కు రూ॥ 11,560 కోట్లకు వృద్ధి చెందినది. అయితే మొత్తం మార్కెటు అయ్యే వ్యవసాయోత్పత్తులతో పోల్చి చూస్తే మార్కెటింగు సంఘాలు వ్యాపార శాతం 10 శాతం కంటే మించదు. అంతేకాక ఈ సంఘాల వ్యాపారమంతా, చెరకు, ప్రత్తి, ఆహారధాన్యాల మీదనే ఆధారపడి ఉంది. ఈ సంఘాలు మార్కెటు చేసే వ్యవసాయోత్పత్తులలో 75 శాతం పంజాబు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో కేంద్రీకృతమయింది. పైనుదహరించిన మూడు పంటలతో బాటు ఈ సంఘాలు కూరగాయలు, నూనె గింజలు, పండ్లు మున్నగు వాటికి మార్కెటింగు చేస్తున్నవి. జ్యూటు కార్పోరేషన్ ఆఫ్ ఇండియా, కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా వారు తమ పంట సేకరణ (procurement) కార్యక్రమాలకు ఈ సహకార సంఘాలను వినియోగించుకొంటున్నారు.

**సహకార మార్కెటింగు సంఘాల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు :-**

1. ఈ సంఘాలలో సన్నకారు మరియు చిన్న రైతులకు ఎక్కువ ప్రాధాన్యం కల్పించి వారి ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు చేకూరేటట్లు చేయటం ప్రధాన అవసరం.

2. మార్కెటింగు సంఘాలు, కేవలం అమ్మకాల పైనే కాక రైతులకు అవసరమయిన మార్కెటింగు సేవలు అనగా గిడ్డంగి వసతులు సరుకు రవాణా, వర్గీకరణ మరియు ప్రమాణీకరణ చేయటం ద్వారా రైతులను ఆకుట్టకొనుటయే కాక, వాటి వ్యాపారాభివృద్ధికి సహాయపడతాయి.

3. మార్కెటింగు సంఘాలు ఒంటరి బాటన పయనించకుండా, ఇతర సహకార సంఘాలు అనగా, వ్యవసాయ పరపతి సంఘాలు, వినియోగదారుల సహకార సంఘాలు, సహకార సూపర్ మార్కెట్లు మున్నగు వాటితో పొత్తులు కుదుర్చుకొని వ్యాపార కలాపాలు సాగించితే వాటికి, ఇతర సంఘాలకు ముఖ్యంగా రైతాంగానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

## 12.6 గ్రామీణ మార్కెట్ల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు :-

స్వాతంత్ర్యానంతరం ఆనాటి పరిస్థితుల దృష్ట్యా అనగా, పెరుగుతున్న జనాభాకు ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేయాలనే ఆకాంక్షతో ప్రభుత్వము వారి దృష్టి అంతా ఉత్పత్తి పథకాల వైపే కేంద్రీకృతమయినది. వ్యవసాయ మార్కెటింగ్ దాని సమస్యల పై ఉత్పత్తి సమస్యల పై సారించినంతగా దృష్టి సారించలేదు. ప్రస్తుతం అన్నిటికన్నా ప్రపంచ వ్యాపార సంస్థ (W.T.O.)తో చేసుకొన్న ఒడంబడికల దృష్ట్యా వ్యవసాయ ఉత్పత్తులలో స్వేచ్ఛా వ్యాపారం అమలవుతున్న తరుణంలో దిగుమతి, ఎగుమతి రంగాలలో పోటీని తట్టుకొని భారత వ్యవసాయరంగం, దాని మీద ఆధారపడిన అసంఖ్యాక సన్నకారు, చిన్న రైతులు ఆర్థికంగా స్థిరపడటానికి ముఖ్యంగా ఆత్మహత్యల అడ్డుకట్టలు వేయటానికి గ్రామీణ వ్యవసాయ మార్కెటింగ్‌లో అనేకమైన విప్లవాత్మక మార్పులు తీసుకురావటం అవసరం. ఈ దిశగా ఈ క్రింద ఉదహరించినవి ముఖ్యంగా గమనించవలసినవి.

1. **ఉత్పాదక వస్తువుల పై నిరంతర నిఘా :-** వ్యవసాయోత్పాదకాలైన మేలురకం విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగు మందులు మున్నగువాటిలో కల్తీ నివారణ, సరసమగు ధరలకు లభ్యమగునట్లు చూచుట అత్యంత ప్రధానమైన విషయం.

2. **వినియోగ వస్తువుల సరఫరా :-** గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పేద రైతాంగం, వ్యవసాయ కూలీలు, ఇతర శ్రామిక జీవులకు ఆహార ధాన్యాలు, కల్తీ లేని మందులు, అందుబాటు ధరలకు పౌర సరఫరా వర్తక సముదాయాల ద్వారా అందజేయటం.

వ్యవసాయ మార్కెటింగులో ఈ క్రింది చర్యలు చేపట్టవలెను. అవి

ఎ. **మార్కెటింగ్ విస్తరణ :-** భారత దేశంలో వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలు అనాది నుంచి కొనసాగుతున్నాయి. కాని, మార్కెటింగు విస్తరణ ఇంతవరకు లేదు. ఇది పరపతి సహాయం కన్నా ముఖ్యమైన విషయం. ఎందుచేతనంటే పది రూపాయలు వడ్డీలో ఆదా చేసుకొని, వందలు, వేలు మార్కెటులో నష్టపోతే లాభం ఉండదు. అందువలన, మార్కెటుకు డిమాండుకు అనుకూలమైన పంటలు పండించటానికి వర్గీకరణ చేసి, ప్రమాణీకరణలకు అనుగుణంగా ఉత్పత్తులను తయారుచేసి, ధరలను గమనించి సరియైన కాలంలో, సరియైన మార్కెట్లలో పంటలు అమ్ముకొనుటకు మార్కెటింగు విస్తరణ అత్యంత ప్రధానమైనది.

బి. **రవాణా సదుపాయాలు మెరుగుపరచటం :-** సరుకును, మారుమూల గ్రామాల నుంచి, ప్రధాన రహదారుల ప్రక్కన లేక సుదూర ప్రాంత పట్టణాలలో నెలకొన్న మార్కెట్లకు సరుకు తరలించటానికి అన్ని కాలాలలోను, అనువైన రోడ్లు, రవాణా సదుపాయాలు అత్యంత ముఖ్యం. అయితే ప్రస్తుతం మన దేశంలో దాదాపు 52 శాతం గ్రామాలకు రోడ్డు సదుపాయాలు లేవు. ఈ లోటును అత్యవసరంగా సరి చేయనిదే మార్కెటింగు పటిష్టపరచటం జరగదు.

సి. **నిల్వ సౌకర్యాలను మెరుగుపరచటం :-** ప్రస్తుతం మన దేశంలో ఉన్న సంస్థాపర గిడ్డంగులు వ్యవసాయోత్పత్తులని నిల్వ చేయుటకు సరిపడవు. ప్రస్తుతం దాదాపు గత 50 సంవత్సరాలలో నిర్మించిన శాస్త్రీయ గిడ్డంగుల 70 మిలియను మెట్రిక్ టన్నులు దేశీయావసరాలలో 30 శాతానికి మాత్రమే సరిపడతాయని అంచనా. అదే విధముగా దేశంలో ఉన్న

153.85 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం దేశంలో ఉత్పత్తి అయ్యే పండ్లు కూరగాయలలో 10 శాతం నిల్వ చేయటానికి సరిపోతాయి. అంతేకాదు, ఈ ఉన్న సదుపాయాన్నంతా, వ్యాపారస్తులు వాడుకుంటున్నారు గాని, రైతులకు ఉపయోగపడుట లేదు. సహకార పరపతి మార్కెటింగ్ సంఘాలలో ఉన్న గిడ్డంగులలో కూడా రైతులు పంట నిల్వ చేయటం లేదు. దీనికి గల కారణాలు వెదికి నివారణా చర్యలు చేపడితేనే గాని రైతులు గిట్టుబాటు ధరలకు వాళ్ళ ఉత్పత్తులను అమ్ముకోలేరు.

డి. **మార్కెట్ సమాచారం అందించటం :-** వివిధ మార్కెట్లలో వ్యవసాయోత్పత్తుల ధరలను వార్తా పత్రికల ద్వారా రేడియోల ద్వారా సమాచారం రైతులకు ప్రభుత్వం వారు అందజేస్తున్నారు. అయితే వివిధ మార్కెట్లలో సరుకుల నిల్వ మార్కెటుకు వచ్చే సరుకు పరిమాణం మున్నగు వివరాలను మార్కెటింగు శాఖవారు సేకరించి అచ్చు వేస్తున్నారు. కాని ఈ సమాచారం రైతులకు అందటం లేదు. టి.వి.లో ప్రతినిత్యం స్టాకు మార్కెట్‌లో జరిగే లావాదేవీలు, వివిధ షేర్ల ధరలు ప్రకటించే రీతిలో ప్రత్యేకంగా వ్యవసాయ మార్కెటింగు ఒక ఛానల్ పెట్టి దాని ద్వారా వివిధ మార్కెట్లలో ధరలు, సరుకు కొనుగోళ్ళు, అమ్మకాలు వగైరా రోజువారీ ప్రసారం చేస్తే రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. దీనితోపాటు ఛార్జీ లేకుండా ఫోనులో మార్కెట్ వివరాలు తెలియజేసే ఏర్పాట్లు రైతులు తాజా వివరాలు వారికి కావలసినప్పుడు తెలుసుకొని తగిన నిర్ణయాలు తీసుకోవటానికి అవకాశం కల్గిస్తాయి.

ఇ. **ఉత్పత్తుల వర్గీకరణ మరియు ప్రమాణీకరణ :-** గవర్నమెంటు వారు వీటి ప్రాముఖ్యతను గుర్తించి 1937 లోనే వ్యవసాయ ఉత్పత్తుల గ్రేడింగ్ అండ్ మార్కెటింగ్ చట్టాన్ని చేసారు. మొదట్లో ఇవి పొగాకు, జనపనారకు పరిమితమైన తర్వాత కాలంలో 162 వ్యవసాయ ఉత్పత్తులకు వర్గీకరణ మరియు ప్రమాణీకరణం చేయటం జరిగింది. ప్రభుత్వం వారు కేంద్ర నాణ్యతా నియంత్రణ ప్రయోగశాలను మొదటగా నాగపూరులో స్థాపించారు. అయితే దీన్ని ప్రస్తుతం హర్యానాలోనికి మార్చారు. అయితే ఈ వర్గీకరణ, ప్రమాణీకరణలు కొంతవరకు వ్యాపారస్తుల స్థాయిలో జరుగుతున్నవి తప్ప రైతుల స్థాయిలో ఇవి చేపట్టటం ఇంతవరకు జరగలేదనే చెప్పవచ్చును. ఈ చర్యలు రైతాంగం స్థాయిలో చేపడితే వారికెంతో లాభదాయకం. ఈ దశగా చర్యలు తీసుకోవటం, ప్రస్తుత పరిస్థితులలో అనగా ప్రపంచీకరణ పరంగా ఎంతో అవసరం.

ఎఫ్. **సహకార మార్కెటింగ్ వ్యవస్థను పటిష్టపరచటం :-** సహకార మార్కెటింగు సంఘాల ద్వారా మార్కెటు చేయబడిన వ్యవసాయోత్పత్తుల విలువ కాలక్రమేణా వృద్ధి చెందుతున్న మాట వాస్తవం. అయితే ఈ సంఘాల పాత్ర కొన్ని ఉత్పత్తులకు, కొన్ని రాష్ట్రాలకే పరిమితం కావటం మరియు ఎక్కువ సంఘాలు వ్యవసాయోత్పత్తుల మార్కెటింగు కన్నా ఉత్పాదకాల అమ్మకాలతో సరిపెట్టుకొని, నష్టాల దిశలో పయనిస్తున్నాయి. ముఖ్యంగా సన్నకారు మరియు చిన్న రైతులు లాభసాటి ధరలు పొందాలంటే ఈ సంస్థలను పటిష్టపరచటం ఎంతో అవసరము.

జి. **గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయోత్పత్తుల ప్రాసెసింగు సౌకర్యాలు వృద్ధి చేయటం :-** రైతులకు లాభసాటి ధరలు అందాలంటే, వ్యవసాయోత్పత్తుల ప్రాసెసింగు వృద్ధి చెందాలి. ఇవి ఉత్పత్తి కేంద్రాలలో పెడితే రైతులకు, పరిశ్రమ నిర్వాహకులకు కూడా ఎంతో మేలు. ఈ సౌకర్యాలు లేనందున, పంట సీజనులో ధరలు లేక డిమాండు లేక ఎక్కువ పరిమాణంలో నిల్వ చేయుటకు వీలు లేని పండ్లు కూరగాయలు పండించే రైతాంగం దుస్థితి పాలవుతున్నారు. ఉదాహరణకు సీజనులో టమోటాలు కిలో 50 పైసలకు రైతు అమ్ముతున్నాడంటే పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నవో తెలుస్తుంది. ఈ సమస్యల నివారణకు ప్రాసెసింగు సౌకర్యాలు చాలా అవసరం.

## 12.7 సారాంశము :-

గ్రామీణ మార్కెట్లలో ముఖ్యంగా వ్యవసాయోత్పత్తుల మార్కెట్లలో అనేక లోపాలున్నాయి. ఎక్కువ మంది దళారీలు, వస్తువుల నిల్వకు తగినంత గిడ్డంగి సదుపాయాలు లేకపోవటం, వర్గీకరణ, ప్రమాణీకరణలు లోపించటం, రవాణా సదుపాయాలు సరిగా లేకపోవటం, తాజా మార్కెట్ల సమాచారం రైతులకు అందుబాటులో లేకపోవటం ఈ మార్కెట్లలోని ప్రధాన లోపాలు.

స్వాతంత్ర్యానంతరం కూడా వ్యవసాయాభివృద్ధి కార్యకలాపాలు ఉత్పత్తి, ఉత్పాదక రేటును వృద్ధి చేయటం పై దృష్టిని కేంద్రీకరించాయి, కాని మార్కెటింగు అభివృద్ధిని నియంత్రించుట, విస్తరణ మున్నగు కార్యకలాపాలపై దృష్టి సారించలేదు.

అయినప్పటికి, వ్యవసాయ మార్కెట్లలోనున్న లోపాలు, ఆ లోపాల వల్ల రైతులు నష్టపోవటాన్ని అరికట్టుటకు ప్రధానంగా రెండు చర్యలను ప్రభుత్వం చేపట్టింది. ఒకటి, వ్యవసాయ మార్కెట్లను నియంత్రించుటకు అన్ని రాష్ట్రాలలో చట్టాలు చేయటంతో బాటు, ప్రధానమైన టోకు మార్కెట్లు, కేంద్ర మార్కెట్లను చట్టాల పరిధిలోనికి తీసుకువచ్చుటకై వాటిని నియంత్రిత మార్కెట్లుగా గుర్తించటం, వాటి నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వ ప్రతినిధులు, వర్తకుల, రైతుల ప్రతినిధులతో కూడిన మార్కెటు కమిటీలకు, మార్కెట్ నిర్వహణా బాధ్యతను అప్పజెప్పటం జరిగినది.

రెండవది, దళారీలకు ప్రత్యామ్నాయంగా సహకార మార్కెటింగు సంఘాలు ఏర్పరచి, వాటకి ఆర్థిక సహాయాలతో పాటు, అనేక ప్రోత్సాహకాలు కల్పించటం. ఈ దిశగా ప్రాథమిక, కేంద్ర, రాష్ట్ర, జాతీయ స్థాయిలో వ్యవసాయ మార్కెటింగు సంఘాలు, వాటి సమాఖ్యను ఏర్పాటు చేయటం జరిగింది.

కానీ పై రెండు చర్యలు ఆశించినంత ఫలితాలు చేకూర్చలేకపోయాయి. నియంత్రిత మార్కెట్లలోని మార్కెటు కమిటీలు, మార్కెటు లోపాలు సవరించటం, సదుపాయాలు పెంచటం అనుకున్నంతగా జరుగలేదు. సహకార మార్కెటింగు సంఘాలలో వ్యాపార పురోభివృద్ధి కనిపించినా వ్యవసాయోత్పత్తుల అమ్మక విలువలో వీటి వ్యాపారం 10 శాతానికి మించలేదు. అంతేకాక వీటి కార్యాకలాపాలు కొన్ని రాష్ట్రాలకు, కొన్ని వ్యవసాయోత్పత్తులకు మాత్రమే పరిమితమైనాయి.

ప్రస్తుత తరుణంలో అనగా ప్రపంచీకరణ, మార్కెటీకరణ దృష్ట్యా వ్యవసాయ మార్కెటింగును పటిష్టం చేయవలసిన ఆవశ్యకత బాగా పెరిగినది. వీటిని పటిష్ట పరచుటకు గ్రామీణ మార్కెట్లలో రైతులకు సరఫరా చేసే వ్యవసాయ ఉత్పాదకాలలో కల్తీ నివారించుటకు నిరంతర నిఘా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, శ్రామికులకు వినియోగ వస్తువులు సరసమైన ధరలకు సరఫరా చేయటం అవసరం. వ్యవసాయోత్పత్తుల మార్కెట్ల అభివృద్ధికి చర్యలు, నిల్వ వసతులు పెంచటం, మార్కెట్ సమాచారం అందజేయటం, ఉత్పత్తుల వర్గీకరణ మరియు ప్రమాణీకరణకు చర్యలు తీసుకోవటం, సహకార మార్కెటింగు వ్యవస్థను పటిష్టపరచుట, గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయోత్పత్తుల ప్రాసెసింగును ప్రోత్సహించటం అవసరం.

## 12.8 ముఖ్య పదాలు :-

**నియంత్రిత మార్కెట్లు** - మార్కెటింగు చట్టాల క్రింద ఏర్పాటు చేయబడి చట్ట పరిధిలో మార్కెటింగు కార్యకలాపాలు నిర్వహించబడే మార్కెట్లు.

**మార్కెట్ కమిటీలు** - నియంత్రిత మార్కెట్ల నిర్వహణాకై, రైతులు, వ్యాపారులు, కమీషను ఏజెంట్లు మరియు మార్కెట్ శాఖాధికారుల ప్రాతినిధ్యంతో ఏర్పాటు చేయబడిన కమిటీలు.

| | | |
|---|---|---|
| **విపణి చట్టాలు** | - | వ్యవసాయ మార్కెటింగులోని లోపములను అరికట్టి వాటిని పటిష్ఠంగా నిర్వహించుటకు తయారుచేసిన నిబంధనలు. |
| **కమీషన్ ఏజెంట్లు** | - | మార్కెటు కేంద్రాలలో షాపులు ఏర్పాటు చేసుకొని వ్యవసాయోత్పత్తులను వ్యాపారస్తులకు అమ్మి వారి సేవలకు గాను అమ్మకందారుల నుండి మరియు కొనుగోలుదారుల నుండి రుసుము తీసుకొనువారు. |
| **సంచార వర్తకులు** | - | గ్రామాల వెంట తిరిగి రైతుల ఉత్పత్తులను కొనుగోలు చేయు వర్తకులు |

## 12.9 స్వయం సమీక్షా ప్రశ్నలు :-

1. భారత వ్యవసాయ మార్కెటింగులోని లోపములను స్థూలనాత్మకముగా పరిశీలింపుము.
2. నియంత్రిత మార్కెట్లు అనగానేమి? అవి వ్యవసాయ మార్కెట్లలోని లోపములను ఏ మేరకు సరిదిద్ద గల్గినవో చర్చించుము.
3. వ్యవసాయోత్పత్తుల మార్కెటింగులో సహకార మార్కెటింగు సంఘాల పాత్రను వివరముగా తెలుపుము.
4. గ్రామీణ మార్కెట్లు ప్రత్యేకంగా వ్యవసాయ మార్కెట్లు అభివృద్ధికి చేపట్టవలసిన చర్యలను విశదీకరించుము.

## 12.10 చదవవలసిన గ్రంథాలు :-


1. Indian Society of Agricultural Marketing 1996
2. Ministry of Agriculture G.O.I. 2004
3. Vistas in Agricultural Marketing (1987-1996) Vol.
4. State of Indian Farmer Vol. 17 Agricultural Marketing by S.S. Acharya.


**ఆచార్య. ఆర్.యమ్. మోహనరావు**

**పాఠం - 13**

# లఘు కుటీర పరిశ్రమలు

## 13.0 లక్ష్యం :-

ఈ పాఠ్యాంశము చదివిన తరువాత పాఠకులు తెలుసుకొను అంశాలు -

* లఘుకుటీర పరిశ్రమలు అనగానేమి? వాటి పెట్టుబడుల పరిమితులు?
* జాతిపిత మహాత్మాగాంధీ ప్రకారము గ్రామీణ పరిశ్రమలకుండవలసిన లక్షణాలు
* భారత ఆర్థికవ్యవస్థ అభివృద్ధికి లఘు కుటీర పరిశ్రమలు ఏ రకముగా దోహదపడుచున్నవి?
* లఘు కుటీర పరిశ్రమలకున్న అనేక సమస్యలు, పరిష్కార మార్గాలు, పంచవర్ష ప్రణాళికలలో గ్రామీణ పరిశ్రమల అభివృద్ధికి కేటాయించబడిన వనరులు, వాటి అభివృద్ధి వ్యూహాలు.

## విషయసూచిక :-


**13.1 విషయ పరిచయము**

**13.2 లఘు కుటీర పరిశ్రమలు - నిర్వచనము**

**13.3 మహాత్మాగాంధీ దృష్టిలో గ్రామీణ పరిశ్రమల లక్షణాలు**

**13.4 భారతదేశ ఆర్థికవ్యవస్థలో లఘు కుటీర పరిశ్రమల పాత్ర - ప్రాధాన్యత**

**13.5 లఘు కుటీర పరిశ్రమల సమస్యలు - పరిష్కార మార్గాలు - ప్రభుత్వ చర్యలు**

**13.6 పంచవర్ష ప్రణాళికలలో గ్రామీణ పారిశ్రామికీకరణ వ్యూహాలు**

**13.7 సారాంశము**

**13.8 నమూనా ప్రశ్నలు**

**13.9 చదువదగిన గ్రంథాలు**


## 13.1 విషయ పరిచయము :-

భారతదేశము వ్యవసాయాధారిత దేశము. అధిక జనాభా, మిగులు శ్రామికులు ఉన్న మన దేశంలో వ్యవసాయ రంగంపై ఒత్తిడి పెరిగితే వ్యవసాయ ఉత్పత్తులలో తగ్గుదల, ప్రచ్ఛన్న నిరుద్యోగిత ఏర్పడి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నిస్సారము కాగలదు. ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ ఉద్యోగావకాశాలకు మూలాధారమైన లఘు కుటీర పరిశ్రమల స్థాపన ఒక మార్గము. మన దేశంలో గల 5,50,000 గ్రామాలలో దాదాపు 75% ప్రజలు నివసిస్తున్నారు. ఈ గ్రామాల అభ్యుదయం లఘు కుటీర పరిశ్రమల ద్వారా సాధ్యపడగలదు. దేశంలోని 75% ప్రజల ఆర్థికస్థితి మెరుగుపడిందంటే దేశం ప్రగతిని సాధించినట్లే గదా!

## 13.2 లఘు కుటీర పరిశ్రమలు - నిర్వచనము :-

లఘు కుటీర పరిశ్రమలనగా సాధారణంగా గ్రామాలలో స్వంత గృహాలలో కుటుంబ సభ్యుల చేత స్థాపించబడి స్థానికంగా లభ్యం అవుతున్న ముడి పదార్థాలను ఉపయోగించుకుంటూ వంశపారంపర్య నైపుణ్యాల ద్వారా కొద్దిపాటి మూలధనంలో సంప్రదాయబద్ధమైన వస్తువులను తయారు చేయు ఉత్పాదక సంస్థలు.

గ్రామీణ పరిశ్రమలు లఘు, కుటీర పరిశ్రమలుగా, అనుషంగిక, వ్యవసాయాధార పరిశ్రమలుగా ఆయా పరిశ్రమల పెట్టుబడి పరిమాణం పై ఆధారపడి వర్గీకరింపబడినాయి. 1978, 1956 సం॥లలో చేయబడిన పారిశ్రామిక విధానాల తీర్మానాలలో అదనపు ఉద్యోగవకాశాలను కల్పించగలిగిన ఈ లఘు కుటీర పరిశ్రమలకు ప్రధాన స్థానం ఇవ్వబడినది. 1950వ సం॥లో భారత ప్రభుత్వము ఈ పరిశ్రమలను రెండు రకాలుగా విభజించింది.

1. విద్యుచ్ఛక్తిని ఉపయోగిస్తూ 50 మంది కన్నా తక్కువ సంఖ్యలో శ్రామికులకు ఉపయోగించునవి.
2. విద్యుచ్ఛక్తి ఉపయోగం లేకుండా 100 మంది వరకూ శ్రామికులను ఉపయోగించుకొను సంస్థలు.

ఈ రెంటికి గరిష్ట పెట్టుబడి పరిమాణము రూ॥ 5 లక్షలుగా నిశ్చయింపబడినది. కాని ఈ రకమైన నిర్వచనాలు, వర్గీకరణ స్థిరమైనవి గాక కాలానుగుణముగా మార్పులు చెందుచున్నవి. 1966వ సం॥లో 7.5 లక్షల స్థిర మూలధనము కలిగిన పరిశ్రమలను కుటీర పరిశ్రమలని, 10 లక్షల పెట్టుబడితో ఉన్న వాటిని అనుషంగిక (ancillary) పరిశ్రమలని నిర్వచించినారు. 1975వ సం॥లో కుటీర పరిశ్రమల గరిష్ట పెట్టుబడిని 10 లక్షల రూ॥లకు, అనుషంగిక పరిశ్రమల పెట్టుబడిని 20 లక్షల రూ॥లకు పెంచటం జరిగింది. 1980వ సం॥లో లఘు పరిశ్రమల పెట్టుబడి పరిమితిని 1 లక్ష నుంచి 2 లక్షల రూ॥లకు వృద్ధి పొందించారు. మార్చి 1985లో ప్రభుత్వము తిరిగి కుటీర, అనుషంగిక పరిశ్రమల పెట్టుబడి పరిమాణాన్ని 35 లక్షలు, 45 లక్షల రూ॥ల మేరకు వరుసక్రమంలో పెంచింది.

1997లో అబిద్ హుస్సేన్ (Abid Hussan Committee) కమిటీ సలహాలననుసరించి ప్రభుత్వం కుటీర పరిశ్రమలకు పెట్టుబడిని 3 కోట్ల రూ॥లుగాను లఘు పరిశ్రమల పెట్టుబడిని 25 లక్షల రూ॥లుగాను నిర్ణయించింది. కాని 2000 సం॥లో కుటీర పరిశ్రమల పెట్టుబడిని 1 కోటి రూ॥లకు తగ్గించినా లఘు పరిశ్రమ పెట్టుబడి పరిమాణాన్ని యథాతథంగానే ఉంచింది.

స్వాతంత్ర్యానంతరం భారీ పరిశ్రమల పోటీని తట్టుకుంటూనే 1950వ సం॥లో 16,000 నమోదు చేయబడిన కుటీర పరిశ్రమల సంఖ్య 1961 నాటికి 36000 యూనిట్లకు పెరిగింది. 2000 - 2001 నాటికి 33.7 లక్షల కుటీర పరిశ్రమలు మన దేశంలో సాధారణ వినియోగ వస్తువులను మాత్రమేకాక ఆధునిక ఎలక్ట్రానిక్ వస్తువులను కూడా ఉత్పత్తి చేస్తూ పారిశ్రామిక రంగంలో ఒక ప్రత్యేకమైన పాత్రను పోషించుచున్నవి.

## 13.3 మహాత్మాగాంధీ దృక్పథంలో గ్రామీణ పరిశ్రమకుండవలసిన లక్షణాలు :-

1. పారిశ్రామిక వికేంద్రీకరణకు చిహ్నాలుగా ఉండాలి.
2. లఘు కుటీర పరిశ్రమలలోని యాంత్రికీకరణ శ్రామికుని శారీరక శ్రమను తగ్గిస్తూ వారి ఉత్పాదకతను పెంచేదిగా ఉండాలి.
3. శ్రమ సాంద్రమైన ఉత్పత్తి ప్రక్రియ ఉపయోగింపబడాలి.
4. స్థానిక ప్రజల అవసరములకు అనుగుణంగా వస్తూత్పత్తి జరగాలి.
5. ప్రాంతీయంగా లభించే మానవ, భౌతిక, వనరులను అభిలషణీయంగా ఉపయోగించుకోవాలి.
6. గ్రామీణ ప్రజల జీవన ప్రమాణ స్థాయిని పెంచేవిగా ఉండాలి.
7. ఈ పరిశ్రమలు గ్రామీణ ప్రజలలోని ఆదాయ అసమానతలను తగ్గించగలగాలి.

## 13.4 భారతదేశ ఆర్థిక వ్యవస్థలో లఘుకుటీర పరిశ్రమలకున్న ప్రాధాన్యత లేదా పాత్ర :-

1. **ఉత్పత్తి - ఉద్యోగిత :-** భారతదేశంలో ఉన్న ముఖ్యమైన సమస్య నిరుద్యోగిత. లఘు కుటీర పరిశ్రమలు పేర్కొనదగిన సంఖ్యలో ఉద్యోగితావకాశాలను కల్పించడమే కాక గణనీయమైన సంఖ్యలో పారిశ్రామిక వస్తువులను ఉత్పత్తి చేయుచున్నవి.

1973 - 74 సం॥ నుంచి 2001 - 02 నాటికి 4 లక్షల నుంచి 19.2 మిలియన్ల మేరకు ఉద్యోగావకాశాలు పెంచబడినవి. అదే సమయంలో వీటి ఉత్పత్తి విలువ 7,200 కోట్ల రూ॥ల నుంచి 6,39,024 కోట్ల రూ॥లకు పెరిగింది. ప్రస్తుతం చిన్న తరహా పరిశ్రమలు, మొత్తం పారిశ్రామిక ఉత్పత్తులలో 39 శాతం, ఎగుమతులలో 34 శాతం వాటాలను కలిగి ఉన్నాయి. చిన్న తరహా సంస్థల పెరుగుదల అధికం కావటానికి ప్రభుత్వం ఎప్పటికప్పుడు వాటి స్థిర మూలధన పరిమితిని పెంచుట ఒక కారణము. ఇక్కడ పేర్కొనదగిన ఇంకొక అంశం కూడా ఉన్నది. అదే ఈ పరిశ్రమల తక్కువ స్థాయి యాంత్రిక వినియోగ సామర్థ్య స్థాయి. చిన్న తరహా పరిశ్రమలు తమ ఉత్పత్తి సామర్థ్యంలో 53 శాతం మాత్రమే ఉపయోగించుకోగలుగుతున్నాయి. అయితే తోలు వస్తువులు, రెడీమేడ్ వస్తువులు, ఇటుకలు, వులెన్ దుస్తులు తయారు చేయు పరిశ్రమలు 60 నుంచి 80 శాతం వరకూ వినియోగ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ప్లాస్టిక్ వస్తువుల ఉత్పత్తి సంస్థలు 24 శాతం సామర్థ్యాన్ని మాత్రమే ఉపయోగించుకుంటున్నాయి.

2. **మూలధన సమస్య పరిష్కారము :-** అభివృద్ధి చెందుచున్న దేశాలకు మూలధన సమీకరణము ఒక సమస్య. గ్రామీణ పరిశ్రమలు తక్కువ మూలధనంలో వస్తూత్పత్తి చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఈ పరిశ్రమలలో మూలధనం ఉత్పత్తి నిష్పత్తి 1 : 3.28 గా ఉంటుంది. అంటే ఒక్క యూనిట్ మూలధనంలో 3 యూనిట్ల ఉత్పత్తి జరుగుతున్నది. ఇంతేకాక ఈ పరిశ్రమలు సాంకేతిక పరిజ్ఞానం విషయంలోనూ యంత్రాల విషయంలోను దిగుమతుల పై ఆధారపడవు. అందుచేత ఈ పరిశ్రమలు విదేశీ వ్యాపార సంతులనానికి తోడ్పడుతూ విదేశీమారక ద్రవ్యాన్ని ప్రభుత్వానికి సమకూర్చగలవు.

3. **ప్రాంతీయ అసమానతల తగ్గుదల :-** భారీ పరిశ్రమలు అన్ని అవస్థాపనా సదుపాయాలున్న ప్రాంతాలలో మాత్రమే స్థాపింపబడగలవు. అందుచేత ప్రాంతీయ అసమానతలు ఏర్పడటానికి అవకాశముంటుంది. కాని లఘు కుటీర పరిశ్రమలు దేశంలోని ఏ మారుమూల ప్రాంతంలోనైనా స్థాపించవచ్చు. వాటికి కావలసిన యాంత్రిక శక్తి, ముడి పదార్థాలు ఏర్పరచుకొనుట సాపేక్షికంగా కొంత సులువు. దీని వలన లఘు కుటీర పరిశ్రమలు వెనుకబడిన ప్రాంతాలలోనైనా స్థాపించబడవచ్చు. తద్వారా ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలు కూడా ముందుకు వస్తాయి. అందువలన దేశంలో పలు ప్రాంతాలలో ఆర్థిక అసమానతలు తగ్గి ప్రాంతీయ సంతులనతకు ఈ పరిశ్రమలు సహాయకారులౌతాయి.

3. **వ్యవసాయోత్పత్తి పెరగటానికి పరోక్షంగా సహాయం :-** గ్రామాలలో లఘు కుటీర పరిశ్రమల స్థాపన భూమి పై శ్రామిక ఒత్తిడిని తగ్గించి, భూమి, శ్రామికుల మధ్య నిష్పత్తి అభిలషణీయంగా ఉండేటట్లు చేయగలదు. దాని వలన వ్యవసాయ రంగంలో ప్రచ్ఛన్న నిరుద్యోగిత తగ్గి, వ్యవసాయ ఉత్పత్తుల అభివృద్ధికి అవకాశం లభించగలదు. హరిత విప్లవం ద్వారా పెరిగిన వ్యవసాయోత్పత్తులు సమర్థవంతంగా వినియోగింపబడటానికి కూడా లఘు కుటీర పరిశ్రమల ఆవశ్యకత ఉన్నది. లఘు కుటీర పరిశ్రమలు ఎక్కువగా వ్యవసాయ రంగ ఉత్పత్తులను ముడి పదార్థాలుగా ఉపయోగించుట వలన ఈ పరిశ్రమలు వ్యవసాయ రంగాన్ని పరోక్షంగా ప్రోత్సహిస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి తోడ్పడుతున్నాయి.

4. **ద్రవ్యోల్బణాన్ని తగ్గించగలవు :-** భారీ పరిశ్రమలలో పెట్టుబడి, ఉత్పత్తికి మధ్య గల ఫలన కాలమెక్కువ. అందుచేత వస్తూత్పత్తికి ముందే ఆదాయాలు పెరుగుట చేత ధరలు పెరుగుతాయి. కాని లఘు కుటీర పరిశ్రమలలో ఫలన కాలము తక్కువ అగుట చేత డిమాండుకు తగిన విధంగా సరఫరా పెరగటానికి అవకాశం ఉంది. తద్వారా ధరల స్థిరీకరణ జరగగలదు.

5. **వలస తగ్గులు, సామ్యవాద సమాజ స్థాపన :-** లఘు కుటీర పరిశ్రమలు ప్రత్యామ్నాయ ఉద్యోగావకాశాలను కల్పించుట ద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలసను తగ్గిస్తాయి. ఫలితంగా గ్రామాలు చైతన్యవంతం అవటమే గాక గ్రామీణుల జీవన ప్రమాణ స్థాయి పెరుగగలదు. ఈ కారణంగా ఆ దేశంలో ఆదాయ అసమానతలు తగ్గుతాయి. సామ్యవాద సమాజ స్థాపన జరుగుతుంది. అంటే ఈ పరిశ్రమలు పారిశ్రామిక వికేంద్రీకరణ ద్వారా ఆర్థికస్తోమత కొద్ది మంది చేతులలో కేంద్రీకృతం కాకుండా ఆపగలవు.

6. **ఎగుమతులలో పెరుగుదల :-** గ్రామీణ పరిశ్రమలు ఎగుమతుల ద్వారా దేశానికి విదేశీ మారకద్రవ్యం సమకూర్చగలవు. రెడీమేడ్ దుస్తులు, ఉప ఉత్పత్తులు, శాండిల్స్, పాదరక్షలు, ఆహారపు ఉత్పత్తులు, వస్త్రాలు వంటి వాటిలో ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. 1980 - 81 సం॥లో 1,643 కోట్ల విలువ గల ఎగుమతులు జరుగగా, 2000 - 2001 సం॥కి ఈ ఎగుమతుల విలువ 69,797 కోట్ల రూ॥లకు పెరిగింది. 2000 - 2001 సం॥లో ఎగుమతి చేయబడిన మొత్తం ఉత్పత్తులలో చిన్న తరహా పరిశ్రమలు 39 శాతం వాటాను కలిగి ఉన్నవి.

పైన పేర్కొన్న విధంగా లఘు కుటీర పరిశ్రమలు శ్రమ సాంద్రత కలిగి ఉద్యోగవకాశాలను పెంచుతూ మానవ వనరుల అభివృద్ధికి దోహదపడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో వ్యవస్థాపక సామర్థ్యాన్ని ప్రజల కళా నైపుణ్యాన్ని, సృజనాత్మక శక్తిని పెంపొందింప చేస్తూ గ్రామీణ ప్రజల జీవన ప్రమాణ స్థాయిని వృద్ధి చేస్తూ భారతదేశ అభివృద్ధికి దోహదపడతాయి.

## 13.5 లఘు కుటీర పరిశ్రమల సమస్యలు - పరిష్కార మార్గాలు :-

1. **ప్రభుత్వ చర్యలు :-** భారీ పరిశ్రమలతో పోలిస్తే లఘు కుటీర పరిశ్రమలకు సమస్యలు ఎక్కువని చెప్పవచ్చు. ఈ పరిశ్రమలు బడ్జెట్ కేటాయింపులు, మూలధన సదుపాయము, మార్కెటింగ్ సౌకర్యము సాంకేతిక పరిజ్ఞానము, ముడి పదార్థాల సరఫరా మున్నగు విషయాలలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నవి.

2. **మూలధనపు కొరత :-** ఒక పరిశ్రమను స్థాపించటానికి, విస్తరించటానికి, అభివృద్ధి చేయటానికి మూలధన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. చిన్నతరహా పరిశ్రమలకు తగినంతగా సొంత వనరులు లేకపోవడంతో ఇవి సంక్షోభంలో పడుతున్నాయి. తమని తాము రక్షించుకొనుటకు వీటికి మిగులు వనరులు లేక వ్యవస్థాపూర్వక ఋణ సదుపాయాలు లేకుండుట వలన వీటి ఉత్పత్తులు దెబ్బతింటున్నాయి. కాని ఆర్థికాభివృద్ధిలో ఈ పరిశ్రమల ప్రాధాన్యతను గమనించి వీటి ద్రవ్య అవసరములను తీర్చుటకు ప్రభుత్వము వాణిజ్య బ్యాంకుల ద్వారా ఋణ సదుపాయమును కలిగించుచున్నది. 1998 మార్చిలో ప్రభుత్వ వాణిజ్య బ్యాంకులు 38,110 కోట్ల రూ॥ల పరపతిని సమకూర్చగా స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్, జాతీయ, చిన్న పరిశ్రమల కార్పొరేషన్ ఈ పరిశ్రమలకు ముడి పదార్థములను సమకూర్చును. వీటికి కావలసిన చిన్న యంత్ర పరికరాలను దిగుమతి చేసుకొనుటకు సదుపాయాన్ని కలుగచేస్తూ అవసరమైనపుడు భారీ యంత్ర పరికరాలను అద్దెకు ఇచ్చును.

3. **సాంకేతిక సేవలు :-** చిన్న తరహా పరిశ్రమలలో పని చేసే శ్రామికులు ఎక్కువగా సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ లేనివారు. అందుచేత ఈ సంస్థల ఉత్పాదక సామర్థ్యము తక్కువ. కాబట్టి నూతన ఉత్పత్తి మార్గాలను అన్వేషించుటకు సాంకేతిక సేవలను అందించుటకు కేంద్ర చిన్న తరహా పరిశ్రమల సంస్థను (Central Small Industries Organisation) స్థాపించినది. ఈ సంస్థ 20 చిన్న పరిశ్రమల సేవా కేంద్రాలను (Small industrries service institutions), 34 విస్తరణ కేంద్రాలను స్థాపించినది. లఘు కుటీర పరిశ్రమలకు ఉత్పన్నమయ్యే సమస్యలకు సలహాలను అందిస్తుంది. సాంకేతిక అంశాలలో ఈ సంస్థ ఉత్పత్తి నిర్వహణ, యంత్రాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సలహాలను అందిస్తుంది.

4. **పారిశ్రామిక వాడలు :-** లఘు కుటీర పరిశ్రమల స్థాపనకు సరియగు ప్రదేశం లభ్యంకాక స్థాపింపబడిన ప్రాంతాలలో ప్రాథమికమైన నిర్వహణా వసతులు లేక ఈ పరిశ్రమలు అనేక ఇబ్బందులకు గురి అగుచున్నవి. సరసమైన ధర వద్ద అవస్థాపనా సదుపాయాలన్నింటినీ ఒకే ప్రదేశంలో కల్పించి చిన్న తరహా పరిశ్రమలన్నింటినీ ఒకే చోట కేంద్రీకృతం అయ్యేటట్లు చేయుటే పారిశ్రామిక వాడల స్థాపన. 6వ పంచవర్ష ప్రణాళిక ప్రకారం (1980 - 85) మార్చి 1979 నాటికి 662 పారిశ్రామిక వాడలలో 13,467 చిన్న తరహా పరిశ్రమలు స్థాపించబడి 363 కోట్ల విలువ గల ఉత్పత్తి చేస్తూ 2.2 లక్షల మందికి ఉపాధికల్పన జరిగింది.

పైన వివరించిన విధంగా చిన్న పరిశ్రమల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చేయూతను అందించినప్పటికీ ఈ పరిశ్రమలు అనేక అవరోధాలను అనుభవిస్తున్నాయి. ప్రభుత్వ ధ్యేయాలకు వ్యతిరేకంగా నిధుల దుర్వినియోగం జరుగుతున్నది. వీటికి ఇవ్వబడిన రాయితీలు, సబ్సిడీలు ఈ పరిశ్రమలకు అందుట లేదు. మార్చి 2002కు ఈ పరపతి పరిమాణము 49,743 కోట్ల రూ॥లకు జరిగింది. ప్రభుత్వము ఈ పరిశ్రమలకు సరసమైన వడ్డీ రేటులో దీర్ఘకాలిక, స్వల్పకాలిక ఋణములను అందించుటేగాక ఈ పరిశ్రమలు చెల్లించలేని వడ్డీలు వాయిదాల పద్ధతిలో అప్పుల చెల్లించుటకై పరపతి సౌకర్యం కలిగిస్తుంది.

5. **మార్కెటింగ్ సదుపాయాల కొరత :-** గ్రామీణ ప్రాంతాలలో ఉత్పత్తి చేయబడిన వస్తువులను ఎటువంటి బ్రాండు పేరులు నాణ్యతా ప్రమాణాలను తెలియపరుచు గుర్తులు (brand names) లేకుండుట, వారి వస్తువుల గురించి ప్రజలకు తెలియజెప్పుటకు సరియైన ప్రచార సాధనాలు లేకుండుట, సమర్థవంతమైన వ్యాపార ప్రతినిధులను ఏర్పాటు చేసుకొను ఆర్థిక సమర్థత లేకుండుట వలన వీరికి సరియగు విక్రయ సదుపాయాలు లేవు. వీరికి తమ పోటీగా ఉన్న వ్యాపార పర్యావరణం గురించి అవగాహన లేదు. ప్రజల అభిరుచులలో మార్పులు వీరు పసికట్టలేరు. అందుచేత వీరి వస్తువులకు తగినంత డిమాండు లేదు. కాబట్టి మార్కెట్ అసంపూర్ణతలను (market imperfections) తొలగించుటకు ప్రభుత్వ జోక్యము అవసరము. లఘు కుటీర పరిశ్రమల ఉత్పత్తికి డిమాండును పెంచుటకు సంఘటిత మార్కెటింగ్ సదుపాయాన్ని కలుగచెయ్యాలి.

మధ్యవర్తులను, దళారులను తొలగించి వినియోగదారులతో ప్రత్యక్ష సంబంధాలను కల్పించాలి. నాణ్యత ప్రాతిపదిక పై వీటి మార్కెట్‌ను విస్తృత పరచాలి. చిన్న తరహా పరిశ్రమలకు మార్కెట్ గ్యారంటీ ఇచ్చుటకు వీటి ఉత్పత్తులలో 15 శాతం వరకూ అమ్మకాలకు ప్రాధాన్యతను ప్రభుత్వం కల్పించుచున్నది. ప్రభుత్వం చిన్న తరహా పరిశ్రమలకు ముడి పదార్థములను సరఫరా చేయుటకు స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ (state trading corporation) ను స్థాపించింది. ఈ పరిశ్రమల ఉత్పత్తిని పెంచుటకు 1955లో జాతీయ చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థను స్థాపించినది.

6. **ముడి పదార్థాలు మరియు దిగుమతి సదుపాయాలు లేకుండుట :-** ముడి పదార్థాల విషయంలో లఘు కుటీర పరిశ్రమలు భారీ పరిశ్రమలతో పోటీకి తట్టుకోలేకపోతున్నాయి. కాబట్టి ప్రభుత్వం ఈ పరిశ్రమలకు ముడి సరుకుల కేటాయింపు విషయంలో సరియగు ప్రాధాన్యతను ఇచ్చుటకు ప్రయత్నాలు చేస్తున్నది.

## 13.6 పంచవర్ష ప్రణాళికలలో గ్రామీణ పరిశ్రమలకై వ్యూహాలు :-

లఘు కుటీర పరిశ్రమల నిమిత్తం మొదటి పంచవర్ష ప్రణాళికలో 42 కోట్ల రూ॥లు రెండవ ప్రణాళికలో 187 కోట్ల రూ॥లు కేటాయించటం జరిగింది. మూడవ ప్రణాళికలో 24 కోట్ల రూ॥లు కేటాయింపబడగా వార్షిక ప్రణాళికలలో (1966 - 69) 132 కోట్ల రూ॥లు ఈ పరిశ్రమల అభివృద్ధికై వెచ్చించబడినవి.

భారీ పరిశ్రమల పోటీ నుండి చిన్న తరహా పరిశ్రమలకు రక్షణనిచ్చుటకు ప్రణాళికా వ్యూహాలు తయారు చేయబడినప్పటికి ప్రభుత్వ ప్రయాస ఫలించలేదు. ఇంతేకాక పారిశ్రామిక కేంద్రీకరణను కూడా ప్రభుత్వం నివారించలేకపోయింది. సాంప్రదాయ ఉత్పత్తులైన జౌళి, వ్యవసాయం, కొబ్బరినార, ఖాదీ మొ॥న వస్తువులను తయారు చేయు ఉత్పత్తి సంస్థలు పేదరికపు రేఖ దిగువన ఉన్నవి. కాబట్టి ఈ పరిశ్రమలలోని శ్రామికుల జీవన ప్రమాణ స్థాయిని పెంచటానికి వారి నైపుణ్యాలను పెంచటానికి 1974 - 78 సం॥లలో ఈ పరిశ్రమలకై 388 కోట్ల రూ॥లు కేటాయింపబడినవి. ఆరవ పంచవర్ష ప్రణాళికలో లఘు కుటీర పరిశ్రమలకై 1,952 కోట్ల రూ॥లు కేటాయించగా వీటిలో ఉత్పత్తి పరిమాణము 1979 - 80 సం॥లలో 33,538 కోట్ల రూ॥ల నుండి 1984 - 85 సం॥లకు 65,370 కోట్లు రూ॥లుగా పెరిగినది. ఉద్యోగవకాశాలు అదే సమయంలో 234 లక్షల నుండి 315 లక్షలకు ఉద్యోగవకాశాలు వృద్ధి చెందినవి.

**పంచవర్ష ప్రణాళికా కాలంలో చిన్న తరహా పరిశ్రమల వృద్ధి**

**(1985 - 90)**

| | ఆధునిక సంస్థలు | సంప్రదాయ సంస్థలు | మొత్తం |
|---|---|---|---|
| ఉత్పత్తి | 12.4 | 9.9 | 12.1 |
| ఉద్యోగిత | 6.1 | 8.2 | 4.4 |
| ఎగుమతులు | 26.5 | 26.6 | 26.6 |

**గమనిక** - 8వ పంచవర్ష ప్రణాళికలో ఇవ్వబడిన గణాంక వివరాలననుసరించి (1992 - 97)

8 వ ప్రణాళికలో సైతం చిన్న తరహా పరిశ్రమల వృద్ధికి పరపతి అవస్థాపనా మార్కెటింగ్, సాంకేతికపరమైన సేవలనందించుటే గాక చేనేత, చేతి పనుల వంటి వాటిని ప్రోత్సహించుటకు అనేక చర్యలు తీసుకున్నది. ప్రణాళికా కాలంలో చిన్న తరహా పరిశ్రలకై కేటాయింపబడిన వనరుల మొత్తం (at 1991 - 92 prices) 6,334 కోట్ల రూ॥లు. 1996 - 97 సం॥లలో లఘు కుటీర పరిశ్రమలు 575 లక్షల మందికి ఉద్యోగవకాశాలు కల్పించినవి. ఇంకనూ పేర్కొనదగిన అంశం 1996 - 97 సం॥ కాలములోనే లఘు కుటీర పరిశ్రమల ద్వారా 52,230 కోట్ల రూ॥ల విలువ గల ఎగుమతులు చేయబడ్డాయి. మొత్తం ఎగుమతులలో ఈ పరిమాణము 44 శాతముగా ఉన్నది. దీన్నిబట్టి మన ఆర్థిక వ్యవస్థను ప్రపంచీకరణ చేయు ప్రయత్నంలో గ్రామీణ, చిన్న పరిశ్రమలు ప్రముఖ స్థానాన్ని ఆక్రమించుకున్నవని చెప్పవచ్చు.

తొమ్మిదవ పంచవర్ష ప్రణాళికా కాలం నాటికి చిన్నతరహా పరిశ్రమలు 8000 రకాలైన వస్తువులను తయారు చేసే స్థితికి ఎదిగినవి. అందులో 821 రకాలైన వస్తువుల తయారీ కేవలం చిన్న తరహా పరిశ్రమలకు మాత్రమే పరిమితం. ఈ ప్రణాళికలో ఈ పరిశ్రమలకు మాత్రమే ఋణాలను ఇవ్వటానికి ప్రభుత్వం ప్రత్యేకమైన బ్యాంకు శాఖలను ప్రారంభించింది. వీటి సాంకేతిక సమస్యల నివారణకు భారతీయ చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ 200 కోట్ల రూ॥ల మూలధనంతో సాంకేతిక అభివృద్ధి మరియు ఆధునీకరణ నిధిని ఏర్పాటు చేసింది. ఈ పరిశ్రమలకు సాంకేతిక సహకారాన్ని శిక్షణను ఇచ్చుటకు భారత ప్రభుత్వం జర్మనీ, డెన్మార్క్, ఇటలీ దేశాల సహాయంతో ఇండోర్, అహమ్మదాబాదు, భువనేశ్వర్, జమ్‌షెడ్‌పూర్, ఔరంగాబాద్‌లలో శిక్షణా పనిముట్ల కేంద్రాలను (tool roms) స్థాపించింది.

ఈ ప్రణాళికలో చిన్నతరహా పరిశ్రమల ఆధునిక, సంప్రదాయ ఉత్పత్తులలో 12 శాతం వృద్ధి అంచనా వేయబడినది. ఈ కాలంలో ఉద్యోగిత 57.5 మిలియన్ల నుండి 66.5 మిలియన్లకు గణనీయంగా పెరిగింది. 2001 - 02 సం॥ల నాటికి చేతి వృత్తులు ఆధునిక వస్తూత్పత్తుల వలన ఎగుమతులు 14.7 శాతం పెరగవచ్చు అని అంచనా.

## 13.7 సారాంశము :-

భారతదేశ అభివృద్ధికి గ్రామీణ పారిశ్రామికీకరణ ఎంతో ముఖ్యం. విదేశ వ్యాపార సంతులనానికి, విదేశీమారక ద్రవ్య నిల్వలకు, వ్యవసాయాభివృద్ధికి ఈ పరిశ్రమలు ఎంతో గణనీయమైన సేవ చేయుచున్నవి. కాని ఈ పరిశ్రమలకు భారీ పరిశ్రమల వలన కొన్ని ప్రభుత్వ విధానాల వలన మూలధనం, పరపతి, ముడి పదార్థాలు, మార్కెటింగ్ మొ॥గు విషయాలలో అనేక సమస్యలు వాటిల్లుతున్నవి. ఈ సమస్యలను నివారణను చేసి వీటి అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యల ద్వారా కృషి చేస్తున్నది.

## 13.8 నమూనా ప్రశ్నలు :-

1. గ్రామీణ పరిశ్రమ అనగానేమి? గ్రామీణ పరిశ్రమలకుండవలసిన లక్షణాలేమి?
2. లఘు కుటీర పరిశ్రమలు భారతదేశ ఆర్థికవ్యవస్థ అభివృద్ధికి ఏ రకముగా తోడ్పడుచున్నవి?
3. లఘుకుటీర పరిశ్రమలు ఎదుర్కొనుచున్న సమస్యలేమి? సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమి?
4. లఘు కుటీర పరిశ్రమల అభివృద్ధికి ప్రణాళికా కాలంలో జరిగిన వ్యూహాత్మక విధానాన్ని వివరించండి.

## 13.9 చదువదగిన గ్రంథాలు :-


Indian Economy (49th Revised Edition 2004) - Ruddar Dutt, KPM Sundaram

Rural Industrialisation, 9th plan - Kurukshetra, August 1997

Rural Industrialisation, Plan Periods Volume VI - Vasant - Desai

Agriculture and Rural Banking in India - S.S.M. Desai

Fundamentals of Rural Economics - S.S.M. Desai

Rural Development Programmes & Strategies, Volume II - Vasant Desai

Khadi & Village Industries - Jagadanandjha


**శ్రీమతి యస్. సుబ్బలక్ష్మి**

పాఠం - 14

# గ్రామీణాభివృద్ధి పథకాలు - ప్రాంతీయాభివృద్ధి పథకాలు

## 14.0 లక్ష్యం :-

ఈ పాఠ్య భాగం చదివిన తరువాత మీరు ఈ క్రింది అంశాలను తెలుసుకోగలరు.

- గ్రామీణాభివృద్ధి అనగానేమి తెలుసుకోగలరు.
- గ్రామీణాభివృద్ధి పథకాలేవో తెలుసుకోగలరు.
- ప్రాంతీయాభివృద్ధి పథకాలను వివరింపగలగాలి.
- టార్గెటెడ్ గ్రూపుల అభివృద్ధి పథకాలను గూర్చి విశదీకరింపగలగాలి.

## విషయసూచిక :-


**14.1 ఉపోద్ఘాతము**

**14.2 గ్రామీణాభివృద్ధి అనగానేమి?**

**14.3 గ్రామీణాభివృద్ధి పథకాలు**

**14.3.1 ప్రాంతీయాభివృద్ధి పథకాలు**

**14.3.1.1 వెనుకబడిన ప్రాంతాభివృద్ధి పథకము**

**14.3.1.2 కమాండ్ ప్రాంతాభివృద్ధి పథకము**

**14.3.1.3 కరువు కాటక నిర్మూలన పథకము**

**14.3.1.4 మెట్ట వ్యవసాయ సమగ్రాభివృద్ధి ప్రాజెక్టులు**

**14.3.1.5 ఎడారి ప్రాంతాల అభివృద్ధి పథకం**

**14.3.1.6 సంపూర్ణ గ్రామాభివృద్ధి పథకము**

**14.3.1.7 గిరిజనాభివృద్ధి పథకము**

**14.3.1.8 కొండ ప్రాంత అభివృద్ధి సంస్థ**

**14.3.2 టార్గెటెడ్ గ్రూపుల అభివృద్ధి పథకాలు**

**14.3.2.1 చిన్నకారు రైతుల అభివృద్ధి పథకం**

**14.3.2.2 సన్నకారు రైతుల మరియు వ్యవసాయ కూలీల అభివృద్ధి సంస్థ**

**14.3.2.3 కనీస అవసరాల పథకము**

**14.3.2.4 గ్రామీణ పేదల ఆర్థిక పునర్నివాస పథకం**

14.4 సారాంశము

14.5 ముఖ్య పదాలు

14.6 నమూనా ప్రశ్నలు

14.7 చదువదగిన గ్రంథాలు

## 14.1 ఉపోద్ఘాతము :-

భారతదేశము యొక్క అభివృద్ధి వ్యూహములో గ్రామీణాభివృద్ధి ప్రధాన అంశంగా ప్రణాళికా కాల ప్రారంభము నుండి వుంటూనే వుంటుంది. నేటికి కూడా ప్రధానమైన అంశం - శాశ్వతంగా దీర్ఘకాలంగా వుంటున్న పేదరికాన్ని తగ్గించుట, విస్తృతంగా వున్న నిరక్షరాస్యతను తగ్గించుట, నిర్దిష్టంగా వుంటున్న నిరుద్యోగితని తగ్గించుట, గ్రామీణ ప్రజల యొక్క కొనుగోలు శక్తిని కనీస వస్తువుల పట్ల పెంపొందించుట మరియు గ్రామీణ ప్రజల యొక్క జీవన ప్రమాణాలను పెంపొందించుట విస్తృతమైన ఉద్దేశ్యంగా చూడాలంటే గ్రామీణ ప్రజల యొక్క గుణాత్మకమైన జీవనాన్ని మెరుగుపరుచట. ప్రధానాంశంగా ప్రభుత్వాలకి కనిపిస్తూ వుంది. గ్రామీణాభివృద్ధిలో యిది ప్రధాన అంశంగా మారినది. అదే విధంగా గ్రామీణాభివృద్ధి ఫలాలు నిరుపేదలకు అందింపజేయుట గ్రామీణాభివృద్ధి వ్యూహం యొక్క ప్రథమ ఉద్దేశ్యము. ఈ అంశాలన్ని సాధించుటకు తగిన పథకాలు అవసరము. అందుకు గాను గ్రామిణాభివృద్ధి పథకాలను ప్రభుత్వాలు రెండు విధాలుగా అమలు చేసినవి. అవి ఏవనగా ప్రాంతాల అభివృద్ధి పథకాలు మరియు లక్ష్యసాధన అభివృద్ధి పథకాలు.

## 14.2 గ్రామీణాభివృద్ధి అనగానేమి? :-

గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజల యొక్క సామాజిక, ఆర్థిక, రాజకీయ మరియు సంస్కృతి స్థితులలో వచ్చు మార్పును వివరించే ఒక వ్యూహాన్నే గ్రామీణాభివృద్ధి అని అంటారు. అనగా గ్రామీణ జీవన యొక్క అన్ని రంగాల ఎదుగుదల అని అర్థం, లేదా గ్రామ జీవితం అనేక అంశాల అభివృద్ధిని గ్రామీణాభివృద్ధి అని అందురు.

## 14.3 గ్రామీణాభివృద్ధి పథకాలు :-

భారతదేశములో 'గ్రామీణాభివృద్ధి' కొరకై ప్రభుత్వముచే అనేక అభివృద్ధి పథకాలు 1951వ సంవత్సరము నుండి అమలు చేయబడుతూ వున్నాయి. ఈ పథకాలన్నీ గడచిన 9 పంచవర్ష ప్రణాళికలలోనూ అమలు చేయబడెను. మొత్తము పథకాలు ఈ క్రింది విధంగా తెలియజేయబడినవి.

1. సమాజాభివృద్ధి పథకం (Community Development Programme)
2. సాంద్ర వ్యవసాయక జిల్లా పథకం (Intensive Agricultural District Programme)
3. సాంద్ర వ్యవసాయక ప్రాంత పథకం (Intensive Agricultural Area Programme)
4. అధిక దిగుబడి రకాల పథకం (High Yielding Varieties Programme)
5. చిన్నకారు రైతుల అభివృద్ధి సంస్థ (Small Farmers Development Agency)
6. సన్నకారు రైతుల మరియు వ్యవసాయ కూలీల అభివృద్ధి సంస్థ (Marginal Farmers and Agricultural Labourers Development Agency)

7. కరువు కాటక ప్రాంత పథకము (Drought Approne Area Programme)
8. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థలు (Integrated Tribal Development Agencies)
9. ఆధునీకరణ ప్రాంతాభివృద్ధి తీరు (Modified Area Development Approach)
10. కమాండ్ ప్రాంతాభివృద్ధి పథకము (Command Area Development Programme)
11. 20 సూత్రాల పథకము (20 Point Programme)
12. కనీస అవసరాల పథకం (Minimum Needs Programme)
13. పనికి ఆహార పథకం (Food for Work Programme)
14. జాతీయ గ్రామీణ ఉద్యోగ పథకం (National Rural Employment Programme)
15. గ్రామీణ భూమి లేని ఉద్యోగ హామీ పథకం (Rural Landless Employment Guarantee Programme)
16. జవహర్ రోజ్‌గార్ యోజన (Jawahar Rozgar Yojana)
17. గ్రామీణ యువత స్వయం ఉపాధి శిక్షణ (Training Rural Youth for Self Employment)
18. విద్యా నిరుద్యోగ యువత స్వయం ఉపాధి (Self Employment for Educated Unemployed Youth)
19. గ్రామీణ ప్రాంతాల స్త్రీ మరియు శిశు అభివృద్ధి (Development of Women and Children Rural Areas)
20. సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకము (Integrated Rural Development Programme)
21. గ్రామీణ పేదల ఆర్థిక పునర్వాసీకరణ (Economic Rehabilitation of Rural Poor (or) Antyodaya Programme)
22. ఇందిరా అవాజ్ యోజనా (Indira Awaz Yojana)
23. ఉపాధి / ఉద్యోగ హామీ పథకం (Employment Assurance Scheme)
24. సమగ్ర గ్రామీణ శక్తి ప్రణాళికాబద్ధ పథకం (Integrated Rural Energy Planning Programme)
25. స్వర్ణ జయంతి గ్రామ స్వరోజ్‌గార్ యోజన (Swarna Jayanthi Swarozgar Yojana)

పైన పేర్కొనబడిన పథకములను క్లుప్తంగా నాలుగు వర్గాలుగా విభజించవచ్చును. అవి

(ఎ) ప్రాంతీయాభివృద్ధి పథకములు, (బి) టార్గెటెడ్ వర్గాల అభివృద్ధి పథకములు,

(సి) రంగపరమైన పథకాలు మరియు (డి) ఉపాధి పథకములు.

**14.3.1 ప్రాంతీయ అభివృద్ధి పథకములు :-**

1. వెనుకబడిన ప్రాంతాభివృద్ధి పథకము (BADP)
2. కమాండ్ ప్రాంతాభివృద్ధి పథకము (CADP)
3. కరువు కాటక నిర్మూలన పథకము (DPAP)
4. మెట్ట వ్యవసాయ సమగ్రాభివృద్ధి ప్రాజెక్టులు (PPIDDA)

5. ఎడారి ప్రాంతాల అభివృద్ధి పథకము (DADP)

6. సంపూర్ణ గ్రామాభివృద్ధి పథకము (WVDP)

7. గిరిజనాభివృద్ధి పథకము (TADP)

8. కొండ ప్రాంతాభివృద్ధి పథకము (HADP)

**14.3.2 టార్గెటెడ్ గ్రూప్ అభివృద్ధి పథకములు :-**

1. చిన్నకారు రైతుల అభివృద్ధి సంస్థ (SFDA)

2. సన్నకారు రైతుల మరియు వ్యవసాయ కూలీల అభివృద్ధి సంస్థ (MFALDP)

3. కనీస అవసరాల పథకము (MNP)

4. గ్రామీణ పేదల ఆర్థిక పునర్ నివాస పథకము (ERRDP)

**14.3.1.1 వెనుకబడిన ప్రాంతాభివృద్ధి పథకము :-** ఈ పథకం గ్రామీణాభివృద్ధి పథకములో ఒక భాగం. వెనుకబడిన ప్రాంతం, కాలాన్ని బట్టి అనేక మార్గాలలో గుర్తింపబడెను. ఈ వెనుకబడిన ప్రాంతాలలో పరిశ్రమలను స్థాపించుటకు గాను 1960 సం॥లో చిన్నతరహా పరిశ్రమల బోర్డు అను ఒక కమిటీని నియమించబడెను.

1. తలసరి ఆదాయం మరియు తలసరి వినియోగం ఆధారంగా పేదరికం.

2. ఉత్పాధిక వనరులను బట్టి చూస్తే జన సాంద్రత అధికంగా వుండాలి.

3. తక్కువ స్థాయి కమ్యూనికేషన్ సదుపాయాలు.

4. తక్కువ స్థాయి విద్యుత్ వినియోగం.

పై అంశాల ఆధారంగా దేశంలో 2/3వ వంతు జిల్లాలు వెనుకబడిన ప్రాంతాలుగా పరిగణింపబడినవి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన ప్రాంతాలకు అనేక రాయితీలు/ప్రోత్సాహకాలు ప్రకటించినవి. పరివేక్షణ మరియు సహకారం ప్రధానమైన నిబంధనలతో వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధిపరచడం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి సంస్థ అధికారత్వం నాయక కమిటీ ఏర్పాటు చేసింది. ఈ సంస్థ ఈ దిగువ లక్ష్యాలు కలిగి ఉన్నది.

1. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి త్వరితగతం

2. స్థానిక వనరుల ఆధారంగా మెరుగుదలైన పరిశ్రమల ప్రాజెక్టుల వేదికలు

3. వెనుకబడిన ప్రాంతాలకు తగిన సాంకేతిక సహాయాన్ని ఏర్పాటు చేయడం

4. వెనుకబడిన పరిశ్రమల అభివృద్ధికై తగిన పథకాలను అమలు చేయడం

5. వెనుకబడిన ప్రాంతాల పరిశ్రమల అభివృద్ధికి అదనపు వనరుల మార్కెట్‌ను ఏర్పాటు చేయడం

ఏది ఏమైనా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి స్థానిక వనరుల పైన మరియు ముడిసరుకులు, మానవ వనరులు రెండింటి పైన ఆధారపడి వున్నది.

**14.3.1.2 కమాండ్ ప్రాంతాభివృద్ధి పథకం :-** ఈ పథకం దేశములో 1974 - 75 సం॥లో ప్రారంభించబడినది. వ్యవసాయ వనరులను అభిలషణీయంగా ఉపయోగించుట ఈ పథక ముఖ్య ఉద్దేశ్యము. అదే విధంగా సాగునీటిని సంపూర్ణంగా

వుపయోగించి వ్యవసాయ ఉత్పత్తులను పెంపొందించుట, బహుళ పంటలను పండించుట కూడా దీని ప్రధాన అంశాలు. ఈ పథకం క్రింద ప్రత్యేక ఋణం వ్యవసాయ గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా ఇవ్వబడెను. ఈ ఋణం 50% కేంద్ర ప్రభుత్వం మరియు 25% రాష్ట్ర ప్రభుత్వం భరించెను.

1. వ్యవసాయ కాలువలను, మురికి కాలువలను నిర్మించుట
2. వాతావరణపరమైన సర్వే చేయించుట
3. భూసారాన్ని నిలువ చేయుట మరియు దాని సర్వే చేయుట
4. లబ్ధిదారులైన రైతులకు రొటేషన్ పద్ధతిలో సాగునీటిని అందించుట మరియు
5. బహుళ పంటలకు సంబంధించి రైతులకు తగిన శిక్షణ ఇచ్చుట మొ॥వి ఈ పథకములో ప్రాథమిక అంశాలు. ప్రత్యేక నీటిశాల నిర్మాణాల పథకము కూడా ఈ పథకంతో పాటు దేశంలో ప్రారంభించబడెను.

**14.3.1.3 కరువు కాటక నిర్మూలన పథకము :-** ఈ పథకము 1970-71వ సం॥ కాలములో ప్రారంభించబడెను. కరువు ప్రాంతాలలో అనగా జిల్లాలలో అభివృద్ధి పెట్టుబడులను కేటాయించుట ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. శ్రమదాయకమైన పనులను ఏర్పాటు చేయుట ఈ పథక ముఖ్య పరిశీలన. మధ్య మరియు చిన్న నీటిపారుదల, రోడ్ల నిర్మాణం, అడవులను పెంపొందించుట, భూసారాన్ని నిలువ చేయుట మరియు మంచి నీటి / త్రాగునీటి సదుపాయం కల్పించుట వంటివి ఈ పథకములో ముఖ్య పనులు.

**14.3.1.4 మెట్ట వ్యవసాయ సమగ్రాభివృద్ధి ప్రాజెక్టులు :-** ఈ ప్రాజెక్టు 1971వ సం॥లో ప్రారంభించబడెను. 12 రాష్ట్రాలలో 24 పైలట్ ప్రాజెక్టులు ప్రారంభించబడెను. మెట్ట భూమి పరిశోధనా కేంద్రాలు భారత వ్యవసాయ పరిశోధనా మండలి ఆధీనంలో ఏర్పడెను. మెట్ట పంటలలో అధిక ఉత్పాధికత పెంచుట దీని ముఖ్య ఉద్దేశ్యము. ఈ పథకం క్రింద ఈ 12 రాష్ట్రాలలో 3200 హెక్టార్ల భూమి 1973 - 74 కాలంలో సాగు చేయబడెను.

**14.3.1.5 ఎడారి ప్రాంతాల అభివృద్ధి పథకం :-** ఈ పథకం 1977వ సం॥లో ప్రారంభించబడినది. ఈ పథకము మొదటగా 16 జిల్లాలలో ప్రారంభించబడెను. రాజస్థాన్, హర్యానా, గుజరాత్ మరియు జమ్ముకాశ్మీర్ రాష్ట్రాల నుండి ఈ జిల్లాలు ఎంపిక చేయబడెను. ఎడారులను అరికట్టి పరిసర ప్రాంతాలతో సమతౌల్యత చేయటం, యిసుక స్థిరం చేయుట, భూసారం కల్పించుట మరియు నీరు నిలువ చేయుట ఈ పథకము ముఖ్య కార్యక్రమాలు.

**14.3.1.6 సంపూర్ణ గ్రామాభివృద్ధి పథకము :-** జాతీయ వ్యవసాయ కమీషన్ సలహా మేరకు ఈ పథకం ఏర్పడెను. ఈ పథకం బీహార్, ఒరిస్సా, తమిళనాడు మరియు ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో 38 గ్రామాలలో ప్రారంభించబడెను. భూ కమతాలను సమీకరించడం, భూ అభివృద్ధి చేయుట, సంపూర్ణంగా సాగునీటిని అందించుట, తగిన పంటలను పండించుట ఈ పథకము యొక్క ముఖ్య ఉద్దేశ్యములు.

**14.3.1.7 గిరిజనాభివృద్ధి పథకం :-** ప్రపంచములో ఆఫ్రికా తరువాత భారతదేశములో చాలా గిరిజన జనాభా వున్నది. ఇంచుమించు ఏదో ఒక రకమైన ధోరణిలో భారతదేశములో అన్ని రాష్ట్రాలలో గిరిజన ప్రజలున్నప్పటికీ, బీహార్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా, రాజస్థాన్ మరియు తూర్పు బెంగాల్ రాష్ట్రాలలో అధిక గిరిజన ప్రజలు నివసిస్తూ ఉన్నారు. ఆర్థిక వెనుకబాటుతనం ముఖ్యమైన గిరిజన సమస్య. మొదట పంచవర్ష ప్రణాళికలో విద్యా, ఆర్థిక మెరుగుదల, ఆరోగ్యం మరియు గృహపరమైనవి ప్రధానమైన గిరిజన సమస్యలుగా పరిగణింపబడెను. ఈ పథకం నాల్గవ పంచవర్ష ప్రణాళిక కాలములో ప్రారంభించబడెను. గిరిజన ప్రాంతాల సమస్యలు వ్యవసాయ

రంగానికి సంబంధించినవి. చిన్న కమతాలు, సాగునీటి సదుపాయాల లేమి, పురాతన పనిముట్లతో వ్యవసాయ సాగు, మెరుగైన విత్తనాలు, రసాయనిక ఎరువులు వాడకపోవుట, అధిక ఋణాలు, ఎక్కువ శాతములో వడ్డీ రేటు, మరియు వనరులు తగ్గిపోవుట, సాంకేతిక పరిజ్ఞానం మార్పు వున్నా మొత్తం వనరులలో మార్పు లేదు. ఉత్పత్తి నిలకడగా ఉన్నది. ఈ కారణాల వలన ఈ పథకం ప్రారంభించబడినది.

**14.3.1.8 కొండ ప్రాంత అభివృద్ధి సంస్థ :-** వ్యవసాయం, హార్టీకల్చర్, పశుసంపద, మధ్య మరియు చిన్న నీటి పారుదల మరియు లింక్ రోడ్ల నిర్మాణము ఈ సంస్థ యొక్క ప్రధానమైన కార్యక్రమాలు. ఈ సంస్థ 3 ప్రాజెక్టులను ప్రారంభించినది. ఈ ప్రాజెక్టుల ద్వారా 6 లక్షల ప్రజలను పరిగణనలోకి తీసుకోబడెను. 1,20,000 కొండ ప్రాంతాలలో వున్న కుటుంబాలను 5 ఎకరాల భూమి లేక తక్కువ వున్న వారిని ఈ సంస్థ ఎంపిక చేసినది. ఆరవ పంచవర్ష ప్రణాళికలో ఈ కొండ ప్రాంత అభివృద్ధి పథకం ప్రారంభించబడెను. ఈ పథకము ద్వారా అనేక కార్యక్రమాలు ఈ కొండ ప్రాంతాలలో ప్రారంభించబడెను. వాటర్ షెడ్‌లను ఏర్పాటు చేయుట, చిన్న చిన్న రోడ్ల నిర్మాణము, కాలి నడకకై వంతెనలు నిర్మించుట, సూక్ష్మ హైడల్ ఎనర్జీ మరియు మిగిలిన చిన్నచిన్న ఎనర్జీలు గిరిజన సమాజాలను విద్యుత్‌చ్ఛక్తి అందజేయుటకు ఈ సంస్థ కర్తవ్యము. పరిసరాలను రక్షించడం, గిరిజనుల యొక్క ఆర్థిక, సామాజిక స్థితిగతులను మెరుగుపరచటం ఈ సంస్థ యొక్క ప్రధాన ఉద్దేశ్యం.

**14.3.2 టార్గెటెడ్ గ్రూపు అభివృద్ధి పథకాలు :-**

**14.3.2.1 చిన్నకారు రైతుల అభివృద్ధి పథకం :-** 1969వ సం॥లో శ్రీ బి. వెంకటప్పయ్య గారి అధ్యక్షతన అఖిల భారత గ్రామీణ పరపతి సమీక్షా కమిటీని భారత రిజర్వు బ్యాంక్ వారు నియమించిరి. ఈ కమిటీ తన మధ్యంతర నివేదికలో చిన్నకారు రైతుల అభివృద్ధి సంస్థ స్థాపనకు సలహా యిచ్చినది.

ఈ సంస్థ యొక్క విధులు క్రింది విధంగా తెలియచేయబడెను.

1. చిన్నకారు రైతుల సమస్యలు పరిశీలించి, గుర్తించడం అందుకు తగిన సేవలనందించే సౌకర్యాలకు ప్రయత్నించడం.
2. కోపరేటివ్ బ్యాంకుల నుండి తగిన ఋణాలు అందించడములో చిన్నకారు రైతులకు హామీ యివ్వడం. తదుపరి వారికి మేలైన విత్తన, రసాయన ఎరువులు మరియు మిగిలిన పరికరాలు పొందేందుకు హామీ యివ్వడం.
3. పిచ్చికారీలు, క్రిమి సంహారక మందులు, ట్రాక్టర్లు అద్దెకు యిప్పించే ఏర్పాటు వంటి వాటిని ఈ సంస్థ చిన్నకారు రైతులకు కలుగజేయును.
4. పథకాలలో పాల్గొనుటకు గాను, పెట్టుబడి మరియు ఉత్పత్తి కార్యక్రమాలు చేపట్టుటలో వ్యవసాయదారులకు యీ సంస్థ సలహాలను యిస్తుండును.
5. పశువుల పెంపకం మరియు కోళ్ళ పెంపకం వంటి వాటి నుండి అదనంగా ఆదాయం వచ్చే అవకాసాలను కనుగొనుటలో ఈ సంస్థ చిన్నకారు రైతులకు సహాయం చేయును.
6. చిన్నకారు వ్యవసాయదారులకు స్వల్పకాల, మధ్యకాల మరియు దీర్ఘకాల కోపరేటివ్ ఋణాలు, పరపతిని, వ్యవసాయ పరపతి సొసైటీలు, కేంద్ర కోపరేటివ్ బ్యాంకుల నుండి పొందుటలో ఈ సంస్థ సహాయం చేసెడిది.

ఈ సంస్థ తన యొక్క కార్యక్రమాలను 1971 - 72 సం॥ కాలములో ప్రారంభించినది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల యొక్క ఆర్థిక సహాయంతో ఈ సంస్థ నడపబడెను. ఈ సంస్థ ద్వారా ఆర్థిక సహాయం పొందిన కేరళ మొదటిది, ఒరిస్సా రెండవ రాష్ట్రము.

**14.3.2.2 సన్నకారు రైతుల మరియు వ్యవసాయ కూలీల అభివృద్ధి సంస్థ :-** చిన్నకారు రైతుల అభివృద్ధి సంస్థతో పాటు, సన్నకారు రైతుల మరియు వ్యవసాయ కూలీల అభివృద్ధి సంస్థ కూడా గ్రామీణ పరపతి సమీక్షా కమీటీ సలహా మేరకు 1969వ సం॥లో స్థాపింపబడెను. సన్నకార రైతులు మరియు వ్యవసాయ కూలీలు తమ యొక్క కమతాలను మరియు నైపుణ్యతలను సంపూర్ణముగా వుపయోగించుటకు తగిన సహాయం అందించుట ఈ సంస్థ యొక్క ప్రధానమైన ఉద్దేశ్యము. వాస్తవంగా ఈ సంస్థ కార్యక్రమాలు 1971 - 72 సం॥లలో ప్రారంభించబడెను. ఈ సంస్థ యొక్క ముఖ్య విధులు -

1. అర్హత గల లబ్ధిదారులను, వారి సమస్యలను గుర్తించుట
2. భాగస్వాములకు తగిన, లాభదాయకమైన ఉపాధి అవకాశాలను కల్పించుటకు గాను తగిన ఆర్థిక కార్యక్రమాలను ఏర్పాటు చేయుట
3. ఉత్పత్తికి, ప్రోసెస్‌కి, నిలువ చేయుటకు తగిన మార్కెట్ ఏర్పాటుకు తగిన వ్యవస్థాపూర్వకమైన సదుపాయాలను మెరుగుపరుచుట, అవసరమైన పరపతిని కోపరేటివ్‌లు, కోపరేటివ్ బ్యాంకులు అందించును. సబ్సిడీలను ఈ సంస్థ అందజేయును. పెట్టుబడికి రూ॥ 3000లు ఉత్పత్తి కారకాలకు రూ॥ 500 వరకు సన్నకారురైతులకు ఈ సంస్థ అందజేయును.

**14.3.2.3 కనీస అవసరాల పథకము :-** ఏడవ పంచవర్ష ప్రణాళికలో ఈ కనీస అవసరాల పథకం ప్రారంభించబడెను. ఈ పథకము ఈ క్రింది అంశాలు కలిగి ఉండును.

1. ప్రాథమిక మరియు వయోజన విద్య
2. గ్రామీణ వైద్యం
3. గ్రామీణ త్రాగునీరు సప్లయి
4. గ్రామీణ రోడ్లు
5. గ్రామీణ విద్యుచ్ఛక్తి
6. గ్రామీణ భూమిలేని శ్రామికులకు గృహ ఆర్థిక సహాయం
7. నగర మురికివాడల పరిసరాల మెరుగుదల
8. పోషకాహారం

పేదరిక రేఖకు దిగువనున్న వారికి ఉచితంగా గాని, సబ్సిడీ ప్రకారం గానీ సేవలను ఈ పథకం ద్వారా అందించెను. పేదల యొక్క వినియోగాన్ని పెంపొందించుటకు ఈ సేవలు ఈ పథకం ద్వారా అందించబడెను.

**14.3.2.4 గ్రామీణ పేదల ఆర్థిక పునర్నివాస పథకం :-** ఈ పథకము ఆరవ పంచ వర్ష ప్రణాళికా కాలంలో అమలు చేయబడెను. 5 లక్షల నిరుపేదలకు పునర్నివాసము ఏర్పాటు చేయుట దీని ముఖ్య ఉద్దేశ్యము. ఆ ప్రకారం 3.4 లక్షల నిరుపేద కుటుంబాలు ఆర్థిక సహాయం పొందినవి. అదే విధంగా ఏడవ పంచవర్ష ప్రణాళికా కాలములో

5.5 లక్షల నిరుపేద కుటుంబాలు ఈ పథకం క్రింది ఆర్థిక సహాయం పొందినవి. ఈ సహాయం ఎక్కువ శాతం షెడ్యూల్డు కులాలు మరియు తెగలు పొందిరి. యీ పథకం సంపూర్తిగా రాష్ట్రాలకు సంబంధించినది. ఈ పథకం క్రింద రూ॥ 1200 లు ఆదాయం మించని పేద కుంటుంబములను లబ్దిదారునిగా ఎంపిక చేయబడెను. బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఆధ్వర్యములో లబ్ధిదారుల ఎంపిక జరిగెను. ఈ పథకం క్రింద 5 సెక్టర్ల పథకాలు పొందుపరచబడెను.

1. భూమి ఆధార పథకాలు, 2. పశు సంపద పథకాలు/కార్యక్రమాలు, 3. చేపల పెంపకం చేసే పథకాలు, 4. సెరీకల్చర్ కార్యక్రమాలు, 5. మిగిలిన కార్యక్రమాలు.

ఈ పథకాన్ని బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పర్యవేక్షించును, మరియు దీనిని అమలు చేయటంలో ఈయన ప్రధానమైన వ్యక్తి. అయితే వ్యయం చేయు విషయంలో ఒక ఉన్నతాధికార కమిటీ వుంటుంది.

## 14.4 సారాంశము :-

భారతదేశము నేటికీ గ్రామాలలోనే నివసిస్తూ ఉన్నది. గ్రామాలు అభివృద్ధి చెందినట్లయితే దేశము అభివృద్ధి చెందుతుంది. అదే మాదిరిగా గ్రామాలు నాశనమైనట్లయితే దేశం నాశనమౌతుంది. కావున గ్రామాలను అభివృద్ధిపరచే బాధ్యత అందరి మీద మరియు ముఖ్యంగా ప్రభుత్వాల పై వున్నది. అందుచేత ప్రభుత్వాలు దేశము యొక్క పంచవర్ష ప్రణాళికలు ప్రారంభించిన దగ్గర నుండి అనేకరకమైన పథకాలను అమలు చేసినవి. వాటిలో కొన్ని ప్రాంతాల అభివృద్ధి పథకాలని, కొన్ని టార్గెటెడ్ గ్రూప్ ఓరియంటెడ్ పథకాలని, సెక్టర్ల పథకాలని మరియు ఉపాధి కల్పనా పథకాలని నాలుగు విధాలైన పథకాలను దేశములో గ్రామీణాభివృద్ధి దృష్ట్యా అమలు చేయడమైనది. ఈ పథకాల వలన కొంత అభివృద్ధి మరికొంత సత్ఫలితాలు యివ్వకపోవటం కూడా జరిగింది. అయితే ఒకటి, పథకాలు సక్రమమైన రీతిలో అమలు చేస్తే అధిక శాతం సత్ఫలితాలు రావటానికి అవకాశమున్నది. కావున గ్రామీణాభివృద్ధి పథకాల అమలుతో ముడిపడి వున్నది అన్నది ఈ పాఠం సారాంశము.

## 14.5 ముఖ్య పదాలు :-

| | | |
|---|---|---|
| సాంద్ర వ్యవసాయం | = | ఒకే పరిమాణ భూమి పై అనేక పంటలు అధిక దిగుబడులతో పండించుట |
| యోజన | = | ప్రయోజనం |
| చిన్న సన్నకారు రైతులు | = | తక్కువ భూమి గల రైతులు |
| ఉపాధి | = | పని |
| నిర్దిష్టత | = | ఖచ్చితంగా |
| ఆధునికీకరణ | = | కొత్తదనము కల్పించుట |

## 14.6 నమూనా ప్రశ్నలు :-

1. గ్రామీణాభివృద్ధి అనగానేమి?
2. గ్రామీణాభివృద్ధి యొక్క వివిధ రకాల పథకాలు తెల్పుము.

3. ప్రాంతాల అభివృద్ధి పథకాల గూర్చి వివరింపుము.

4. టార్గెటెడ్ గ్రూప్ ఓరియంటెడ్ పథకాలను వివరింపుము.

## 14.7 చదువదగిన గ్రంథాలు :-


డేబేందర్ కె. దాస్ - గ్రామీణాభివృద్ధి యొక్క పెనుమార్పులు

బి.కే. షాహూ - భారతదేశములో గ్రామీణాభివృద్ధి

కిషోర్ చంద్ర పాఢీ - ఆధునిక భారతదేశములో గ్రామీణ అభివృద్ధి

పి.ఎన్. నాగపాల్ & ఏ.సి. మిటల్ - గ్రామీణాభివృద్ధి


**ఆచార్య మిరియాల చంద్రయ్య**

పాఠం - 15

# గ్రామీణాభివృద్ధి పథకాల ప్రణాళిక మరియు నిర్వహణ

## 15.0 లక్ష్యం :-

ఈ పాఠ్యభాగం చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలను తెలుసుకుంటారు.

గ్రామీణాభివృద్ధి పథకాలను, పథకాల ప్రణాళిక, పథకాల మదింపు, పథకాల నిర్వహణ

## విషయసూచిక :-


**15.1 ఉపోద్ఘాతము**

**15.2 గ్రామీణాభివృద్ధి పథకాలు**

**15.3 గ్రామీణాభివృద్ధి ప్రణాళిక**

**15.4 గ్రామీణాభివృద్ధి పథకాల మదింపు**

**15.5 గ్రామీణాభివృద్ధి పథకాల నిర్వహణ**

**15.6 సారాంశము**

**15.7 నమూనా ప్రశ్నలు**

**15.8 చదువదగిన గ్రంథాలు**


## 15.1 ఉపోద్ఘాతము :-

గ్రామీణ ప్రాంతాల సర్వతో ముఖాభివృద్ధి ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరుచుటను గ్రామీణాభివృద్ధిగా చెప్పవచ్చు. వ్యవసాయాభివృద్ధి, గ్రామీణ మరియు కుటీర పరిశ్రమలు, చేతి వృత్తుల అభివృద్ధి, సామాజిక మరియు ఆర్థిక మౌళిక వసతులు కల్పించుట, మానవ వనరుల సమర్థవంతమైన ఉపయోగం మొదలగు అంశాలు గ్రామీణాభివృద్ధిలో ఇమిడి ఉంటాయి. వివిధ భౌతిక, సాంకేతిక, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక మరియు వ్యవస్థాత్మక కారకాల మధ్య జరిగే చర్యల వల్ల గ్రామీణాభివృద్ధి జరుగుతుంది. ప్రపంచ బ్యాంకు అభిప్రాయంలో గ్రామీణ పేదల ఆర్థిక, సామాజిక స్థితిగతులను మెరుగుపరుచుటకు ఉద్దేశించిన వ్యూహాన్నే గ్రామీణాభివృద్ధిగా భావించారు. అంటే గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల యొక్క జీవన శైలిని వారికి లభ్యమయ్యే వివిధ వనరుల సమర్థవంతమైన ఉపయోగం, గ్రామీణ ప్రజల సామర్థ్య నిర్మాణం ద్వారా మెరుగుపరుచుటయే గ్రామీణాభివృద్ధి యొక్క ముఖ్య ఉద్దేశంగా చెప్పవచ్చు.

ఈ నేపథ్యంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు గ్రామీణాభివృద్ధి సాధించుటకు వివిధ పథకాలు రూపొందించి అమలు చేస్తున్నాయి. ఈ పథకాలు ఎలా రూపొందిస్తారు? వాటిని ప్రణాళికలలో ఎలా పొందుపరుస్తారు? ఈ పథకాల అమలుకు

ఎటువంటి చర్యలు తీసుకుంటారు? వాటి నిర్వహణకు ఎటువంటి ఏర్పాట్లు చేయటం జరిగింది. ఈ పథకాల నుంచి వచ్చే ఫలితాలు ఆశించిన రీతిలో ఉన్నాయా? ఈ ఫలితాలను మూల్యాంకన చేయడం ఎలా? ఈ అధ్యాయంలో ఈ ప్రశ్నలకు తగిన సమాధానాలు ఇవ్వటానికి ప్రయత్నం చేయటం జరిగింది. ఈ అధ్యాయం నాలుగు భాగాలుగా విభజించబడింది. మొదటి భాగంలో గ్రామీణాభివృద్ధి పథకం అంటే ఏమిటి? దాని లక్షణాలు ఏవి? పథకానికి ప్రణాళికకు గల సంబంధం ఏమిటి? గ్రామీణాభివృద్ధి ప్రణాళికలో పథకాల పాత్ర ఏమిటి? అనే విషయాలు పరిశీలించుట జరిగింది.

రెండవ భాగంలో గ్రామీణాభివృద్ధి పథకాలు ఏ విధంగా గుర్తించబడతాయి, రూపొందించబడతాయి? అనే విషయాలు చర్చించుట జరిగింది. మూడవ భాగంలో గ్రామీణాభివృద్ధి పథకాలు ప్రణాళికలో ఎలా చేర్చబడతాయి? వాటి లాభ నష్టాలను ఎలా బేరీజు వేయాలి? అనే విషయాలు వివరించడం జరిగింది. నాల్గవ భాగంలో గ్రామీణాభివృద్ధి పథకాల నిర్వహణ ఎలా ఉండాలి? వాటిని ఎలా పర్యవేక్షించాలి? వాటి అమలు ద్వారా ఆశించిన ఫలితాలు వస్తున్నాయా? ఈ పథకాల మూల్యాంకన ఎలా చేయాలి? అనే విషయాలు వివరించటం జరిగింది.

## 15.2 గ్రామీణాభివృద్ధి పథకాలు :-

పథకం (project) అంటే ఏదైనా ఒక అంశానికి లేదా అంశాలకు సంబంధించిన నిర్దష్టమైన చర్యా ప్రతిపాదన. పథకం సూక్ష్మంగా ఒక కార్యాచరణ ప్రతిపాదన అని చెప్పవచ్చు.

ప్రైస్ జిట్టింగర్ అభిప్రాయంలో వనరుల పెట్టుబడి ద్వారా నిర్దిష్టమైన లక్ష్యాలను నిర్ణీత కాలవ్యవధిలో సాధించుటను పథకంగా భావించటం జరిగింది. ప్రణాళిక రూపొందించుటకు, అమలు చేయుటకు మరియు వనరులు సమకూర్చుటకు పథకాన్ని ఒక యూనిట్‌గా తీసుకొనవచ్చు. ప్రతి పథకంలో అంతర్ సంబంధాలు గల వివిధ కార్యాలు ఒక శాస్త్రీయ పద్ధతిలో చేపట్టబడతాయి. ప్రతి పథకానికి నిర్దిష్టమైన ప్రారంభం, ముగింపు ఉంటాయి. ప్రతి పథకం యొక్క ఖర్చులు మరియు రాబడిని కొలవవచ్చు. ప్రతి పథకానికి లబ్ధిదారులు ఉంటారు. సాధారణంగా ప్రతి పథకానికి ఒక పరిపాలనా నిర్మాణం, ఒక ప్రాంతం లేదా కార్య పరిధి ఉంటుంది. పెట్టుబడికి వినియోగించే వనరులు వివిధ రకాలుగా ఉండవచ్చు. ఉదాహరణకు మానవ వనరులు, సహజ వనరులు, ఆర్థిక వనరులు లేక మూలధనం, వస్తువులు, పనిముట్లు, పశు సంపద మొదలగునవి. ఈ వనరుల పెట్టుబడి అనేది రాబడితో పాటు ఉపాధికల్పన, వస్తు సేవల కల్పన, తదితర లాభాలు పొందుటకు ఉద్దేశించబడి ఉంటుంది.

లిటిల్ మరియు మిర్‌లీస్ దృష్టిలో పథకాన్ని వనరుల పెట్టుబడికి ఉపయోగించే ఒక స్కీమ్‌గా చెప్పవచ్చు. పథకాన్ని విశ్లేషించుటకు, మూల్యాంకన చేయుటకు ఒక యూనిట్‌గా భావించాలి.

గ్రామీణాభివృద్ధి పథకాలు గ్రామీణ ప్రాంతాలలో నివసించే ప్రజల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యాన్ని సాధించుటకు ఉద్దేశించబడిన వివిధ కార్యాల ప్యాకేజీలుగా భావించవచ్చు. ఈ పథకాలకు కొన్ని ప్రత్యేకమైన లక్షణాలుంటాయి.

1. **నిర్దిష్టమైన లక్ష్యాలు :-** ప్రతి పథకానికి కొన్ని నిర్దిష్టమైన లక్ష్యాలు, ఉద్దేశాలు ఉంటాయి.
2. **నిర్ణీత కాల వ్యవధి :-** ప్రతి పథకానికి ప్రారంభము, ముగింపు ఉంటాయి.
3. **అస్థిత్వం** (Entity) :- ప్రతి పథకం నిర్దిష్టమైన అస్థిత్వం కలిగి ఉంటుంది.
4. **జట్టుగా పని చేయుట** (Team Work) :- ప్రతి పథకంలో వివిధ రంగాల నిపుణులు, వ్యక్తులు, ఒక జట్టుగా ఏర్పడి పని చేయాల్సిన అవసరం ఉంది.
5. **జీవనక్రమం :-** ప్రతి పథకానికి పెరుగుదల, సుస్థిరత మరియు క్షీణింపు దశలు ఉంటాయి.

6. **ప్రత్యేకత :-** ఏ రెండు పథకాలు అన్ని విషయాలలో ఒకే విధంగా ఉండవు. ప్రతి పథకం ఒక ప్రత్యేకతను సంతరించుకొని ఉంటుంది.

7. **కార్యక్రమావళి - వరుసక్రమం :-** ప్రతి పథకంలోని వివిధ కార్యాలు ఒక వరుస క్రమంలో అమలవుతాయి.

8. **మార్పు :-** ప్రతి పథకం తన జీవనక్రమంలో మార్పుకు లోనవుతూ ఉంటుంది.

9. **భిన్నత్వంలో ఏకత్వం :-** ప్రతి పథకంలో వైవిధ్యమైన అంశాలు ఉన్నప్పటికీ అవి అన్నీ కలిసి ఒక పథకంగా భావించడానికి వీలవుతుంది.

10. **నష్ట భయము మరియు అనిశ్చితి :-** ప్రతి పథకం నష్ట భయానికి మరియు అనిశ్చితికి గురి కాబడుతుంది.

గ్రామీణాభివృద్ధి పథకాల జీవన కాలంలో రెండు దశలుంటాయి. ఒకటి నిర్మాణ దశ, రెండు పని చేయు దశ. ఉదాహరణకు ఒక కోళ్ళ పరిశ్రమ అభివృద్ధి పథకంలో లబ్దిదారుల గుర్తింపు, స్థల సేకరణ, షెడ్డు నిర్మాణం, కోడి పిల్లల పంపిణీ వరకు నిర్మాణ దశగాను, కోడి పిల్లల పెంపకం, వాటి గుడ్లు, మాంసం అమ్మడం పని చేయు దశగాను భావించవచ్చు. మన దేశంలో అభివృద్ధి ప్రణాళికలు జాతీయ స్థాయిలో లేదా రాష్ట్ర స్థాయిలో సంవత్సరానికి ఒకసారి లేదా అయిదు సంవత్సరాలకొకసారి తయారు చేయబడతాయి. ప్రతి అభివృద్ధి ప్రణాళికలో వివిధ కార్యక్రమాలు చేర్చబడి ఉంటాయి. ఈ కార్యక్రమాలు వివిధ రంగాలకు సంబంధించి ఉంటాయి. ఉదాహరణకు గ్రామీణ విద్యుదీకరణ కార్యక్రమం, మురికి వాడల అభివృద్ధి కార్యక్రమం, మలేరియా నివారణ కార్యక్రమం, సమగ్ర గ్రామీణాభివృద్ధి కార్యక్రమం మొదలగునవి. ప్రతి కార్యక్రమంలో వివిధ పథకాలు చేర్చబడి ఉంటాయి. ఉదాహరణకు సమగ్ర గ్రామీణాభివృద్ధి కార్యక్రమంలో పాడి పరిశ్రమాభివృద్ధి పథకం, కోళ్ళ పరిశ్రమాభివృద్ధి పథకం, సాగునీటి వనరు అభివృద్ధి పథకం, వ్యవసాయాభివృద్ధి పథకం, గొర్రెల పెంపక పథకం లాంటి ఎన్నో పథకాలు ఉన్నాయి. ప్రతి పథకంలోనూ వివిధ కార్యాలుంటాయి. ఉదాహరణకు పాడి పరిశ్రమాభివృద్ధి పథకంలో లబ్దిదారుల ఎంపిక, పాడి పశువుల పంపిణీ, పశుగ్రాసం, దాణా పంపిణీ, పాల సేకరణ వంటి కార్యాలుంటాయి.

ఈ విధంగా చూస్తే గ్రామీణాభివృద్ధి పథకాలు అభివృద్ధి ప్రణాళికలో ముఖ్యపాత్రను పోషిస్తున్నట్లు స్పష్టమవుతుంది. దేశాభివృద్ధి జరగాలంటే గ్రామీణాభివృద్ధి అవసరం. అలాగే గ్రామీణాభివృద్ధి జరగాలంటే అట్టడుగు స్థాయిలో వివిధ గ్రామీణాభివృద్ధి పథకాలు సక్రమంగా రూపొందించబడి అమలుకావాలి. అయితే చాలా దేశాలలో పథకాలు తయారు చేయు సామర్థ్యం సరిగా ఉండదు. పాలకులు, అధికారులు పథక తయారీకి కావలసిన సమయాన్ని వనరులను సరిగా అంచనా వేయరు. ఎక్కువ సమయాన్ని విధి విధానాలు రూపొందించుటకు వినియోగిస్తారే కాని పథక రూపకల్పనను పూర్తిగా విస్మరించటం జరుగుతుంది. దీనివల్ల వనరులు సమర్థవంతంగా ఉపయోగించుట సాధ్యపడటం లేదు. తొందరపాటుతో రూపకల్పన చేయబడిన పథకాల అమలు కష్టసాధ్యమవుతుంది. ఆశించిన ఫలితాలు రావటం లేదు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఈ లోపాలను సరిచేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ఇందుకు పథక ప్రణాళిక మరియు నిర్వహణలోని వివిధ దశలను క్షుణ్ణంగా తెలుసుకోవలసిన అవసరం ఉంది.

పథక ప్రణాళిక మరియు నిర్వహణలో ఆరు దశలుంటాయి.

(1) పథక గుర్తింపు (Project Identification)

(2) పథక రూపకల్పన (Project Formulation)


(3) పథక మదింపు (Project Appraisal)

(4) పథక అమలు (Project Implementation)

(5) పథక పర్యవేక్షణ (Project Monitoring)

(6) పథక మూల్యాంకన (Project Evaluation)

మొదటి మూడు దశలను పథక ప్రణాళికగాను, చివరి మూడు దశలను పథక నిర్వహణ గాను భావించవచ్చు. ఈ దశలన్నింటినీ ఒక దాని తర్వాత ఒకటి నిర్దిష్టక్రమంలో చేపట్టాలి. ఈ ప్రక్రియ నిరంతరం జరుగుతుంది. కాబట్టి ఈ దశలన్నింటినీ కలిపి ఒక పథక చక్రంగా (Project Cycle) పేర్కొనవచ్చు. పథక చక్రాన్ని క్రింది విధంగా చూపవచ్చు.




## 15.3 గ్రామీణాభివృద్ధి పథకాల ప్రణాళిక :-

గ్రామీణాభివృద్ధి పథకాలు ఏ విధంగా ప్రణాళికలోకి చేర్చబడతాయి అన్న విషయాన్ని పరిశీలిస్తే పథకాల గుర్తింపు మరియు వాటి రూపకల్పన యొక్క ప్రాముఖ్యత స్పష్టమవుతుంది.

గ్రామీణాభివృద్ధి పథకాలు ఎవరు గుర్తిస్తారు? అందులో ఎటువంటి విషయాలు పరిగణనలోకి తీసుకోవాలి? గ్రామీణాభివృద్ధి పథకాలు గుర్తించే ముందు స్థానిక స్థాయిలోని పరిస్థితులను అర్థం చేసుకోవాలి. ఒక స్థానిక ప్రాంతం (గ్రామం / మండలం / జిల్లా) ఒక రాష్ట్రం మరియు దేశంలోని అంతర్భాగం కాబట్టి దేశాభివృద్ధి విధానాలు మరియు ప్రాధామ్యాలను దృష్టిలో ఉంచుకొని ఆ స్థాయిలో పథకాలు గుర్తించాలి. అంతేకాని స్థానిక ప్రాంతాలకు స్వయం నిర్ణయాధికారం ఉండదు. పథకాల గుర్తింపుకు కావలసిన సమాచారం స్థానిక స్థాయిలో లభ్యం కాకపోవచ్చు. అభివృద్ధి యొక్క లక్ష్యాలు మరియు ప్రాధామ్యాలు కూడా స్పష్టంగా ఉండవు. స్థానిక స్థాయిలో వివిధ సమూహాలు, వర్గాలు పథకాల కొరకు పోటీ పడుతుంటాయి. పథక గుర్తింపు స్థూలంగా రెండు దశలలో జరుగుతుంది.

1. పెట్టుబడి అవకాశాల అధ్యయనం (Investment Opportunity Study)
2. సాధ్యాసాధ్యాల ప్రాథమిక విశ్లేషణ (Pre-feasibility Study)

మొదటి దశలో పెట్టుబడికి గల అవకాశాలను, అంటే పథకాలను గుర్తించుట జరుగుతుంది. రెండవ దశలో ఇలా గుర్తించిన పథకాల సాధ్యాసాధ్యాల గురించి ప్రాథమిక అధ్యయనం జరుగుతుంది.

గ్రామీణాభివృద్ధి పథకాలు ఎవరు గుర్తిస్తారు అన్న విషయానికి వస్తే మూడు సంస్థలు ప్రధానంగా కన్పిస్తాయి.

1. ప్రభుత్వ సంస్థలు
2. బ్యాంకులు తదితర ఆర్థిక సంస్థలు
3. ప్రజలు, ప్రభుత్వేతర సంస్థలు

గ్రామీణాభివృద్ధి పథకాల గుర్తింపుకు మూడు పద్ధతులు అవలంబించవచ్చు.

1. పై నుంచి క్రిందికి వచ్చే ప్రక్రియ (Top-down Process) లో జాతీయాభివృద్ధి లక్ష్యాలు, ప్రాధామ్యాలు, విధి విధానాలు, పరిమితులు దృష్టిలో ఉంచుకొని స్థానిక స్థాయిలోని పరిస్థితుల నేపథ్యంలో పథకాలను గుర్తించుట.

2. క్రింది నుండి పైకి వచ్చే ప్రక్రియ (Bottom-up Process) లో కుటుంబాలు, ప్రాంతాలు, అభివృద్ధి సంస్థల అవసరాల ఆధారంగా పథకాలను గుర్తించుట.

3. భాగస్వామ్య ప్రక్రియ (Participatory Process) లో అన్ని అభివృద్ధి సంస్థల ప్రతినిధులు ప్రజలతో కలిసి ఆ ప్రాంతానికి అవసరమయ్యే పథకాలు గుర్తించుట.

మన దేశంలో సాధారణంగా మొదటి పద్ధతి అమలులో ఉన్నది. ఇటీవల మూడవ పద్ధతి యొక్క ప్రాముఖ్యతను గుర్తించటం జరిగింది. అయితే ఈ మూడు పద్ధతులు పరస్పరం పూర్తిగా భిన్నంగా ఉండునని గమనించాలి. అన్ని పద్ధతులను క్రోడీకరించి గ్రామీణాభివృద్ధి పథకాలను గుర్తించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఇలా గుర్తించిన పథకాల సాధ్యాసాధ్యాల విశ్లేషణ చేపట్టాలి. అంటే ఒక పథకం ఏ రంగానికి చెందినది? దాని లక్ష్యాలు ఏవి? వాటిని ఎలా నిర్దేశించాలి? అందులో ఇమిడి ఉన్న కార్యాలు ఏవి? అందుకు కావలసిన వనరులు, ఏర్పాట్లు ఏవి? ఆ పథకం చేపట్టవలసిన అవసరం ఏమిటి? వంటి అంశాలు అధ్యయనం చేసి ఆ పథకాన్ని చేపట్టడం సాధ్యపడుతుందా లేదా నిర్ణయించాలి. సాధ్యపడతాయి అని తేలిన పథకాలను పూర్తి స్థాయిలో రూపకల్పన చేయాలి.

పథక రూపకల్పన అంటే పథకాన్ని పూర్తిగా అధ్యయనం చేసి దానికి ఒక రూపు కల్పించడం. అభివృద్ధి చెందుతున్న దేశాలలో అన్ని పథకాలు ఒకేసారి చేపట్టడానికి కావలసిన వనరులుండవు. కాబట్టి మనకున్న పరిమిత వనరులతో ఏ పథకాలు ఎప్పుడు చేపట్టాలి అని నిర్ణయించాలంటే వివిధ పథకాల వల్ల ఒనగూరే లాభ నష్టాలను శాస్త్రీయ పద్ధతిలో బేరీజు వేయాలి. ఇందుకు పథకాలన్నింటినీ రూపకల్పన చేయాలి. ఈ పథక రూపకల్పన ద్వారా పథకాల ప్రాధామ్యాన్ని గుర్తించుటకు వీలవుతుంది.

పథక రూపకల్పన చేయాలంటే దాని యొక్క వివిధ అంశాలు క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. అందుకు వివిధ రంగాల నిపుణులు ఒక జట్టుగా ఏర్పడి పని చేయవలసిన అవసరం ఉంది. పథక రూపకల్పన చేయాలంటే కొంత సమయం పడుతుంది. ఆర్థిక వనరులు కూడా ఖర్చు పెట్టాలి. సాధారణంగా పథక రూపకల్పనకు అయ్యే ఖర్చు పథకానికి అయ్యే మొత్తం ఖర్చులో దాదాపు 2 నుండి 5 శాతం వరకు లేదా 10 శాతం వరకు ఉండవచ్చు. పథక రూపకల్పనకు ఇంత ఖర్చు చేయటం వృథా అని కొంతమంది అధికారులు, పాలకులు భావిస్తారు. అయితే ఇలా రూపొందించిన పథకాలు సక్రమంగా, నిర్ణీత కాలంలో అమలయ్యే అవకాశాలు చాలా ఎక్కువ. ఇంతవరకు అమలు జరిగిన పథకాలు పరిశీలిస్తే ఏ పథకం కూడా అనుకున్న ప్రకారం నిర్ణీతకాలంలో పూర్తి కాలేదు. అనుకున్న సమయం కన్నా రెండు నుంచి అయిదు రెట్లు ఎక్కువ సమయం తీసుకున్న పథకాలు చాలా ఉన్నాయి. మొదట అంచనా వేసిన వ్యయం కన్నా ఈ పథకాలకైన ఖర్చు ఎన్నో రెట్లు ఎక్కువగా ఉండటం మనం గమనించవచ్చు. దీనితో పోలిస్తే పథక రూపకల్పనకయ్యే ఖర్చు చాలా తక్కువ. పథక రూపకల్పన చేయటం వల్ల పథకాల అమలులో సమయం, ఆర్థిక వనరులు వృథా కాకుండా చూడవచ్చు.

పథక రూపకల్పనలో ఏడు దశలుంటాయి.

1. **సాధ్యాసాధ్యాల విశ్లేషణ** (Feasibility Analysis) **:-** పథకాన్ని పూర్తి స్థాయిలో రూపకల్పన చేయవచ్చా లేదా అనే విషయం ఈ దశలో నిర్ధారించబడుతుంది.

2. **సాంకేతిక, ఆర్థిక విశ్లేషణ** (Techno - Economic Analysis) **:-** ఈ దశలో పథకానికి గల అవసరాన్ని దానికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని విశ్లేషించుట జరుగుతుంది. అంటే ఒక పథకానికి ఎంత గిరాకీ ఉంది. దాని

పరిమాణం ఎంత ఉంటే బాగుంటుంది, ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలి అనే అంశాలు పరిశీలించటం జరుగుతుంది.

3. **పథక నిర్మాణ మరియు కార్యాచరణ విశ్లేషణ** (Project Design and Network Analysis) :- ఈ దశలో పథకం యొక్క నిర్మాణం ఎలా ఉండాలి? ఎటువంటి కార్యాలుంటాయి? వాటి మధ్య పరస్పర సంబంధాలు ఏ విధంగా ఉంటాయి? అనే విషయాలు పరిశీలన చేయటం జరుగుతుంది.

4. **వనరుల విశ్లేషణ** (Input Analysis) :- పథకానికి కావలసిన వనరులు ఏవి? అవి స్థానికంగా లభ్యమవుతాయా లేక ఇతర ప్రాంతాల / దేశాల నుంచి సమకూర్చుకోవాలా? తదితర అంశాలు ఈ దశలో పరిశీలించబడతాయి.

5. **విత్త విశ్లేషణ** (Financial Analysis) :- ఈ దశలో పథకానికి అయ్యే ఖర్చు ఎంత? దానిని ఎలా సమకూర్చుకోవాలి? తదితర అంశాలు పరిశీలిస్తారు.

6. **సామాజిక లాభ - వ్యయ విశ్లేషణ** (Social Benefit - Cost Analysis) :- ఈ దశలో పథకం వల్ల సమాజానికయ్యే మొత్తం వ్యయం, దాని ద్వారా వచ్చే లాభాలను అధ్యయనం చేయటం జరుగుతుంది.

7. **ముందస్తు పెట్టుబడి మదింపు** (Pre-Investment Appraisal) :- ఈ దశలో పైన చేపట్టిన విశ్లేషణ ఫలితాలు క్రోడీకరిస్తారు. అంటే ఈ ఫలితాలను ఏ రూపంలో పొందుపరచాలి అనే అంశం పరిగణనలోకి తీసుకుంటారు.

పైన వివరించిన విధంగా ఒక నిర్దిష్టమైన క్రమంలో పథక రూపకల్పన దశలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే పథకం యొక్క ముఖ్యాంశాలు ఒక ప్రాధామ్య క్రమంలో విశ్లేషించబడతాయి. ఇలా చేయటం వల్ల ఏ దశలోనైనా పథకం వల్ల లాభం లేదు అనే నిర్ధారణకు వస్తే తర్వాత చేపట్టాల్సిన విశ్లేషణ ఆపి వేయవచ్చు. పథక రూపకల్పన ప్రక్రియను అంతటితో ముగించి, తద్వారా వృధా ఖర్చును ఆదా చేయవచ్చు.

ఈ విధంగా రూపకల్పన చేసిన పథకాలుంటే అభివృద్ధి ప్రణాళికల తయారీ సులభమవుతుంది. అయితే ఈ పథకాలు అభివృద్ధి ప్రణాళికలో చేర్చే ముందు వాటిని క్షుణ్ణంగా సమీక్షించవలసి ఉంటుంది. ఈ ప్రక్రియనే పథక మదింపు అంటారు.

## 15.4 గ్రామీణాభివృద్ధి పథకాల మదింపు :-

గ్రామీణాభివృద్ధి పథకాలను ప్రణాళికలో చేర్చే ముందు ఈ క్రింది అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.

1. **విధాన మార్గదర్శకాలు** (Policy Guidelines) :- ప్రతిపాదించిన పథకం దేశాభివృద్ధి ప్రణాళిక యొక్క విధాన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉందా లేదా చూడాలి.

2. **సమాజ సమ్మతి** (Social Acceptance) :- ప్రతిపాదించిన పథకం ఉద్దేశించిన లబ్దిదారులకు లేక సముదాయానికి సమ్మతంగా ఉంటుందా లేదా చూడాలి.

3. **ఆర్థిక లాభాధ్యయనం** (Economic Viability) :- ప్రతిపాదించిన పథకం పై పెట్టే పెట్టుబడి నుంచి వచ్చే రాబడి లాభదాయకంగా ఉంటుందా లేదా పరిశీలించాలి.

4. **విత్త లాభాధ్యయనం** (Financial Viability) :- ప్రతిపాదించిన పథకం పై పెట్టుబడికి అప్పు తీసుకున్నట్లయితే వచ్చే రాబడి ఆ అప్పు కంతులను (loan instalments) తీర్చుటకు అనువుగా ఉంటుందా లేదా పరిశీలించాలి.

5. **సహాయ వ్యవస్థల అందుబాటు** (Adequacy of Support Systems) :- ప్రతిపాదించిన పథకం అమలుకు కావలసిన సహాయ వ్యవస్థలు సరిపడినంతగా అందుబాటులో ఉన్నాయా లేదా పరిశీలించాలి. ఉదాహరణకు ఒక పాడి పరిశ్రమాభివృద్ధి పథకం విజయవంతం కావాలంటే అందుకు అవసరమైన పశుగ్రాసం, దాణా, పశు వైద్యశాలలు ఆ ప్రాంతంలో అందుబాటులో ఉన్నాయా లేదా చూడాలి. అలాగే పాల సేకరణ కేంద్రాలు, పాల శీతలీకరణ వసతులు ఆ ప్రాంతంలో అందుబాటులో ఉన్నాయో లేదో చూడాలి. ఒక వేళ ఈ సహాయ వ్యవస్థలు సరిపడినంతగా అందుబాటులో లేకుంటే వాటిని సమకూర్చే ప్రయత్నం చేయాలి. అంతవరకు అ పథకాన్ని చేపట్టకూడదు.

6. **పర్యావరణ సుస్థిరత** (Environmental Stability) :- ప్రతిపాదించిన పథకం వల్ల ఆ ప్రాంత పర్యావరణ సుస్థిరతకు ప్రమాదం వాటిల్లుతుందా లేదా చూడాలి.

7. **నిర్వహణా సామర్థ్యం** (Mangerial Competence) :- ప్రతిపాదించిన పథకాలను నిర్వహించే సంస్థకు వాటిని సక్రమంగా అమలుచేసి పర్యవేక్షించగల సామర్థ్యం ఉందా లేదా పరిశీలించాలి. ఒకవేళ అటువంటి సామర్థ్యం లేకపోతే ఆ సంస్థలోని ఉద్యోగులకు తగిన శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలి.

8. **అనుగుణ్యత** (Consistency Check) :- ప్రతిపాదించిన పథకాలు ప్రస్తుతం అమలవుతున్న పథకాలకు అనుగుణంగా ఉన్నాయా లేక వాటి సక్రమ అమలుకు భంగం కల్గించే విధంగా ఉన్నాయా చూడాలి. ఉదాహరణకు సమగ్ర గ్రామీణాభివృద్ధి కార్యక్రమం క్రింద ఒక మండలంలో ప్రస్తుతం సామాజిక అడవుల పెంపక పథకం అమలులో ఉన్నదనుకుందాం. ఈ నేపథ్యంలో మేకల అభివృద్ధి పథకం ప్రతిపాదిస్తే అటువంటి పథకాన్ని చేపట్టకూడదు. ఎందుకంటే అది అప్పటికే అమలవుతున్న పథకానికి భంగం కలిగించవచ్చు.

ప్రతిపాదించిన పథకాలను వివిధ అంశాల పరంగా అధ్యయనం చేసి అన్ని రకాలుగా ఆ పథకాలు సమాజానికి లేదా సముదాయానికి లాభదాయకంగా, ప్రయోజనకరంగా ఉండే అవకాశాలుంటే అటువంటి పథకాలను మాత్రమే ప్రణాళికలో చేర్చుటకు అనువైనవిగా భావించాలి. పైన పేర్కొన్న అంశాలలో సంతృప్తికరమైన ఫలితాలు వచ్చే అవకాశం లేని పథకాలను నిరాకరించాలి. ప్రతిపాదించిన పథకాలకు ఆచరణ, రూపు ఇచ్చే ముందు పై విధంగా మదింపు చేయవలిసన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో మదింపు అంటే "సాధ్యా సాధ్య సమీక్షా ప్రక్రియ"గా భావించవచ్చు. ఒక పథకం ప్రతిపాదన దశలో ఉన్నప్పుడు అది సాధించబోయే ఫలితాలపట్ల "వృత్తిపరమైన నిపుణ అంచనా"గా మదింపును భావించవచ్చు. ప్రతిపాదించిన పథకాల మెరుగుదలకు, ఆర్థిక, వాణిజ్య, సాంకేతిక సాఫల్యతకు తగిన సూచనలివ్వడం కూడా మదింపులో ఒక ముఖ్యాంశం.

జాతీయ స్థాయిలో పథక మదింపు కోసం 1972లో ప్రణాళికా సంఘంలో పథక మదింపు విభాగాన్ని (Project Appraisal Division) ఏర్పాటు చేయటం జరిగింది. ఈ విభాగం పథకాల సాంకేతిక, ఆర్థిక మదింపుకు తగిన ప్రామాణికాలను రూపొందిస్తుంది. జాతీయ స్థాయిలో అంచనాలకు సంబంధించిన సూచీ నామాలను (parameters) నిర్ణయిస్తుంది. అంతేకాక ప్రభుత్వ రంగ పరిశ్రమలకు ప్రతిపాదనల తయారీలో సహకరించుట, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించుట పథకాల వ్యయ ప్రయోజనాల విశ్లేషణ కూడా ఈ విభాగం చేపడుతుంది.

అయితే స్థానిక స్థాయిలో పథక మదింపుకు సరైన ఏర్పాట్లు లేవనే చెప్పవచ్చు. చాలా సందర్భాలలో ఈ ప్రక్రియ గ్రామీణాభివృద్ధి పథకాల విషయంలో సరిగా చేపట్టడం లేదు. అందువల్ల పథకాల అమలులో చాలా సమస్యలు ఎదురవుతుండటం మనం గమనించవచ్చు.

## 15.5 గ్రామీణాభివృద్ధి పథకాల నిర్వహణ :-

పథక రూపకల్పన, మదింపుతో సంబంధం లేకుండా ఎన్నో గ్రామీణాభివృద్ధి పథకాలు ప్రణాళికలోకి చేర్చబడుతున్నాయి. వీటి అమలు ఏ విధంగా ఉండాలి? వీటి పర్యవేక్షణ ఎలా జరుగుతుంది? వీటి నిర్వహణకు ఎటువంటి ఏర్పాట్లున్నాయి అనే అంశాలు ఈ భాగంలో పరిశీలించబడతాయి.

పథకాల అమలు అనేది వాటి జీవనక్రమంలో చాలా ముఖ్యమైన అంశం. ఎందుకంటే ఈనాడు గ్రామీణాభివృద్ధి పథకాల అమలు ఆలస్యం కావటంతోబాటు అందులో ఎన్నో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయి. ప్రతి గ్రామీణాభివృద్ధి పథకం కూడా ఒక నిర్ణీత ప్రణాళిక ప్రకారం అమలు కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈ పథకాల అమలు సరిగా నిర్వహించుటకు కావలసిన ఏర్పాట్లు చేయవలసిన అవసరం కూడా ఉంది. ఈ దశను పథక అమలు ప్రణాళిక (Project Implementation Planning) అనవచ్చు. ఈ ప్రణాళిక తయారీలో అయిదు ఘట్టాలుంటాయి.

1. పథకంలోని వివిధ కార్యాల పట్టికను తయారు చేయడం
2. ఈ కార్యాలు ఏ క్రమంలో అమలు చేయవచ్చో నిర్ధారించడం
3. ఒక్కో కార్యానికి అవసరమయ్యే సమయాన్ని అంచనా వేయడం
4. ఈ కార్యాలను ఒక కార్యాచరణ పట్టికలో పొందుపరచడం
5. ఈ కార్యాచరణ పట్టికను విశ్లేషించడం

ఈ విధంగా ఒక పథకంలో ఎన్ని కార్యాలుంటాయి. వాటి మధ్య పరస్పర సంబంధాలు ఎలా ఉన్నాయి, ఏ కార్యాలను ఏక కాలంలో చేపట్టవచ్చు, ఏ కార్యాలను ఒక దాని తర్వాత ఒకటి చేపట్టాలి, అన్ని కార్యాలను పరిగణనలోకి తీసుకుంటే పథకాన్ని అమలు చేయుటకు ఎంత సమయం పడుతుంది? పథక అమలులో, అంటే వివిధ కార్యాలను చేపట్టుటలో ఏమైనా వెసలుబాటు ఉంటుందా అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించుట జరుగుతుంది. ఈ పరిశీలన ఆధారంగా పథక అమలుకు ఒక ప్రణాళికను తయారు చేయవచ్చు. ఈ ప్రణాళికలో పథకంలోని అతి ముఖ్యమైన కార్యాలు ఏవి అనే విషయం స్పష్టమవుతుంది. అంటే ఈ కార్యాలు ఆలస్యం కావడం వల్ల పథక అమలు కూడా ఆలస్యమవుతుందని అర్థం చేసుకోవాలి. పథక నిర్వాహకులకు ఏ కార్యాల పై దృష్టి పెట్టాలో దీని వల్ల స్పష్టమవుతుంది. పథక అమలుకు ఎంత సమయం పడుతుంది అనే విషయం కూడా స్పష్టమవుతుంది. అంతేకాక పథక నిర్వాహకులకు పథక అమలును పర్యవేక్షించుటకు దోహదం చేస్తుంది.

పథక పర్యవేక్షణ అనగా ఒక పథక అమలును ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలించి, ఏమైనా సమస్యలు ఎదురైనపుడు లేదా లోపాలు దొర్లినపుడు వాటిని అధిగమించుటకు సవరణ చర్యలు చేపట్టి ఆ పథకాన్ని నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి అయ్యేలా చూడడం. పథక పర్యవేక్షణలో క్రింది విషయాలు పరిశీలించడం జరుగుతుంది.

1. పథకంలోని వివిధ కార్యాలు ముందుగా నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం అమలవుతున్నాయా లేదా ఎక్కడైనా ఆలస్యం జరుగుతుందా పరిశీలించడం.
2. పథక అమలు ద్వారా ఆశించిన ఫలితాలు వస్తున్నాయా లేదా చూడడం.
3. పథక అమలులో నిమగ్నమైన వివిధ శాఖల మధ్య సమన్వయం సరిగా ఉందా లేదా చూడడం
4. పథక అమలులో ప్రజల భాగస్వామ్యం ఆశించిన స్థాయిలో ఉందా, అది పథక సుస్థిరతకు దారి తీస్తుందా లేదా చూడడం.

పర్యవేక్షణ అనేది పథక నిర్వాహకులకు తగిన సమయంలో సరైన నిర్ణయం తీసుకునేందుకు ఉపకరిస్తుంది. ముఖ్యంగా ఒక పథకాన్ని నిర్ణీత సమయంలో పూర్తి చేయవచ్చా లేక ఎక్కువ సమయాన్ని కేటాయించవలసిన అవసరముందా అనే విషయంలో నిర్ణయం తీసుకోవచ్చు. అలాగే వనరుల కేటాయింపులో ఏమైనా మార్పులు చేసే విషయంలో కూడా సరైన నిర్ణయం తీసుకోవచ్చు. అంటే వనరులను అధిక స్థాయిలో కేటాయించుట వల్ల నిర్ణీత సమయంలో ఒక పథకాన్ని పూర్తి చేయవచ్చా అనే విషయంలో నిర్ణయం తీసుకోవచ్చు. అలాగే ఒక పథకానికి కేటాయించిన నిధులు ఏ కారణం వల్లనైనా వినియోగం కాకపోతే వాటిని ఇతర పథకాలకు మళ్ళించే విషయం పై కూడా నిర్ణయం తీసుకోవచ్చు. అంతే కాకుండా ఒక పథకాన్ని విజయవంతంగా పూర్తి చేయుటకు కావలసిన సహాయ వ్యవస్థల ఏర్పాటు పై తగిన సమయంలో నిర్ణయం తీసుకోవచ్చు.

పథక పర్యవేక్షణకు ముఖ్యంగా కావలసినది సమాచారం. ఈ సమాచారం నమ్మదగినదిగా, సందర్భానికి తగినదిగా, సరైన సమయంలో వీలైనంత క్లుప్తంగా (పట్టికల రూపంలో) సేకరించవలసిన అవసరం ఉంది. అలా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి దాని ఆధారంగా పథక అమలుపై ఒక నిర్ధారణకు రావాలి. ఈ నిర్ధారణ ఆధారంగా ఎటువంటి సవరణ చర్యలు తీసుకోవాలో నిర్ణయించాలి. ఇలా తీసుకున్న నిర్ణయాలను సత్వరం అమలు చేయాలి. ఆ నిర్ణయాల అమలు ఏ విధంగా ఉంది అనే దానిపై మళ్ళీ సమాచారం సేకరించాలి. ఈ విధంగా ఈ ప్రక్రియ పథక అమలుకాలంలో అనేకసార్లు చేయవలసి వస్తుంది.

గ్రామీణాభివృద్ధి పథకాల అమలును పర్యవేక్షించాలంటే పథక నిర్వహణా సమాచార వ్యవస్థను (Project Management Information System) ఏర్పాటు చేయాలి. ఈ వ్యవస్థను ఏర్పాటు చేయుటకు అయిదు చర్యలు తీసుకోవాలి.

1. గ్రామీణాభివృద్ధి పథకాల పనితీరు తెలియచేసే సమాచారం ఏమిటి అన్నదానిపై స్పష్టమైన అవగాహనకు రావాలి.
2. ఇలా నిర్ణయించిన సమాచారం ఏ స్థాయి నుంచి ఏ స్థాయికి అందించాలి అనే విషయం పై ఒక నిర్ధారణకు రావాలి.
3. ఈ సమాచారం ఒక స్థాయి నుంచి మరొక స్థాయికి ఎంత తరుచుగా అందించాలి అనే విషయం పై ఒక నిర్ధారణకు రావాలి.
4. సమాచారం ఏ రూపంలో అందించాలి, ఎటువంటి పట్టికలు తయారు చేయాలి అనే విషయాన్ని నిర్ణయించాలి.
5. సమాచారాన్ని అందించే ఉద్యోగులకు, ఇతర వ్యక్తులకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలి.

ఈ విధంగా ఏర్పాటు చేసిన నిర్వహణా సమాచార వ్యవస్థ ఉంటే గ్రామీణాభివృద్ధి పథకాలను సమర్థవంతముగా పర్యవేక్షణ చేయవచ్చు. ఆచరణలో చూస్తే 1980లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (District Rural Development Agency) ఏర్పాటు అయ్యేవరకు గ్రామీణాభివృద్ధి పథకాల నిర్వహణకు పటిష్టమైన చర్యలు తీసుకోలేదని చెప్పవచ్చు. ఈ సంస్థలు ఏర్పాటు చేసిన తర్వాత సమాచార వ్యవస్థకు కొంత ప్రాధాన్యత నివ్వడం జరిగింది. అయినప్పటికీ గ్రామస్థాయిలో ఈ సమాచార వ్యవస్థ ఇంకా పటిష్టంగా లేదని చెప్పవచ్చు. అంతేకాక ఇటువంటి సమాచార వ్యవస్థ గ్రామీణాభివృద్ధి పథకాలు నిర్వహించే అన్ని ప్రభుత్వ శాఖలలోనూ ఏర్పాటు చేయాలి. వివిధ శాఖల మధ్య సమన్వయం సాధించాలంటే ఇది ఎంతో అవసరం. ఇటీవలి కాలంలో సమాచార వ్యవస్థ యొక్క ప్రాముఖ్యత గుర్తించినప్పటికీ అన్ని శాఖలలో అన్ని స్థాయిలలో దీనిని ఇంకా పటిష్టం చేయవలసిన అవసరముందని చెప్పవచ్చు.

పథక నిర్వహణలో ఇంకొక ముఖ్యమైన అంశం పథక మూల్యాంకన. గ్రామీణాభివృద్ధి పథకాల అమలు చేపట్టిన తర్వాత అవి ఎంతవరకు తమ లక్ష్యాలను సాధించాయి, ఆశించిన ఫలితాలు వస్తున్నాయా / వచ్చాయా లేదా అనే అంశాన్ని పరిశీలించవలసిన అవసరం ఉంది. దీనినే పథక మూల్యాంకనగా పేర్కొనవచ్చు. పథక మూల్యాంకన ఆ పథకం యొక్క లక్ష్యాలు, ఉద్దేశాలను దృష్టిలో పెట్టుకొని అవి ఎంతమేరకు నెరవేరాయి, నెరవేరకపోతే కారణాలు ఏమిటి అనే విషయాన్ని అధ్యయనం చేస్తుంది. అంటే ఆ పథక లక్ష్యాలు, ఉద్దేశాలు పూర్తి స్థాయిలో నెరవేరితే ఆ పథక విజయానికి దారితీసిన పరిస్థితులు తెలుసుకోవాలి. అలాగే అవి కొంతమేరకే నెరవేరితే అలా ఎందుకు జరిగిందో తెలుసుకోవాలి. ఒక పథకం తన లక్ష్యాలను సాధించుటలో విఫలమైతే ఆ వైఫల్యాలకు కారణాలు శోధించాలి. ఈ విధంగా చేయటం వలన భవిష్యత్తులో పథకాలు విజయవంతంగా అమలు చేయుటకు వీలు కల్గుతుంది.

అలాగే ఒక చోట విజయవంతమైన పథకాలు ఇతర చోట్ల అమలు చేయటానికి అవకాశం ఉంది. ఒక పథకంలో గుర్తించిన లోపాలు ఇతర పథకాలలో దొర్లకుండా జాగ్రత్తలు తీసుకొనే అవకాశం కూడా ఉంది. పథకాలు సందర్భానికి తగినట్లు రూపొందించబడ్డాయా అనే విషయం పై కూడా ఒక నిర్ధారణకు రావచ్చు.

గ్రామీణాభివృద్ధి పథకాలు పేదరిక తగ్గింపుకు ఉద్దేశించినవి కాబట్టి, ఆ లక్ష్య సాధనలో అవి ఎంతమేరకు సఫలీకృతమైనాయి అనే విషయం పై మూల్యాంకన దృష్టి సారిస్తుంది. అంటే, ఆయా పథకాలలో పేదలకు ఎంతవరకు ప్రాతినిధ్యం లభించింది, వారు ఎంతవరకు ఆ పథకాలను సద్వినియోగం చేసుకున్నారు, ఎన్ని పేద కుటుంబాలు శాశ్వత ప్రాతిపదికన దారిద్ర్య రేఖను దాటగలిగాయి అనే అంశాలు పరిశోధించబడతాయి. ఈ విధంగా చూస్తే మూల్యాంకన లబ్దిదారులకు ప్రాధాన్యతనిస్తుంది. ఏ సమూహాలు లబ్ది పొందాయి లేక అధ్వాన్న పరిస్థితుల్లోకి నెట్టబడ్డాయి, ఎవరు ప్రత్యక్షంగా లబ్ధిపొందుతారు, ఎవరు పరోక్షంగా లబ్ది పొందారు అనే విషయం పై కూడ దృష్టి సారించటం జరుగుతుంది.

మూల్యాంకన చేసే సంస్థను బట్టి దానిని రెండు రకాలుగా పేర్కొనవచ్చు.

1. అంతర్గత మూల్యాంకన (Internal Evaluation) లేదా స్వీయ మూల్యాంకన (Self Evaluation)
2. బాహ్య మూల్యాంకన (External Evaluation)

ఏ సంస్థ పథకాలను చేపడుతుందో ఆ సంస్థయే మూల్యాంకన చేపడితే దానిని అంతర్గత లేక స్వీయ మూల్యాంకన అనవచ్చు. ఇటీవలి కాలంలో అట్టడుగు స్థాయిలో స్వీయ మూల్యాంకనకు ప్రాధాన్యత పెరుగుతున్నది. అలా కాకుండా పథకాల అమలుకు సంబంధం లేని సంస్థలు మూల్యాంకన చేపడితే దానిని బాహ్య మూల్యాంకనగా పేర్కొనవచ్చు. బాహ్య మూల్యాంకనలో ఎటువంటి ముందస్తు ఉద్దేశాలు లేకుండా, నిష్పక్షపాతంగా పథకాలకు సంబంధించిన వివిధ అంశాలు క్షుణ్ణంగా పరిశీలించుటకు అవకాశం ఉంది. బాహ్య మూల్యాంకనకున్న ప్రాధాన్యత దృష్ట్యా పథకాల మూల్యాంకనను పరిశోధనా సంస్థలకు, విశ్వ విద్యాలయాలకు అప్పగిస్తారు. అనేక ప్రభుత్వేతర సంస్థలు కూడా ఇదే పద్ధతి అవలంబిస్తున్నాయి.

మూల్యాంకన చేసే సమయాన్ని బట్టి దానిని మూడు రకాలుగా విభజించవచ్చు.

1. పథక అమలుతో బాటు జరిగే మూల్యాంకనను సమాంతర మూల్యాంకన (Ongoing or Concurrent Evaluation) గా పేర్కొనవచ్చు.
2. పథక అమలు పూర్తి అయిన వెంటనే చేపట్టే మూల్యాంకనను అంత్య మూల్యాంకన (Terminal or Summative Evaluation) గా పేర్కొనవచ్చు.
3. పథక అమలు పూర్తి అయిన కొంతకాలం తర్వాత ఆ పథకం నుంచి వచ్చే ప్రయోజనాల స్థిరీకరణ (stabilization of benefits) జరిగినపుడు మూల్యాంకన చేస్తే దానిని కార్యానంతర మూల్యాంకనగా (ex-post evaluation) పేర్కొనవచ్చు.

గ్రామీణాభివృద్ధి పథకాల నిర్వహణలో మూల్యాంకన పాత్ర ఎంతో ముఖ్యమైనది. దీని వల్ల ఏ పథకాలు విజయవంతమైనాయో, ఏ పథకాలు వైఫల్యం చెందాయో, వాటికి గల కారణాలు ఏవి, అనే విషయాలు స్పష్టం కావటం వల్ల భవిష్యత్తులో ఇటువంటి పథకాలను మరింత సమర్థవంతంగా, పటిష్టంగా రూపొందించవచ్చు, అమలు చేయవచ్చు. మనకున్న పరిమిత వనరులను వృధా కాకుండా సక్రమంగా వినియోగించటానికి సరైన చర్యలు చేపట్టవచ్చు. మూల్యాంకన యొక్క ప్రాముఖ్యత గుర్తించటం వల్లనే అనేక అభివృద్ది సంస్థలు స్వీయ మూల్యాంకన ఏర్పాట్లతో బాటు బాహ్య మూల్యాంకనకు కూడా సిద్ధపడుతున్నాయి. కొన్ని అంతర్జాతీయ, జాతీయ బ్యాంకులు, సంస్థలు తమ పథకాల సక్రమ నిర్వహణకు ఇవి ఎంతో ఉపకరిస్తాయి.

## 15.6 సారాంశము :-

ఈ అధ్యాయంలో గ్రామీణాభివృద్ధి పథకాల ప్రణాళిక మరియు నిర్వహణలోని వివిధ అంశాలు శాస్త్రీయ బద్ధంగా ఎలా చేయవచ్చో వివరించబడింది. గ్రామీణాభివృద్ధి పథకాలు విజయవంతంగా అమలు కావాలంటే పథకాల గుర్తింపులో ప్రజల భాగస్వామ్యం ఉండాలి. పథకాలు స్థానిక అవసరాలకు తగినట్లుగా ఉండాలి. ఇలా గుర్తించిన పథకాలను పూర్తి స్థాయిలో పెట్టుబడి ప్రతిపాదనలుగా తీర్చిదిద్దటమే పథక రూపకల్పన. ప్రతిపాదిత పథకాలను అన్ని అంశాలలో, ముఖ్యంగా ఆర్థిక, సాంకేతిక పరంగా క్షుణ్ణంగా సమీక్షించటాన్ని పథక మదింపుగా పేర్కొనవచ్చు. అలా మదింపు చేసిన పథకాలను మాత్రమే ప్రణాళికలో చేర్చాలి. ఈ పథకాలను అమలు చేసే ముందు ఒక కార్యాచరణ ప్రణాళికను తయారు చేయాలి. ఈ చర్యలన్నీ సక్రమంగా చేపడితే ఆయా పథకాల అమలుతీరును పర్యవేక్షించటానికి వీలు కల్గుతుంది. గ్రామీణాభివృద్ధి పథకాలను పర్యవేక్షించాలంటే సమాచార నిర్వహణా వ్యవస్థను ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. చివరగా గ్రామీణాభివృద్ధి పథకాలు ఏ మేరకు విజయవంతమయినాయో లేదా వైఫల్యం చెందాయో తెలుసుకొనుటకు మూల్యాంకన చేపట్టాలి. అభివృద్ధి చెందుతున్న దేశాలు తమకున్న పరిమిత వనరులతో గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను పేదరిక తగ్గింపు దిశగా చేపట్టాలంటే పథకాల గుర్తింపు నుంచి మూల్యాంకన వరకు అన్ని అంశాలకు ప్రాధాన్యతనివ్వవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## 15.7 నమూనా ప్రశ్నలు :-

1. గ్రామీణాభివృద్ధి పథకాల ప్రణాళికలోని వివిధ అంశాలు వివరింపుము.
2. గ్రామీణాభివృద్ధి పథకాల నిర్వహణలోని వివిధ అంశాలు వివరింపుము.
3. పథక చట్రంలోని వివిధ దశలను తెల్పుము.
4. పథక రూపకల్పన పద్ధతిలోని దశలు వివరింపుము?
5. పథక పర్యవేక్షణ యొక్క ఆవశ్యకతను పరిశీలించుము?
6. పథక మూల్యాంకన అనగానేమి? అందులోని రకాలను తెల్పుము?

## 15.8 చదువదగిన గ్రంథాలు :-


| | | | |
|---|---|---|---|
| 1. | Price Gittinger (1984) | : | Economic Analysis of Agricultural Projects, the John Hopkins University Press, Baltimore and London |
| 2. | Little IMO & JA Mirrlees (1974) | : | Project Appraisal and Planning for Developing Countries, Oxford & IBH Publishing Co, New Delhi |
| 3. | Pitale, R.L. (1987) | : | Project Appraisal Technique, Oxford & IBH Publishing Co, New Delhi |
| 4. | UNIDO (1978) | : | Guide to Practical Project Appraisal, Oxford & IBH Publishing Co, New Delhi |
| 5. | Chowdhary, S. (1988) | : | Project Management, Tata Mc Graw Hill Publishing Co, New Delhi |
| 6. | Mridula Krishna (1983) | : | Project Planning in India, IIPA, New Delhi |


డా॥ జి. శ్రీధర్

పాఠం - 16

# గ్రామీణాభివృద్ధి - మహాత్మాగాంధీ నమూనా

## 16.0 లక్ష్యం :-

ఈ పాఠం చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకోగలరు.

* మహాత్మాగాంధీ నమూనాలోని ప్రధాన అంశాలు
* స్వాతంత్ర్యానంతరం ఆ నమూనాని పాటించనందున ప్రస్తుతం భారతదేశం ఎదుర్కొంటున్న సమస్యలు
* ప్రస్తుతం మన ఆర్థిక వ్యవస్థలోని లోపాల సవరణకు మహాత్మాగాంధీ నమూనా అమలు

**విషయసూచిక :-**


**16.1 విషయ పరిచయము**

**16.2 ఆదర్శ గ్రామము**

**16.3 పరిపాలనా వికేంద్రీకరణ**

**16.4 గ్రామీణ ఆర్థికవ్యవస్థ**

**(ఎ) వ్యవసాయము /**

**(బి) ఉద్యోగిత**

**(సి) పారిశ్రామికీకరణ**

**16.5 ధర్మకర్తృత్వము**

**16.6 గాంధీజీ నమూనా - గ్రామీణాభివృద్ధికి మార్గదర్శకత**

**16.7 సారాంశము**

**16.8 నమూనా ప్రశ్నలు**

**16.9 చదువదగిన గ్రంథాలు**


## 16.1 విషయ పరిచయము :-

పలువురి అభిప్రాయం ప్రకారం మహాత్మాగాంధీ గ్రామీణాభివృద్ధి నమూనా, ప్రస్తుత ప్రపంచ పరిస్థితులలో ఆదర్శప్రాయమైనదే కాని ఆచరణ సాధ్యమైనది కాదు. కాని ఈనాటి మన దేశ సమస్యలను పరిశీలన చేస్తే వాటికి పరిష్కార మార్గం మహాత్మాగాంధీ నమూనాలో ఉన్నదని ద్యోతకమౌతుంది. భారతదేశానికి పల్లెలు పట్టుకొమ్మలు. అటువంటి పల్లెల అభివృద్ధికి మార్గమును గాంధీ గ్రామీణాభివృద్ధి నమూనా తెలియచేస్తున్నది. భారతదేశములోని గ్రామాల అభివృద్ధికి మహాత్మాగాంధీ నమూనాను అమలుపరుచుటే అన్నింటికన్నా మేలైన మార్గము.

సామాజిక వ్యవస్థను పునరుద్ధరించటానికి మహాత్మాగాంధీచే సూచించబడిన అభివృద్ధి నమూనాలో భౌతికాంశాల కన్నా నైతిక విలువలకు అధిక ప్రాధాన్యత ఇవ్వబడినది. కాబట్టి దీనిని పలువురు ఆదర్శప్రాయమైన సమాజం రామరాజ్యంలాగా ఉండాలి. అంతమాత్రం చేత గాంధీ రాచరిక ప్రభుత్వాన్ని సమ్మతించినట్లు కాదు. రామరాజ్యంలో ప్రజాభిప్రాయానికి ఉన్నంత విలువ ఆదర్శ గ్రామ పరిపాలనలో ఉండాలనేది ఆయన అభిమతం. ప్రజలకు అనంతమైన అధికారాలు ఉండాలని ఈ అధికారాలు నైతిక విలువలకు లోబడి ఉండాలి అన్నారు. అనగా ఆదర్శ సమాజంలో ప్రజలకు సార్వభౌమాధికారాలు (Sovereign Powers) ఉండాలి. కాని వారు నీతి, న్యాయాలకి, ధర్మానికి కట్టుబడి ఉండాలని మహాత్మాగాంధీ సూచించారు.

## 16.2 ఆదర్శ గ్రామము :-

భారతదేశంలోని అధిక జనాభా పల్లెలలో నివసిస్తున్నారు. గ్రామాలు భారతదేశ అభివృద్ధికి పట్టుకొమ్మలు. అటువంటి గ్రామాలు నశ్వరమైతే దేశం అభివృద్ధి చెందదని చెప్తూ గ్రామాల ప్రాధాన్యతను మహాత్మాగాంధీ విశదీకరించారు. మనదేశంలో ప్రాచీన కాలం నుంచీ కూడా బలమైన స్థానిక సంస్థలుండేవి. అది ప్రజలను విదేశీ దండయాత్రల నుంచి రక్షించి ప్రజలకు ప్రశాంతమైన జీవితాన్ని అందినవి. బ్రిటీష్ పరిపాలనకు ముందర భారతదేశంలో గల ఇట్టి గ్రామాలు వృత్తి వికేంద్రీకరణలో స్వయం సమృద్ధంగా ఉండేవని గాంధీ తెలిపారు. ఇట్టి స్వయం పోషకాలైన గ్రామాలను బ్రిటీష్‌వారు భారత దేశాన్ని వలస ఆర్థిక వ్యవస్థగా చేసుకుని క్రమమైన పథకం ప్రకారం నాశనం చేశారు. అన్యాగారాల వలె ఉన్న గ్రామాలను బ్రిటీష్ ప్రభుత్వం "శాశ్వత శిస్తు నిర్ణయ విధానం" వంటి భూస్వామ్య పద్ధతుల ద్వారా నాశనం చేశారు. వ్యవసాయదారులను వ్యవసాయ కూలీలుగా చేశారు. స్వేచ్ఛా వ్యాపారం మిషతో కుల వృత్తులను కూలదోశారు. వారు ప్రవేశపెట్టిన రైలు మార్గాల వలన గ్రామీణ ప్రజలు పాశ్చాత్య నాగరికతకు అలవాటుపడి వ్యవసాయోత్పత్తులు అమ్మగా వచ్చిన ద్రవ్యాన్ని విదేశీ వస్తువులపై మోజులో మంచినీళ్ళలాగా ఖర్చు పెట్టారు. "స్వదేశీ" భావనను మరిచారు. గాంధీజీ ప్రకారం "స్వదేశీ" అనగా భారతీయత అని అర్థం. అట్టి భారతీయతను ప్రతిబింబిస్తూ స్వయం సమృద్ధంగా స్వయం పోషకాలుగా ఉండే గ్రామాల నిర్మాణానికి కావలసిన ప్రధాన అంశాలు ఈ క్రింది విధంగా పేర్కొనబడ్డాయి.

## 16.3 వికేంద్రీకరణ :-

గ్రామీణ పునర్నిర్మాణానికి సామాజిక. రాజకీయ అధికార, పాలనా వికేంద్రీకరణ ఉండాలి. అట్టి వికేంద్రీకరణను, ప్రాచీన కాలమందలి గణతంత్ర గ్రామీణ వ్యవస్థను పునః ప్రతిష్ట చేయుటకు మహాత్మాగాంధీ గ్రామ పంచాయితీల స్థాపనను "గ్రామ స్వరాజ్" పేరుతో తన నమూనాలో పేర్కొన్నారు. గ్రామ స్వరాజ్ అంటే స్థానిక పాలనా నిర్ణయాధికారాలు కొద్ది మంది కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు కాక గ్రామ పంచాయితీలకు ఉండాలి. ఈ గ్రామ పంచాయితీ ప్రజా ప్రతినిధులచే ఎన్నుకోబడిన స్థానిక స్వపరిపాలనా సంస్థ. ఈ స్థానిక సంస్థలకు పరిపాలన న్యాయ, శాసన సంబంధిత అంశాల పై సంపూర్ణ అధికారాలు ఉండాలి. వీరు తమ వనరులను తామే ఏర్పాటు చేసుకొన గలిగి స్థానిక బాధ్యతలను స్వీకరించగలిగి ఉండాలి. బలహీన వర్గాలను, అస్పృశ్యులను ఆదుకోవాలి. గ్రామంలో ఎటువంటి స్పర్థలు తలెత్తినా ప్రజలు బయట కోర్టులకు వెళ్ళే అవసరం లేకుండా గ్రామ పంచాయితీలు పరిష్కరించగలిగి ఉండాలి.

**అహింసాయుత మార్గం ద్వారా గ్రామాల రక్షణ :-** ఈనాటి సాయుధ, సైనిక, పోలీసు దళాల గురించి మహాత్మాగాంధీ ప్రస్తావించ లేదు. ఆయన ప్రకారం గ్రామాలను బహిర్గత శక్తుల నుంచి అంతర్గత కలహాల నుంచి రక్షించుటకు మానవాతీత శక్తి పై అపార నమ్మకం ఉన్న స్వచ్ఛంద సేవకులు (సైనికులు) ఉండాలి. వీరు ధార్మికత, నైతికత కలిగిన వారు కాబట్టి తమ ప్రాణాలను కూడా లెక్కించక ప్రజలకు రక్షిస్తారు.

## 16.4 గ్రామీణ ఆర్థిక వ్యవస్థ :-

గ్రామాల ప్రాథమిక అవసరముల నిమిత్తం గ్రామాలు ఆధార భూతాలు కాక స్వయం పోషకాలు కావాలి. మహాత్మాగాంధీ ప్రకారం స్వయం పోషకత అంటే గ్రామాలు ఇతర గ్రామాలతో సంబంధాలు లేక ఒంటరిగా ఉండాలని కాదు. ప్రతి గ్రామము తమ భౌగోళిక, మానవ వనరులను అభిలషణీయంగా ఉపయోగపరచుకుని వనరుల పరిమితి దృష్ట్యా తాము ఉత్పత్తి చేయలేని వస్తువులను మాత్రమే ఇతర గ్రామాల నుంచి కొనుగోలు చేసి, తమ అవసరాలు తీరగా ఉన్న మిగులు వస్తువులను ఇతర గ్రామాలకు విక్రయం చేయాలని చెప్పారు. మహాత్మాగాంధీ అర్థశాస్త్రవేత్త కాదు. అయినా ఆయనచే పేర్కొనబడిన గ్రామీణాభివృద్ధి నమూనా తులనాత్మక వ్యయ (Compartive Cost Advantage) సిద్ధాంతం ద్వారా వ్యాపారాన్ని లాభదాయకం చేసుకునే మార్గాన్ని నిర్దేశిస్తున్నది.

**(ఎ) వ్యవసాయం :-** గ్రామాలు స్వయం పోషకాలుగా ఉండటానికి తమకు కావలసిన ఆహార పంటలను, ప్రత్తిని పండించాలి. కొంత భాగాన్ని పశు గ్రాసం కోసం తప్పనిసరిగా వినియోగపరచాలి. ఈ భావన మహాత్మా మానవతా వాదాన్ని, గ్రామీణాభివృద్ధికి పశుసంపద అవసరమనే అంశాన్ని స్పష్టం చేస్తున్నది. కొంత భూమిని వయోజనులకు, పిల్లలకు ఆట స్థలంగా ఉపయోగించాలని సూచించారు. అంటే గ్రామీణ ౹ల ఆరోగ్యం మానసిక వికాసానికి దోపదపడుతుందని తద్వారా గ్రామీణాభివృద్ధి జరుగుతుందని తెలియ చెప్పారు. ఇంకనూ మిగులు భూమి ఉంటే అందులో పొగాకు, ఓపియమ్ వంటివి కాక, వాణిజ్య పంటలను పండించి గ్రామీణ ఆర్థిక వృద్ధిని పెంపొందింప చేయాలని చెప్పారు.

**(బి) ఉద్యోగిత :-** సంపూర్ణోద్యోగితను సాధించే రీతిలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ప్రణాళిక జరగాలని గాంధీ సూచించారు. అపుడే గ్రామాల నుండి వలస తగ్గి గ్రామాలు జీవ చైతన్యంతో ఉంటాయన్నారు. సంపూర్ణోద్యోగితకు వృత్తి వికేంద్రీకరణ మార్గమన్నారు. సంపూర్ణోద్యోగిత ద్వారా ఆదాయ వ్యత్యాసాలను తగ్గించి సమ సమాజాన్ని సాధించవచ్చన్నారు. వ్యక్తులు తమ ప్రాథమికావసరములను పొందుటకు శ్రమను వెచ్చించాలి. ప్రతి వ్యక్తి కేవలం అవసరమైనంత వరకే శ్రమకు వినిమయం చేయుట ద్వారా ప్రతి వ్యక్తికీ పని లభిస్తుందని, నిరుద్యోగిత ఉండదని, అందుచేత సంపూర్ణోద్యోగిత తద్వారా ఆదాయ సమానత పొందగలమన్నారు.

**(సి) పారిశ్రామికీకరణ :-** గాంధీజీ పారిశ్రామికీకరణకు గాని, యాంత్రికీకరణకు కాని వ్యతిరేకి కాదు. భారతదేశంలోని మానవ వనరుల దృష్ట్యా ఆయన శ్రామిక దోపిడీని పెంచు, పారిశ్రామికీకరణను వనరుల దృష్ట్యా ఆయన శ్రామిక దోపిడీని పెంచు పారిశ్రామికీకరణను ప్రోత్సహించరాదన్నారు. భారీ పారిశ్రామికీకరణ ద్వారా దేశంలోని అధిక జనాభా అయిన అల్పాదాయ, బలహీన వర్గాలకు అవసరం లేని వస్తువులను భారీ ఎత్తున ఉత్పత్తి చేయుట వలన దేశంలోని పరిమిత వనరులు దుర్వినియోగం అవుతాయని సూచించారు. ధరల యంత్రాంగం ఉన్న స్వేచ్ఛాయుత వ్యాపారం అనవసరమైన పోటీని పెంచి లాభాల మీద దృష్టి నిలిపి శ్రామిక దోపిడీకి దారి తీయును. ఇది మన అధిక మూలధన సాంద్రమైన ఉత్పత్తి ప్రక్రియ నిరుద్యోగితను పెంచును. శ్రామిక తొలగింపు, తత్ఫలితమైన నిరుద్యోగిత దేశంలోని అల్పాదాయ వర్గాల జీవన ప్రమాణ స్థాయిని దిగజారుస్తూ ఆదాయ వ్యత్యాసాలను ప్రోత్సహిస్తూ పెట్టుబడీదారీ వ్యవస్థకు దారి తీయును. భారీ పారిశ్రామికీకరణ, భారతదేశంలో అనాదిగా ఉద్యోగితను పెంచుతూ వస్తున్న గ్రామీణ లఘు కుటీర పరిశ్రమల పతనాన్ని కలుగజేస్తూ గ్రామాల నుండి ప్రజల వలస పెరిగేటట్లు చేస్తున్నది. తత్ఫలితంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నిర్జీవమై కుంటుపడుతున్నది. ఈ రకమైన వలస పట్టణ ప్రాంతాలలో కూడా అనేక అవస్థాపనా ఇబ్బందులను కలుగ చేస్తున్నది. మన దేశం వంటి దేశాలలో యాంత్రీకరణ శ్రామికుల ఉత్పాదకతను పెంచేదిగా ఉండాలే గాని వారిని వైతొలగించేదిగా ఉండరాదని ఆయన అభిప్రాయపడ్డారు. దేశంలోని ఆర్థిక సమస్యలకు పరిష్కారము భారీ పారిశ్రామికీకరణ కాదని ఆయన ఖచ్చితంగా చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో పేదరిక నిర్మూలనకు ఆయన శ్రమ సాంద్రమైన కుటీర, వ్యవసాయాధార

పరిశ్రమలు, పురాతన నైపుణ్యాల పై ఆధరపడ్డ చేతివృత్తుల పరిశ్రమలను పునరుద్ధరించాలని చెప్పారు. స్వయం సమృద్ధతలో భాగంగా ఆయన ఖాదీ అనగా నూలు వడకుటకు ప్రాధాన్యతనిచ్చారు. గాంధీజీ నమూనాలో గుర్తించవలసిన అంశం ఏమంటే మన దేశం వంటి దేశాలలో మూలధన కొరత సమస్య కాబట్టి, పరిమితంగా ఉన్న మూలధనాన్ని మూల పరిశ్రమలకు (ఉదా॥ ఇనుము ఉక్కు పరిశ్రమల వంటివి) మాత్రమే ఉపయోగించాలి. అంతేకాని ఆయన యాంత్రీకరణకు వ్యతిరేకి కాదు. మానవ శ్రమకు ప్రాధాన్యతనివ్వాలనే ఆయన అభిమతం.

## 16.5 ధర్మ కర్తృత్వం :-

మహాత్మాగాంధీ దృష్టిలో అర్థ శాస్త్రానికి, నీతి శాస్త్రానికి తారతమ్యమేమీ లేదు. ధార్మికత లేని అనైతికత్వంగా ఏ ఆర్థిక వ్యవస్థా నిలబడదని మహాత్మాగాంధీ భావన. ఆర్థిక వ్యవస్థ స్వయం సమృద్ధంగా ఉండాలంటే అహింస, సహకార భావన ప్రజలలో ఉండాలన్నారు. వైరుధ్యాల వలన గాక పరస్పర అవగాహన సహకారత ద్వారానే ఒక దేశం ప్రగతిని పొందగలదన్నారు. ఆయన గ్రామాలలో ఆర్థికస్థోమత కేంద్రీకరణను వ్యతిరేకించారు. భూమి అనేది ప్రకృతి ప్రసాదించిన సంపద. అది ఏ ఒక్కరి సొత్తూ కాదు. ఆ వనరును అందరి సంక్షేమానికి, శ్రేయస్సుకు ఉపయోగించాలి. మహాత్మాగాంధీ ప్రకారం భూస్వాములు భూమికి ధర్మకర్తలే గాని హక్కుదారులు, యజమానులు కానేరరు. వారంతట వారు భూమిని స్వచ్ఛందంగా దానము చేయకపోతే అహింసాయుత మార్గాల ద్వారా వారికి నచ్చ చెప్పాలన్నారు. ఒకవేళ వారు శ్రామిక దోపిడీని ఆపకపోతే శ్రామికులు సహాయ నిరాకరణోద్యమం ద్వారా వారికి కనువిప్పు కలిగించాలన్నారు. శ్రామిక సహకారం, శ్రమ లేకపోతే భూస్వాములు ధనరాశులను ప్రోది చెయ్యలేరనే విషయాన్ని గ్రహించవలెనన్నారు.

నాగరిక సమాజ స్థాపనకు అహింస, నైతిక విలువలు పునాది రాళ్ళ వంటివి. హింస నైతికతకు విరుద్ధమైన భావన. కాబట్టి మహాత్మాగాంధీ ప్రకారం గ్రామీణ పునర్నిర్మాణం, గ్రామీణాభివృద్ధి అహింసాయుతంగానే జరగాలి.

## 16.6 మహాత్మాగాంధీ నమూనా - భారతదేశ గ్రామీణాభివృద్ధికి మార్గదర్శకత :-

"Gandhiji is more relevant to Indian than any other prophet from East or West, North or South."

- Stephen Murphy - Australian
Gandhian Observer.

దేశ స్వాతంత్ర్యానంతరం మనం గాంధీ గ్రామీణాభివృద్ధి నమూనాను అమలుపరచలేదు. అభివృద్ధి వ్యూహంగా భారీ పారిశ్రామికీకరణము, పట్టణీకరణను, మూలధన సాంద్ర ఉత్పత్తి ప్రక్రియను ఆ నాటి ప్రధాని పండిట్ నెహ్రూ అనుసరించారు.

అప్పటి దేశ ఆర్థిక వ్యవస్థ దృష్ట్యా పారిశ్రామిక రంగంలో స్వయం సమృద్ధి కోసం ఆ విధానం మంచిదే. కాని మన దేశంలోని మానవ భౌతిక వనరుల దృష్ట్యా చూస్తే గాంధీజీ నమూనాను అవలంభించక పోవటం వలన మన ఆర్థిక వ్యవస్థలోని కొన్ని సమస్యలు తలెత్తినాయి.

1. గ్రామీణాభివృద్ధికి వనరుల కొరత, గ్రామాల నుండి పట్టణాలకు వలస.
2. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ప్రత్యామ్నాయ ఉద్యోగావకాశాల లేమి, ప్రచ్ఛన్న నిరుద్యోగిత పెంపు.
3. సంప్రదాయ నైపుణ్యాల పై శ్రద్ధ లేక లఘు కుటీర పరిశ్రమలు కుంటుపడుట.
4. వృత్తి వికేంద్రీకరణ లేని గ్రామాలలో నిరుద్యోగిత పెరుగుదల.
5. పట్టణాలలో అధికమగుచున్న జన సాంద్ర, తత్ఫలితంగా పెరుగుతున్న ఆర్థిక, సామాజిక సమస్యలు.
6. పట్టణీకరణ ప్రభావంతో ప్రకృతి వనరుల దుర్వినియోగం పునరుద్భవింప చేయలేని (non renewable natural resources) సహజ వనరుల కొరత.

7. గ్రామీణ పట్టణ ప్రాంతాలలో పెరుగుతున్న ఆర్థిక స్థోమత కేంద్రీకరణ, ఎక్కువగుచున్న ఆర్థిక అసమానతలు.
8. పెరుగుతున్న వినియోగ ప్రవృత్తి, నైతిక విలువలు దిగజారుట. యువత విప్లవాత్మక ధోరణులు, ఆర్థిక, రాజకీయ ఆందోళనలు.
9. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ (నూతన ఆర్థిక విధానం) వ్యూహాల నేపథ్యంలో భారీ యాంత్రీకరణ, శ్రామిక మార్కెట్ల సరళీకరణ, పెరుగుతున్న నిరుద్యోగిత.
10. పారిశ్రామికీకరణ, యాంత్రీకీకరణ, పట్టనీకరణ వలన ఉద్భవిస్తున్న పర్యావరణ అసంతులిత, అతి పెద్ద సమస్యగా జనిస్తున్న వాతావారణ కాలుష్యం.

మహాత్మాగాంధీ గ్రామీణాభివృద్ధి నమూనాను అనుసరించుట ద్వారా కొంతవరకూ ఈ సమస్యలను పరిష్కరించవచ్చు. మొదటిగా గ్రామీణ ప్రాంతాలకు ఆర్థిక వనరులను తరలించుట ద్వారా అనేక సమస్యలను తగ్గించవచ్చు. గ్రామాలలోని చిన్న, ఉపాంత రైతుల సంప్రదాయ చేతివృత్తుల వారి జీవన ప్రమాణ స్థాయి పెరిగితే గ్రామీణ నిరుద్యోగిత తగ్గించి పట్టణాలకు వలసను ఆపవచ్చు. గ్రామాల అభివృద్ధి, గ్రామీణాల ఆదాయ వృద్ధి సమర్థ డిమాండు పెంచి, స్వదేశీ మార్కెట్లను విస్తృతపరచుట ద్వారా పారిశ్రామిక, సేవల రంగాల వృద్ధికి తోడ్పడుతుంది. పట్టణాలలో సామాజిక, ఆర్థిక సమస్యలు తగ్గుతాయి. భూమి, నీరు, మానవ శక్తి సక్రమంగా ఉపయోగింపబడుతాయి. గ్రామీణాభివృద్ధి పథకాలు, ప్రాజెక్టులు, ప్రజల భాగాస్వామ్యాన్ని ప్రోత్సహిస్తే నిజమైన ప్రజాస్వామ్య గణతంత్ర వ్యవస్థ భారతదేశంలో రూపుదిద్దుకోగలదు. 1992లో తయారు చేయబడిన 70వ రాజ్యాంగ సవరణ చట్టం మహాత్మాగాంధీ పేర్కొన్న "గ్రామ స్వరాజ్"కు నాందిగా చెప్పవచ్చు. స్థానిక సంస్థలకు అభిలషణీయమైన అధికారాలు, వనరులు బదిలీ చేయుట ద్వారా గ్రామీణాభివృద్ధి, తద్వారా దేశాభివృద్ధి జరగగలదు. మహాత్మాగాంధీ కలలుగన్న ఆదర్శ గ్రామాల స్థాపన వలన ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ అయిన మన భారతదేశం, ఇతర దేశాలకు మార్గదర్శకం కాగలదు.

## 16.7 సారాంశము :-

మహాత్మాగాంధీచే సూచించబడిన గ్రామీణాభివృద్ధి నమూనాను, పలువురు ఆదర్శప్రాయమైనదే కాని ఆచరణ సాధ్యం కాదని అంటారు. కాని భారతదేశ భౌగోళిక స్థితి, భౌతిక, మానవ వనరుల దృష్ట్యా పరిశీలిస్తే మహాత్మాగాంధీ గ్రామీణాభివృద్ధి నమూనాను మన ఆర్థిక వ్యవస్థకు అనువర్తింప చేయటం ద్వారా ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించుకొనుటకు అవకాశం లభిస్తుంది.

## 16.8 నమూనా ప్రశ్నలు :-

1. మహాత్మాగాంధీ గ్రామీణాభివృద్ధి నమూనాలోని ముఖ్య అంశములను విశ్లేషించండి.
2. భారత ఆర్థికవ్యవస్థకు గాంధీజీ గ్రామీణాభివృద్ధి నమూనాను ఎంతవరకు అనువర్తింప చేయగలము? వివరించండి?

## 16.9 చదువదగిన గ్రంథాలు :-


1. Journal of Peace and Gandhian Studies, April - Sep 1997 Volume - II
2. Why Gandhi is relevant in Modern India - Stephen Murphy
3. Mahatma Gandhi - B.R. Nanda
4. Gandhian Thought - An Analytical Study - J.K. Mehta
5. The Hindu, October 19th, 1997

   The Hindu, October 21st 1997

   India Today May 31st 1997


**శ్రీమతి యస్. సుబ్బలక్ష్మి**